30-6Pg1exHMNWJQE.qxd:30-6Pg1exHMNWJQE.qxd 1/1/02 6:11 AM Page 1





ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

విశాఖపట్నం

: fb.com/vaartha Digital

Published from Visakhapatnam, Vijayawada, Hyderabad, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

30-6-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 150 పేజీలు: 16 వెల: 6.50



ట్రంప్ విశేషాధికారాలను సమర్థించిన సుప్రీం కోర్టు 2లో

వైద్యపరీక్షల కోసం ముంబయిలో డి.సిఎం పవన్


# పాలనలో మరింత వేగం

## సెక్రటరీలు, కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించాలి

## నవచేతన కింద పిల్లల స్క్రీనింగ్

## ప్రజలకు మరింత చేరువగా ప్రభుత్వ సేవలు

## ఆర్టీజీఎస్ సమీక్షలో సీఎం చంద్రబాబు



**విజయవాడ, జూన్ 29, ప్రభాతవార్త:** ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు, పరిపాలనలో పారదర్శకత, వేగాన్ని పెంచేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ పథకాలు, సేవలు పొందడంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించి, ప్రక్రియలను సులభతరం చేయాలని ఆయన స్పష్టం చేశారు. నేడు అమరావతి సచివాలయంలోని రియల్‌టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) కేంద్రంలో వివిధ శాఖల పనితీరుపై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలతో నిత్యం సంబంధాలుండే శాఖల్లో సేవల సరళీకరణపై ప్రధానంగా దృష్టి సారించారు. ముందుగా 11 రకాల కీలక సేవల్లో అనవసరమైన ప్రక్రియలను కుదించి, వాటిని సులభతరం చేస్తున్నామని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. దీనిపై సంతృప్తి వ్యక్తం చేసిన సీఎం, ప్రజా ఫిర్యాదుల స్వీకరణ వ్యవస్థను (పీజీఆర్ఎస్) మరింత పటిష్ఠం చేయాలని ఆదేశించారు. ప్రజలు తమ సమస్యలను సులభంగా ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చేలా ఆన్‌లైన్ పోర్టల్‌తో పాటు, ˝మనమిత్ర వాట్సాప్ ద్వారా ప్రత్యేక సేవలను ప్రారంభించాలని సూచించారు. కేవలం టెక్స్ట్ మెసేజ్‌లే కాకుండా, వాయిస్ మెసేజ్‌ల రూపంలో పంపే ఫిర్యాదులను కూడా స్వీకరించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని, తక్షణమే పరిష్కరించేందుకు అధికారులు తప్పనిసరిగా క్షేత్రస్థాయి పర్యటనలు చేయాలని చంద్రబాబు ఆదేశించారు. ఇందుకు అనుగుణంగా సెక్రటరీలు నెలకు 3 రోజులు, శాఖాధిపతులు (హెచ్‌ఓడీలు) 6 రోజులు, జిల్లా కలెక్టర్లు 8 రోజులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని స్పష్టం చేస్తూ సర్క్యులర్ జారీ చేసినట్లు అధికారులు సీఎంకు తెలిపారు. సమస్యలు అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి, వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని సీఎం సూచించారు. రాష్ట్రంలో మెరుగైన కమ్యూనికేషన్ వ్యవస్థ ప్రాధాన్యతను నొక్కిచెప్పిన ముఖ్యమంత్రి, మొబైల్ నెట్‌వర్క్ సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 3,000 ప్రాంతాల్లో సిగ్నల్ సమస్యలు ఉన్నట్లు గుర్తించామని, రాబోయే మూడు నెలల్లో నెట్‌వర్క్ సంస్థలతో మాట్లాడి ఈ సమస్యను అధిగమించాలని డెడ్‌లైన్ విధించారు.

ఆర్టీజీఎస్ పనితీరుకు ప్రశంసలు స్త్రీ శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అమలవుతున్ననవచేతన (ఎర్లీ చైల్డ్ హుడ్ డెవలప్‌మెంట్ స్క్రీనింగ్) కార్యక్రమంపై అధికారులు ప్రజెంటేషన్ ఇచ్చారు. పిల్లల శారీరక, మానసిక ఎదుగు దలను అంచనా వేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా 33,949 మంది పిల్లలకు స్క్రీనింగ్ పూర్తి చేశామని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు, ఇళ్లకు వెళ్లి కూడా ఈ స్క్రీనింగ్ చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఈ సమీక్షకు కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) డైరెక్టర్ జనరల్ చంద్రజీత్ బెనర్జీ, ఇతర ప్రతినిధులతో కలిసి సీఎం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్టీజీఎస్ పనితీరును, పాలనలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వంటి ఆధునిక టెక్నాలజీల వినియోగాన్ని ఐటీ కార్యదర్శి కాటంనేని భాస్కర్ సీఐఐ ప్రతినిధులకు వివరించారు. సీఐఐ గ్లోబల్ లీడర్‌షిప్ సెంటర్‌ను వీలైనంత త్వరగా ఏపీలో ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు కోరారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ ప్లస్‌గా అమరావతి

## రాజధాని పనులపై ప్రతి రెండు నెలలకు సమీక్ష: సిఎం

**విజయవాడ,జూన్ 29,ప్రభాతవార్తప్రతినిధి:** యావత్ దేశం గర్వించే రాజధాని నగరంగా అమరావతిని నిర్మిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. హైదరాబాద్ ప్లస్‌గా అమరావతి నిర్మాణం జరగాలని అన్నారు. ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ నగర నిర్మాణంలో కాంట్రాక్టు సంస్థలు కూడా భాగస్వాములు కావాలని సీఎం పిలుపునిచ్చారు. రాజధాని నిర్మాణ పనుల్లో మరింత వేగం పెంచాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు. అమరావతిలో నిర్మాణ పనుల పురోగతిపై సచివాలయంలో కాంట్రాక్టు సంస్థలతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. నిర్దేశిత గడువు కంటే ముందే నిర్మాణ పనులు పూర్తి చేయాలని సూచనలు ఇచ్చారు. ప్రస్తుతం రూ.50,999 కోట్ల విలువైన పనులు కాంట్రాక్టు సంస్థలకు అప్పగించామని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. హౌసింగ్, ట్రంక్ ఇన్ ఫ్రా, ఎల్పీఎస్ ఇన్ ఫ్రా, సహా అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయ టవర్ల లాంటి ఐకానిక్ భవనాల నిర్మాణ ప్రాజెక్టులు వేగంగా జరుగు >>2



# నేడు దోహాలో అమెరికా- ఇరాన్ చర్చలు

## హార్ముజ్ సమస్యే కీలకం

**వాషింగ్టన్, జూన్ 29:** అమెరికా-ఇరాన్ మధ్య కొద్దిరోజులుగా ఉద్రిక్తతలు, పరస్పర దాడులతో పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణాన్ని తలపించింది. అయితే, తాజాగా ఇరు దేశాలు పరస్పర దాడులను నిలిపివేయడానికి అంగీకరించాయి. దీంతో తాత్కాలిక ఊరట లభించింది. అలాగే, ఇరు దేశాల మధ్య దెబ్బతిన్న శాంతి ఒప్పందాన్ని పునరుద్ధరించేందుకు మంగళవారం ఖతార్ రాజధాని దోహాలో ఉన్నతస్థాయి చర్చలు జరపాలని ఇరుపక్షాలు నిర్ణయించాయి. కీలకమైన హార్ముజ్‌లో నౌకల రాకపోకలపై సాంకేతిక చర్చలు కొనసాగుతున్నందున, ప్రస్తుతానికి ఎలాంటి సైనిక చర్యలు చేపట్టకూడదని ఇరు దేశాలు ఒక అంగీకరానికి వచ్చినట్లు ప్రముఖ అంతర్జాతీయ మీడియా సంస్థ 'అక్సియోస్' వెల్లడించింది. అమెరికా, ఇరాన్ మధ్య >>2

# పెట్రోల్, డీజిల్‌పై ఆంక్షలు ఎత్తివేత



## రేపటి నుంచి అమలు

**న్యూఢిల్లీ,జూన్ 29:** దేశంలో పెట్రోల్, డీజిల్ అమ్మకాలపై విధించిన తాత్కాలిక ఆంక్షలను జూలై 1 నుంచి ఎత్తివేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. మధ్యప్రాచ్య యుద్ధం కారణంగా ప్రపంచ ఇంధన సరఫరా వ్యవస్థ దెబ్బతినడంతో పాటు దేశంలో ఇంధన లభ్యతపై ఆందోళనలు వ్యక్తమైన నేపథ్యంలో ఈ నెల ప్రారంభంలో ఈ ఆంక్షలను అమలు చేశారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఆంక్షల సమయంలో వాణిజ్య వినియోగదారులు రిటైల్ పెట్రోల్ బంకుల నుంచి ఇంధనం కొనుగోలు చేయకుండా నిషేధించారు. అలాగే ప్రతి వినియోగదారు లేదా వాహనం రోజుకు గరిష్ఠంగా 200 లీటర్ల డీజిల్ మాత్రమే కొనుగోలు చేసేలా పరిమితి విధించారు. నిల్వలు దాచిపెట్టకుండా నిరోధించడం, దుర్వినియోగాన్ని అరికట్టడం, అందరికీ సరిపడా ఇంధనం అందు బాటులో ఉండేలా చూడడమే ఈ నిర్ణయం >>2

# దుప్పటి అడిగిందని విద్యార్థిని గెంటివేత

## చింతలపూడి ఎస్సీ బాలికల హాస్టల్‌లో కలకలం, వార్డెన్ సస్పెన్షన్

**ఏలూరు జిల్లా బ్యూరో, జూన్ 29 ప్రభాత వార్త:** ప్రభుత్వ హాస్టళ్లలో విద్యార్థులకు రక్షణ, సంరక్షణ కల్పించాల్సి న బాధ్యత ఉన్న వారే అమానుషంగా వ్యవహరిస్తే పరిస్థితి ఎలా ఉంటుందో చింతలపూడి ఎస్సీ బాలికల హాస్టల్ ఘటన మరోసారి రుజువు చేసింది. చలిని తట్టుకోలేక అదనంగా ఒక దుప్పటి కావాలని కోరిన ఎనిమిదో తరగతి విద్యార్థినిని హాస్టల్ వార్డెన్ రాత్రి వేళ నిర్ధాక్షి ణ్యంగా బయటకు పంపించి వేశారనే ఆరోపణలు రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించింది. రాత్రంతా భయాం దోళనల మధ్య గడిపిన విద్యార్థిని పరిస్థితి స్థానికులను కలచి వేసింది. విషయం వెలుగులోకి రావడంతో సోమవారం తల్లి దండ్రులు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు హాస్టల్ వద్దకు చేరి ఆగ్రహం వ్యక్తంచేశాయి. ఈ ఉదంతం యావత్ ప్రభుత్వ హాస్టళ్లలో విద్యార్థుల భద్రతపై తీవ్ర ఆందోళన వ్యక్తమైంది. బాధిత విద్యార్థిని తల్లిదండ్రుల కథనం ప్రకారం, ప్రగడవరం గ్రామానికి చెందిన విద్యార్థిని దుప్పటి ఇవ్వాలని కోరగా, ఆన్‌లైన్‌లో పేరు లేదు. హాస్టల్‌లో ఉండేందుకు >>2

# ప్రధాని మోడీకి ఇరాన్ సుప్రీం లీడర్ సందేశం

**టెహ్రాన్,జూన్ 29:** ఇరాన్ నూతన సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ ప్రధాని మోడీకి ప్రత్యేక సందేశం పంపారు. ఇటీవల ఈద్ అల్‌అదా సందర్భంగా ప్రధాని మోడీ పంపిన శుభాకాంక్షలకు ప్రతిస్పందిస్తూ భారత్‌ఇరాన్ మధ్య చారిత్రక స్నేహబంధం మరింత బలపడుతుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ప్రధాని మోడీ పంపిన ఈద్ శుభాకాంక్షల సందేశాన్ని అందుకున్న మొజ్తబా ఖమేనీ అందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈద్ అల్‌అదా సందర్భంగా మీరు పంపిన శుభాకాంక్షల సందేశం నాకు అందింది. మీకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తూ నా తరఫున కూడా మీకు శుభాకాంక్షలు తెలుపుతున్నాను. పరస్పర గౌరవం, ఉమ్మడి ప్రయోజనాలపై నిర్మితమైన మన రెండు దేశాల చారిత్రక స్నేహం ఇరు ప్రభుత్వాల కృషితో భవిష్యత్తులో మరింత బలపడుతూ విస్తరిస్తుందని నాకు పూర్తి నమ్మకం ఉందని పేర్కొన్నారు. ప్రధాని మోడీ ప్రభుత్వం, భారత ప్రజలు మరింత అభివృద్ధి సాధించాలని దేవుడిని ప్రార్థిస్తున్నట్లు కూడా తన సందేశంలో తెలిపారు. అమెరికాఇజ్రాయెల్ సంయుక్త దాడుల్లో ఫిబ్రవరిలో ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అయతల్లా అలీ ఖమేనీ మరణించిన అనంతరం ఆయన కుమారుడు మొజ్తబా ఖమేనీ >>2

# రేపు నెల్లూరు, తిరుపతిలో సిఎం చంద్రబాబు పర్యటన

## సత్యవేడులో హీరో మోటార్స్ జిపిసికి శంకుస్థాపన

**విజయవాడ, జూన్ 29,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ హీరో మోటార్స్ గ్లోబల్ పార్ట్స్ సెంటర్‌జీపీసీకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జూలై 1 తేదీన శంకుస్థాపన చేయనున్నారు. తిరుపతి జిల్లా సత్యవేడు మండలంలోని మదనపాలెంలో హీరో మోటార్ కార్ప్స్ నూతనంగా ఏర్పాటు చేయనున్న జీపీసీకు సీఎం భూమిపూజ చేయనున్నారు. హీరో మోటార్స్ కు చెందిన వివిధ తయారీ కేంద్రాలు, డీలర్లకు ద్విచక్ర వాహనాల విడి భాగాలను తయారు చేసి సరఫరా చేసేలా ఆ సంస్థ ఈ సెంటర్‌ను ఏర్పాటు చేయనుంది. రూ.750 కోట్ల పెట్టుబడితో హీరో మోటార్ కార్పొరేషన్ ఈ జీపీసీ 2.0ను నిర్మించనుంది. దీని ద్వారా 4 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలగనున్నాయి. ఇప్పటికే శ్రీసిటీ సమీపంలో హీరో మోటార్స్ సంస్థ ఏర్పాటు చేసిన అధునాతన ద్విచక్ర వాహనాల తయారీ ప్లాంట్ లో ఏడాదికి 1.5మిలియన్ల వాహనాలను ఉత్పత్తి జరుగుతోంది. దేశ, విదేశాల్లో ఉన్న మోటార్ సైకిళ్లు, స్కూటెక్లు, ఈవీలకు విడి భాగాలను తయారు చేసేందుకు గానూ ఈ జీపీసీను హీరో మోటార్స్ ఏర్పాటు చేయనుంది. ఇప్పటికే పీ4 కార్యక్రమంలో మార్గదర్శిగా ఉన్న హీరో మోటార్స్ సంస్థ పలువురికి స్కాలర్ షిప్ లను ఇవ్వాలని నిర్ణయించుకుంది. ఈమేరకు స్వర్ణాంధ్ర ఫౌండేషన్ ద్వారా హీరో మోటార్స్ అందించనున్న బ్రిజ్ మోహన్‌లాల్ ముంజల్ పేరుతో హీరోస్ ఆఫ్ టుమారో పేరిట స్కాలర్‌షిప్‌లను సీఎం ఆవిష్కరించనున్నారు. ఏపీ పోలీసులు వినియోగించుకునేలా హీరో మోటార్స్ సంస్థ ప్రత్యేకంగా తయారు చేసిన ఎలక్ట్రిక్ మొబిలిటీ వాహనాలను కూడా ముఖ్యమంత్రి చేతుల మీదుగా అందించనున్నారు. **పేదల సేవలో సీఎం:** నెల్లూరుజిల్లా చిల్లకూరు మండలం, పున్నపువారిపాలెంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేదలసేవలో కార్యక్రమంలో పాల్గొననున్నారు. దీంట్లో భాగంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను >>2

# ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు లొంగుబాటు



## సాయికృష్ణ లాకప్‌డెత్ కేసు కొత్త మలుపు

## తల్లి దాఖలు చేసిన హెబియస్ కార్పస్ పిటిషన్‌పై విచారణ వాయిదా

## సిఐ నాగరాజు కస్టడీ పిటిషన్‌పై కూడా వాయిదా

**విజయవాడ,జూన్ 29,ప్రభాతవార్తప్రతినిధి:** సాయికృష్ణ లాకప్ డెత్ కేసులో కొత్త మలుపు చోటుచేసుకుంది. కృష్ణలంక పీఎస్‌లో హెడ్‌కానిస్టేబుళ్లుగా విధులు నిర్వహిస్తున్న అశోక్, నాని సోమవారం లొంగిపోయారు. సూర్యారావుపేట ఏసీపీ కార్యాలయానికి వచ్చిన వీరు తాము లొంగిపోతున్నట్లు తెలిపారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న సీఐ నాగరాజుకు లొంగిపోయిన కానిస్టేబుళ్ళు అత్యంత సన్నిహితులుగా ఉండేవారు. ఈ కేసులో సీఐ నాగరాజు అరెస్ట్ తర్వాత ఈ ఇద్దరు అజ్ఞాతంలోకి వెళ్లారు. సాయికృష్ణ కేసులో సీఐ నాగరాజుకు వీరు సాయం చేశారని సిట్ గుర్తించింది. ఈ క్రమంలోనే లొంగిపోయిన నాని, అశోక్‌ను కమాండ్ కంట్రోల్‌లోని కమాండ్ కంట్రోల్‌లోని సిట్ కార్యాలయానికి తరలించారు. అక్కడికి సిట్ చీఫ్, ఐజీ రవిప్రకాశ్, ఎస్పీలు అమిత్ బర్దర్, నయీం అద్నాన్ అస్మీ చేరుకొని వారిని విచారిస్తున్నారు. కృష్ణలంక స్టేషన్ పరిధిలోని లాడ్జీలు, బార్లు, మద్యం దుకాణాలు ఇతరత్రా కార్యకలాపాలకు సంబంధించిన వ్యవహారాలను అశోక్ చక్కదిద్దేవాడు. అంతేకాక పలు సెటిల్‌మెంట్లకు పాల్పడేవాడని ఆరోపణలున్నాయి. స్టేషన్ పరిధిలోని >>2

# షైనింగ్ స్టార్లే మా బ్రాండ్ అంబాసిడర్లు

## ప్రభుత్వ బడులవైపే విద్యార్థులు మొగ్గు

## వచ్చే యేడాది 2లక్షల మంది ప్రైవేటు నుంచి ప్రభుత్వ స్కూళ్లకు రావాలి

## షైనింగ్ స్టార్స్ సత్కార కార్యక్రమంలో మంత్రి లోకేష్



**విజయవాడ, జూన్ 29 ప్రభాతవార్త:** విద్యార్థి కోణంలోనే ఆలోచించే ఎడ్యుకేషన్ సిస్టమ్‌లో సంస్కరణలు చేపట్టామని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు, ఇప్పుడు మనం బెస్ట్ టీచర్లను సింగపూర్, ఫిన్‌లాండ్ కి పంపుతున్నాం. అక్కడ ఉన్న బెస్ట్ ప్రాక్టీసెస్ రాష్ట్రంలో అమలు చేస్తున్నాం. నా కోరిక ఒక్కటే. భవిష్యత్తులో దేశం మొత్తం ఏపీ మోడల్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ గురించే మాట్లాడాలన్నారు. వచ్చే ఏడాది రెండు లక్షల మంది ప్రైవేట్ నుండి ప్రభుత్వ పాఠశాలల్లో చేరాలి, షైనింగ్ స్టార్లే మా బ్రాండ్ అంబాసిడర్లని స్పష్టం చేసారు. గత ఏడాది పదోతరగతి, ఇంటర్మీడియట్‌లో ఉత్తమ ఫలితాలు కనబర్చిన విద్యార్థులను పాఠశాల విద్యాశాఖ తరపున మంత్రి లోకేష్ తాడేపల్లిలోని సిఎస్ఆర్ ఫంక్షన్ హాలు వేదికగా ఘనంగా సత్కరించారు. 55మంది టెన్త్ షైనింగ్ స్టార్లకు రూ. 30వేలు ప్రైజ్ మనీ, మెడల్, సర్టిఫికేట్, 61మంది ఇంటర్మీడియట్ షైనింగ్ స్టార్లకు ల్యాప్ ట్యాప్, మెడల్ అందజేశారు.

**మీరు గెలిచారు, నన్ను గెలిపించారు:** ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ షైనింగ్ స్టార్స్ మిమ్మల్ని చూసిన తర్వాత నాకు అబ్దుల్ కలాం గారు చెప్పిన ఒక మాట చెప్పాలనిపించింది. నిద్రలో కనిపించేది కలకాదు.. కల మిమ్మల్ని నిద్రపోనివ్వదు. నిద్రపోకుండా మీరు పడిన కష్టం మిమ్మల్ని షైనింగ్ స్టార్స్‌గా నిలబెట్టింది. మీరు గెలిచారు, నన్ను గెలిపించారు. మన విద్యావ్యవస్థను గెలిపించారు. మీరు పాఠశాలలకు పూర్వ వైభవం తీసుకొచ్చారు. మీకు తక్కువ మార్కులు వస్తే నాకు సీఎం గారు తక్కువ మార్కులు వేస్తారు. షైనింగ్ స్టార్స్ ఎక్కువ మార్క్స్ తెచ్చుకున్నారు. నాకు ఎక్కువ మార్కులు పడేలా చేసారు. మీ పెర్ఫార్మెన్స్ వల్ల మంత్రిగా నా గౌరవంతోపాటు 2లక్షలమంది టీచర్ల గౌరవం కూడా పెరిగింది. గతంలో ప్రభుత్వ స్కూళ్లంటే చిన్నచూపు ఉండేది. చరిత్ర తిరగరాసిన ఘనత మీ అందరిది. జులైలో మెగా పిటిఎం నిర్వహిస్తాం. మొదటి పిటిఎంలో ప్రభుత్వ పాఠశాలలకు పూర్వవైభవం తెస్తానని చెప్పా. మీ అందరి కృషి, కష్టంతో ఆ మాటను సుసాధ్యం చేశా.

**విద్యాశాఖ వ్యవసాయం లాంటిదే:** విద్యాశాఖ వ్యవసాయం లాంటిది, చాలా కష్టమైంది. ఫలితాలు వెంటనే రావు. ప్రతిరోజు నీళ్ల పోయాలి, ఎరువు వేయాలి, పంట చేతికొచ్చినపుడు రైతులకు కలిగిన ఆనందం ఈరోజు నాకు కలుగుతోంది. ఇంకా కష్టపడాలి, పనిచేయాలి, కలసికట్టు సరికొత్త చరిత్ర సృష్టించాలి. ఈరోజు విద్యార్థులు రాసిన డ్రీమ్ వాల్, గ్రాటిట్యూడ్ వాల్స్ చూశాను. విద్యార్థులు డాక్టర్, ఇంజనీర్, ఐఎఎస్ అవుతానని రాశారు. ఏ ఒక్కరూ రాజకీయ నాయకుడ్ని అవుతా, సమాజాన్ని మారుస్తానని రాయలేదు. యువత రాజకీయాల్లోకి వచ్చి సమాజంలో మార్పు సాధించాలని కోరుకుంటున్నా. మొదటిసారి ప్రభుత్వ పాఠశాలల పిల్లల ఫోటోలు పేపర్ అడ్వర్టైజ్‌మెంట్ లో చూసినప్పుడు నాకు చెప్పలేని ఆనందం కలిగింది. ఈరోజు చాలా గర్వంగా ఉంది. ప్రైవేటు నుంచి ప్రభుత్వ పాఠశాలలకు 1.06లక్షలమంది వచ్చారు. >>2

# సాగుకు ఇక కొత్తదిశ



## వ్యవసాయరంగంలో సాంకేతిక విప్లవానికి శ్రీకారం: మంత్రి అచ్చెన్నాయుడు

సోమవారం గుంటూరు లాంఫాంలో జరిగిన ఏరువాకలో పాల్గొన్న మంత్రి అచ్చెన్నాయుడు

**అమరావతి/గుంటూరు, జూన్ 29:** రైతు సంతోషంగా ఉంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని, రైతుకు భరోసా కల్పించి, వ్యవసాయ రంగానికి పునర్వైభవం తీసుకురావడమే ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. సోమవారం గుంటూరులో లాంఫాం నందు గల ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఏరువాక పౌర్ణమి కార్యక్రమాన్నిపొలంలో ఎద్దుల అరకదున్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ వ్యవసాయానికి తొలి పండుగ అయిన ఏరువాకను గుంటూరులో నిర్వహించడానికి ప్రత్యేక కారణం ఉందని, రైతాంగానికి గుంటూరు జిల్లాతో అవినాభావ సంబంధం ఉన్నందున ఈ కార్యక్రమాన్ని ఇక్కడ నిర్వహించామని తెలిపారు. రాష్ట్ర జనాభాలో దాదాపు 66 శాతం మంది వ్యవసాయం, అనుబంధ రంగాలపై ఆధారపడి జీవిస్తున్నారని, >>2

# ఉద్యాన హబ్‌గా 'సీమ'

## రాష్ట్ర పెట్టుబడుల్లో మూడోవంతు రాయలసీమకే: మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి



**విజయవాడ.జూన్ 29, ప్రభాతవార్తప్రతినిధి:** కూటమి ప్రభుత్వంలో రాయలసీమ˝రతనాల సీమ్మగా మారుతుందని మంత్రి బీసీ జనా ర్ధన్ రెడ్డి అన్నారు. సోమవారం తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమను కరువులు, వలసలకు నిలయంగా కాకుండా పారిశ్రామిక, వ్యవసాయ, ఉద్యా నవన అభివృద్ధికి కేంద్రంగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్య మని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో గత రెండు సంవత్సరాల కాలంలో రాయల సీమలో భారీ ఎత్తున పరిశ్రమలు, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, సాగునీటి పనులు చేపట్టడం ద్వారా ఈ ప్రాంత రూపురేఖలు మారుతున్నాయని ఆయన తెలిపారు. రాష్ట్రంలో గత 24 నెలల్లో సుమారు 240 పరిశ్రమలకు సంబంధించిన పెట్టుబడుల ద్వారా రూ.5.33 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు సమకూరాయని, రాష్ట్రానికి వస్తున్న మొత్తం పారిశ్రామిక పెట్టుబడుల్లో దాదాపు మూడో వంతు రాయలసీమ ప్రాంతానికే దక్కుతోందని చెప్పారు. ఈ పెట్టుబడుల ఫలితంగా వేలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని పేర్కొన్నారు. ఇటీవల మంత్రి నారా లోకేష్ ఆధ్వ ర్యంలో రూ.1000 కోట్ల పెట్టుబడితో సుమారు మూడు వేల మందికి ఉద్యోగాలు కల్పించే పరిశ్రమకు శంకుస్థాపన జరిగిందని గుర్తుచేశారు. అలాగే తిరుపతిలో రూ.2,508 కోట్ల పెట్టుబడితో రాయల్ ఎన్‌ఫీల్డ్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నామని, ఇతర రాష్ట్రానికి వెళ్లాల్సిన >>2



సోమవారం సతీమణి అన్నాతో ముంబయిలో పవన్ కల్యాణ్

## వైద్యపరీక్షల కోసం ముంబయిలో డి.సిఎం పవన్

**విజయవాడ,జూన్ 29,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సోమవారం సాయంత్రం ముంబైకి చేరుకున్నారు. గత కొంతకాలంగా భుజాలకి సంబంధించిన రొటేటర్ కఫ్ గాయంతో ఆయన ఇబ్బంది పడుతున్నారు. ఈ క్రమంలోనే రెండు భుజాలకి చెందిన కండరాలు పూర్తిగా చిట్లడంతో ఇబ్బందిపడుతున్నారు. దీంతో ఆయన వైద్యుల సూచనను అనుసరించి వైద్య పరీక్షల నిమిత్తం ముంబాయి. కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆసుపత్రికి వెళ్లనున్నారు. ఆయనకు అక్కడ ఈ రోజు సాయంత్రంగాని, మంగళవారం ఉదయంగాని పవన్ కళ్యాణ్ కు వైద్యపరీక్షలు చేసే అవకాశం ఉంది. పవన్ వెంట ఆయన సతీమణి అన్నా కొణిదెల ఉన్నారు.



## సింగపూర్ కాన్సుల్ జనరల్ ఎడ్గర్ పాంగ్ తే చియాంగ్‌తో మంత్రి లోకేష్ భేటీ

**విజయవాడ,జూన్ 29, ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో వివిధ రంగాల్లో పెట్టుబడులకు మంచి అవకాశాలున్నాయని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేసారు. రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌తో చెన్నైలోని సింగపూర్ కాన్సులేట్ జనరల్ ఎడ్గర్ పాంగ్ తే చియాంగ్ ఇవాళ మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఉండవల్లిలోని లోకేశ్ నివాసంలో జరిగిన ఈ భేటీలో ఇరుపక్షాల మధ్య సహకారం, పెట్టుబడుల అవకాశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్, రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అనుకూల వాతావరణాన్ని సింగపూర్ ప్రతినిధికి వివరించారు. ప్రజాప్రభుత్వం కొలువుదీరిన తర్వాత పెట్టుబడులను క్షేత్రస్థాయికి తీసుకురావడంపై ప్రత్యేకంగా దృష్టి సారించామని తెలిపారు. రాష్ట్రంలో 750 పరిశ్రమల ఏర్పాటు వివిధ దశల్లో ఉంది. ప్రతి 15 రోజులకు ఒకసారి ఈ ప్రాజెక్టుల పురోగతిని సమీక్షిస్తున్నాం. పారిశ్రామిక అభివృద్ధి కోసం 22 క్లస్టర్లను అభివృద్ధి చేస్తున్నాం" అని లోకేశ్ పేర్కొన్నారు.

# ఉద్యాన హబ్‌గా 'సీమ'

>> ఈ ప్రాజెక్టును ముఖ్యమంత్రి చొరవతో ఆంధ్రప్రదేశ్‌కు తీసుకువచ్చామని తెలిపారు. ఈ యూనిట్‌ను ఏడాది వ్యవధిలో పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని వెల్లడించారు. సత్యసాయి జిల్లాలోని పుట్టపర్తిలో డీఆర్‌డీఓ ఆధ్వర్యంలో రూ.15,800 కోట్ల పెట్టుబడితో ఏఎంసీఏ యుద్ధ విమానాల తయారీ ప్రాజెక్టు ఏర్పాటవుతుందని చెప్పారు. ఇది దేశంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మక రక్షణ రంగ ప్రాజెక్టులలో ఒకటిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ యూనిట్ ద్వారా సుమారు 7,500 ప్రత్యక్ష ఉద్యోగాలతో పాటు అనేక అనుబంధ పరిశ్రమలు కూడా ఏర్పడతాయని తెలిపారు. రానున్న రోజుల్లో పుట్టపర్తిలో లక్షా యాభై వేల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చే అవకాశాలు ఉన్నాయని పారిశ్రామిక వర్గాలు ఆసక్తి చూపుతున్నాయన్నారు. సత్యసాయి జిల్లాలో రిలయన్స్ సంస్థ ఆధ్వర్యంలో రూ.51 వేల కోట్లతో సోలార్ పవర్, బ్యాటరీ స్టోరేజ్ ప్రాజెక్టు, కడప జిల్లాలో అదానీ సంస్థ ఆధ్వర్యంలో రూ.12 వేల కోట్లతో హైడ్రో ఎనర్జీ ప్రాజెక్టు, కర్నూలు జిల్లాలో డ్రోన్ సిటీ, అన్నమయ్య, తిరుపతి జిల్లాల్లో స్పేస్ సిటీ ప్రాజెక్టులు రూపుదిద్దుకుంటున్నాయని వివరించారు. ఓర్వకల్లులో పారిశ్రామిక అభివృద్ధి వేగంగా సాగుతోందని, ఇప్పటికే వేల కోట్ల రూపాయల పెట్టుబడులు సమకూరాయని, రిలయన్స్ సంస్థకు చెందిన ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ కూడా త్వరలో పూర్తి కానుందని తెలిపారు. 2014-19 మధ్య అనంతపురానికి కియా మోటార్స్ పరిశ్రమను తీసుకురావడం వల్ల సుమారు 13 వేల మందికి ఉద్యోగాలు లభించాయని, ప్రభుత్వానికి వేల కోట్ల రూపాయల ఆదాయం సమకూరుతోందని పేర్కొన్నారు. పరిశ్రమల రాకతో స్థానిక భూముల విలువలు గణనీయంగా పెరిగాయని చెప్పారు. సాగునీటి ప్రాజెక్టుల విషయంలో గత వైసీపీ ప్రభుత్వం తీవ్ర నిరక్ష్యం ప్రదర్శించిందని ఆరోపించారు. 2014-19 మధ్య తెలుగుదేశం ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులపై రూ.12,441 కోట్లు ఖర్చు చేయగా, 2019-24 మధ్య వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.2 వేల కోట్లు కూడా పూర్తిస్థాయిలో ఖర్చు చేయలేదని విమర్శించారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేవలం రెండేళ్లలోనే రూ. రూ.12,484 కోట్లకు పైగా వ్యయం చేసి హంద్రీ-నీవా సహా పలు ప్రాజెక్టుల పనులను వేగవంతం చేసిందని తెలిపారు. రాయలసీమను లక్ష కోట్ల రూపాయల పెట్టుబడులతో దేశంలోనే అతిపెద్ద ఉద్యానవన కేంద్రంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు. డ్రిప్ ఇరిగేషన్‌కు మళ్లీ ప్రాధాన్యం కల్పించామని, ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులకు సబ్సిడీతో పరికరాలు అందించే చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఐదేళ్లపాటు ఈ పథకాన్ని నిరక్ష్యం చేసిందని ఆరోపించారు.

# ట్రంప్ విశేషాధికారాలను సమర్థించిన సుప్రీం కోర్టు..

### స్వతంత్ర సమాఖ్యల అధిపతులను తొలగించే అధికారం

**వాషింగ్టన్,జూన్ 29:** అమెరికా అధ్యక్షుడి అధికారాలకు సుప్రీంకోర్టు భారీ ఊతం ఇచ్చింది. ఫెడరల్ రిజర్వ్‌కు మాత్రం మినహాయింపు అమెరికా అధ్యక్షుడి అధికారాలను విస్తరిస్తూ అమెరికా సుప్రీంకోర్టు సోమవారం కీలక తీర్పు వెలువరించింది. స్వతంత్ర సమాఖ్య సంస్థల అధిపతులను అధ్యక్షుడు తొలగించే అధికారాన్ని సమర్థించింది. అయితే దేశ కేంద్ర బ్యాంకైన ఫెడరల్ రిజర్వ్ విషయంలో మాత్రం ప్రత్యేక మినహాయింపు ఇచ్చింది. ఫెడరల్ రిజర్వ్ గవర్నర్ లీసా కుక్‌ను తొలగించాలన్న అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయాన్ని ప్రస్తుతం అమలు చేయొద్దని కోర్టు పేర్కొంది. ఆమెపై ఉన్న మార్టేజ్ మోసం ఆరోపణలను కుక్ ఖండించారు. తనపై కేసు పూర్తయ్యే వరకు ఆమె పదవిలో కొనసాగేందుకు అనుమతి ఇచ్చింది. ప్రధాన న్యాయమూర్తి జాన్ రాబర్ట్స్ నేతృత్వంలోని ధర్మాసనం, 91 ఏళ్ల క్రితం వచ్చిన చారిత్రక తీర్పును పక్కనపెడుతూ, రాజ్యాంగంలోని అధికారాల విభజన సూత్రానికి విరుద్ధంగా ఉన్న రక్షణలను కొనసాగించలేమని స్పష్టం చేసింది. ఈ తీర్పు ప్రభావం ఫెడరల్ ట్రేడ్ కమిషన్, నేషనల్ లేబర్ రిలేషన్స్ బోర్డ్, మెరిట్ సిస్టమ్స్ ప్రొటెక్షన్ బోర్డ్, కన్స్యూమర్ ప్రొడక్ట్ సేఫ్టీ కమిషన్ వంటి పలు స్వతంత్ర సంస్థలపై కూడా పడనుంది. తీర్పును స్వాగతించిన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇది అధ్యక్ష అధికారాలకు సంబంధించిన అత్యంత చారిత్రాత్మక నిర్ణయాల్లో ఒకటని పేర్కొన్నారు. ఈ తీర్పుపై విభేదించిన న్యాయమూర్తి సోనియా సోటోమేయర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం వల్ల అధ్యక్షుడికి అపూర్వమైన అధికారం లభించిందని, ఇది ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని ఆమె హెచ్చరించారు. సెంట్రల్ బ్యాంకు గవర్నర్లలో ఒకరైన లీసా కుక్‌ను తొలగించాలన్న ట్రంప్ ప్రయత్నం వెనుక రాజకీయ ఉద్దేశాలున్నాయని విమర్శకులు ఆరోపిస్తున్నారు. వడ్డీ రేట్లపై ప్రభావం చూపేందుకు ఫెడరల్ రిజర్వ్‌పై నియంత్రణ సాధించాలనే లక్ష్యంతోనే ఈ చర్యలు చేపట్టినట్లు వారు అంటున్నారు. కుక్‌పై మిచిగన్, జార్జియా రాష్ట్రాల్లోని రెండు ఇళ్లను ఒకేసారి ప్రధాన నివాసంగా చూపించి తక్కువ వడ్డీ రేటుతో రుణాలు పొందేందుకు ప్రయత్నించారనే ఆరోపణలు ఉన్నాయి. తాను ఎలాంటి తప్పూ చేయలేదని, తనపై ఎలాంటి క్రిమినల్ కేసు కూడా నమోదు కాలేదని లీసా కుక్ స్పష్టం చేశారు.

# షైనింగ్ స్టార్లే మా బ్రాండ్ అంబాసిడర్లు

>> ఆ క్రెడిట్ అంతా ఇక్కడున్న షైనింగ్ స్టార్లదే.

**నా డ్రీమ్ ను మీరు సాకారం చేశారు:** ఏపీకి బ్రాండ్ అంబాసిడర్ మన సిబిఎన్ గారు. ప్రభుత్వ పాఠశాలలకు షైనింగ్ స్టార్స్ బ్రాండ్ అంబాసిడర్లు. మిమ్మల్ని కలవడం ఆనందంగా ఉంది. మీ సక్సెస్ స్టోరీ ఏంటో తెలుసుకోవాలనే ఈ ప్రోగ్రాం ఏర్పాటు చేసాను. కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా గవర్నమెంట్ స్కూల్స్ ను తయారు చెయ్యాలని టార్గెట్ పెట్టుకొని పనిచేస్తున్నాం. నేను ఫస్ట్ టైమ్ మెగా పిటిఎం పెట్టినప్పుడు చెప్పాను. ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు ఎలాంటి ప్రకటనలు ఇస్తాయో అలానే ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులు సక్సెస్ కూడా సెలబ్రేట్ చేస్తానని చెప్పారు. నా డ్రీం మీరు సాకారం చేసారు. మీ ఫోటోలతో ప్రకటన ఇచ్చాం. ప్రభుత్వ పాఠశాలల్లో స్కూళ్ల కోసం ఎమ్మెల్యేల రికమెండేషన్ కోరే రోజు వస్తుందని అసెంబ్లీ సాక్షిగా చెప్పా అన్నారు.

**ప్రభుత్వ స్కూళ్లలో నో అడ్మిషన్ బోర్డులు:** ఇప్పుడు గవర్నమెంట్ స్కూళ్లలో నో అడ్మిషన్ బోర్డులు చూసే రోజు వచ్చింది. షైనింగ్ స్టార్స్ విజయం వెనుక టీచర్ల కృషి ఉంది. తల్లిదండ్రుల ప్రోత్సాహం ఉంది. 100 రోజుల యాక్షన్ ప్లాన్ ఉంది. ఎవరైనా ఒక సబ్జెక్ట్ లో వీక్ గా ఉంటే స్పెషల్ కేర్ తీసుకున్నారు. ఫైనల్ గా ఎగ్జామ్స్ లో అద్భుతమైన ఫలితాలు సాధించారు. ఈ ఫలితం వెనుక ఎంతో మంది కష్టం ఉంది. ఇదంతా ఒక్కరోజులో అవ్వలేదు . ఒక నెలలో అవ్వలేదు...విద్యా వ్యవస్థలో మార్పు తీసుకురవడానికి నాకు రెండేళ్ళు పట్టింది. నేను విద్యామంత్రి అయినపుడు పలువురు సౌకర్యాల గురించి అడిగారు. అందరూ హార్డ్ వేర్ బాగుంటే చాలు అనుకుంటారు.. హార్డ్ వేర్ అంటే బిల్డింగ్స్, ఫ్యాన్లు, టాయిలెట్స్. వాటితోపాటు సాఫ్ట్ వేర్ కూడా ముఖ్యమే. సాఫ్ట్‌వేర్ అంటే నాణ్యమైన విద్య. మంత్రిగా బాధ్యత తీసుకున్న మొదటి రోజు నుండే నేను ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ - లీప్ మిషన్ స్టార్ట్ చేశాను, లీప్ యాప్ తెచ్చాం. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరుతో స్టూడెంట్ కిట్ తెచ్చాం. విద్యా శాఖలో రాజకీయ రంగులు ఉండకూడదని నిర్ణయం తీసుకున్నా. గతంలో టెక్స్ట్ బుక్ లో ముఖ్యమంత్రి, మంత్రి, అధికారుల సందేశాలు ఉండేవి, వాటన్నింటినీ తీసేశాం.

**ప్రతివిద్యార్థిపై ప్రభుత్వ లక్ష రూపాయలు ఖర్చు చేస్తోంది:** జీవితంలో కష్టాలు వస్తాయి, అధిగమించే శక్తి కూడా దేవుడు మనకు ఇస్తాడు. తల్లిదండ్రులు అనేక ఇబ్బందులు పడి మిమ్మల్ని చదివిస్తున్నారు. దయచేసి ఇది మరువద్దు. జీవన ప్రయాణంలో అనేక దెబ్బలు తగులుతాయి. ఫెయిల్ అంటే ఫస్ట్ ఎటెంప్ట్ ఇన్ లెర్నింగ్. తప్పును ఎంత త్వరగా సరిదిద్దుకుంటామన్నదే ముఖ్యం. విద్యార్థులు ఒక సబ్జెక్టు ఫెయిలైతే ఆత్మహత్య చేసుకుంటున్నారు. దీనివల్ల తల్లిదండ్రులు ఎంత బాధపడతారో ఆలోచించాలి. జీవితంలో అనేక ఎదురు దెబ్బలు తగులుతాయి. కష్టపడటానికి ప్రత్యామ్నాయం లేదు. దేశం కోసం ప్రధాని మోడీజీ ఎంతో కష్టపడుతున్నారు. ప్రతి విద్యార్థిపై ప్రభుత్వం లక్షరూపాయలు ఖర్చుపెడుతోంది. ప్రభుత్వం ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత మీపై ఉంది. మీ స్కూలును మర్చిపోవద్దు. మీకు చాన్స్ దొరికినపుడు మీ వంతు సహాయం ఆ పాఠశాలకు అందజేయాలని మంత్రి లోకేష్ విజ్ఞప్తిచేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యాశాఖ డైరక్టర్ తమీమ్ అన్సారియా, ఇంటర్మీడియట్ విద్య కమిషనర్ రంజిత్ బాషా తదితరులు పాల్గొన్నారు.

# ఇద్దరు హెడ్‌కానిస్టేబుళ్లు లొంగుబాటు

>> రౌడీషీటర్లు, పాత నేరస్థులతో సఖ్యంగా ఉండటం, బెదిరింపులకు పాల్పడటం, నేరస్థులను స్టేషన్‌కు తీసుకురావడం వంటి పనులను నాని చేసేవాడు. నాని పటమట స్టేషన్‌లో పనిచేసినప్పుడు స్పా సెంటర్ల విషయంలో ఆరోపణలు రావడంతో వీఆర్‌కు పంపించారు. గన్నవరం స్టేషన్‌లో పనిచేసినప్పుడు ఓ మిస్సింగ్ కేసులో ఆత్కూరు స్టేషన్ ఎస్సైని అని చెప్పి డబ్బులు వసూలు చేసిన వ్యవహారంలో సస్పెండయ్యాడు. సీఐ నాగరాజుకు సన్నిహితంగా మెలిగిన ప్రైవేట్ వ్యక్తి సురేశ్ కూడా వీరితో కలిసి రౌడీషీటర్ల కౌన్సెలింగ్, నిందితుల విచారణ, తదితర వ్యవహారాల్లో జోక్యం చేసుకునేవాడని తేలింది. గత నెల 29న సాయికృష్ణ బంధువులను కలిసేందుకు ఈ ముగ్గురూ గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం వడ్డేశ్వరం వెళ్లారని సిట్ అధికారులు గుర్తించారు. సురేశ్‌ను సిట్ ఇప్పటికే అదుపులోకి తీసుకుంది. అతన్ని విచారణ అనంతరం కోర్టు హాజరు పరిచే దిశలో సిట్ సిద్ధమవుతుంది.

గాదె సాయికృష్ణ తల్లి విజయలక్ష్మి దాఖలు చేసిన హెబియస్ కార్పస్ పిటిషన్‌పై ఏపీ హైకోర్టు విచారణను మంగళవారానికి వాయిదా వేసింది.. ఈరోజు పిటిషన్ విచారణకు రీచ్ అవకపోవడంతో రేపటికి వాయిదా వేయాలని హైకోర్టు నిర్ణయించింది. తన కొడుకు విజయవాడ కృష్ణలంక పోలీసులు బలవంతంగా తీసుకుని వెళ్ళి లాకప్‌లో చిత్ర హింసలకు గురిచేసారని విజయలక్ష్మి తన పిటిషన్ ఆరోపించారు., అతన్ని లాకప్ డెత్ చేసారని అనుమాన వ్యక్తం చేసారు. అతన్ని తమ అప్పగించాలని పోలీసులను ఆదేశించాలని కోరారుఈ క్రమంలో .హెబియస్ కార్పస్ పిటిషన్‌పై విచారణను రేపటికి ఏపీ హైకోర్టువాయిదా వేసింది.. ఏపీ హైకోర్టు రేపు విచారణ చేపట్టనున్నది. ఈ కేసుపై విచారణ నివేదికను హైకోర్టుకు సిట్ అధికారులు సమర్పించనున్నారు.

గాదె సాయికృష్ణ కస్టోడియల్ డెత్ కేసులో సీఐ నాగరాజును కస్టడీకి కోరుతూ సిట్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ వాయిదా పడింది. ఈ కేసుకు సంబంధించి విజయవాడలో ఏజేఎమ్ కోర్టులో రెండు పిటిషన్లపై సోమవారం విచారణ జరిగింది. ఈ కేసులో మరిన్ని వివరాలను సేకరించేందుకు సీఐ నాగరాజును కస్టడీకి కోరుతూ సిట్ అధికారులు పిటిషన్ వేశారు. 12 రోజుల పాటు సీఐను కస్టడీలోకి ఇస్తే పూర్తి స్థాయిలో విచారిస్తామని కోర్టుకు తెలిపారు. దీనిపై విచారణ జరిపిన కోర్టు కౌంటర్ దాఖలు చేయాలని సీఐ తరఫున న్యాయవాదిని ఆదేశించింది. పిటిషన్‌పై తదుపరి విచారణను జులై 1వ తేదీకి వాయిదా వేసింది.

**ఇంటి భోజనానికి అనుమతి:** రాజమండ్రి సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న నాగరాజు.. తనకు ఇంటి నుంచి భోజనం తెచ్చుకునేందుకు అనుమతి ఇవ్వాలని, తన ఆరోగ్య కారణాల దృష్ట్యా బయటి ఆహారం పడదంటూ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారించిన కోర్టు.. సీఐ నాగరాజుకు ఇంటి నుంచి భోజనాన్ని తెప్పించుకునేందుకు అనుమతులిస్తూ ఆదేశాలు జారీ చేసింది.

## ప్రధాని మోడీకి ఇరాన్ సుప్రీం లీడర్ సందేశం

>> కొత్త సుప్రీం లీడర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆ తర్వాత ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ అలీ ఖమేనీ అంత్యక్రియలకు హాజరుకావాలని ప్రధాని మోడీకి ఆహ్వానం పంపారు. ముందుగా నిర్ణయించిన విదేశీ పర్యటనల కారణంగా ప్రధాని మోడీ ఆ కార్యక్రమానికి హాజరు కాలేకపోతున్నారు. సుప్రీం లీడర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొజ్తబా ఖమేనీ నేరుగా ప్రధాని మోడీకి సందేశం పంపడం ఇదే తొలిసారి కావడం విశేషం. మరోవైపు అమెరికా దాడుల్లో తీవ్రంగా గాయపడినట్లు వార్తలు వచ్చినప్పటి నుంచి మొజ్తబా ఖమేనీ ఇప్పటి వరకు బహిరంగంగా కనిపించలేదు. దీంతో ఆయన ఆరోగ్య పరిస్థితిపై కూడా అంతర్జాతీయంగా చర్చ కొనసాగుతోంది.

## జర్మనీలో కాల్పుల కలకలం: ఐదుగురు మృతి పోలీసుల అదుపులో అనుమానితుడు

**స్టాడే(జర్మనీ),జూన్ 29:** జర్మనీలో కాల్పుల ఘటన కలకలం రేపింది. ఉత్తర జర్మనీలోని స్టాడే పట్టణంలో సోమవారం జరిగిన కాల్పుల్లో కనీసం ఐదుగురు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఘటన అనంతరం ఒక అనుమానితుడిని అదుపులోకి తీసుకుని విచారణచేస్తున్నారు. ఈ కేసుపై విస్తృత దర్యాప్తు కొనసాగుతోంది. కాల్పులకు గల కారణాలు ఇంకా తెలియరాలేదు. మృతుల వివరాలను కూడా అధికారులు ఇంకా వెల్లడించలేదు. ఘటన ఎలా జరిగింది దాడికి దారితీసిన పరిస్థితులు ఏంటి అనే అంశాలపై దర్యాప్తు చేస్తున్నారు. జర్మన్ వార్తా సంస్థ డీపీఏ కథనం ప్రకారం.. సుమారు 50 వేల జనాభా కలిగిన స్టాడే పట్టణంలోని ఓ యూత్ సెంటర్ సమీపంలో ఈ కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ పట్టణం హాంబర్గ్ నగరానికి పశ్చిమ దిశలో ఉంది. ఈ ఘటనలో ఒకటి కంటే ఎక్కువ మంది నిందితులు ఉండే అవకాశం ఉందని ప్రచారం జరుగుతున్నా పోలీసులు ధృవీకరించలేదు. ఘటన అనంతరం డాంకర్స్‌స్ట్రాసే పరిసర ప్రాంతాల్లో భారీ ఎత్తున పోలీసు బలగాలను మోహరించారు. ఆ ప్రాంతానికి ప్రజలు వెళ్లొద్దని, అత్యవసర సిబ్బంది సూచనలను తప్పనిసరిగా పాటించాలని హెచ్చరించారు.

## నేడు దోహాలో అమెరికా-ఇరాన్ చర్చలు

>> చారిత్రాత్మక తాత్కాలిక శాంతి ఒప్పందం కుదిరిన 11 రోజులకే పరస్పరం భారీ దాడులు జరగడం, ఆ వెంటనే ఈ అత్యవసర చర్చఉ ఖరారు కావడం గమనార్హం. దోహాలో జరిగే చర్చల్లో హార్ముజ్ జలసంధి అంశ్రమే ప్రధానం కానుంది. అమెరికా సాంకేతిక బృందం అధిపతి నిక్ స్టెవర్ట్ ఈ చర్చల్లో పాల్గొననున్నారు. ఈ సమావేశంలో ముందుగా వాణిజ్య నౌకల రాకపోకలపై ఉన్న విభేదాలను, మిలిటరీ హాట్‌లైన్ ఏర్పాటును పూర్తిస్థాయిలో పరిష్కరించనున్నారు. ఆ తర్వాతే ఇరాన్ అణు కార్యక్రమం, ఆర్థిక ఆంక్షల సరళీకరణ, దీర్ఘకాలిక శాంతి వంటి విస్తృతమైన అంశాలపై చర్చలు జరగనున్నాయి. గతవారం కుదిరిన అవగాహన ఒప్పందంలో ప్రపంచ ఇంధన రవాణాలో అత్యంత కీలకమైన హార్ముజ్ జలసంధి గుండా వెళ్లే అంతర్జాతీయ వాణిజ్య నౌకలకు ఎలాంటి అభ్యంతరాలు లేకుండా సురక్షితమైన మార్గాన్ని కల్పించడానికి అంగీకరించింది. అయితే హార్ముజ్ జలసంధి గుండా వెళ్లే ప్రతి నౌక తప్పనిసరిగా తమ అధికారులతో ముందస్తుగా సమన్వయం చేసుకోవాలని ఇరాన్ పట్టుబట్టడం, ఇది ఒప్పంద పరిధిని దాటి వ్యవహరించడమేనని అమెరికా భావించడంతో కుదిరిన ఒప్పందం విచ్ఛిన్నం అయింది. దాంతో కొద్ది రోజులకే మళ్లీ దాడులు మొదలయ్యాయి. ఈ వారాంతంలో అమెరికా-ఇరాన్ దేశాల మధ్య జరిగిన దాడులు పశ్చిమాసియా ప్రాంతాన్ని భయాందోళనకు గురిచేశాయి.

## సాయికృష్ణ లాకప్‌డెత్ కేసులో క్రైం కానిస్టేబుల్ బాబూరావు అరెస్ట్

**విజయవాడ కార్పోరేషన్,జూన్ 29,ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కల్గించిన గాదె సాయికృష్ణ అదృశ్యం కేసులో కృష్ణలంక పోలీస్‌స్టేషన్ క్రైం విభాగంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న బాబూరావును సిట్ బృందం సోమవారం అదుపులోకి తీసుకుంది. ఇదిలా ఉండగా కస్టోడియల్ డెత్ కేసును జ్యుడీషియల్ విచారణకుఅప్పగించాలని కోరుతూ విజయవాడ న్యాయస్థానంలో సాయికృష్ణ తల్లి విజయలక్ష్మి దాఖలు చేసిన పిటీషన్‌ను మాజీ సిఐ నాగరాజు న్యాయవాదుల కౌంటర్‌ను దాఖలు చేసే నిమిత్తం న్యాయమూర్తి వాయిదా వేశారు.



సోమవారం రాజధాని నిర్మాణ పనులపై సమీక్షిస్తున్న సిఎం చంద్రబాబు

# హైదరాబాద్ ప్లస్‌గా అమరావతి

>> తున్నాయని తెలిపారు. పనులు వేగంగా చేసేందుకు అవసరమైన మానవ వనరులు, యంత్రాలు ఇతర సామాగ్రిని ముందుగానే సిద్ధం చేసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. ప్రస్తుతం 26,924 మంది కార్మికులు, 5,140కి పైగా భారీ యంత్రాలు నిర్మాణ పనుల్లో నిమగ్నమైనట్టు మంత్రి నారాయణ సీఎంకు వివరించారు. నిర్మాణ పనులకు ఎలాంటి ఆటంకమూ లేకుండా కొండవీటి వాగు, పాలవాగు ప్రవాహాలు సజావుగా సాగేందుకు వీలుగా వాటిని వెడల్పు చేస్తుమ్నని మంత్రి తెలియచేశారు. దీనిపై స్పందించిన సీఎం భవిష్యత్ నగరంగా నిర్మిస్తు అమరావతి నిర్మాణంలో పని చేశామన్న బ్రాండ్ ను కాంట్రాక్టర్లు సంపాదించేలా పనులు చేపట్టాలని సూచించారు. కొందరు వ్యక్తులు కావాలని లిటిగెంట్లుగా మారి రాజధాని పనుల్ని అడ్డుకోవాలని ప్రయత్నాలు చేస్తున్నారని .. రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ముందుకు వెళ్లాలని సీఎం స్పష్టం చేశారు. కార్యదర్శులు, ప్రధాన కార్యదర్శుల నివాసాలు, రహదారులు, మౌలిక సదుపాయాలతో పాటు అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయ టవర్ల నిర్మాణాలపై ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారు. దేశవ్యాప్తంగా వివిధ పుణ్య క్షేత్రాలు, నదుల నుంచి పవిత్రమైన మట్టి, నీళ్ల తీసుకువచ్చి ఈ ప్రాంతాన్ని పునీతం చేశామని.. గత పాలకులు ఐదేళ్ల పాటు రాజధాని నిర్మాణాన్ని ఆపేశారని సీఎం అన్నారు. గడచిన రెండేళ్లుగా అమరావతి నిర్మాణాన్ని మళ్లీ గాడిలో పెట్టామన్నారు. అత్యుత్తమ నివాసయోగ్య నగరంగా నిర్మాణం చేస్తున్న అమరావతిలో భాగస్వాములం అయ్యామన్న ఆలోచనతో కాంట్రాక్టు సంస్థలు పనిచేయాలని సీఎం సూచించారు. పనులు పూర్తి అయ్యాక రాజధాని నిర్మాణాల ప్రారంభోత్సవానికి ప్రధాని మోదీని ఆహ్వానిస్తామని సీఎం తెలిపారు. నిర్మాణ పనుల వేగంతో పాటు నాణ్యత పై కూడా ఎక్కడా రాజీ లేకుండా చేపట్టాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయ భవనాలు ఐకానిక్ నిర్మాణాలుగా ఉండాలని పేర్కొన్నారు. అమరావతికి పేరు తెచ్చేలా ఈ భవనాలను నిర్మించాలన్నారు. రాజధాని నిర్మాణంలో చిన్న ఇబ్బందులు కూడా లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ప్రతీ రెండు నెలలకు ఒకసారి నిర్మాణాల పురోగతిపై సమీక్షిస్తానని సీఎం స్పష్టం చేశారు. ఎల్ అండ్ టీ, షాపూర్ జీ పల్లోంజి, మెగా ఇంజినీరింగ్, ఎన్సీసీ, బీఎస్ఆర్, కేఎంవీ సహా వేర్వేరు కాంట్రాక్టు సంస్థలు చేపట్టిన పనులకు సంబంధించిన అంశాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయా సంస్థల ప్రతినిధులకు సీఎం దిశా నిర్దేశం చేశారు. ఈ సమీక్షకు పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ, సీఆర్డీఏ అధికారులు, వివిధ కాంట్రాక్టు సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు.

# సాగుకు ఇక కొత్తదిశ

>> అందువల్ల వ్యవసాయ రంగానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వ నిరక్ష్యంతో తీవ్రంగా దెబ్బతిన్న వ్యవసాయ రంగాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రెండేళ్లలో గాడిలో పెట్టగలిగాం. రైతుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, సాంకేతిక పరిజ్ఞానం, మార్కెట్ అనుసంధానం వంటి అన్ని అంశాల్లో ప్రభుత్వం సమగ్ర చర్యలు చేపట్టింది. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి రైతు ఆదాయం పెంచడమే ఎన్డీయే కూటమి ప్రభుత్వ సంకల్పం అని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వ్యవసాయం, నీటిపారుదల వంటి కీలక రంగాలు పూర్తిగా నిరక్ష్యానికి గురయ్యాయని విమర్శించారు. రైతు భరోసా కింద సంవత్సరానికి రూ.7,500 ఇవ్వడం మినహా రైతుకు ఉపయోగపడే అనేక పథకాలను నిలిపివేశారని, విత్తన కంపెనీలకు వందల కోట్ల రూపాయల బకాయిలు పెట్టి విత్తన సరఫరా వ్యవస్థను దెబ్బతీశారని అన్నారు. గత ప్రభుత్వ బకాయిలను దశలవారీగా చెల్లించి, రాయితీపై రైతులకు నాణ్యమైన విత్తనాలను సబ్సిడీపై అందిస్తున్నామని చెప్పారు. రైతులు సంప్రదాయ సాగు విధానాలతో పాటు మార్కెట్ అవసరాలు, శాస్త్రవేత్తల సూచనలకు అనుగుణంగా పంటల సాగు చేయాలని మంత్రి సూచించారు. ఒక సంవత్సరం ధరలు బాగున్నాయని ఒకే పంటను అధికంగా సాగు చేస్తే మరుసటి ఏడాది ధరలు పడిపోయి రైతులు నష్టపోయే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. మిర్చి, పొగాకు వంటి పంటల విషయంలో గత అనుభవాలు దీనికి నిదర్శనమని పేర్కొన్నారు. అధిక కెమికల్స్ ఉపయోగించడం వలన ఇటీవల చైనాకు వెళ్లిన గుంటూరు మిర్చి కంటైనర్స్ తిరిగి వెనక్కి వచ్చిన సందర్భాలు గుర్తుచేసుకోవాలని తెలిపారు. ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవాలని రైతులకు విజ్ఞప్తి చేశారు ఎలాంటి వాతావరణ సవాళ్లు ఎదురైనా రైతులను ఆదుకునేందుకు అవసరమైన అన్ని చర్యలు సిద్ధంగా ఉన్నాయని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఎక్కడా ఎరువుల కొరత లేదని స్పష్టం చేసిన మంత్రి, శాస్త్రవేత్తల సిఫార్సుల మేరకే ప్రాంతాల వారీగా ఎరువుల సరఫరా చేస్తున్నామని చెప్పారు.

## విద్యార్థిని గెంటివేత

>> అర్హత లేదు అంటూ వార్డెన్ రాత్రి సమయంలో బయటకు పంపించారని ఆరోపించారు. హాస్టల్‌లో పనిచేస్తున్న రాణి అనే వర్కర్ తనను జుట్టు పట్టుకుని కొట్టిందని విద్యార్థిని తెలిపింది. రాత్రి 11 గంటల వరకు హాస్టల్ గేటు వద్ద వేచి ఉన్నప్పటికీ వార్డెన్ లోపలికి అనుమతించలేదని, చివరకు విషయం తెలుసుకున్న విద్యార్థిని తల్లిదండ్రులు కుమార్తెను ఇంటికి తీసుకెళ్లాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. హాస్టల్‌లో విద్యార్థులను తరచూ వేధిస్తున్నారని, ప్రశ్నించిన వారిని రాత్రి వేళ బయటకు పంపిస్తున్నారని మరికొందరు విద్యార్థినులు కూడా ఆరోపించారు. సిబ్బందిని తనకు అనుకూలంగా మార్చుకుని విద్యార్థులపై తప్పుడు ఆరోపణలు చేయిస్తున్నారని తల్లిదండ్రులు పేర్కొన్నారు. ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వెంటనే విచారణకు ఆదేశాలు జారీ చేసింది. ప్రాథమిక విచారణలో వార్డెన్ నిరక్ష్యం, అనుచిత ప్రవర్తన కనిపించడంతో సంబంధిత వార్డెన్ స్వప్నను సస్పెండ్ చేశారు. పూర్తి స్థాయి విచారణ కొనసాగుతోంది.

## ఆంక్షలు ఎత్తివేత

>> ఉద్దేశమని ప్రభుత్వం తెలిపింది. ప్రస్తుతం దేశంలో ఇంధన సరఫరా పరిస్థితులు సాధారణ స్థితికి చేరుకోవడంతో ఈ ఆంక్షలను ఉపసంహరించుకోవాలని నిర్ణయించినట్లు ప్రభుత్వం వెల్లడించింది. దీంతో జూలై 1నుంచి రవాణా సంస్థలు, పరిశ్రమలు సహా అన్ని వాణిజ్య వినియోగదారులు మళ్లీ రిటైల్ పెట్రోల్ బంకుల నుంచి ఎలాంటి పరిమితులు లేకుండా పెట్రోల్, డీజిల్ కొనుగోలు చేసుకోవచ్చు. రిటైల్ ఇంధన ధరలు, బల్క్ సరఫరా ధరల మధ్య భారీ వ్యత్యాసం ఏర్పడటంతో ఈ ఆంక్షలు అమల్లోకి వచ్చాయి.

## రేపు నెల్లూరు, తిరుపతిలో సిఎం చంద్రబాబు పర్యటన

>> పంపిణీ చేయనున్నారు. వృద్ధాప్య, వితంతు సహా వేర్వేరు కేటగిరీలకు చెందిన 62 లక్షల మంది లబ్ధిదారులకు రూ.2750 కోట్ల మేర పెన్షన్ ను అందించనున్నారు. పున్నపు వారిపాలెం గ్రామంలో ఓ లబ్ధిదారు ఇంటికి వెళ్లనున్న ముఖ్యమంత్రి స్వయంగా పెన్షన్ ను పంపిణీ చేయనున్నారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన ప్రజావేదిక సభలో సీఎం పాల్గొననున్నారు. రాత్రికి శ్రీసిటీలో ఉన్న అతిథి గృహంలో ముఖ్యమంత్రి బస చేయనున్నారు.

## వారం - వర్జ్యం

30-06-2026, మంగళవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
నిజ జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, ఆరుద్ర కార్తె
పాడ్యమి ఉ.7.39
పూర్వాషాఢ పూర్తి
వర్జ్యం : మ.2.46-సా.4.34
దు.ఉ.8.14-ఉ.9.06, 2) రా.11.58-రా.12.50
శుభసమయం : ఉ.9.30-ఉ.10.30
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం:** నూతన విద్యా ఉద్యోగావకాశాలు లాభిస్తాయి. వాహనాల విషయంలో మెలకువలో వ్యవహరించండి.

**వృషభం:** సంఘంలో ఓ ప్రత్యేకత గౌరవం పొందుతారు. ప్రముఖులతో పరిచయాలు. పెట్టుబడులకు అనుకూల సమయం.

**మిథునం:** ప్రకృతి వైద్యం, ఆయుర్వేద వైద్యం పట్ల ఎక్కువ దృష్టి సాధించ గలుగుతారు. కుటుంబసమస్యలు తీరుతాయి.

**కర్కాటకం:** బంధువులతో వ్యక్తిగత విషయాలపై సంప్రదిస్తారు. అధికార హోదా కలిగిన వ్యక్తులతో పరిచయం.

**సింహం:** ఫలితములు మీ చేతికి అందకపోయినా కనుచూపు మేరలోనే మీ కృషికి తగిన ఫలితం కనిపిస్తుంది. వస్త్రలాభం.

**కన్య :** స్వయం కృతాపరాధములు, పొరపాటు నిర్ణయాలు, నోరుజారుట వంటివి సంభవించ కుండా జాగ్రత్త వహించండి.

**తుల:** వివాహాది శుభకార్యాలలో చురుకుగా పాల్గొంటారు. ప్రయాణాలలో వస్తు భద్రత పట్ల జాగ్రత్తలు పాటించండి.

**వృశ్చికం:** ముఖ్యమైన వ్యవహారాలలో ఎదురైనా ఆటంకాలు అధిగమిస్తారు. ఋణాలు కొంతవరకు తీరుస్తారు.

**ధనుస్సు:** మీ మౌనము మీ సహనము మీకు మేలు చేస్తాయి. శారీరకంగా, మానసికంగా అలసట అధిగమవుతాయి. వస్త్ర లాభం.

**మకరం:** ఇన్‌స్టాల్‌మెంట్ చెల్లింపులను కాస్త ఆలస్యంగా చెల్లిస్తారు. సమాజములో మీకు గౌరవ ప్రతిష్ఠలు పెంపొందుతాయి.

**కుంభం:** మీ నమ్మకము కన్నా మీ ఇంటిలోని వారి ఊహే నిజమవుతుంది. శ్రమ అధికమవుతుంది. వాహనసౌఖ్యం.

**మీనం:** సంతాన భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పెద్ద మొత్తాలను డిపాజిట్ చేసేందుకు చికాకులు ఎదురుఅవుతాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# రేపు అనంతపురానికి రాష్ట్రపతి

**● సెంట్రల్ వర్సిటీ తొలి స్నాతకోత్సవానికి ముర్ము హాజరు ● గవర్నర్ అబ్దుల్ నజీర్, మంత్రులు లోకేష్, కేశవ్ రాక**

**● రాష్ట్రపతి ఏర్పాట్లు పర్యవేక్షించిన జిల్లా కలెక్టర్ ఆనంద్, ఎస్పీ జగదీష్**



**అనంతపురం, జూన్ 29 ప్రభాతవార్త బ్యూరో:** రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జులై 1న అనంతపురం జిల్లా పర్యటనకు రానున్నారు. సెంట్రల్ యూనివర్సిటీ మొదటి స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. రాష్ట్రపతి వస్తుండడంతో జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. జిల్లా కలెక్టర్ ఆనంద్, ఎస్పీ జగదీష్, తదితర జిల్లా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. రాష్ట్రపతి అనంతపురం జిల్లా పర్యటనకు సంబంధించి కలెక్టర్ ఆనంద్ వివరాలు వెల్లడించారు. రాష్ట్రపతి జులై 1న బుధవారం ఉ.09:30గంటలకు బెంగళూరు విమానాశ్రయం నుంచి బయలుదేరి హెలిక్యాప్టర్ ద్వారా అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం మండలంలోని కేంద్ర విశ్వవిద్యాలయంలో ఏర్పాటుచేసిన హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. అనంతరం హెలిప్యాడ్ నుంచి సెంట్రల్ యూనివర్సిటీకి 10.30గం.లకు రాష్ట్రపతి చేరుకుని, ఉదయం 11:00 గంటల నుంచి 12:00 గంటల వరకు కేంద్ర విశ్వవిద్యాలయం మొదటి స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరవుతారు. అనంతరం కేంద్ర విశ్వవిద్యాలయం హెలిప్యాడ్ నుండి 12.10గం.లకు బయలుదేరి బెంగళూరు విమానాశ్రయానికి చేరుకుని ఆ తర్వాత ప్రత్యేక విమానంలో న్యూఢిల్లీకి వెళుతారు.

**రాష్ట్రపతి పర్యటించే ప్రాంతాల్లో పటిష్ట భద్రత:** రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటించే ప్రాంతాలలో అడ్వాన్స్ సెక్యూరిటీ లైజన్ (ఏఎస్ఎల్) నిర్వహించి పటిష్ట భద్రతా చర్యలు పరిశీలించారు. కేంద్ర విశ్వవిద్యాలయంలో జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, ఎస్పీ పి.జగదీష్, రాష్ట్ర ఐ.ఎస్.డబ్ల్యు ఎస్పీ ఆరిఫ్, తదితరులు అడ్వాన్స్ సెక్యూరిటీ లైజన్ (ఏఎస్ఎల్) నిర్వహించి అన్ని భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. రాష్ట్రపతి కాన్వాయ్‌కి సంబంధించిన రూట్‌ను పరిశీలించారు. హెలిప్యాడ్, స్నాతకోత్సవ కార్యక్రమం వేదిక, పార్కింగ్ స్థలాలు వద్ద బందోబస్తు, భద్రత ఏర్పాట్లను సమీక్షించి అధికారులకు జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలు పలు సూచనలు చేశారు. ఎలాంటి ఇబ్బంది, లోటుపాట్లు లేకుండా ద్వారా రాష్ట్రపతి పర్యటనను విజయవంతం చేసేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**1,268 మంది విద్యార్థులకు పట్టాల ప్రదానం:** ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం తన విద్యా ప్రస్థానంలో మరో చారిత్రాత్మక ఘట్టానికి సాక్ష్యంగా తొలి స్నాతకోత్సవాన్ని 2026 జులై 1న నిర్వహించనుంది. ఈ వేడుకకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ కార్యక్రమానికి విశ్వవిద్యాలయ కులాధిపతి డా. శంకర్ ఆచార్య అధ్యక్షత వహించనుండగా, గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్, మంత్రులు నారా లోకేష్, పయ్యావుల కేశవ్ విశిష్ట అతిథులుగా పాల్గొననున్నారు. ఈ తొలి స్నాతకోత్సవంలో 2020 నుండి 2026 వరకు 1,268 మంది విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేయనున్నారు. వీరిలో 480 మంది స్నాతక, 788 మంది స్నాతకోత్తర విద్యార్థులు ఉండగా, వీరు దేశంలోని 23 రాష్ట్రాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అలాగే 11 రాష్ట్రాలకు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులకు 56 విశ్వవిద్యాలయ స్వర్ణ పతకాలు, 8 దాతృత్వ స్వర్ణ పతకాలు ప్రదానం చేయనున్నారు. ఈ సందర్భంగా ఉపకులపతి ఆచార్య ఎస్.ఎ.కోరి మాట్లాడుతూ తొలి స్నాతకోత్సవం విశ్వవిద్యా లయ చరిత్రలో చిరస్మరణీయ మైలురాయిగా నిలుస్తుందని, నాణ్యమైన ఉన్నత విద్య, పరిశోధన, ఆవిష్కరణలు, సమగ్రాభివృద్ధి ద్వారా దేశ నిర్మాణానికి తోడ్పడే విద్యార్థులను తీర్చిదిద్దడమే విశ్వవిద్యాలయ లక్ష్యమని పేర్కొన్నారు.



రాష్ట్రపతి పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న జిల్లా కలెక్టర్ ఆనంద్, ఎస్పీ జగదీష్ తదితర అధికారులు

# అడవిబిడ్డల కళ్లల్లో ఆనంద హేల

**● రైతుల కల నిజం చేసిన సిఎం చంద్రబాబు ● 65 యేళ్లుగా ఉన్న రైతుల నిరీక్షణకు తెర ● భూపట్టాల మంజూరుకు గ్రీన్‌సిగ్నల్ ● జులై 4న సిఎం పర్యటనలో పంపిణి ● జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రత్యేక చొరవ**

**కుప్పం, జూన్ 29 ప్రభాతవార్త:** కుప ్ం ప్రాంత చరిత్రకు సాక్ష్యంగా నిలిచే కంగుంది అటవీ ప్రాంతంలో ఉన్న భూములను సాగు చేసుకుంటూ పట్టాల కోసం రైతులు 65యేళ్లుగా చేసిన నిరీక్షణకు ప్రభుత్వం తెరదించింది. సిఎం చంద్రబాబు ఆదేశాలతో ఇటీవల మంత్రి వర్గం రైతులకు భూపట్టాలు పంపిణీ చేసేందుకు అనుమతి ఇచ్చింది. దీంతో అటవీ ప్రాంతంలో అనాదిగా భూములు సాగు చేస్తున్న రైతుల కళ్లల్లో ఆనంద హేల కన్పిస్తోంది. జూలై 4న సిఎం చంద్రబాబునాయుడు కుప్పం పర్యటనలో రైతులకు భూపట్టాలు పంపిణీ చేయనున్నారు.

**రైతులకు ప్రభుత్వం న్యాయం:** కంగుంది పంచాయతీ అంబాపురం, రాములగుట్టచేను, చిలకాల వంక తదితర గ్రామాలు 1965 ప్రాంతంనుంచి రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో ఉన్నాయి. అయితే వ్యవసాయాన్నే నమ్ముకున్న సుమారు 350 మంది రైతులు అక్కడే భూములను సాగు చేసుకుని వ్యవసాయ పంటలు పండిస్తూ తమ కుటుంబాలను నెట్టుకువస్తున్నారు. ఈ భూములను రైతులు జమీందారు వంశస్తుల వద్ద కొనుగోలు చేశారు గతంలో. అనంతరం ఈ భూముల విషయంగా కోర్టు కేసులు నమోదయ్యాయి. దీంతో సమస్య కొనసాగుతూ వచ్చేది. గతంలో కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నేత గఫూర్ వంటి నేతలు సైతం ఈ గ్రామాల్లో



రాములగుట్టలో రైతులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ (ఫైల్‌ఫోటో)

పర్యటించి రైతులకు భూపట్టాలు అందించాలని సమావేశాలు నిర్వహించారు. అయితే ఈ సమస్యకు తాజాగా సిఎం చంద్రబాబు నాయుడు చెక్ పెట్టారు. భూములు సాగు చేస్తున్న రైతులకు వ్యక్తిగత పట్టాలు ఇవ్వాలని ఆదేశించారు.

**జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ:** కంగుంది ప్రాంతంలో రైతులు ఎదుర్కొంటున్న భూపట్టాల సమస్యలపై జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రత్యేక చొరవ చూపారు. భూములను సాగు చేస్తున్న రైతులకు సుమారు 530 ఎకరాలకు గాను వారికి వ్యక్తిగత పట్టాలు మంజూరు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడంలో కలెక్టర్ కీలకపాత్ర వహించారు. ఈ ప్రతిపాదనలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఇటీవలే జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, కడ పి.డి. వికాస్ మర్మత్, ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు గ్రామసభలు నిర్వహించి రైతులతో మాట్లాడారు. అర్హులైన రైతులకు ప్రభుత్వం పట్టాలు మంజూరు చేస్తుందని వారు రైతులకు భరోసా ఇచ్చారు. ఏదిఏమైనా కంగుంది ప్రాంతంలో రైతుల ఏళ్లనాటి కలను నిజం చేసిన సిఎం చంద్రబాబునాయుడుకు రైతులు కృతజ్ఞతలు చెబుతున్నారు.

## అన్నా క్యాంటీన్‌లకు రూ.50 లక్షల విరాళం

**విజయవాడ, జూన్ 29 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ స్టార్ హోటల్స్ అసోసియేషన్ సభ్యులు ముఖ్యమంత్రి చంద్రబాబుని సచివాలయంలో కలిసి అన్న క్యాంటీన్‌కు విరాళం అందించారు. తమ అసోసియేషన్ తరపున రూ.50 లక్షల చెక్కును సీఎంకు అందజేశారు. ఈ సందర్భంగా వారిని సీఎం అభినందించారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఏపీ స్టార్ హోటల్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్, హయత్ ప్లేస్ ఛైర్మన్ ఆర్.వీ స్వామి, వైస్ ప్రెసిడెంట్ పవన్ కార్తీక్, సెక్రటరీ సీ.మూర్తి, తాజ్ వివాంత ఛైర్మన్ మలినేని రాజయ్య, మురళీ ఫార్చ్యూన్ హోటల్ ఛైర్మన్ ముత్తవరపు మురళీ, జీఆర్టీ హోటల్స్ అధినేత వి.శరణ్ ఉన్నారు.



## నా భూమి నాకు తిరిగిచ్చేయండి

**● చట్టాలను గౌరవించి న్యాయం చేయండి**

**● గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు**



**విజయనగరం, జూన్ 29 ప్రభాతవార్త:** నేను వ్యక్తిగత విమర్శలు ఎవరికైనా చేయను. చట్టాలకు గౌరవిస్తాను, చట్టాలు అమలు చేసే బాధ్యత అధికారులదే అని అశోక్ గజపతిరాజు అన్నారు. సోమవారం అశోక్ బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత సమస్య మీద ప్రెస్ ముందుకు రావడం జరిగిందన్నారు. టౌన్ సర్వే నెంబర్ 569లో నాకు 4.76 ఎకరాలు భూమి ఉందనీ గత ప్రభుత్వంలో ఆ భూమిలో ఎకరా భూమిని గత ప్రభుత్వం ఆ పార్టీ కార్యాలయానికి ఇచ్చిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం రూల్ ఆఫ్ లా పాటించ లేదన్నారు. రూల్ పాటిస్తేనే రూల్ అని అదెక్కడా పాటించలేదన్నారు. ఆ సమస్యను మిస్ లీడ్ చేయడానికి చాలా మంది ప్రయత్నిస్తున్నారని, మీ ఇంటికి వచ్చి ఇది నా స్థలం అంటే నువ్వు ఒప్పుకుంటావా అని నిలదీశారు. నేను ఎవరిపైనా వ్యక్తిగత ఆరోపణలు చేయడం లేదని, చట్టం ప్రకారమే నేను మాట్లాడుతున్నాన్నారు. నా భూ సమస్య మీద కలెక్టర్‌కు లెటర్ పెట్టి ఒక ఏడాది అయింది. చివరిగా నాలుగు నెలలు కిందట ఆయన దృష్టిలో పెట్టడం జరిగిందన్నారు. ఇప్పటికీ స్పందన లేదని అధికారంలో లేని వారు కూడా వారికి అనుకూలంగా చేసుకుంటున్నారన్నారు. చట్టాల్ని చుట్టాలుగా చేస్తూ పనిచేస్తున్న వారు ఈ రోజు మాట్లాడుతున్నారని, వారు అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారన్నారు. అధికారులకు ఇది మంచి పద్ధతి కాదని చట్టాన్ని అమలు చేయండని మాకు చట్టం మీద నమ్మకం ఉందని మా నమ్మకానికి పరీక్ష పెట్టడం సరికాదన్నారు. చట్టం ప్రకారం వెళ్ళాలని, కానీ అధికారులు అలా వెళ్లడం లేదనీ చాలా బాధగా ఉందన్నారు. ప్రైవేట్ స్థలం.. అసలు ప్రభుత్వం స్థలంగా ఎలా మారింది? ప్రైవేట్ స్థలం.. ప్రభుత్వ స్థలంగా మార్చడానికి ఎమ్మార్వోకు అధికారం లేదన్నారు. ఆ కాంపిటీటివ్ అధికారం ఒక్క కలెక్టర్‌కు మాత్రమే ఉందన్నారు. వైలేషన్ ఆఫ్ లా అయిందా లేదా అన్నది కాదు. ఇది ఒక డైవర్షన్ మాత్రమే అన్నారు. మా భూమి అనడానికి అన్ని రికార్డులు ఉన్నాయన్నారు. గవర్నర్ అయ్యే ముందు పొలిటికల్ పార్టీకి రాజీనామా చేశానని, ఇప్పుడు నా ఆస్తులకు కూడా రాజీనామా చేయమంటే ఎలా? అన్నారు. ఎవరు బాధ్యత? అని కలెక్టర్‌ను అడిగానన్నారు. ప్లీజ్ ఇంప్లిమెంట్ ల్యాండ్ ఆఫ్ లా నా భూమి విషయంలో లా ఫాలో చేయాలని అధికారులకు చెప్తున్నానన్నారు. వైసీపీ కార్యాలయానికి డేట్ వారి ఏ విధంగా కేటాయించారో నా దగ్గర ఆధారాలు ఉన్నాయనీ చట్టాలను చుట్టాలుగా చేసి నా స్థలాన్ని కొట్టేశారన్నారు. చట్టాలను, రాజ్యాంగాన్ని గౌరవించాలన్నారు. వాటిని ఉల్లంఘించకండి అన్నారు. చట్టాన్ని అమలు చేసి, రికార్డులు పరిశీలించి నా భూమి విషయంలో తగు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

## ఇద్దరి హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

**చిత్తూరు, జూన్ 29 ప్రభాతవార్త:** చిత్తూరు తాలుకా స్టేషన్ పరిధిలో 2018 సంవత్సరంలో జరిగిన ఇద్దరి హత్య కేసులో నిందితుడైన బండికేశవులుకు 9వ అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి ఎన్.శ్రీనివాసరావు జీవిత ఖైదుతో పాటు ఒకొక్క హత్యకు వెయ్యి రూపాయలు చొప్పున జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు వెల్లడించారు. చిత్తూరు రూరల్ మండలం నాయనిచెరువు పంచాయతీ చెన్నసముద్రం గ్రామంకు చెందిన పల్లెబోయిన శేఖర్, పి.లక్ష్మీపతి యాదవ్‌లను 20 అక్టోబర్ 2018 రాత్రి చెరకు తోటలో బండి చెన్నకేశవులు కత్తితో గొంతు కోసి హత్యలు చేశాడు. బండి చెన్నకేశవులు తన కుమార్తెను పల్లెబోయిన శేఖర్ లైంగికంగా వేధిస్తున్నాడనే కక్షతో హత్య చేయగా ఈ హత్య బహిర్గతం కాకుండా వుండటానికి శేఖర్‌తో పాటు వున్న లక్ష్మీపతిని హత్యకు గురయ్యాడు. హత్యకు గురికాబడ్డ శేఖర్ తల్లి పి.మాణిక్యమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి తాలుకా ఎస్ఐ ఎన్.భాస్కర్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో నిందితుడు బండి కేశవులు విఆర్ఓ సమక్షంలో నేరం అంగీకరించి, హత్యకు ఉపయోగించిన కొడవలి, రక్తపు మరకలు వున్న దుస్తులు తదితరాలను పోలీసులు స్వాధీనం చేసుకుని శాస్త్రీయ ఆధారాలతో దర్యాప్తు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసు పూర్వపరాలను విచారించిన 9వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి కె.శ్రీనివాసరావు నిందితుడు బండి కేశవులును దోషిగా నిర్ధారించి జీవిత ఖైదుతో పాటు ఒకొక్క హత్యకు రూ.1000 జరిమానా విధించారు. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేవిధంగా కృషి చేసిన అప్పటి తాలుకా స్టేషన్ ఎస్ఐ భాస్కర్, ఈస్ట్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ బి.శ్రీనివాసరావు, ప్రస్తుత ఈస్ట్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ రామచంద్ర, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎన్.శరవణకుమార్, కోర్టుకు సాక్షులను సకాలంలో హాజరు పరచిన కోర్టు కానిస్టేబుల్ ఎం.శంకర్, కేసును పర్యవేక్షించిన డి.కార్తీకలను ఎస్పీ తుషార్ డూడి అభినందించారు.

# కొత్త ఆలోచనలకు.. అవకాశాలకు వేదికగా సిఐఐ సదస్సు

**● నవంబర్ 12,13 తేదీల్లో విశాఖలో ప్రతిష్టాత్మకంగా భాగస్వామ్య సదస్సు ● విశాఖ కంటే ముందుగా 5 చోట్ల ప్రాంతీయ భాగస్వామ్య సదస్సులు**

**● ఎంఒయులు, పెట్టుబడులతోపాటు నాలెడ్జ్ షేరింగ్ మీద ఎక్కువ దృష్టి ● సిఐఐ భాగస్వామ్య సదస్సు2026 సన్నాహక సమావేశంలో సిఎం చంద్రబాబు**

**విజయవాడ, జూన్ 29 ప్రభాతవార్త ప్రతినిధి:** నవంబర్‌లో నిర్వహించనున్న 31వ సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ ఏర్పాట్లపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నవంబర్ 12, 13 తేదీల్లో విశాఖపట్నంలో 31వ సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ నిర్వహించాలని నిర్ణయించారు. నావిగేటింగ్ చేంజ్, లీడర్‌షిప్. టెక్నాలజీ ట్రస్ట్, అండ్ ట్రేడ్ ఇన్ ట్రాన్స్‌ఫార్మింగ్ వరల్డ్ అనే అంశాన్ని ఈ ఏడాది సదస్సు థీమ్‌గా ఖరారు చేశారు. ప్రధాన సదస్సుకు ముందు విశాఖపట్నం, రాజమహేంద్రవరం లేదా కాకినాడ, అమరావతి, అనంతపురం, తిరుపతిలో ప్రాంతీయ భాగస్వామ్య సమావేశాలు నిర్వహించే అంశంపైనా చర్చించారు. ఈ సమావేశాల ద్వారా పెట్టుబడులు, పారిశ్రామిక అభివృద్ధిపై చర్చలు జరపడమే కాకుండా ప్రాంతీయ స్థాయిలో అవగాహన పెంచాలని నిర్ణయించారు. రెండు రోజుల పాటు జరిగే సదస్సులో ఎంఓయూలు, మినిస్టీరియల్ సెషన్లు, ప్లీనరీ సమావేశాలు, కంట్రీ సెషన్లు, బీ2బీ, బీ2జీ సమావేశాలు నిర్వహించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ సదస్సుకు దేశీయ, అంతర్జాతీయ కంపెనీల ప్రతినిధులు, కేంద్ర మంత్రులు, వివిధ దేశాల ప్రతినిధులను ఆహ్వానించనుంది. సదస్సుకు విస్తృత ప్రచారం కల్పించేందుకు జూలై నుంచి సెప్టెంబర్ వరకు దేశ, విదేశాల్లో రోడ్ షోలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఢిల్లీ, బెంగళూరు, చెన్నై, ముంబై, కోయంబత్తూర్, అహ్మదాబాద్, హైదరాబాద్ నగరాల్లో ఈ ప్రచార కార్యక్రమాలు చేపట్టనున్నారు. చర్యలు తీసుకోవాలని, ప్రముఖ అంతర్జాతీయ విశ్వవిద్యాలయాల నిపుణులను సదస్సుకు ఆహ్వానించాలని అధికారులను ఆదేశించారు. అలాగే ఎన్ని పెట్టుబడులు వచ్చాయన్న దానికంటే నాలెడ్జ్ షేరింగ్ ఎంత జరిగిందన్నదే ముఖ్యమని సీఎం స్పష్టం చేశారు. అదేవిధంగా, సీఐఐ గ్లోబల్ లీడర్‌షిప్ సెంటర్‌ను అమరావతిలో ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. సమీక్ష సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పలు కీలక సూచనలు చేశారు. పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్‌లో కేవలం పెట్టుబడులు, వ్యాపార అవకాశాలకే పరిమితం కాకుండా ప్రజా విధానాలు, సాంకేతికత, వ్యవసాయం, ఉద్యానవనం, ప్రకృతి వ్యవసాయం, సర్క్యులర్ ఎకానమీ, ఆధ్యాత్మికత, ఒత్తిడి లేని పని సంస్కృతి వంటి అంశాలపై కూడా విస్తృత చర్చలు జరగాలని సూచించారు. ప్రాంతీయ సమావేశాల్లోనూ ఎంఓయూలు కుదిరేలా చర్యలు తీసుకోవాలన్నారు.



**లీడర్లదే భవిష్యత్:** "భాగస్వామ్య సదస్సులు అంటే కేవలం పెట్టుబడులు రాబట్టడం, ఎంఓయూలు కుదుర్చుకోవడం అనే భావన పోవాలి. భాగస్వామ్య సదస్సుల్లో వివిధ కీలక అంశాల మీద చర్చ జరగాలి. ఎన్ని పెట్టుబడులు వస్తున్నాయి. ఎన్ని ఎంఓయూలు కుదుర్చుకున్నామనే దానికంటే నాలెడ్జ్ షేరింగ్ ఎంత వరకు చేసుకోగలుగుతున్నామనేది ముఖ్యం. అందుకే విశాఖలో జరగబోయే 31వ భాగస్వామ్య సదస్సులో జరిగే కార్యక్రమాలపై ప్రజలు చర్చించుకోవాలి. వినూత్నంగా ఆయా రంగాలను ఏ విధంగా అభివృద్ధి సాధించాలనే ఆలోచనలు రేకెత్తించాలి. టెక్నాలజీ సహా వివిధ అంశాల గురించి అందరూ మాట్లాడుతున్నారు. కానీ ఆయా రంగాల్లో ఛాంపియన్ గా నిలిచిన వాళ్లే గ్లోబల్ లీడర్లుగా ఎదుగుతున్నారు. ఫ్యూచరిస్టిక్ రంగాలపై ఎక్కువ దృష్టి సారించాలి. ప్రముఖ యూనివర్శిటీలకు చెందిన నిపుణులు భాగస్వామ్య సదస్సుకు వచ్చేలా చూడాలి. సీఐఐ గ్లోబల్ లీడర్ షిప్ సెంటర్‌ను అమరావతిలో ఏర్పాటు చేసుకోబోతున్నాం. విశాఖలో జరగబోయే పార్టనర్ షిప్ సమ్మిట్లో పబ్లిక్ పాలసీలపై చర్చలు జరగాలి. వ్యాపారాలు, పెట్టుబడులు వంటి అంశాలతోపాటు సవాళ్లు ఎదురైతే వాటిని ఎలా అధిగమించాలనే అంశంపై చర్చలు జరగాలి. వ్యవసాయం, ఉద్యానరంగం, ప్రకృతి వ్యవసాయం, సర్క్యులర్ ఎకానమీ, ఆధ్యాత్మికత, స్ట్రెస్ ఫ్రీ వర్క్ వంటి అంశాలపై చర్చించాలి."అని ముఖ్యమంత్రి సూచించారు.

**కీలకంగా రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్:** భాగస్వామ్య సదస్సును వినూత్నంగా నిర్వహించాలి. విశాఖలో ప్రధాన కార్యక్రమం చేపట్టడంతో పాటు.. ప్రాంతాల వారీగా భాగస్వామ్య సదస్సులు చేపట్టాలి. ప్రాంతీయ స్థాయిలో భాగస్వామ్య సదస్సులు నిర్వహిస్తే.. ప్రజలు, యువత, విద్యార్థుల భాగస్వామ్యం మరింతగా పెరుగుతుంది. కొత్త ఆలోచనలను ప్రజలకు చేరవేయడం అలాగే యువతలోని ఇన్నోవేషన్లను ఆయా రంగాల పారిశ్రామిక పెద్దల దృష్టికి వెళ్లడం అనేది సాధ్యమవుతుంది. ప్రాంతాల వారీగా నిర్వహించే సదస్సుల్లో స్టార్టప్ కంపెనీలకు ఇన్నోవేషన్లకు అగ్రభాగం ఉండాలి. అలాగే ప్రాంతీయ సదస్సుల్లోనూ ఎంఓయూలు కుదుర్చుకునే అంశానికి ప్రాధాన్యత ఇవ్వాలి. ఇలాంటి కార్యక్రమాలు ఏదో ఒక్క చోట కాకుండా వివిధ ప్రాంతాల్లో జరిగితే ప్రభుత్వం చేస్తున్న కృషి, పడుతున్న కష్టం ప్రజలకు అర్థమవుతుంది. ఈ సదస్సుల్లో జెన్ జీ భాగస్వామ్యం ఉండేలా చూడాలి."అని సీఎం చంద్రబాబు చెప్పారు. ఈ సన్నాహక సమీక్ష సమావేశానికి మంత్రులు టీజీ భరత్, కొండపల్లి శ్రీనివాస్, పొంగూరు నారాయణ, కందుల దుర్గేష్, గొట్టిపాటి రవికుమార్, సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజీత్ బెనర్జీ, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పొగాకు రైతుల ప్రయోజనాలు కాపాడుతాం

**● కిలో పొగాకు రూ.200 తగ్గకుండా కొనుగోలు చేయాలి ● రైతుల కష్టకాలంలో కంపెనీలు పొగాకు కొనుగోలుకు ముందుకు రావాలి ● మంత్రి గొట్టిపాటి రవికుమార్**

**ఒంగోలు, జూన్ 29 ప్రభాతవార్త:** పొగాకు రైతుల ప్రయోజనాలను కాపాడడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. కిలో పొగాకును కనీసం రూ.200కు తగ్గకుండా కొనుగోలు చేసి రైతులకు గిట్టుబాటు కల్పించాలని పొగాకు కొనుగోలుదారులను కోరారు. ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం వెల్లంపల్లి పొగాకు వేలం కేంద్రాన్ని సోమవారం సందర్శించిన మంత్రి, కొనుగోలు పక్రియను పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. వేలం నిర్వహణ, ధరల పరిస్థితి, కొనుగోళ్ల తీరుపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతుల ప్రయోజనాలే కూటమి ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని అన్నారు. పొగాకు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లిన వెంటనే, కొనుగోలు సంస్థల ప్రతినిధులతో అత్యవసర సమావేశం నిర్వహించి రైతులకు గిట్టుబాటు ధర కల్పించే చర్యలు చేపట్టారని తెలిపారు. 29 పొగాకు కొనుగోలు కంపెనీలు ఉన్నప్పటికీ, వేలంలో కేవలం 9 నుంచి 10 కంపెనీలు మాత్రమే పాల్గొంటున్నాయని తెలిపారు. అన్ని కంపెనీలు తప్పనిసరిగా వేలంలో పాల్గొనేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు. అలాగే వేలం కేంద్రాల్లో బిడ్లు లేకుండా ఉండే పరిస్థితి తలెత్తకుండా పర్యవేక్షించాలని సూచించారు. కొనుగోలు వ్యవస్థను మరింత పారదర్శకంగా సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పొగాకు రైతులు కష్టాల్లో ఉన్న సమయంలో వారికి అండగా నిలవాల్సిన బాధ్యత ప్రభుత్వం, కొనుగోలు సంస్థలపై ఉందని మంత్రి అన్నారు. ఏ కంపెనీ రోజుకు ఎంత మేరకు కొనుగోలు చేయాలన్న నిబంధనలను అధికారులు ఖచ్చితంగా అమలు చేయాలని సూచించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కాలువల మరమ్మత్తులు చేపట్టి రైతులకు సకాలంలో సాగునీరు అందించడంతో ఈ ఏడాది దిగుబడి పెరిగిందని చెప్పారు.



దిగుబడి పెరగడం, అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితుల ప్రభావంతో కొన్ని సార్లు ధరల్లో హెచ్చుతగ్గులు వచ్చినా, రైతులకు నష్టం జరగకుండా కొనుగోలు సంస్థలు ముందుకు రావాలని కోరారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కొనుగోళ్లు చేపట్టాలని సూచించారు. అవసరమైతే రాష్ట్ర ప్రభుత్వం రైతుల తరుపున కొనుగోలు సంస్థలతో చర్చించి గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

**రాజధానిపై వైసిపి ద్వంద వైఖరి:** వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి అనుసరిస్తున్న విధానాలే ఆ పార్టీ నేతలను అమరావతిలో ప్రజలు తిరస్కరించే పరిస్థితికి దారితీశాయని మంత్రి గొట్టిపాటి రవికుమార్ విమర్శించారు. ఎన్నికలకు ముందు అమరావతిలో ఇల్లు కట్టుకున్నానని చెప్పిన జగన్, అధికారంలోకి వచ్చిన తర్వాత మూడు రాజధానుల పేరుతో రాష్ట్ర ప్రజలను అయోమయంలోకి నెట్టారని ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాలపై స్పష్టమైన వైఖరి లేకుండా రోజుకో మాట మాట్లాడటం వల్ల ప్రజల్లో గందరగోళం ఏర్పడిందన్నారు. రాష్ట్రానికి శాశ్వత రాజధాని లేకుండా చేయాలన్న ధోరణితోనే వైసీపీ వ్యవహారించిందని విమర్శించారు.

## బాధ్యతగా విధులు నిర్వహించండి

**● ఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి**



**తిరుపతి, జూన్ 29 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎస్పీడీసీఎల్ పరిధిలో క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది బాధ్యతగా విధులను నిర్వహించాలని ఆ సంస్థ సిఎండి శివ శంకర్ లోతేటి సూచించారు. ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ సిఎండి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 9 జిల్లాల నుంచి వినియోగదారులు మాట్లాడుతూ వ్యవసాయ విద్యుత్ సర్వీసుల మంజూరు, పాడైపోయిన విద్యుత్ స్తంభాల మార్పు, వేలాడే విద్యుత్ తీగలను సరి చేయడం, లో వోల్టేజ్ తదితర సమస్యలను ఈ కార్యక్రమం ద్వారా అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా సీఎండి శివశంకర్ లోతేటి మాట్లాడుతూ వినియోగదారుల విద్యుత్ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా క్షేత్రస్థాయిలో సిబ్బంది విధులు నిర్వహించాలని ఆదేశించారు. సంస్థలో అవినీతిపై ఫిర్యాదులు అందితే సంబంధిత అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సంస్థ పరిధిలో గృహ, వాణిజ్య విద్యుత్ సర్వీసుల మంజూరులో జాప్యం, విద్యుత్ సమస్యలను పరిష్కరించనట్లయితే సంబంధిత అధికారులు సిబ్బందిపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమం ద్వారానే కాకుండా వినియోగదారులు విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నంబర్లు: 1912, 1800 425 155333కు కాల్ చేయడం, వాట్సాప్ నంబరు: 91333 31912కు చాట్ చేయడం, ఏపీఎస్పీడీసీఎల్ చాట్ బోట్ ద్వారా విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి, పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ ఐటి) అయూబ్ ఖాన్, డైరెక్టర్, కే. గురవయ్య, డైరెక్టం, కె. రామమోహన్ రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు కె. ఆదిశేషయ్య, జె. రమణాదేవి, ఆర్.పద్మ, ఎం. మురళి కుమార్, ఎన్. శోభా వాలెంటీనా, ఎం.ఉమాపతి, సిహెచ్ రామచంద్రరావు, కే. సంపత్ కుమార్, ఎస్. రమణ, జనరల్ మేనేజర్లు చక్రపాణి, జగదీష్, లత, పిఆర్ఒ తోట మధుసూదన

వార్త

మాట్లాడటానికి ముందు శ్రద్ధగా వినాలి, రాయడానికి ముందు బాగా ఆలోచించాలి.

-ప్లినీ

# జల'సంధి'కి రాజెవరో తేలేదాకా..?

ఎవరూ వెనక్కి తగ్గలేదు. యుద్ధ సమయంలో సవాళ్లు ప్రతి సవాళ్లుంటాయి. దేశాధినేతలు నోటికొచ్చినట్లు మాట్లాడి సమస్యల్ని జటిలం చేసుకునే పరిస్థితే ఒక లాగుంటుంది. మొన్నామధ్య పశ్చిమాసియా యుద్ధ మేఘాలకు విరామమేర్పడిందని సందేశం వినిపిస్తే అన్ని దేశాల వారూ సంబరపడిపోయారు. అప్పటికప్పుడు వచ్చే ప్రయోజనమేదీ లేకున్నా అంతర్జాతీయ రవాణా వ్యవస్థ 'హార్ముజ్ చక్రం'లో బిగుసుకుపోయే సరికి గిల గిల్లాడి కొట్టుకున్నారు. పశ్చిమాసియా యుద్ధ వైఖరి ఎలా గుండంటే ఒక అడుగు ముందుకేస్తే రెండడుగులు వెనక్కు అన్న చందాన సాగుతోంది. ఏవి తొలి వర్గులో ఏవి మలి వర్గులో, తుది వర్గులకు దారి ఏర్పడ్డుందా? అవి ఉమలువుతాయా అన్న సందేహాల మధ్య ఇరాన్‌అమెరికా అధికార బృందాలు చర్చలు సాగాయి. అంతలాయిపోయి వచ్చే ఆరు నెలల్లో కిక్కురుమనకుండా స్నేహాభిలాషతో కలిసిమెలిసి తుదినిర్ణయం తీసుకోవాలని ఉభయ వర్గాలూ అంగీకరించాయి. అదేపాదపదేశా జనం ఊహించని హెచ్చరికలతో బెదరకొట్టే ఉదరకొట్టే శ్వేతసౌధాధినేత డోనాల్డ్ ట్రంప్ కూడా ఉభయ శ్రేయోదాయక ఒప్పందంపై సంతకాలు పెట్టేశారు. అయినా ఇరాన్ అమెరికా శాంతి ఒప్పందం ముణ్ణాళ్ల ముచ్చటగానే ముగిసింది. తాజా అమెరికా దాడులు హార్ముజ్ జల సంధిలో పనామా దేశ జెండాతో వెళ్తున్న ఎవర్ లౌలీ అనే నౌకపై ఇరాన్ దాడి చేసినందుకే తాము ఎదురు దాడులు చేసినట్లు యు.ఎస్ మిలిటరీ ప్రకటించింది. ఇలా ప్రకటించిన అనంతరం తాము 10 సైనిక లక్ష్యాలపై దాడులు చేసా మని వారి బులెటిన్ పేర్కొంది. ఇరాన్ సైనిక నిఘా వ్యవస్థలు సమాచార ప్రసార వ్యవస్థలు, వైమానిక రక్షణ కేంద్రాలు, డ్రోన్ నిల్వ గోదాములపై అమెరికా దాడులు ముమ్మరం చేసింది. ఈ దాడులకు ప్రతీకారంగా కువైట్ బహ్రెయిన్‌లలో అమెరికా సైనిక స్థావరాలు లక్ష్యంగా తమ నావికా, వైమానిక దళాలు సంయుక్తంగా క్షిపణి, డ్రోన్ అపరేషన్లు నిర్వహించినట్లు ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్‌కోర్ సమాచారమిచ్చింది. ఎవరికి ఇష్టమున్నా లేకున్నా ఒక ఒప్పందం అమలులో ఉండగా వీటిని త్రోసిరాజని దూకుడుని ప్రదర్శించడం యుద్ధనీతి రీతి కాదు. కాల్పుల విరమణ ఒప్పందాన్ని అమెరికా పూర్తిగా ఉల్లంఘించిందని ఐఆర్‌జిసి ఆరోపించింది. తాము అమెరికా దాడులకు ప్రతీకార దాడులనుమాత్రమే చేసినట్లు వివరణ కూడా ఇచ్చింది. దాడులను ఆపకుంటే ఇరాన్‌ను భూమ్మీద లేకుండా చేస్తామని ట్రంప్ హెచ్చరించగా, ఇకపై కాళరాత్రిని చూపిస్తామని అంతర్జాతీయంగా ఇరాన్ ఆగ్రహావేశాలు వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో పరస్పర దాడులు కొనసాగిస్తున్నాయి. అమెరికా దాడులకు తమ సమాధానం అత్యంత విధ్వంసకరంగా ఉంటుందని ఇరాన్ ముందుగానే హెచ్చరించినట్లు గానే. దూకుడుగా యుద్ధ ప్రకంపనలు సృష్టిస్తోంది. కాగా కువైట్, బహ్రెయిన్ తదితర గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడులు చేయడాన్ని గల్ఫ్ కోపరేషన్ కౌన్సిల్ ఖండించింది. ఇలాంటి దాడులను తాము సమ్మతించబోమని హెచ్చరించింది. ఆది నుంచీ ఇరాన్ తమ సార్వభౌమాధికారాన్ని కొల్లగొట్టే పరిస్థితి వస్తే తాము ఎంతకైనా తెగిస్తామని చెబుతూనే ఉంది. ఎంతో విచిత్రంగా ట్రంప్ తాజా హెచ్చరికలున్నాయి. తన ట్రూత్ సోషల్‌లో ఆదివారం పెట్టిన పోస్టులో ఇస్లామిక్ రిపబ్లిక్ మొత్తాన్ని నాశనం చేస్తామని ప్రకటించారు. హేతుబద్దంగా వ్యవహరించలేని పరిస్థితే వస్తే తాము ప్రారంభించిన పనిని సైనికపరంగా పూర్తి చేయాల్సిన అనివార్య పరిస్థితి ఏర్పడ్డుందన్న సంకేతాలను కూడా పంపారు. ఇరు వర్గాలు ఏమాత్రం సంయమనం పాటించకుండా సై అంటే సై అంటూ యుద్ధంలోకి దిగేపరిస్థితులే తీసుకొచ్చారు. శాంతి ఒప్పందాలంటే కొత్త ఆశలకు చివుళ్లు పోస్తాయి. కొన్ని సార్లు స్వల్ప ఉల్లంఘనలు జరిగినా, వెనువెంటనే సర్దుకుంటాయి. అది కట్టుబాటు ఉన్న సందర్భాల్లోనే సాధ్యం. కానీ ఇరాన్, అమెరికా శాంతి ఒప్పందంలో తమ దేశ ప్రయోజనాలు మాత్రమే ముఖ్యం అనుకోవడం వలనే ఉల్లంఘనలకు ప్రాతిపదిక అయింది. చిత్త శుద్ధి లేకుండా చేసుకునే ఒప్పందాలేమీ మనుగడ సాధించలేవు. శాంతి ప్రక్రియకు శాంతి ఒప్పందంలోని భాగస్వామ్య దేశాలే సహకరించనప్పుడు శాశ్వత శాంతి ఎలా లభిస్తుంది? ప్రాతినిధ్య దేశాలే యోచింప కోవలి. పైగా పరస్పర విశ్వాసం పాదుగొల్పలేనప్పుడు ఒప్పందాలు ఎన్ని సజీవంగా ఉన్నా ప్రయోజనాలు సాధించవు. కేవలం సైనిక లేదా భద్రతావర్గాల ద్వారా శాంతి ప్రక్రియ మొదలౌతుంది, అదే సుస్థిర శాంతి, శాశ్వత శాంతికి దోహదపడుతుందని భావిస్తారు. కానీ తాజాపరిస్థితులను బట్టి ఒప్పందం నిలవదు. శాంతి పొసగదు. ఇరాన్ తీరానికి చేరువగా హార్ముజ్‌కు కొత్త రవాణా మార్గాన్ని విస్తరించేందుకు అమెరికా నౌకాదళ నేతృత్వంలో జరుగుతున్న ప్రయత్నాలను ఆపాలని ఇరాన్ కోరుతోంది. ఆ జలసంధి మార్గం కూడా తమదేనని ఇరాన్ ఆకాంక్ష. హార్ముజ్‌పై ఎవరి జోక్యాన్నీ ఇరాన్ సహించలేక పోవడమే శాంతి ప్రక్రియకు విఘాతం కలిగించింది. అది తేలితేనే కానీ శాంతి మార్గం సుగమం కాదు. యుద్ధం శాశ్వత ముగింపు కోసం అమెరికా ఇరాన్‌ల మధ్య సాగుతున్న చర్చలు ప్రతిష్టంభనే ఏర్పడే పరిస్థితి వస్తే మళ్లీ ప్రపంచం ఆయిలు చక్రబంధంలో చిక్కుల్లో పడినట్టే. అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గుతున్నాయని సంబరపడిన వేళ మళ్లీ భీకర యుద్ధం తప్పదేమోనన్న అంచనాలతో జనం ఉలిక్కి పడ్డారు. ఏదైనా ఇరువర్గాలు సంయమనంతో వ్యవహరించడం మేలు.

నీది కాదని తెలిసిన దాన్ని కూడా నీదనుకోవడం నిజంగా నేరం.



ఠాగూర్

చదరంగంలో మాదిరిగానే జీవితంలో కూడా ముందు చూపు ఎంతో అవసరం.



వి.జాన్సన్

# ప్రజావాక్కు



## పక్కారోడ్లే ప్రాణాధారం

గ్రామీణాభివృద్ధికి పక్కా రోడ్లు ప్రాణాధారం. ఒక గ్రామం అభివృద్ధి చెందాలంటే ముందుగా రవాణాసౌకర్యం మెరుగుపడాలి. ఆంధ్రప్రదేశ్,తెలంగాణరాష్ట్రాల్లో అనేక గ్రామాలకు ప్రధాన రహదారులు చేరినప్పటికీ, ఇప్పటికీ కొన్ని మారుమూల గ్రామాలుమట్టి రోడ్లపైనే ఆధారపడుతున్నాయి. వర్షాకాలంలో ఈరోడ్లు బురదమయంగా మారి ప్రజలు, విద్యార్థులు,రైతులు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పక్కారోడ్లు ఉంటే వ్యవసాయ ఉత్పత్తులు మార్కెట్లకు వేగంగా చేరతాయి. అత్యవసర వైద్యసేవలు గ్రామాలకు సులభంగా అందుతాయి. విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు సకాలంలో చేరగలుగుతారు. పారిశ్రామిక, వాణిజ్య కార్యకలాపాలు కూడా గ్రామీణప్రాంతాలకు విస్తరించి ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.గ్రామీణ పర్యాటకానికికూడామెరుగైనరహదారులుఎంతోదోహదపడతాయి. ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజనతో పాటు రెండు రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న గ్రామీణ రహదారుల అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేయాలి.రోడ్ల నాణ్యతపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## భారతరత్న మాటే మరిచారు!

ఒకప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ప్రజల మన్ననలను పొంది అలాగే అప్పటి 'నేషనల్ ఫ్రంట్' చైర్మన్‌గా ఉంటూ ఆనాడు కేంద్రంలో చక్రం తిప్పిన మన ఆంధ్రుల తెలుగుజాతి ఎప్పటికీ గర్వించదగ్గ గొప్ప వ్యక్తి, మహానటుడు స్వర్గీయ నందమూరి తారకరామారావు. ఆనాడు తెలుగు దేశం పార్టీని స్థాపించి అప్పట్లోనే ఎంతో ప్రజా చైతన్యం కలిగించిన వ్యక్తి మన స్వర్గీయ ఎన్టీఆర్ గారికిఇంతవరకూ'భారతరత్న' ప్రకటించకపోవడం చాలా బాధాకరం. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ఈ విషయంపై సరియైన నిర్ణయం తీసుకుని స్వర్గీయ ఎన్టీఆర్‌కు వేంటనే 'భారతరత్న' ప్రకటించాలి.

- దాసం వెంకటరెడ్డి, బెంగుళూరు

## యువత ప్రశ్నించాలి

గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధివైపు నడిపించడానికి ప్రభుత్వ అధికారులను, పాలకవర్గాలను గ్రామ పంచాయతీ అభివృద్ధి కొరకు సమస్యల పట్ల నిరంతరం ప్రశ్నిస్తేనే గ్రామ ప్రజలు అభివృద్ధి, ఆర్థిక బాటలో నడిచే అవకాశంఉంది.పాలకులనుప్రశ్నిద్దాం.అభివృద్ధిచేసుకుందాం..

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

## ధరల నియంత్రణలో విఫలం

ధరలను తగ్గించడం చేతకాక అవి కొనొద్దు,ఇవి కొనొద్దు విమానాలు ఎక్కి దూర ప్రయాణాలు చేయొద్దు కార్యాలయాలకి టూ వీలర్, ఫోర్ వీలర్ మీద కాకుండా సైకిల్ మీద వెళ్లండని ఖర్చులుతగ్గించుకోవడం పొదుపు పాటించడంపై ఉచిత సలహాలిస్తున్నారు బిజెపి పాలకులు. ఏసౌకర్యాలు లేని కాలంలో కట్టెల పొయ్యి మీద వండుకునేవారు ప్రజలు. చన్నాళ్ల తరువాత వారికి మళ్లీ అలాంటి స్థితిదాపురించింది. ఏ యేడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇవ్వలేదు. నల్లధనం వెనక్కి తీసుకురాలేదు. బ్యాంకుఖాతాల్లో 15లక్షల రూపాయలు జమ చేయలేదు. ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా అధికారంలోకి వచ్చినప్పటినుంచి నిత్యావసర వస్తువుల ధరలు పెంచేస్తూ ప్రజలను ఆర్థికంగా కృంగదీస్తున్నారు. పుష్కర కాలం నుంచి ప్రతిపక్ష పార్టీలను, దివంగత ప్రధానులను విమర్శిస్తున్నారు.

- మిథునం, హైదరాబాద్

## బ్రిటన్ నాయకత్వ మార్పుల పరంపర

కీర్ స్టార్మర్ నిష్క్రమిస్తున్నట్లు వస్తున్న వార్తలు, ఆయన తర్వాత సమర్థుడైన వారసుడిగా ఆండీ బర్న్‌హామ్ పేరు తెరపైకి రావడం బ్రిటిష్ రాజకీయాల్లో మళ్లీ కొనసాగుతున్న అస్థిరతను ఎత్తి చూపుతున్నాయి. గత దశాబ్దకాలంలో యునైటెడ్ కింగ్‌డమ్ అసాధారణంగా ఎక్కువ మంది ప్రధాన మంత్రుల మార్పును చూసింది. ఇదిరాజకీయ కొనసాగింపు, పరిపాలనపై ప్రశ్నలను లేవనెత్తుతోంది. ఎన్నికల ఓటములు, సొంత పార్టీలోనే నెలకొన్న అసంతృప్తి కారణంగా స్టార్మర్ తీవ్ర విమర్శలను ఎదుర్కొన్నారు. విధానపరమైన నిర్ణయాల మార్పులు,వలసలు,జీవన వ్యయసంక్షోభం,క్షీణిస్తున్న ప్రజా సేవలు వంటి తీవ్రమైన సమస్యలను పరిష్కరించడంలో ఆయన విఫలమయ్యారని పేర్కొంటూ చాలా మంది లేబర్ పార్టీ సభ్యులు ఆయన నాయకత్వాన్ని ప్రశ్నించినట్లు తెలుస్తోంది. బ్రిటన్ ఇటీవలి చరిత్ర ఈ సవాలును ప్రతిబింబిస్తుంది.

- టి. సంతోష్ కుమార్, ఇల్లందు

## గతం గతః

ఎమర్జెన్సీ అమలు చేసి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని జూన్ 25న ఇందిరాగాంధీని అంబేద్కర్‌ని అవమానించారంటూ ఏప్రిల్ 14న నెహ్రూని ఎప్పుడో దశాబాదల నాటి విషయాలను బిజెపి నాయకులు గుర్తు చేసుకుంటూ మాజీ ప్రధానులను విమర్శిస్తూ ఉన్నారు. ఇది సమంజసంకాదు. వారేమీ దేశ ద్రోహులు కాదు. గొప్ప దేశభక్తులు. నెహ్రూ స్వాతంత్ర్య పోరాటాల్లో చురుగ్గా పాల్గొన్నారు.ఎన్నోసార్లు జైలుకి వెళ్లారు.

-ఎం.శ్రీనివాస్, హైదరాబాద్

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# ఎఐ మనిషి మేధోవికాస సాధనం కావాలి

**మానవీయ విలువలను, మనిషి గౌరవాన్ని దిగజార్చే ఏ శాస్త్ర విజ్ఞానం మనం అతిగా వాడగూడదు! ప్రపంచంలోని అన్ని దేశాల నాయకులు ఈసందర్భంగా ఒక నిర్ణయం ఏకగ్రీవంగా తీసు కోక తప్పదు ఎ.ఐ చుట్టూ తిరిగేందుకు మనిషి సిద్ధంగా ఉండనవసరం లేదు. మనిషి చెప్పినట్లు చేస్తూ మనిషి చుట్టూ తిరిగే 'ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్' మాత్రమే అవసరం! ఈ సందర్భంగా ప్రధాని మోడీ అన్నమాటలు ఎంతో విలువైనవి సముచితమైనవీ! పారిస్లో జూన్‌నెలలో జరిగినఇండియా ఎఐ ఇంపాక్ట్ సమావేశంలో మాట్లాడుతూ 'బలమైన అమలు చేసే రెగ్యులేటరీ ఫ్రేమ్ వర్క్ అవసరం అంతేగాని ఎవరికి వారు తోచిన రీతిలో పద్ధతికి కట్టుబడకుండా ఎ.ఐని వాడే పరిస్థితి వుండగూడదు' అన్న ప్రధాని సందేశంలో కర్తవ్యబోధన వుంది! తు.చ. తప్పకుండా ఆ సందేశాన్ని అనుసరించగలుగుతే 'ఎ.ఐ' మానవాళికి వరంగా మారుతుంది! మానవ మేధస్సుకు సహాయకారిగా భాసిల్లుతుంది!**



రావులపాటి సీతారాంరావు

ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ మనిషి మేధస్సును ప్రశ్నించే స్థితిలో వుందని ఆధునిక ఆలోచనాపరులు జోస్యం చెబుతున్నారు. ఆధునికత, కంప్యూటర్ విజ్ఞానం, మార్పుల జోస్యం, అన్నీ ప్రపంచంలోని మానవాళికి తెలియజెప్పింది మనిషి మేధస్సే! భస్మాసురుడికి వరమిచ్చిన దేవుడినే భస్మం చేయాలని ప్రయత్నించటం ఇతర దేశస్థులకు తెలియకపోయినా విజ్ఞాన వీచికలను దిశ దిశలా వ్యాపింపచేసిన భారతీయులకు ఈ ఇతిహాసం ఏమిటో తెలుసుకదా! అలాగే ఎ.ఐని ఏవిధంగా వినియోగించుకోవాల్నో మన పండితులకు విజ్ఞానులకు తెలిసిన మాదిరి, ప్రపంచంలోని అందరికీ తెలుసనే భావించాలి! కంప్యూటర్ యుగంలో మన ప్రమేయం లేకుండా అన్నీ కంప్యూటర్ ద్వారా మేమే సృష్టించాం అని చెప్పుకుంటే తప్పుపట్టాల్సిన అవసరం లేదు కానీ మనం సృష్టించిన మన ఎ.ఐ మననే మ్రింగే పరిస్థితి రాకూడదు. అణుబాంబును కనుక్కోవటంతో పాటు అణుశాస్త్ర అధ్యయనం వల్ల మానవాళికి శాస్త్రీయ, సాంకేతిక పరిజ్ఞానం లభించింది! లాభాల వినియోగం వల్ల కేవలం విధ్వంసమే కాదు ప్రజలకు మేలు చేకూర్చే విధంగా అణుశాస్త్ర పరిజ్ఞానాన్ని వినియోగించుకోవచ్చు అని తెలిసొచ్చింది! ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్సు వల్ల పర్యావరణ మార్పులూ,స్థిరత్వం, అంచనాలతో పాటు వాతావరణాన్ని ముందుగానే పసిగట్టి తగు జాగ్రత్తలు తీసుకోవచ్చు. అయితే మానవాళి నిజమైన, స్వభావ స్వరూపాలను హరించివేసే విధంగా ఎ.ఐను వాడుకోటానికి ఎవరైనా సాహసిస్తే, ప్రపంచ భవిష్యత్తు అంధకారమవుతుంది అన్న భయం శాస్త్రజ్ఞులు, సాంకేతిక విషయాల పండితుల చర్చల వల్ల కలుగుతున్నది. కొంతమంది ఎ.ఐ ప్రొగ్రెస్కు కొంతకాలం ఆటవిడుపు ఇచ్చి తదుపరి పరిశోధనలు వాయిదా వేస్తే బావుంటుందని కూడా భావిస్తున్నారు! కానీ అలా సలహాలు ఇవ్వటానికి ఈ శాస్త్రజ్ఞులకు ఏవిధమైన హక్కు వుంది? కొత్త విషయాలను కనిపెట్టే సత్తా, సంపదా వున్నప్పుడు ఏదో సాకు చెప్పి 'ఎ.ఐ మొత్తం ప్రపంచ వినాశనానికే దారితీస్తుందని ఏ ఆధారంతో చెప్పగలరు? ఇలాంటి ఆలోచనలకు స్వస్తి చెప్పి ఏవిధంగా ఎ.ఐ చెడు మార్గాలను అవలంభించకుండా వుండేందుకు మానవాళి ఎలాంటి చర్యలు తీసుకోవాలి!' అన్న ప్రశ్నకు జవాబుగా మొత్తం ప్రపంచంలోని దేశాలన్నిటినీ ఒక త్రాటి మీద నడిపించి, సమగ్ర అవగాహన తెచ్చుకొని ఒక విధంగా ఏకగ్రీవంగా ఆ ప్రపోసలను ఆమోదించినప్పుడే ఎ.ఐ నియంత్రణ ప్రపంచ వ్యాప్తంగా కొంతలో కొంతైనా సాధ్యపడే అవకాశం వుంది! మానవ మేధస్సును ఈ సందర్భంగా తక్కువచేసి మాట్లాడాల్సిన అవసరం లేదు! ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స అనేది మనిషి కనుగొన్నదే! ఏ కొత్త విషయం ప్రపంచం ముందుకు వచ్చినా అది మనిషి మేధస్సు వలన వచ్చిందే అన్న ప్రాథమిక సూత్రాన్ని అంగీకరించినప్పుడు




శాస్త్రజ్ఞులకు కంప్యూటర్ విజ్ఞులకూ, ఆధునిక సాంకేతిక నిపుణులకు తమ మీద అపనమ్మకం పోయి విశ్వాసం రెట్టింపు ఉత్సాహంతో సొంతమవుతుంది! కొత్త వ్యూహాలతో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్సను ఉపయోగిస్తే మానవ జాతి పురోగతికి సగటు వ్యక్తికి కావల్సిన సామాజిక, సాంకేతిక సదుపాయాల ఉత్పత్తికి క్షణాల్లో మార్గం ఏర్పడుతున్నది! ముఖ్యంగా మానసిక సామర్థ్యాలు, నైపుణ్యాలతో ఎ.ఐ మనిషికంటే బాగా సమస్యలను పరిష్కరించే సరియైన నైపుణ్యంతో ఉపయోగపడ్తుంది! ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ విభాగాలకు మానవత్వం, నైతిక విలువలతో కూడిన విజన్‌ను సమకూరుస్తేనే అనుకున్న రీతిలో ఫలితాలు రాబట్టగలం. లేకపోతే మనిషి చేయిదాటిపోయి సామర్థ్యాలతో కూడిన పనితనం విధ్వంస ధోరణిలో మనిషికి బదులు రాక్షసత్వం బయటకు వస్తుంది! టెర్రీ ఈగల్‌టన్ అనే శాస్త్రవేత్త ఎ.ఐని గురించి చెప్పిన మాటలు జ్ఞాపకం చేసుకోవాల్సి వస్తుంది! 'అమర్చిన కంప్యూటరైజ్డ్ ఇంటలిజెన్స్‌తో మితిమీరిన విశ్వాసం మెషనరీలో కూర్చబడుతే వెనుకటి గ్రీక్స్ ఆకాశం వైపు చూస్తూ చేతులెత్తేసిన వైనం గుర్తుకు రాక తప్పదు. అందుకే మితిమీరిన విశ్వాసం ఎ.ఐ మీద వుంచుతే మొదటికే మోసం వస్తుంది! సాంకేతిక నైపుణ్యం చట్టుబండలుగా మారుతుంది!' ఒక స్పానిష్ ఫిలాసఫర్ ఎ.ఐ పనితనం సందర్భంగా ఒకటి చెప్పారు 'ఇప్పటికే మనిషికి తనమీద తనకే అపరిమితమైన నమ్మకాన్ని తన తెలివితేటల మీద మితిమీరిన విశ్వాసాన్ని ఏర్పరుచుకొని, ఎ.ఐ నాచేతిలో కీలుబొమ్మ అంతే వుంటుంది అన్న అనవసరపు విశ్వాసంతో ఈ ఎ.ఐ నైపుణ్యాన్ని సాంకేతికంగా మరీ బలోపేతం చేస్తున్నాడు! దాంతో మరోదారి ఎ.ఐ పట్టి ఘోరమైన ఫలితాలు మానవాళి మూటకట్టుకొనే ప్రమాదం వుంది!' పెక్కు దేశాల మత గురువులు ఎ.ఐ ను గురించి ప్రస్తావిస్తూ మనిషికి ఈ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్సను రక్షించే అవసరం గూడా ఏర్పడవచ్చు! ఆ ఒక్క హెచ్చరిక చాలు ఎ.ఐ ప్రయోగాల వల్ల అనుకూల ఫలితాలు ప్రజల ప్రగతి కోసం ఉపయోగపడే రీతిలో ఏర్పరుచుకోగల్గాలి! అంతేగాని ఎ.ఐని కనిపెట్టిన విజ్ఞాన వేత్తలు తమ గొయ్యి తామే త్రవ్వుకొనే విధంగా ఎ.ఐని ఉపయోగించుకోకూడదు! సహజరీతిలో మనిషి వుండాలి! ప్రకృతికి విరుద్ధంగా నడుచుకోగూడదు! విశ్వామిత్ర సృష్టి వల్ల ప్రయోజనం వుండదని భారత పురాణ గాథలు ఇప్పటికే చెప్పాయి! ఎ.ఐ వల్ల కలిగే లాభాలు విభాగాల వారీగా సమీక్షించుకొని పరిమిత రీతిలో రాబట్టుకోవాలి! మనిషి సాధనలో, పనిలో మరో చేయిగా సహకరించే విధంగానే ఎ.ఐని శాస్త్రవేత్తలు తీర్చిదిద్దాలి! ఒకవేళ ఏ కారణం చేతనైనా ఎ.ఐ ప్రయోగాలు వికటిస్తే శాస్త్రవేత్తలు వెనక్కు తీసుకోవటానికి విరుగుడు సదుపాయాలు గూడా అమర్చుకోక తప్పదు! మానవీయ విలువలను, మనిషి గౌరవాన్ని దిగజార్చే ఏ శాస్త్ర విజ్ఞానం మనం అతిగా వాడగూడదు! ప్రపంచంలోని అన్ని దేశాల నాయకులు ఈసందర్భంగా ఒక నిర్ణయం ఏకగ్రీవంగా తీసుకోక తప్పదు ఎ.ఐ చుట్టూ తిరిగేందుకు మనిషి సిద్ధంగా ఉండనవసరం లేదు.మనిషి చెప్పినట్లు చేస్తూ మనిషిచుట్టూ తిరిగే 'ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్' మాత్రమే అవసరం! ఈ సందర్భంగా ప్రధాని మోడీ అన్నమాటలు ఎంతో విలువైనవి సముచితమైనవీ!పారిస్లో జూన్‌నెలలో జరిగినఇండియా ఎఐ ఇంపాక్ట్ సమావేశంలో మాట్లాడుతూ 'బలమైన అమలు చేసే రెగ్యులేటరీ ఫ్రేమ్ వర్క్ అవసరం అంతేగాని ఎవరికి వారు తోచిన రీతిలో పద్ధతికి కట్టుబడకుండా ఎ.ఐని వాడే పరిస్థితి వుండగూడదు' అన్న ప్రధాని సందేశంలో కర్తవ్యబోధన వుంది! తు.చ. తప్పకుండా ఆ సందేశాన్ని అనుసరించగలుగుతే 'ఎ.ఐ' మానవాళికి వరంగా మారుతుంది! మానవ మేధస్సుకు సహాయకారిగా భాసిల్లుతుంది! ●

# వర్షం వెనుకడుగు... రైతుకు ముందడుగు ఎప్పుడు?

తిప్పర్తి శ్రీనివాస్

దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచిన వ్యవసాయం ప్రకృతి అనుగ్రహంపై అధికంగా ఆధారపడుతోంది. ముఖ్యంగా ఖరీఫ్ పంటల సాగు పూర్తిగా నైరుతి రుతుపవనాలపై ఆధారపడి ఉంటుంది. ప్రతిఏడాది జూన్‌నుంచి సెప్టెంబర్ వరకు కురిసే వర్షాలు రైతులకు ఆశాజ్యోతిగా నిలుస్తాయి. అయితే ఈఏడాది నమోదవుతున్న లోటు వర్షపాతం రైతాంగాన్ని తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది.వర్షాలు ఆలస్యంగా కురవడం, కొన్నిప్రాంతాల్లో ఆశించిన స్థాయిలో వర్షపాతం నమోదు కాకపోవడం వల్ల ఖరీఫ్‌సాగు ఆలస్యమవుతోంది.దీనివల్ల లక్షలాది మంది రైతులు అనిశ్చిత పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితి మరింత కొనసాగితే వ్యవసాయం మాత్రమే కాకుండా దేశ ఆహారభద్రతపైనా తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉంది. భారతదేశంలో సుమారు సగానికి పైగా సాగుభూమి ఇప్పటికీ వర్షాధారంగానే ఉంది. చిన్న,సన్నకారు రైతులకు బోర్లు, కాలువల ద్వారా నీటి సౌకర్యాలు అందుబాటులో లేకపోవడంతో వారు పూర్తిగా వర్షాలపైనే ఆధారపడాల్సి వస్తోంది. వర్షాలు ఆలస్యమైతే విత్తనాలు వేయలేని పరిస్థితి ఏర్పడుతుంది. ఇప్పటికే విత్తిన విత్తనాలు తగిన తేమ లేక మొలకెత్తకపోవడం లేదా ఎండిపోవడం జరుగుతుంది. దీని వల్ల రైతులు మళ్లీవిత్తనాలు కొనుగోలు చేయాల్సి రావడం, అదనపు పెట్టుబడి పెట్టాల్సి రావడం వారి ఆర్థిక భారాన్ని మరింత పెంచుతుంది. ఖరీఫ్ సీజన్‌లో ప్రధానంగా వరి, పత్తి, మొక్కజొన్న, సోయాబీన్, పప్పుధాన్యాలు,వేరుశెనగ వంటి పంటలు సాగు చేస్తారు. ఈ పంటల దిగుబడితగ్గితే దేశంలో ధాన్యోత్పత్తి తగ్గే అవకాశం ఉంది. ఉత్పత్తి తగ్గడం వల్ల మార్కెట్లో ధరలు పెరుగుతాయి. ద్రవ్యోల్బణం మరింత అధికమై సామాన్య ప్రజలపై అదనపు భారం పడుతుంది. ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆహార పదార్థాల ధరల పెరుగుదల తీవ్రఇబ్బందులను కలిగిస్తుంది. ఈ విధంగా లోటు వర్షాల ప్రభావం రైతులకే పరిమితం కాకుండా దేశ ఆర్థిక వ్యవస్థ మొత్తంపైనా పడు



తుంది.వాతావరణ మార్పులు కూడా ఈ పరిస్థితికి ప్రధాన కారణంగా మారుతున్నాయి. ఒకప్పుడు క్రమపద్ధతిలోకురిసే వర్షాలు ఇప్పుడు అసమానంగా కురుస్తున్నాయి.కొన్ని ప్రాంతాల్లో అతివృష్టి, మరికొన్ని ప్రాంతాల్లో అనావృష్టి కనిపిస్తోంది. ఒకేసారి భారీ వర్షాలు కురిసి వరదలు సృష్టించడం, తరువాత దీర్ఘకాలం వర్షాలు లేకపోవడం వంటి పరిస్థితులు పంటలకు తీవ్రనష్టం కలిగిస్తున్నాయి.ఈ మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ విధానాలను మార్చుకోవాల్సిన అవసరం ఏర్పడింది. ఇలాంటి క్లిష్ట సమయంలో ప్రభుత్వం వేగంగా స్పందించడం అత్యంత అవసరం. మొదటగా నీటి సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి. చెరువులు, కుంటలు, కాలువలను పునరుద్ధరించడం, వర్షపు నీటిని నిల్వ చేసే నిర్మాణాలను విస్తరించడం, భూగర్భ జలాలను పునరుద్ధరించే చర్యలను వేగవంతం చేయాలి. సూక్ష్మ సాగునీటి పద్ధతులైన డ్రిప్, స్ప్రింక్లర్ వ్యవస్థలను మరింత ప్రోత్సహించాలి. ప్రతి నీటి బొట్టును సమర్థవంతంగా వినియోగించే విధానాలే భవిష్యత్తులో వ్యవసాయాన్ని కాపాడగలవు. అదే సమయంలో రైతులకు ఆర్థికపరంగా కూడా ప్రభుత్వం అండగానిలవాలి. పంట రుణాల చెల్లింపుకు గడువు పొడిగించడం, అవసరమైన విత్తనాలు, ఎరువులు సబ్సిడీపై అందించడం, పంట బీమా క్లెయిమ్‌లను వేగంగా పరిష్కరించడం వంటి చర్యలు రైతుల్లో విశ్వాసాన్ని పెంచుతాయి. వ్యవసాయ శాఖ అధికారులు గ్రామస్థాయిలో రైతులకు తగిన సలహాలు అందించి, పరిస్థితులకు అనువైన ప్రత్యామ్నాయ పంటలను సూచించాలి. తక్కువ నీటితో పండేపంటల సాగునుప్రోత్సహించడం ద్వారా నష్టాలనుకొంతవరకు తగ్గించవచ్చు.నీటి వనరుల సమగ్ర నిర్వహణ, వర్షపునీటి సంరక్షణ, భూసార పరిరక్షణ, వాతావరణ అనుకూల వ్యవసాయ పద్ధతులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టిసారించాలి. నీటి వనరుల సంరక్షణ,రైతులకు తక్షణ ఆర్థికసహాయం, శాస్త్రీయ వ్యవసాయ పద్ధతుల ప్రోత్సాహం, దీర్ఘకాలిక నీటినిర్వహణ ప్రణాళికలు అమలు చేస్తేనే ఈ సవాలును సమర్థంగా ఎదుర్కోగలం. రైతును కాపాడటం అంటే దేశభవిష్యత్తును కాపాడటమే. ●

# వెనెజులా విషాదం.. ప్రపంచానికి గుణపాఠం

డివిబి శ్రీహరిన్

ప్రకృతి వైపరీత్యాలు దేశాల రాజకీయాలను, ఆర్థిక వ్యవస్థలను పరిగణనలోకి తీసుకోవు. కానీ ఒక దేశం ఇప్పటికే సంక్షోభంలో ఉన్నప్పుడు సంభవించే విపత్తు విధ్వంసం అనేక రెట్లు పెరుగుతుంది. ల్యాటిన్ అమెరికా దేశమైన వెనిజువాలాలో తాజాగా సంభవించిన వరుస భారీభూకంపాలు దీనికి ప్రత్యక్ష ఉదాహరణ. రాజకీయ అస్థిరత, తీవ్ర ఆర్థిక సంక్షోభం, అంతర్జాతీయ ఆంక్షలు, బలహీనమైన మౌలిక వసతులతో ఇప్పటికే అల్లాడుతున్న వెనిజులాను ప్రకృతి మరోసారి మోకాళ్లపై కూర్చోబెట్టింది. వేలాది భవనాలు నేలమట్టమవగా, వందలాది ప్రాణాలు కోల్పోయాయి. గల్లంతైన వారి సంఖ్య వేలల్లో ఉండటంతో మరణాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. విదేశీ సహాయక బృందాలు రంగంలోకి దిగినా, శిథిలాల కింద చిక్కుకున్నవారిని రక్షించేందుకు సమయంతో పోటీపడాల్సిన పరిస్థితి నెలకొంది. అయితే ఈ విపత్తు కేవలం ప్రకృతి సృష్టించిన విధ్వంసం మాత్రమే కాదు. బలహీనమైన నిర్మాణ వ్యవస్థలు, దీర్ఘకాలిక ఆర్థిక సంక్షోభం, ప్రణాళికా లోపాలు కలిసి ఒక సహజ విపత్తునుమహా మానవీయ విషాదంగా మార్చాయి. అందుకే వెనిజులా విషాదాన్ని కేవలం ఒక భూకంపంగా కాకుండా, ప్రకృతి వ్యవస్థల వైఫల్యం కలగలిసిన సంక్షోభంగా చూడాల్సిన అవసరం ఉంది. ఈ విపత్తు సాధారణ భూకంపం కాదు. భూకంప శాస్త్రంలో 'సీస్మిక్ డబ్లెట్'గా పిలిచే అత్యంత అరుదైన సంఘటన. మొదట సంభవించిన భారీ ప్రకంపనతో బలహీనపడిన భవనాలను, కొద్ది సెకన్ల వ్యవధిలో వచ్చిన రెండో భారీ భూకంపం పూర్తిగా కూల్చివేసింది. సాధారణంగా ప్రధాన భూకంపం తర్వాత వచ్చే ప్రకంపనలు తక్కువ తీవ్రతతో ఉంటాయి. కానీ ఇక్కడ దాదాపు సమాన తీవ్రతతో రెండు భారీ భూకంపాలు సంభవించడం వల్లవిధ్వంసం అనూహ్యంగా పెరిగింది. ఇటువంటి సంఘటనలు ప్రపంచంలో చాలా అరుదుగా మాత్రమే నమోదవుతాయి. వెనిజులా భౌగోళికంగా కరేబియన్ టెక్టోనిక్ ప్లేట్,దక్షిణఅమెరికా టెక్టోనిక్ ప్లేట్‌ల సరిహద్దులో ఉంది. ఈ రెండు ఫలకాలు పరస్పరం రుద్దుకుంటూ కదలడం వల్ల భూమి అంతర్భాగంలో అపారమైన ఒత్తిడి పేరుకుపోతుంది. ఆ ఒత్తిడి ఒక్కసారిగా విడుదలైనప్పుడు భూకంపాలు సంభవిస్తాయి. వెనిజులా గుండా విస్తరించిన బొకొనో ఫాల్ట్ వ్యవస్థ ఈ ప్రాంతంలోని ప్రధాన భూకంపాలకు కారణమవుతోంది. ఈసారి భూకంపాలు తక్కువ లోతులో సంభవించడం వల్ల ప్రకంపనల శక్తి నేరుగా ఉపరితలానికి చేరి విధ్వంసాన్ని మరింత పెంచింది. ఈ విపత్తులో శాస్త్రవేత్తలు మరో కీలక అంశాన్ని గుర్తించారు. దానినే 'రెజోనెన్స్' అంటారు. ప్రతి భవనానికి ఒక సహజ కంపన వేగం ఉంటుంది. భూకంప తరంగాల కంపన వేగం అదే స్థాయిలో ఉన్నప్పుడు భవనం ఊగిసలాట ఒక్కసారిగా పెరిగి నిర్మాణం క్షణాల్లో కూలిపోతుంది. వెనిజులాలోని అనేక పాత భవనాలు భూకంప నిరోధక ప్రమాణాలకు అనుగుణంగా నిర్మించబడకపోవడంతో ఈ ప్రభావం మరింత తీవ్రంగా కనిపించింది. మొదటి ప్రకంపనతో పగుళ్లు ఏర్పడిన నిర్మాణాలు, రెండో ప్రకంపనను



తట్టుకోలేక శిథిలాలుగా మారాయి. వెనిజులాకుభూకంపాలు కొత్తవి కావు. 1812లో సంభవించిన భారీ భూకంపం వేలాది మందిని బలితీసుకోగా, 1967లో కారకాస్‌ను వణికించిన మరో భూకంపం కూడా భారీ ప్రాణనష్టం కలిగించింది.అయినప్పటికీ గత కొన్నిదశాబ్దాలుగా ఆర్థిక సంక్షోభం కారణంగా భూకంప నిరోధక నిర్మాణ ప్రమాణాల అమలు, పాత భవనాల బలోపేతం, విపత్తు నిర్వహణ వ్యవస్థల ఆధునికీకరణ వంటి చర్యలు ఆశించిన స్థాయిలో జరగలేదు. భౌగోళికంగా అత్యంత ప్రమాద ప్రాంతంలో ఉన్నప్పటికీ, భూకంప ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకొని దీర్ఘకాలిక పట్టణ ప్రణాళికలను అమలు చేయడంలో వెనిజులా విఫలమైంది. ఈ నిర్లక్ష్యమే తాజా విపత్తులో మరింత భారీ మూల్యం చెల్లించుకునేలా చేసింది. భూకంపం సంభవించిన సమయంలోనే వెనిజులా తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ద్రవ్యోల్బణం,విదేశీ మారక నిల్వల కొరత, ఆరోగ్య రంగంలో పెట్టుబడుల లోపం కారణంగా అత్యవసర సేవలు తీవ్ర ఒత్తిడికి గురయ్యాయి. ప్రభుత్వ ఆదాయానికి ప్రధాన ఆధారమైన చమురు రంగం గత కొన్నేళ్లుగా క్షీణించడంతో విపత్తు నిర్వహణకు అవసరమైన పెట్టుబడులు కూడా గణనీయంగా తగ్గిపోయాయి. అనేక ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా, కమ్యూనికేషన్ వ్యవస్థలు దెబ్బతిన్నాయి. భారీ యంత్రాలు,రక్షణ పరికరాలు, శిక్షణ పొందిన సిబ్బంది కొరత కారణంగా మొదటి 72 గంటల్లో సహాయక చర్యలు ఆశించిన వేగంతో సాగలేకపోయాయి. దీంతో స్థానిక ప్రజలే తమ చేతులతో శిథిలాలను తొలగిస్తూ బాధితులను కాపాడేందుకు ప్రయత్నించిన హృదయవిదారక దృశ్యాలు ప్రపంచాన్ని కదిలించాయి. వెనిజులాపై అమల్లో ఉన్న అంతర్జాతీయ ఆంక్షలు, రాజకీయ విభేదాలు సహాయక చర్యలపై పరోక్ష ప్రభావంచూపే అవకాశం ఉందని విశ్లేషకులు పేర్కొంటున్నారు.అయితే ప్రకృతి విపత్తులు రాజకీయ పక్షపాతాన్ని గుర్తించవు. అలాంటి సమయంలో మానవత్వానికే మొదటి ప్రాధాన్యం దక్కాలి. ఐక్యరాజ్యసమితి, అంతర్జాతీయ రెడ్‌క్రాస్, విదేశీ ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు ఇప్పటికే సహాయక చర్యలు ప్రారంభించాయి. కానీ విపత్తు తీవ్రతను దృష్టిలో ఉంచుకుంటే మరింత సమన్వయంతో కూడిన అంతర్జాతీయ సహకారం అత్యవసరం. వెనిజులా విషాదం ప్రకృతి విపత్తులు ఎంత వినాశకరంమాత్రమే కాదు, బలహీనమైన పరిపాలన, నాసిరకం మౌలిక వసతులు, దీర్ఘకాలిక ఆర్థిక సంక్షోభం వాటి ప్రభావాన్ని ఎంతగానో పెంచుతాయని కూడా గుర్తు చేస్తోంది. శాస్త్రీయ ప్రణాళిక, పటిష్ఠమైన నిర్మాణ ప్రమాణాలు, సమర్థవంతమైన విపత్తు నిర్వహణ, అంతర్జాతీయ సహకారం కలిసొస్తేనే ఇటువంటి విపత్తుల నుంచి ప్రాణనష్టాన్ని,ఆస్తినష్టాన్ని గణనీయంగా తగ్గించవచ్చు. ప్రకృతి విపత్తులు ఎప్పుడు, ఎక్కడ సంభవిస్తాయో మనిషి చెప్పలేడు. కానీ అవి మానవీయ విషాదాలుగా మారకుండా నిరోధించడం మాత్రం ప్రభుత్వాల చేతుల్లోనే ఉంటుంది. వెనిజులా ఇప్పుడు కేవలం శిథిలాలను తొలగించే దశలో లేదు,తన ఆర్థిక వ్యవస్థను, మౌలిక వసతులను, ముఖ్యంగా ప్రజల విశ్వాసాన్ని తిరిగి నిర్మించుకోవాల్సిన చారిత్రక మలుపు వద్ద నిలిచింది. ప్రకృతి హెచ్చరికలను నిర్లక్ష్యం చేసినా మూల్యం ఎప్పుడూ ప్రాణాలతోనే చెల్లించాల్సి వస్తుంది. వెనిజులా విషాదం ప్రపంచానికి చెబుతున్న అతిపెద్ద పాఠం ఇదే. ●

విశాఖపట్నం అనకాపల్లి అల్లూరి సీతారామరాజు

26

# వార్త

మంగళవారం 30, జూన్ 2026





### రాజ్యసభ సభ్యులు చింతకాయల విజయ్‌కు
# రేపు ఘనంగా పౌర సన్మానం



చింతకాయల రాజేష్

నర్సీపట్నం, జూన్ 30, ప్రభాతవార్త : రాజ్యసభ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం తొలిసారిగా నర్సీపట్నం విచ్చేస్తున్న చింతకాయల విజయ్ ఘన స్వాగతం పలికేం దుకు భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు నర్సీపట్నం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చింతకాయల రాజేష్ ఒక ప్రకటనలో తెలిపారు. జులై 1వ తేదీ బుధవారం నాడు ఆయన నర్సీపట్నం చేరుకోనున్న సందర్భంగా, నియోజకవర్గ నాయకులు మరియు ప్రజల ఆధ్వర్యంలో పౌర సన్మాన కార్య క్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం 5 గంటలకు ఈ పౌర సన్మాన కార్య క్రమం అత్యంత ఘనంగా జరగనుందని వెల్లడించారు. ఈ ప్రతిష్టాత్మక కార్య క్రమంలో నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ శ్రేణులు, నాయ కులు, కార్యకర్తలు, మరియు ప్రజలందరూ పెద్ద ఎత్తున పాల్గొని చింత కాయల విజయ్‌ని ఆశీర్వదించి, సన్మాన కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా చింతకాయల రాజేష్ పిలుపునిచ్చారు.

### సైబర్ నేరాలపై
# ఉక్కుపాదం మోపుతాం
హోం మంత్రి అనిత



విశాఖపట్నం, జూన్ 29, ప్రభాతవార్త : కొవిడ్ తర్వాత సైబర్ నేరాలు పెరిగాయని ఆంధ్రప్రదేశ్ హోం మంత్రి వంగల పూడి అనిత వ్యాఖ్యానించారు. ఎన్డీఏ ప్రభుత్వం సైబర్ క్రైమ్‌పై దృష్టి పెట్టిందని పేర్కొన్నారు. సైబర్ నేరాలపై ఉక్కుపాదం మోపుతున్నామని హెచ్చరించారు. సైబర్ క్రైమ్ పోలీసుస్టేషన్‌కు టూల్స్ ఇస్తున్నామని చెప్పుకొచ్చారు. విశాఖపట్నం పోలీస్ కమిషనరేట్‌లో ఈరోజు (సోమవారం) సైబర్ క్రైమ్స్ రికవరీ మేళా నిర్వహించారు. ఈ మేళాకు ముఖ్య అతిథిగా హోం మంత్రి అనిత పాల్గొనగా, సీపీ శంఖబ్రాత బాగ్చి, పోలీస్ అధికారులు హాజరయ్యారు. సైబర్ క్రైమ్ బాధితులకు రికవరీ చేసి చెక్కులను హోం మంత్రి అందజేశారు.

**సైబర్ క్రైమ్‌లో టెక్నాలజీని పూర్తిగా వాడుతున్నాం**

చదువుకున్నవారే సైబర్ నేరాలకు గురవుతున్నారని హోం మంత్రి అనిత అన్నారు. సైబర్ నేరాలకు గురైన 310 మందికి సుమారు ఆరు కోట్ల రూపాయలు రికవరీ చేసి అందించామని తెలిపారు. సైబర్ క్రైమ్‌లో టెక్నాలజీని పూర్తిగా వాడుతున్నామని వివరించారు. ప్రతి జిల్లాలో సైబర్ క్రైమ్ స్టేషన్ ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. సైబర్ క్రైమ్‌లో ఎవరైనా మోసపోతే తక్షణమే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సైబర్ నేరాలపై ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని హోం మంత్రి అనిత పేర్కొన్నారు.

### విశాఖలో కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం
# నేడు తొలి స్నాతకోత్సవం



- 373 మంది పట్టభద్రులకు డిగ్రీ పట్టాలు, 13 మందికి బంగారు పతకాల ప్రదానం
- ముఖ్య అతిథిగా విచ్చేస్తున్న భారత రాష్ట్రపతి, హాజరుకానున్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు
- విలేకరుల సమావేశంలో ఛాన్సలర్ మదన్ లాల్ మీనా, వైస్ ఛాన్సలర్ టి. శ్రీనివాసన్

విశాఖపట్నం, జూన్ 29, ప్రభాతవార్త : విశాఖపట్నంలో మంగళవారం కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం తొలి స్నాతకోత్సవం (కాన్వొకేషన్) ఘనంగా నిర్వహించనున్నట్లు విశ్వ విద్యాలయ ఛాన్సలర్ మదన్ లాల్ మీనా, వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసన్ తెలిపారు. సోమవారం స్థానిక దస్పల్లా హోటల్లో సంయు క్తంగా నిర్వహించిన విలేకరుల సమా వేశంలో వారు స్నాతకోత్సవానికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. 2020 నుంచి 2025-26 విద్యా సంవత్సరాల వరకు వివిధ కోర్సులు పూర్తి చేసిన మొత్తం 373 మంది విద్యార్థులకు డిగ్రీ, పీజీ పట్టాలు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 13 మంది విద్యార్థు లకు రాష్ట్రపతి చేతుల మీదుగా బంగారు పతకాలు అందజేసి సత్కరించనున్నట్లు పేర్కొ న్నారు. విజయనగరం కేంద్రంగా 2019లో కేంద్రీయ గిరిజన (తరువాయి 8వ పేజీలో)

### నగరానికి చేరుకున్న
# మంత్రి లోకేష్



విశాఖపట్నం, జూన్ 29 ప్రభాతవార్త: విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ సోమవారం రాత్రి నగరానికి చేరుకున్నారు. రెండు రోజుల పర్యటనలో పలు కార్యక్రమా ల్లో పాల్గొనేందుకు ఆయన వచ్చారు. ఈ సం దర్భంగా కూటమి నాయకులు ఘన స్వాగ తం పలికారు. విశాఖలో నిర్వహిస్తున్న సెం ట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ స్నాతకోత్స వంలో ఆయన పాల్గొనున్నారు. కలవడానిని వచ్చిన ప్రజల నుండి అర్జీలు స్వీకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

# పెట్టుబడే విద్యార్థుల భవిష్యత్తుకు పునాది



- ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికే నా ఎంపీ నిధులు: ఎంపీ మతుకుమిల్లి శ్రీభరత్
- రూ.40 లక్షల ఎంపీ నిధులతో చినగదిలి జడ్పీ ఉన్నత పాఠశాలలో నూతన తరగతి గదుల ప్రారంభం

విశాఖపట్నం, జూన్ 29, ప్రభాతవార్త : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి మౌలిక వసతులు కల్పించాలనే సంకల్పంతో తన పార్లమెంట్ స్థానిక ప్రాంత అభివృద్ధి నిధులను వినియోగిస్తున్నట్లు విశాఖపట్నం పార్లమెంటు సభ్యులు మతుకుమిల్లి శ్రీభరత్ తెలిపారు. సోమవారం చినగదిలి మండలంలోని సునీల్ శర్మ కాలనీలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.40 లక్షల ఎంపీ నిధులతో నిర్మించిన మూడు అదనపు తరగతి గదులు, విశాలమైన హాల్, విద్యార్థుల భద్రత కోసం గ్రిల్ వర్క్, గ్రౌండ్ లెవలింగ్, ఆర్.ఓ. తాగునీటి ప్లాంట్ షెడ్, సీలింగ్ ఫ్యాన్లు, ఎల్ఈడీ లైటింగ్ తదితర అభివృద్ధి పనులను ఎంపీ శ్రీభరత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ, ఎంపీలకు కేటాయించే నిధులు పరిమితం గానే ఉన్నప్పటికీ వాటిని అత్యంత బాధ్యతతో, దీర్ఘకాలిక ప్రయోజనం కలిగే విధంగా వినియోగిస్తున్నా మని అన్నారు. రోడ్లు, ఇతర సాధారణ పనుల కంటే సమాజ భవిష్యత్తును తీర్చిదిద్దే విద్య, వైద్యం, క్రీడలు, గ్రంథాల యాల అభివృద్ధికే ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఈ పాఠశాలలో గతంలో సరైన తరగతి గదులు, భద్రతా వసతులు లేక ఇబ్బందులు ఎదుర్కొనేవారని, నేడు ఆధునిక సౌకర్యాలతో విద్యార్థులకు (తరువాయి 8వ పేజీలో)

### రాధాగాయత్రి తల్లిదండ్రులకు
# పూర్తి సహకారం అందిస్తాం..



విశాఖపట్నం, జూన్ 29, ప్రభాతవార్త : ముస్సోరీలో అనుమానాస్పదస్థితిలో మృతిచెందిన టెకీ రాధాగాయత్రి తల్లిదం డ్రులు ఈరోజు(సోమవారం) హోం మంత్రి అనితను కలిశారు. కూతురి మర ణం, అల్లుడు శ్రీచరణ్ ప్రవర్తనపై అనుమానాలను హోం మంత్రికి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం సహకారం కావాలని రాధాగాయత్రి తల్లిదండ్రులు సుధాకర్, సత్యవతి కోరారు. ఇప్పటికే అక్కడి పోలీసులతో ఇన్‌ఛార్జి జాయింట్ సీపీ మాట్లాడి కేసుపై వివరాలను తీసుకున్నారని ఈ సందర్భంగా హోం మంత్రి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందిస్తామని రాధా గాయత్రి తల్లిదండ్రులకు అనిత భరోసా ఇచ్చారు (తరువాయి 8వ పేజీలో)

### వరల్డ్ హెల్త్ అసెంబ్లీలో ఎంసి వైద్య విద్యార్థులకు
# బెస్ట్ డెలిగేట్ అవార్డు



8లో

# ప్రతిష్టాత్మక వేడుకకు పటిష్ట ఏర్పాట్లు
## సమన్వయంతో విజయవంతం

అధికారులకు దిశానిర్దేశం చేసిన రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత

పల్లా శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్‌తో కలిసి ఏర్పాట్ల పరిశీలన



విశాఖపట్నం, జూన్ 29, ప్రభాతవార్త : విశాఖ వేదికగా జరగనున్న ప్రతిష్టాత్మక వేడుకకు పటిష్ట ఏర్పాట్లు చేయటంతో పాటు, సమన్వయంతో విజయవంతం చేయాలని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత అధికారులను ఆదేశించారు. భారత రాష్ట్రపతి మంగళవారం విశాఖపట్నంలో పర్యటించనున్న నేపథ్యంలో నోవాటెల్ హోటల్‌తో పాటు ప్రధాన కార్యక్రమ వేదిక వద్ద చేపట్టిన ఏర్పాట్లను మంత్రి సోమవారం క్షుణ్ణంగా పరిశీలించారు. ఆమెతో పాటు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిశోర్, విశాఖ నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భం గా మంత్రి అధికారులతో మాట్లాడుతూ, కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం తొలి స్నాతకోత్సవంలో దేశ ప్రథమ పౌరురాలు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పాల్గొనడం రాష్ట్రానికి గర్వకారణమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున రాష్ట్రపతికి ఘన స్వాగతం పలికేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. జిల్లా యంత్రాంగం, విశాఖ నగర పోలీస్ కమిషనే ంట్, కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయ అధి కారులు సమన్వయంతో పనిచేస్తూ ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టారని మంత్రి పేర్కొన్నారు. కార్యక్రమానికి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌తో పాటు పలువురు ప్రజాప్రతి నిధులు, ప్రముఖులు హాజరుకానున్న నేపథ్యం లో ప్రతి అంశాన్ని అత్యంత జాగ్రత్తగా నిర్వ హించాలని అధికారులను ఆదేశించారు. అధి కారులంతా సమష్టి కృషితో ఈ ప్రతి ష్టాత్మక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, రాష్ట్రపతి భవన్ (తరువాయి 8వ పేజీలో)

### విశాఖ విమానాశ్రయంలో గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు
# అధికారుల ఘన స్వాగతం



విశాఖపట్నం, జూన్ 29, ప్రభాతవార్త: రాష్ట్ర గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్ సోమవారం విశాఖపట్నం విమానాశ్రయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్, నగర పోలీసు కమిషనర్ డా. శంఖబ్రత బాగ్చి, సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ ఛాన్సలర్ మదన్ లాల్ మీనా, వైస్ చాన్సలర్ టి. శ్రీనివాసన్ తదితరులు గవర్నర్‌కు ఘన స్వాగతం పలికారు. గవర్నర్ పర్యటన సందర్భంగా జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. అధికారులు గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా పలువురు ఉన్నతాధికారులు, విశ్వవిద్యాలయ ప్రతినిధులు కూడా హాజరయ్యారు.

# ప్రజా దర్బార్‌కి అర్జీలు




విశాఖపట్నం, జూన్ 29, ప్రభాతవార్త : విఎంఆర్‌డిఎ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్‌కి ఆరు వినతులు వచ్చాయి. సోమవారం జరిగిన ప్రజా దర్బార్ లో విఎంఆర్‌డిఎ చైర్మన్ ఎం.వి. ప్రణవ్ గోపాల్, మెట్రోపాలిటన్ కమిషనర్ ఎన్ తేజ్ భరత్ పాల్గొన్నారు. అర్జీదారులు వచ్చి వారి సమస్యలను విన్నవించారు. చైర్మన్ ఎం.వి.ప్రణవ్ గోపాల్, మెట్రోపాలిటన్ కమిషనర్ ఎన్.తేజ్ భరత్ వారి సమస్యలను తెలుసుకొని, సంబంధిత అధికారులతో మాట్లాడి వినతుల పరిష్కారానికి గడువు లోగా సత్వర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజా దర్బార్ వేదికగా వచ్చే వినతులను నిశితంగా పరిశీలించి, పరిష్కరించేలా చొరవ చూపాలని ఆదేశిం చారు. అనంతరం ప్రజా దర్బార్ వినతులపై సమీక్షించారు. ప్రజా దర్బార్‌కి మొత్తం 6 వినతులు రాగా వాటిలో ప్లానింగ్-2, ఇంజనీరింగ్-1, రెవెన్యూ-2, పరిపాలన విభాగం-1 చొప్పున వచ్చాయి. కార్యక్రమంలో అదనపు కమిషనర్ శ్రీమతి దాట్ల కీర్తి, ఓ.ఎస్.డి. శ్రీ కృష్ణ నాయక్, కార్యదర్శి మురళీ కృష్ణ, ముఖ్య ఇంజినీర్ వినయ్ కుమార్, ముఖ్య ప్రణాళికాధికారిణి శ్రీమతి దివ్యలత, ముఖ్య గణాంక అధికారి హరి ప్రసాద్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### 95 శాతం ఈఎఫ్ పత్రాల
# పంపిణీ పూర్తి

విశాఖ జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం వేగవంతం: జిల్లా కలెక్టర్



విశాఖపట్నం, జూన్ 29 ప్రభాత వార్త : విశాఖ జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాల (ఈ.ఎఫ్.) పంపిణీ ప్రక్రియ వేగంగా కొనసాగుతోందని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ తెలిపారు. జిల్లాలో మొత్తం 20,23,009 మంది ఓటర్లకు గాను ఇప్పటి వరకు 19,24,480 మందికి ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేయడం ద్వారా 95.13 శాతం పంపిణీ పూర్తయిందని వెల్లడించారు. జిల్లాలోని 1,980 పోలింగ్ కేంద్రాల పరిధిలో బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలను అందజేస్తూ, వాటిని తిరిగి సేకరించే ప్రక్రి యను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. నియోజక వర్గాల వారీగా పరిశీలిస్తే పెందుర్తిలో 97.65 శాతం, గాజువాకలో 96.82 శాతం, విశాఖ ఉత్తరంలో 95.94 శాతం, విశాఖ దక్షిణంలో 95.55 శాతం, విశాఖ తూర్పులో 93.93 శాతం, విశాఖ పశ్చిమంలో 93.33 శాతం, భీమిలిలో 92.56 శాతం ఈ.ఎఫ్. పత్రాల పంపిణీ పూర్తయిం దన్నారు. ఇప్పటివరకు జిల్లాలో 2,60,210 ఫారాలు డిజిటైజ్ చేయగా, ఇది మొత్తం ఓటర్లలో 12.86 శాతానికి సమానం అని తెలిపారు. ఫారాల పంపిణీతో పాటు డిజిటైజేషన్ ప్రక్రియను కూడా మరింత వేగ వంతం చేయాలని సంబంధిత ఎన్నికల అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఎన్యూమరేషన్ ఫారాలు ఇంకా అందుకోని ఓటర్లు లేదా నింపి సమర్పించని వారు తమ బీఎల్‌వోలకు వీలైనంత త్వరగా ఫారాల ను అందజేసి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమానికి సహకరించాలని జిల్లా కలెక్టర్ ప్రకటన ద్వారా విజ్ఞప్తి చేశారు.

### 1 నుంచి 'వీబీ-జీ రామ్ జీ'
# పథకం అమలు

- జూలై 1 నుంచి గ్రామీణ ఉపాధి హామీ పనులకు శ్రీకారం
- 'వీబీ-జీ రామ్ జీ' పథకం ద్వారా గ్రామీణ కుటుంబాలకు ఏడాదికి 125 రోజుల ఉపాధి లక్ష్యం
- ఆంధ్రప్రదేశ్‌కు రూ.12,845 కోట్ల భారీ నిధుల కేటాయింపు
- ఏపీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్



8లో

### వీఎంఆర్‌డీఏ టెండర్ల ప్రక్రియ
# పూర్తిగా పారదర్శకమే
అధికారులు

విశాఖపట్నం, జూన్ 29, ప్రభాతవార్త: వీఎంఆర్‌డీఏ చేపడుతున్న నిర్వహణ పనులకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ పూర్తిగా నిబంధనలకు అనుగుణంగా, పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు అధికారు లు తెలిపారు. నిర్వహణ పనుల అంచనాలు ప్రభుత్వం నిర్దేశించిన స్టాండర్డ్ షెడ్యూల్ ఆఫ్ రేట్స్ (తరువాయి 8వ పేజీలో)

8లో

### వరల్డ్ హెల్త్ అసెంబ్లీలో ఎఎంసి వైద్య విద్యార్థులకు

## బెస్ట్ డెలిగేట్ అవార్డు

విశాఖపట్నం, జూన్ 29 ప్రభాతవార్త:

ఇటీవల వెల్లూరు క్రిస్టియన్ మెడికల్ కాలేజీ నిర్వహించిన వరల్డ్ హెల్త్ అసెంబ్లీ (డేబ్ల్యూ హెచ్ ఎ) పోటీలో ఆంధ్రా వైద్య కళాశాల విద్యార్థులు మెరి శారు. ఈ పోటీల్లో పాల్గొన్న ఎఎంసి వైద్య విద్యార్థులు సుభి రాజ్,సుశాంత్ దూబే "బెస్ట్ డెలిగేట్" బహుమతిని అందుకున్నారని ఆంధ్రా మెడికల్ కాలేజీ సోమవారం సగర్వంగా ప్రకటించింది. కాగ్నిటో 2026లో భాగంగా నిర్వహించిన ఈ వరల్డ్ హెల్త్ అసెంబ్లీ పోటీ ని క్రిస్టియన్ మెడికల్ కాలేజ్, వెల్లూరు లో నిర్వహించినట్టు ఎ ఎం సి ప్రిన్సిపాల్, ఆదనపు డిఎంఈ డాక్టర్ కె.వి.ఎస్.ఎమ్. సంధ్యా దేవి, ఈ మేరకు ఒక ప్రకటన లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె విజేతలైన కళాశాల కు చెందిన వైద్య విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో మైక్రోబయాలజీ ప్రొఫెసర్ ఇంచార్జి హెచ్ఓడి డాక్టర్ సి.శివ కళ్యాణి, మైక్రోబయాలజీ అధ్యాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిష్టాత్మక వేడుకకు పటిష్ట ఏర్పాట్లు

(7వ పేజీ తరువాయి)

నుంచి జారీ చేసిన ప్రోటోకాల్, భద్రతా మార్గదర్శకాలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని సూచించారు. కార్యక్రమ నిర్వహణలో ఎక్కడా చిన్నపాటి లోపం కూడా తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు.

మంత్రి వంగలపూడి అనిత ముందుగా వి-కన్వెన్షన్ హాలులో ఏర్పాటు చేసిన ప్రధాన కార్యక్రమ వేదికను పరిశీలించారు. అనంతరం గ్రీన్ రూములు, అతిథుల విశ్రాంతి గదులు, భద్రతా ఏర్పాట్లు, ప్రవేశ-నిష్క్రమణ మార్గాలు, ఇతర సౌకర్యాలను తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడిన మంత్రి, రాష్ట్రపతి పర్యటన విజయవంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం అన్ని శాఖల సమన్వయంతో పనిచేస్తోందని తెలిపారు. రాష్ట్రపతి పర్యటనతో పాటు కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం తొలి స్నాతకోత్సవం విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆమె కోరారు. జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, డీసీపీలు లతామాధురి, మణికంఠ, ఆర్డీవోలు దిలీప్ చక్రవర్తి, సంగీత్ మాధుర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### వీఎంఆర్‌డీఏ టెండర్ల ప్రక్రియ

## పూర్తిగా పారదర్శకమే

(7వ పేజీ తరువాయి)

(ఎస్ఓఆర్) ఆధారంగానే రూపొందించామని, అంచనా వ్యయాల్లో ఎలాంటి అసాధారణ పెంపు లేదని స్పష్టం చేశారు. గతంలో నిర్వహణ పనుల్లో ఎదురైన లోపాలను దృష్టిలో ఉంచుకుని, అనుభవం ఉన్న సంస్థలకు అవకాశం కల్పించేలా టెండర్ అర్హత నిబంధనలను రూపొందించినట్లు తెలిపారు. కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, అర్బన్ డెవలప్‌మెంట్ సంస్థల్లో నిర్వహణ పనులు చేసిన అనుభవం ఉన్న సంస్థలు పాల్గొనేలా అవకాశం కల్పించడం వల్ల పనుల నాణ్యత మెరుగుపడటంతో పాటు, స్థానికంగా తలెత్తే సమస్యలను సత్వరమే పరిష్కరించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

గత ఏడాది అమలులో ఉన్న అర్హత నిబంధనలనే ఈ ఏడాది కూడా కొనసాగించామని అధికారులు తెలిపారు. వీఎంఆర్‌డీఏ పరిధిలోని అన్ని టెండర్లను పూర్తిస్థాయి పారదర్శకతతో ఈ-ప్రొక్యూర్‌మెంట్ విధానంలోనే నిర్వహిస్తున్నామని, టెండర్ల ప్రక్రియలో అవినీతికి లేదా అక్రమాలకు ఎలాంటి అవకాశం లేదని స్పష్టం చేశారు.

### పద్మనాభంలో ఘనంగా ప్రారంభమైన అంతర్జాతీయ సహకార వారోత్సవాలు



పద్మనాభం, జూన్ 29, ప్రభాతవార్త :

మండల కేంద్రమైన పద్మనాభంలో ఉన్న పిఎసిఎస్ వద్ద సోమవారం అంతర్జాతీయ సహకార వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పిఎసిఎస్ చైర్మెన్ మొకర అప్పలనాయుడు అంతర్జా తీయ సహకార వారోత్సవాలలో భాగంగా పద్మనాభం లో రచ్చబండ కార్యక్రమంను నిర్వహించారు. అనం తరం ఆయన మాట్లాడుతూ సంఘం ద్వారా రైతులకు వ్యవసాయ రుణాలను ఇబ్బందులు లేకుండా అందజేస్తు న్నట్లు చెప్పారు.అనంతరం మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో సంఘ సిఈఒ కనకల కోటీశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

## పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గించాలి

### ఆటో కార్మికుల నిరసన




ఆరిలోవ, జూన్ 29, ప్రభాతవార్త

విశాఖ ఆటో రిక్షా కార్మిక సంఘం సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం ఎండాడ దగ్గర గల పెట్రోల్ బంకు వద్ద ఆటో కార్మికులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కే సత్యనారాయణ మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో డీజిల్ పెట్రోల్ ధరలు భారీగా పెరిగాయని దీనికి కారణం కేంద్ర ప్రభుత్వం ఆయిల్ కంపెనీలకు డీజిల్ పెట్రోల్ ధరల పెంచుకునే విధంగా అవకాశం కల్పించడమే అన్నారు. అంతేకాకుండా రోజురోజుకీ పెరుగుతున్న డీజిల్ పెట్రోల్ ధరల వల్ల ప్రజానీకం అందరికీ కూడా చాలా ఇబ్బందికరమైన పరిస్థితులని అన్నారు. మోటార్ వాహనం వాడిన ప్రతి ఒక్కరికి కూడా తీవ్ర నష్టం కలుగుతుందని రమణాచార్జీలు పెరుగుతాయని దాని మూలంగా నిత్యావసర ధరలు కూడా భారీగా పెరిగే అవకాశం ఉందని కావున తక్షణమే పెట్రోల్ డీజిల్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ప్రజా రవాణాలో కీలక పాత్ర వహిస్తున్నటువంటి ఆటో కార్మికులకు పెట్రోల్ డీజిల్ సబ్సిడీ ధర కూడా అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాన్నిదే అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు రాము, సన్నీ, కొండలరావు, జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# 1 నుంచి 'వీబీ-జీ రామ్ జీ' పథకం అమలు

విశాఖపట్నం, జూన్ 29 ప్రభాత వార్త :

గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను విస్తరించడం, పేద కుటుంబాలకు స్థిరమైన ఆదాయ భద్రత కల్పించడం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయడం లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన "వికసిత్ భారత్ -- రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్) గ్యారంటీ (వీబీ-జీరామ్ -జీ )" పథకం దేశవ్యాప్తంగా జూలై 1 నుంచి అమలులోకి రానుందని ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు .

ఈ పథకాన్ని ఆంధ్రప్రదేశ్‌లో కేంద్ర వ్యవసాయ , రైతు సంక్షేమ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జూలై 2న తిరుపతి జిల్లా రైల్వే కోడూరులో అధికారికంగా ప్రారంభించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ పథకం ద్వారా గ్రామీణ కుటుంబాలకు సంవత్సరానికి గరిష్టంగా 125 రోజుల వరకు ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం రూ.12,845 కోట్ల నిధులను మంజూరు చేయగా, రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా రూ.5,138 కోట్లు సమకూర్చాల్సి ఉంటుందని వివరించారు. ఈ నిధులతో చెరువుల అభివృద్ధి, నీటి సంరక్షణ పనులు, గ్రామీణ రహదారుల నిర్మాణం, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు, వ్యవసాయ అనుబంధ మౌలిక సదుపాయాల అభివృద్ధితో పాటు స్థానిక అవసరాలకు అనుగుణంగా వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. దీంతో గ్రామీణ యువత, మహిళలు, వ్యవసాయ కూలీలు, బలహీన వర్గాలకు విస్తృత స్థాయిలో ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం "వికసిత్ భారత్ --2047" లక్ష్య సాధనలో భాగంగా గ్రామీణాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పీవీఎన్ మాధవ్ అన్నారు. గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, గ్రామాల నుంచి పట్టణాలకు వలసలను తగ్గించడం, స్థానికంగా ఉపాధి అవకాశాలను పెంపొందించడం ఈ పథకం ప్రధాన లక్ష్యమని వివరించార

దేశవ్యాప్తంగా ఈ పథకం కింద అత్యధిక నిధులు పొందిన రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ మూడో స్థానంలో నిలవడం రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం సమర్థవంతంగా వినియోగించి గ్రామీణ ప్రాంతాల్లో సుస్థిర అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.

గ్రామీణ కార్మికులు, అర్హులైన కుటుంబాలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచుకోవాలని పీవీఎన్ మాధవ్ కోరారు.

# నేడు తొలి స్నాతకోత్సవం

(7వ పేజీ తరువాయి)

విశ్వ విద్యాలయం ఏర్పాటై, 2020 నుంచి తరగ తులు ప్రారంభమైనట్లు వివరించారు. ప్రస్తుతం విశ్వవిద్యాలయంలో ఎనిమిది పీజీ కోర్సులు, ఐదు డిగ్రీ కోర్సులు నిర్వహిస్తున్నా మని తెలి పారు. స్కూల్ ఆఫ్ సైన్సెస్, స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో విద్యా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని చెప్పారు. స్నాతకోత్సవంలో స్కూల్ ఆఫ్ సైన్సెస్ నుంచి 200 మంది, స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ నుంచి 82 మంది, స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ నుంచి 91 మంది విద్యార్థులు పట్టాలు అందుకోనున్నట్లు వెల్లడించారు.

### 13 మందికి బంగారు పతకాలు అందులో 11 మంది విద్యార్థినులే

ఈ సందర్భంగా ఛాన్సలర్, వైస్ ఛాన్సలర్ మాట్లాడుతూ విశిష్ట ప్రతిభ కనబరిచిన 13 మంది విద్యార్థులకు బంగారు పతకాలు ప్రదానం చేస్తున్నట్లు పేర్కొన్నారు. వారిలో 11 మంది విద్యార్థినులు, ఇద్దరు విద్యార్థులు ఉండటం విశేషమన్నారు. ఎంఎస్సీ కెమిస్ట్రీ విభాగం నుంచి ఐదుగురు, ఇంటిగ్రేటెడ్ ఎం ఎస్సీ కెమిస్ట్రీ నుంచి ఇద్దరు, మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్ నుంచి ఇద్దరు, మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ నుంచి ఇద్దరు, ఎంఎస్సీ బయోటెక్నాలజీ నుంచి ఇద్దరు బంగారు పతకాలకు ఎంపికైనట్లు వెల్లడించారు.

ఏఛాన్సలర్ మదన్ లాల్ మీనా మాట్లాడు తూ స్నాతకోత్సవం ప్రతి విద్యార్థి జీవితంలో ఒక ముఖ్యమైన మైలురాయి అని అన్నారు. ఉన్నత విద్యతో పాటు నైతిక విలువలు, సామాజిక బాధ్యత, నవీన ఆలోచనలను అలవరచుకున్నప్పుడే యువత సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషించగలదన్నారు. పట్టభద్రులు తమ విద్యను దేశాభివృద్ధికి, సమాజ శ్రేయస్సుకు వినియోగించాలని పిలుపునిచ్చారు. వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసన్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయం నాణ్యమైన విద్య, పరిశోధన, ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు అనేక వినూత్న కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు.

స్నాతకోత్సవ కార్యక్రమానికి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, ఫౌండర్ వీసీ టి.వి. కట్టిమణి, ఇతర మంత్రులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖ విద్యావేత్తలు, విశిష్ట అతిథులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వివరించారు. పట్టభద్రులు, వారి తల్లిదండ్రులు నిర్ణీత సమయానికి హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. విలేకరుల సమావేశంలో రిజిస్ట్రార్ జితేంద్ర మోహన్ మిశ్రా పాల్గొన్నారు.

# పెట్టుబడే విద్యార్థుల భవిష్యత్తుకు పునాది

(7వ పేజీ తరువాయి)

ఏర్పడడం ఆనందంగా ఉందన్నారు. పనులు పూర్తయిన అనంతరమే ప్రారంభోత్సవం నిర్వహిస్తానని ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఉపాధ్యాయు లను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, "మేము భవనాలు నిర్మించగలం. కానీ విద్యార్థుల జీవితాలను నిర్మించేది ఉపాధ్యాయులే. కేవలం పరీక్షల్లో మంచి మార్కులు సాధించడం మాత్రమే లక్ష్యం కాకూడదు. విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వం, ఆలోచనా శక్తి, భయం లేకుండా మాట్లాడే ఆత్మవిశ్వాసం పెంపొం దేలా బోధన ఉండాలి. అదే నిజమైన విద్యకు నిదర్శనం" అని అన్నారు. అలాగే పాఠశాల అభివృద్ధికి కల్పించిన వసతులను ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు సమిష్టిగా సంరక్షించి, భవిష్యత్తు తరాలకు ఉపయోగపడేలా కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు గారి తనయుడు గంటా రవితేజ, జిల్లా విద్యాశాఖా ధికారి శ్రీ ఎన్. ప్రేమ్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి గీతాదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానిక నాయకులు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



### ఆస్తిపన్ను చెల్లించి వడ్డీ భారం నుంచి

# ఉపశమనం పొందండి...

### జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ విజ్ఞప్తి

విశాఖపట్నం, జూన్ 29, ప్రభాతవార్త:

గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) పరిధిలోని ఆస్తిపన్ను చెల్లింపుదారులు 2026--27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన తొలి అర్ధ సంవత్సరపు ఆస్తిపన్నును ఈ నెల 30వ తేదీలోగా తప్పనిసరిగా చెల్లించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ విజ్ఞప్తి చేశారు. నిర్ణీత గడువులోపు పన్ను చెల్లించడం ద్వారా వడ్డీ భారం నుంచి ఉపశమనం పొందవచ్చని ఆయన తెలిపారు. ఆస్తిపన్నుతో పాటు ఖాళీ స్థలాల పన్ను, మంచినీటి కొళాయి ఛార్జీలను కూడా సకాలంలో చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని పౌరులను కోరారు. పన్నులను సకాలంలో చెల్లించడం ద్వారా పౌర సేవల నిర్వహణ, మౌలిక సదుపాయాల అభివృద్ధికి తోడ్పాటు అందించినవారవుతారని కమిషనర్ పేర్కొన్నారు. నగర ప్రజలందరూ గడువు తేదీలోగా తమ పన్ను బకాయిలను చెల్లించి వడ్డీ భారాన్ని నివారించుకోవాలని సూచించారు.



# 27వ వార్డులో ఆలయ కమిటీల ప్రమాణ స్వీకారం

### ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ శుభాకాంక్షలు



విశాఖపట్నం, జూన్ 29, ప్రభాతవార్త:

విశాఖ దక్షిణ నియోజకవర్గంలోని 27వ వార్డు పరిధిలో శ్రీ శ్రీ రామాలయం, శ్రీ శ్రీ శ్రీ పరదేశమ్మ ఆలయం, శ్రీ శ్రీ ఎరుకమాంబ అమ్మవారి ఆలయాల నూతన చైర్మన్లు, కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవాలు సోమవారం భక్తిశ్రద్ధల మధ్య జరిగాయి. ఈ కార్యక్రమాల్లో దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొని నూతన కమిటీలకు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా ఆయా దేవాలయాల్లో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారు, అమ్మవారి ఆశీస్సులు పొందారు. అనంతరం నూతనంగా బాధ్యతలు చేపట్టిన కమిటీ సభ్యులను అభినందిస్తూ, ఆలయాల అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ప్రజలు ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుని సేవా దృక్పథంతో విధులు నిర్వహించాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మరింత ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమాల్లో స్థానిక కూటమి నాయకులు, బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ విగ్రహ ప్రతిష్ట

ఆరిలోవ, జూన్ 29, ప్రభాతవార్త :

తూర్పు నియోజకవర్గం స్థానిక 13వ వార్డు ఆరిలోవ లాస్ట్ బస్ స్టాప్ వద్ద నూతనంగా నిర్మిస్తున్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం సోమవారం వాసవి విక్టరీ క్లబ్ అధ్యక్షులు శివప్రసాద్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ భాబు పాల్గని వేద పండితుల మంత్రోచరణ మధ్య ప్రత్యేక పూజలు చేసి ఆయన చేతుల మీదుగా విగ్రహ ప్రతిష్ట చేశారు. ఈ మహోత్సవంలో వార్డ్ టిడిపి అధ్యక్షులు ఏడువాక సన్యాసిరావు మహాలక్ష్మి దంపతులు, స్థానిక టిడిపి నాయకులు పాత్రకొండ ధర్మారావు, తురకపూడి బాలస్వామి, కెల్లా సత్యనారాయణ, మజ్జి రమణి, బిజెపి నాయకులు కొండపల్లి సతీష్, వడ్డే నాగరాజు, సూరిశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



### రాధాగాయత్రి తల్లిదండ్రులకు పూర్తి సహకారం అందిస్తాం

(7వ పేజీ తరువాయి)

రాధాగాయత్రీ కుటుంబ సభ్యులు తనను కలిశారని ఆ తల్లిదండ్రుల బాధ వర్ణనాతీతమని హోం మంత్రి అనిత అన్నారు. రాధాగాయత్రి మరణంపై సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా దృష్టి సారించారని తెలిపారు. ఉత్తరాఖండ్ డీజీపీతో మాట్లాడమని ఏపీ డీజీపీకి చెప్పారన్నారు. రాధాగాయత్రి మృతిపై కుటుంబసభ్యులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారన్నారు. ఆమె మరణం వెనుకున్న రహస్యం బయటపడాలని.. నిందితుడికి కఠిన శిక్ష పడాలని అన్నారు. రాధాగాయత్రి తల్లిదండ్రులకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని హోం మంత్రి అనిత స్పష్టం చేశారు.

### పెందుర్తి జోన్‌లో జూలై 1, 2 తేదీల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం

విశాఖపట్నం, జూన్ 29, ప్రభాతవార్త:

గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) పెందుర్తి జోన్ పరిధిలోని 88వ వార్డులో ప్రధాన తాగునీటి పైప్‌లైన్ మరమ్మత్తు పనుల కారణంగా జూలై 1, 2 తేదీల్లో పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు జీవీఎంసీ నీటి సరఫరా విభాగం కార్యనిర్వాహక ఇంజినీరు సంతోషి తెలిపారు.

అగనంపూడి నుంచి దువ్వాడ, వెదుళ్ల నరవ, మంగళపాలెం రిజర్వాయర్లకు నీటిని సరఫరా చేసే ప్రధాన పైప్‌లైన్‌కు మరమ్మత్తులు చేపడు తున్న నేపథ్యంలో మంగళపాలెం, దువ్వాడ, వెదుళ్ల నరవ తదితర ప్రాంతాల్లో తాగునీటి సరఫరా నిలిచిపోనుందని పేర్కొన్నారు. ప్రజలకు కలిగే అసౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని అవసరమైన ప్రాంతాలకు ప్రత్యామ్నాయంగా నీటి ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేయనున్నట్లు తెలిపారు. ట్యాంకర్ల ద్వారా నీరు అవసరమైన వారు 88వ వార్డు నీటి సరఫరా విభాగం సహాయక ఇంజినీరు 8897100593 ను సంప్రదించాలని సూచించారు. మరమ్మత్తు పనులు పూర్తయ్యే వరకు నగర ప్రజలు సహకరించాలని జీవీఎంసీ అధికారులు విజ్ఞప్తి చేశారు.

### జీవీఎంసీ ఉద్యోగి ఎస్. సాయిబాబుకు నేడు ఘన వీడ్కోలు



విశాఖపట్నం, జూన్ 29, ప్రభాతవార్త:

గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ)లో సుదీర్ఘకాలం పాటు సేవలం దించిన ఉద్యోగి ఎస్. సాయిబాబు మంగళ వారం పదవీ విరమణ పొందనున్నారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కార్యాలయంలో అధికా రులు, సహోద్యోగులు ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికనున్నారు. ఉద్యోగ జీవితంలో అంకితభావం, క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన విధి నిర్వహణతో ఎస్. సాయిబాబు అందించిన సేవలు సంస్థకు విశేషంగా ఉపయోగపడ్డాయి. జీవీఎంసీ అభివృద్ధి లో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని ఉద్యోగులు పేర్కొన్నారు. సహోద్యోగులు ఆయనకు పదవీ విరమణ శుభాకాంక్షలు తెలియజేయను న్నారు, పదవీ విరమణ అనంతరం ఆయురారో గ్యాలతో, కుటుంబ సభ్యులతో ఆనందంగా, ప్రశాంతమైన జీవితాన్ని గడపాలని తోటి ఉద్యోగులు ఆకాంక్షించారు.

### గాజువాక సెలెస్ట్ లో

## 'బార్బిక్యూ నేషన్' విభిన్న వంటకాలు



గాజువాక, జూన్ 29,ప్రభాతవార్త :

ప్రముఖ బఫే డైనింగ్ చైన్ 'బార్బిక్యూ నేషన్' తన నూతన ఔట్‌లెట్‌ను గాజువాకలోని సెలెస్టా మాల్‌లో సోమవారం ఘనంగా ప్రారంభిం చింది. ధాత్రి ఫౌండేషన్‌కు చెందిన చిన్నారుల తో కలిసి బార్బిక్యూ నేషన్ ఆంధ్రప్రదేశ్ ఆపరేషనల్ హెడ్ నరేష్ నాయుడు ముత్తులూరు ఈ శాఖను ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారులకు స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. విశాఖలో ఇది నాల్గవ శాఖ అని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఏపీ ఆపరేషనల్ హెడ్ నరేష్ నాయుడు మాట్లాడుతూ.. అన్ని పన్నులతో కలుపుకుని వెజ్ బఫేను రూ.475లకు, నాన్ వెజ్ బఫేను రూ.525లకే అందిస్తున్నట్లు వెల్లడించారు. భోజన ప్రియుల కోసం చికెన్ తందూరీ అంగారా, ఫిష్ కొలివాడ, పన్నీర్ కా సూల్, ముర్గ దమ్ బిర్యానీ, లైవ్ చాట్ కౌంటర్లు, డెజర్ట్స్‌తో సహా సుమారు 30కి పైగా విభిన్న వంటకాలను అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ధాత్రి ఫౌండేషన్ 'ఆకార్', 'అమ్మ ఒడి' హాస్టళ్ల చిన్నారులు పాల్గొన్నారు.



## పోతంగిలో పీజీఆర్ఎస్

దుంబ్రిగుడ, జూన్ 29 ప్రభాతవార్త

పోతంగి పంచాయతీ కేంద్రం దుంబ్రిగుడ లో పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని అధికార యంత్రాంగం సోమవారం నిర్వహించారు. కిదారి భవనలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మండల స్థాయి అధికారులు వినతులను స్వీకరించారు. జిల్లా కలెక్టర్ నిశాంతి ఆదేశాల మేరకు ప్రతి సోమవారం పంచాయతీ కేంద్రాల్లో నిర్వహించాలనే ఆదేశాలతో పోతంగి పంచాయతీ కేంద్రంలో జరిగిన సమస్యల పరిష్కార వేదికలో గిరిజనులు పలు వినతులు సమర్పించారు. క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారానికి అధికారులు శాఖల వారిగా అర్జీలను తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, మండల పరిషత్తు అడ్మిస్ట్రేటివ్ అధికారి విశ్వనాథ్, అధికారులు పాల్గొన్నారు.

## గ్రామస్థాయిలోనే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహణ

### వారంలో ప్రతి సోమవారం మండల స్థాయి అధికారులతో నిర్వహించుటకు ప్రణాళికలు సిద్ధం చేయాలి: జిల్లా కలెక్టర్ టి.నిశాంతి

పాడేరు,జూన్29, ప్రభాతవార్త:



ప్రజా సమస్యలు సత్వర పరిష్కారం కొరకు, అధికార యంత్రాంగాన్ని ప్రజలకు వద్దకు పాలన అందుబాటులో ఉంచేందుకు వారంలో ప్రతి సోమ వారం గ్రామ స్థాయిలోనే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించుటకు ప్రణాళికలు తయారు చేయా లని మండల స్థాయి అధికారులకు జిల్లా కలెక్టర్ టి.నిశాంతి ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా రెవెన్యూ, మండల తహసిల్దార్, మండల అభివృద్ధి అధికారులు, జిల్లా యంత్రాంగంతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ వారంలో ప్రతి సోమవారం, పంచాయతీలో ఒక గ్రామంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించాలని, ప్రజలకు అధికారులు నిరంతరం అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టాలని, క్షేత్ర స్థాయిలోనే సమస్యల పరిష్కారం కొరకు గ్రామస్థాయి పిజిఆర్ఎస్ ఒక వినూత్న కార్యక్రమన్నారు. మండల రెవెన్యూ అధికారులు, మండల అభివృద్ధి అధికారులు మండలంలో ఉన్న పంచాయితీ పరిధిని గ్రామాలలో పిజిఆర్ఎస్ నిర్వహించుటకు కార్యాచరణ రూపొందించాలన్నారు. పిజిఆర్ఎస్ నిర్వహించే గ్రామాలలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ, గ్రామస్థాయి సిబ్బంది అందుబాటులో ఉండి అర్జీలను స్వీకరించాలన్నారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా క్షేత్రస్థాయిలో కార్యక్రమం నిర్వహిస్తున్నందున అధికారులు నిర్లక్ష్యం వహించరాదన్నారు. స్వీకరించిన అర్జీలను ఆన్లైన్ పోర్టల్ నందు ఎప్పటికప్పుడు నమోదు చేసి సంబంధిత శాఖ అధికారులతో అర్జీలకు పరిష్కార మార్గం చూపించాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలకు తీసుకొనుటకు ఉపేక్షించేది లేదన్నారు. క్షేత్రస్థాయి సిబ్బంది ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీ పూజ, జిల్లా రెవెన్యూ అధికారి (ఎఫ్ఏసి )ఎంవిఎస్ లోకేశ్వరరావు, పాడేరు ఆర్డీవో ఎం.భుజంగరావు, మండల తహసిల్దార్లు రెవెన్యూ అధికారులు, మండల అభివృద్ధి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పీఎం జన్‌మన్ బిల్లులు చెల్లించాలి..

దుంబ్రిగుడ, జూన్ 29, ప్రభాతవార్త



పీఎం జన్మన్ బిల్లులు చెల్లించి గృహ నిర్మాణాలు వేగవంతం గా పూర్తయ్యేలా అధికారులు చర్యలు చేపట్టాలని వైకాపా మండల కార్యదర్శి నర్సింగరావు డిమాండ్ చేశారు. సొవ్వా పంచాయతీ సాగరివలస గ్రామంలో ఆ పార్టీనాయకులతో ఆయన సందర్శించిన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పీఎం జన్మమన్ బిల్లుల చెల్లింపు ప్రక్రియలో జాప్యంతో లబ్దిదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అసంపూర్తి నడుమ గృహ నిర్మాణాలతో పరాయి పంచనే గడుపుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి పీఎం జన్మన్ గృహ నిర్మాణ బిల్లులు చెల్లించి గృహ నిర్మాణ లబ్ధిదారుల కష్టాలను తీర్చాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు కురంజన్, గోవర్ధన్, రాజు పాల్గొన్నారు.

## జనసేన పార్టీ బలోపేతమే లక్ష్యంగా ప్రత్యేక కమిటీలు ఏర్పాటు

### జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు

అరకు రూరల్, జూన్ 29, ప్రభాతవార్త



అరకు పార్లమెంట్ పరిధిలో జనసేన పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర జనసేన ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు అన్నారు. సోమవారం అరకు పార్లమెంట్ జనసేన పార్టీ నిర్మాణ సారధుల సమాచార సేకరణ కమిటీ సమావేశం స్థానికంగా ఉన్న ప్రైవేటు గుడ్ మార్నింగ్ రిసార్ట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాగబాబు మాట్లాడుతూ జనసేన పార్టీ బలోపేతమే లక్ష్యంగా ప్రత్యేక కమిటీలను నియమిస్తున్నట్లు చెప్పారు. గత 12 ఏళ్లుగా పార్టీ కోసం పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు తగిన గుర్తింపు ఇవ్వనున్నమని ఆయన అన్నారు. ఇందులో ఉత్సాహంగా పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తల వివరాలు సేకరిస్తున్నామన్నారు. పూర్తి స్థాయిలో సమాచార సేకరణ జరిగిన తర్వాత ఉత్సాహంగా, అంకితభావంతో పనిచేసిన కార్యకర్తలకు బాధ్యతలు అప్పగిస్తామన్నారు. గిరిజన సంక్షేమానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారని ఆయన అన్నారు. గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లక్ష్యం అన్నారు. రాబోయే ఎన్నికల్లో అరకు, పాడేరు నియోజకవర్గాల్లో జనసేన పార్టీ పోటీ చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. అరకు పార్లమెంట్ పరిధిలోని నియోజకవర్గాల్లో సమర్థవంతమైన కొత్త నాయకత్వాన్ని తీర్చిదిద్దడమే ఈ సమావేశం ప్రధాన ఉద్దేశ్యం అన్నారు. గిరిజనుల హక్కులు, రాజ్యాంగబద్ధ చట్టాల పరిరక్షణకు జనసేన పార్టీ కట్టుబడి ఉందన్నారు. గిరి జనులు అంటే పవన్ కళ్యాణ్‌కు ఇష్టమని ఇందులో భాగంగానే కోట్ల రూపాయలు రహదారులు నిర్మిస్తున్నారని ఆయన అన్నారు. పవన్ కళ్యాణ్ చేపట్టిన అడవి తల్లి బాట కార్యక్రమం కింద చేపట్టిన రహదారుల నిర్మాణంలో నాణ్యతకు తిలోదకలిచ్చి రోడ్డు నిర్మాణం చేపడుతున్నారని ఆయన వద్ద ప్రస్తావించగా ఇదేమైనా ఉంటే జనసేన పార్టీ దృష్టికి తీసుకురావాలని ఆయన అన్నారు. ఈ ప్రాంతం లోని జనసేన పార్టీకి విశేషమైన ఆదరణ ఉందన్నారు. అనంతరం పార్టీ నిర్మాణ సారధుల కమిటీ సమావేశం నిర్వహించి పార్టీ నాయకులకు, కమిటీకి బలోపేతం కోసం దిశ నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో పాడేరు నియోజకవర్గం జనసేన ఇన్చార్జి, రాష్ట్ర జానపద కలలు సృజనాత్మక అకాడమీ చైర్మన్ వంపూరి గంగులయ్య, అరకు నియోజకవర్గ ఇన్చార్జి చిరంజీవి, అరకు నియోజకవర్గ జనసేన ప్రధాన కార్యదర్శి రిటైర్డ్ ఎస్సై కొర్ర మధుసూదనరావు, జనసేన నాయకులు బాలు, నరేష్, వీర మహిళ నాయకురాలు దామర సింగ్ దివ్య, రత్న ప్రియ, అరకు పార్లమెంటు పరిధిలోని వర్గాల జనసేన ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రాజేంద్రపాలెంలో సామూహిక అక్షరాభ్యాసం

కొయ్యూరు, జూన్ 29, ప్రభాతవార్త



శ్రీ ధానధర్మ చారిట్రబుల్ ట్రస్ట్, అలాగే వేదసంకల్ప సేవ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రమైన రాజేంద్రపాలెం శ్రీ సీతా రామచంద్ర స్వామివారి ఆలయం ఆవరణలో గల గిరిజన భవన్‌లో సామూహిక అక్షరాభ్యా సాలు నిర్వహించారు. ఈ కార్యక్రమం గిరిజన అర్చకులు శ్రీ గణేష్ రాజు అధ్యక్షతన గణపతిపూజ సరస్వతి పూజ అక్షరాభ్యాస కార్యక్రమం అత్యంత వేడుకగా జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ తాజా మాజీ సర్పంచ్ పీటా సింహాచలం. అంగన్వాడీ స్టాఫ్ ఎ. వెంకటరమణమ్మ, గ్రామ ప్రజలు పాల్గొని ఈ కార్యక్రమ నిర్వహణ ట్రస్ట్ వారికి కృతజ్ఞత పూర్వక అభినందనలు తెలిపారు.

## ఘోర రోడ్డు ప్రమాదం.. మహిళ మృతి

నక్కపల్లి రూరల్, ప్రభాతవార్త



మండలంలోని న్యాయం పూడి జాతీయ రహదారిపై సోమవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఒక మహిళ మృతి చెందింది.! నక్కపల్లి సర్కిల్ సిఐ జూరెడ్డి మురళి అందించిన వివరాలు ఇలా ఉన్నాయి.. అనకాపల్లి జిల్లా పెందుర్తి గ్రామానికి చెందిన ఓలుపల్లి ఈశ్వరరావు, భార్య గాయత్రి (26) ఇరువురు కలిసి స్కూటీపై పెందుర్తి నుంచి దర్శనం కోసం కాకినాడ జిల్లా అన్నవరం వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానానికి బయలుదేరారు. న్యాయం పూడి జాతీయ రహదారి వద్దకు వచ్చేసరికి పశ్చిమ బెంగాల్ రాజమండ్రి వైపు వస్తున్న వ్యాన్ డ్రైవర్ వెనుక నుంచి స్కూటీని అదుపుతప్పి ఢీకొట్టడంతో స్కూటీ ఎదురుగా ఉన్న కంటైనర్ లారీని ఢీకొట్టింది. అదే సమయంలో వెనుకనే ఉన్న వ్యాను ఒక్కసారిగా ఢీకొట్టడంతో స్కూటీపై వెనుకను ఉన్న ఈశ్వరరావు భార్య గాయత్రి కంటైనర్‌కి వ్యాన్ మధ్య ఉండిపోవడంతో ఇరుక్కుపోయింది. బలంగా రెండు వాహనాల మధ్య మహిళ ఉండిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందింది. రెండు వాహనాలు ఢీ కొట్టిన సమయంలో భర్త ఈశ్వరరావు తూలిపో స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. కళ్ళ ముందే భార్య మృతి చెందడంతో భర్త ఈశ్వరరావు ఏం చేయాలో తెలియని పరిస్థితిలో కన్నీరు మున్నీరై విలపించాడు. సంఘటన విషయం తెలిసిన వెంటనే సిఐ చేరుకొని గాయపడిన ఈశ్వరరావును ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వాహనం మధ్యన ఇరుక్కుపోయిన మహిళ మృతదేహాన్ని బయటికి తీశారు. బంధువులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఓటర్ల నమోదు ప్రక్రియ గడువులోగా పూర్తి చేయాలి

### ఈఆర్‌ఓస్, ఏఈ ఆర్‌ఓస్ శిక్షణలో వెల్లడించిన జిల్లా కలెక్టర్ నిశాంతి

పాడేరు,జూన్ 29,ప్రభాతవార్త:



అల్లూరి జిల్లాలోని 11 మండలాలకు సంబంధించిన ఓటర్ల జాబితా సవరణ, ఎస్ఐఆర్, ఫారాల పంపిణి పరిశీలనపై ఈఆర్వో బిఎల్ఓల విధులకు సంబంధించి ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించిన జిల్లా కలెక్టర్ టి.నిశాంతి సోమవారం ఉదయం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మండల స్పెషల్ అధికారులు, 11 మండలాలకు సంబంధించిన తహసిల్దార్, మండల అభివృద్ధి అధికారులు, ఎంఈఓలతోఈ శిక్షణ కార్య క్రమం నిర్వహించి, ఓటర్ నమోదు సవరణలపై పలు సూచనలను చేసి ఆదేశాలు జారీ చేశారు. ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని అధికారులతో మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియ, ఓటర్ పారాల పంపిణీ, పరిశీలన తప్పనిసరిగా బిఎల్వోలు మాత్రమే పారాల పంపిణీ చేయాలని, ఇతర సిబ్బందితో ఓటర్ పారాలు పంపిణీ చేయరాదని సూచించారు. రాష్ట్ర ఎన్నికల అధికారి సూచనలు, జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాలు మేరకు నిర్దేశిత గడువులోగా ఓటర్ ఫారాల పనుల పూర్తి చేయాలని,ఓటర్ల నమోదలో మార్పులకు సంబంధించిన దరఖాస్తులను, పిర్యాదులను నిర్ణీత 48 గంటల గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఓటర్ల ఫారాల పంపిణీ, సేకరణ బాధ్యతలను కేవలం బీఎల్ఓలు మాత్రమే నిర్వహించాలని, ఇందులో ఇతరుల ప్రమేయం ఎట్టిపరిస్థితుల్లోనూ ఉండకూడదని స్పష్టం చేశారు. నెట్‌వర్క్ లేని ప్రాంతాల్లో ఆఫ్‌లైన్ ఆప్షన్ ద్వారా ఫోటోలను సేవ్ చేసుకుని, నెట్‌వర్క్ అందుబాటులోకి రాగానే అప్‌లోడ్ చేయాలని చూచించారు. ప్రతిసచివాలయంలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగుల వ్యవస్థను, కంప్యూటర్, ప్రింటర్లను ఓటర్ల జాబితా ప్రక్రియ కోసం సమర్థవంతంగా వాడుకోవాలని, సచివాలయాల పరిధిలో బీఎల్ఓల విధులకు పంచాయతీ కార్య దర్శులు సైతం పూర్తి సహకారం అందించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ, డిఆర్ఓ (ఎఫ్ఏసి) ఎంవి ఎస్ లోకేశ్వరరావు, ఆర్డిఓ భుజంగరావు, కలెక్టరేట్ ఉన్నతాధికారులతో పాటు వివిధ మండలాల తహసీల్దార్లు, మండల అభివృద్ధి అధికారులు, ఎంఈఓలు, కలెక్టరేట్ ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

## అరకులోయలో భారత్ గ్యాస్ మోసాలు

### సర్వీస్ ఛార్జీ పేరుతో అదనపు వసూళ్లు

అరకు రూరల్, జూన్ 29, ప్రభాతవార్త



అరకులోయ మండలంలో భారత్ గ్యాస్ కష్టాలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. స్థానికంగా భారత్ గ్యాస్ గోదాం లేకపోవ డం, మైదాన ప్రాంతాల నుండి సరఫరా చేస్తున్న భారత్ గ్యాస్ ఏజెన్సీలకు వరంగా మారు తుంది. అరకలోయలో గదా కొద్ది నెలలుగా భారత్ గ్యాస్ కొరత ఇంకా కొనసాగుతూనే ఉంది. దీనిని ఆసరాగా తీసుకుంటున్న భారత్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు పలు మాసాలకు పాల్పడుతూ సొమ్ము చేసుకుంటున్నారన్న ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. ఆన్‌లైన్‌లో గ్యాస్ సిలిండర్ బుక్ చేసుకున్న వినియోగిదారులకు గ్యాస్ తీసుకోకుండానే డెలివరీ మెసేజ్‌లు రావడంతో అవాక్కవుతున్నారు. దీనికి తోడు భారత్ గ్యాస్ బ్లాక్ సిలిండర్లపై సర్వీస్ చార్జి పేరుతో అదనపు వసూళ్లు చేస్తుండడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కో బండకు 1060 రూపాయలు గ్యాస్ ఏజెన్సీ నిర్వహకులు వసూలు చేస్తుండడంతో వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా గ్యాస్ వ్యాన్ ఎప్పుడు వస్తుందో తెలియక భారత్ గ్యాస్ వినియోగదారులు ప్రతిరోజు అర్ధరాత్రి నుండే క్యూ కడుతుండడంతో బారులు తీరుతున్నారు. అరకులోయలో భారత్ గ్యాస్ వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడంతో మైదాన ప్రాంతం నుండి సరఫరా చేస్తున్న భారత్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు సొమ్ము చేసుకుంటున్నారు. అరకులోయకు ప్రస్తుతం భారత్ గ్యాస్ వినియోగదారులకు మైదాన ప్రాంతం శృంగవరపు కోట (ఎస్ కోట)కు చెందిన శ్రీ లక్ష్మిగ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు వంట గ్యాస్‌ను సరఫరా చేస్తున్నారు. ఆన్ లైన్‌లో గ్యాస్ తీసుకుందామని బుక్ చేసుకున్న ఎస్ కోట భారత్ గ్యాస్ ఏజెన్సీ వినియోగదారులకు గ్యాస్ తీసుకోకుండానే డెలివరీ చేసినట్లు మెసేజ్‌లు రావడంతో అవాక్కవుతున్నారు. దీనిపై ఎస్.కోట భారత్ గ్యాస్ ఏజెన్సీ సిబ్బందిని అడిగితే సిలిండర్ డెలివరీ తీసుకోకపోతే ఇబ్బందులు ఎదురవుతాయని ముందుగానే తామే డెలివరీ చేసినట్లు మెసేజ్‌లు పంపు తున్నామని చెబుతూ తప్పించుకునే ప్రయత్నాలు చేస్తూ, గట్టిగా అడిగే వారిపై బెదిరింపులకు పాల్పడుతు న్నారని వినియోగిదారులు పేర్కొంటున్నారు. అరకులోయలో భారత్ గ్యాస్ ఏజెన్సీకి సంబంధించి గోదాం లేకపోవడం కారణంగానే గ్యాస్ మోసాలు పెరుగుతున్నాయని, వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని దీనిపై అధికారులు కూడా పట్టించుకోకపోవడం దారుణమని గిరిజనులు వాపోతున్నారు.

## గతం కన్నా... నేటి పోలీస్ ఎంతో మిన్న..!

### అవగాహన కార్యక్రమాలతో ప్రజలతో మమేకమవుతున్న పోలీసులు

కొయ్యూరు జూన్ 29 ప్రభాతవార్త



గతంతో పోల్చుకుంటే ప్రస్తుతం పోలీసు శాఖ ఉన్నతాధికారుల ఆదేశాలతో స్థానిక పోలీసులు వివిధ అవగాహన కార్యక్రమాల పేరుతో ప్రజలతో నిత్యం మమేకమవుతున్నట్లు కనబడుతోంది. గతంలో ఖాకీలు అంటేనే కాస్త దూరంగా ఉండే ప్రజలు ఇప్పుడు ఫ్రెండ్లీ పోలీసింగ్‌లో భాగంగా స్నేహపూర్వక వాతావరణంలో నడుస్తున్నారు. ఇటీవల కొయ్యూరు సీఐ బి.శ్రీనివాస రావు, ఎస్సై కిషోర్ వర్మ, మంప ఎస్సై సీదరి శ్రీనివాస్ తమ సిబ్బందితో కలిసి మండలంలోని పలు వారపు సంతల్లో, ప్రజలు రద్దీగా ఉండే బహిరంగ ప్రదేశాల్లో రోడ్డు భద్రత, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, సైబర్ నేరాలు, గంజాయి వంటి నిషేధిత మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్ధాలు, వారపు సంతల్లో విక్రయించే నకిలీ వస్తువులు తదితర అంశాలపై ప్రత్యక్షంగా ప్రజలకు అవగాహన కల్పిస్తూ, పరోక్షంగా ప్రజలతో మమేకమవుతున్నారు. పోలీసులు నిత్యం చేపడుతున్న ఈ కార్యక్రమాలతో స్థానిక ప్రజలకు పోలీసుల పట్ల ఉండే భయాందోళన భావం పోయి, స్నేహపూర్వక భావం, గౌరవభావం ఏర్పడుతున్నాయి. పోలీసులు, ప్రజలతో మమేకమవడం శుభ సూచకమని, సమాజంలో జరుగుతున్న నేరాల నియంత్రణకు ఇది ఎంతో ఉపకరిస్తుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఇందులో భాగంగా పోలీస్ స్టేషన్లకు ఫిర్యాదులతో వచ్చే బాధితుల సమస్యలను. సకాలంలో పరిష్కరించడంలో కూడా పోలీసులు ప్రత్యేక చొరవ చూపిస్తే ప్రజలకు పోలీసుల పట్ల మరింత గౌరవభావం ఏర్పడుతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

## అరిల్లోవ అటవీ ప్రాంతంలో సీడ్ బాల్స్ నాటిన అటవీ శాఖ

గొలుగొండ, జూన్ 29 ప్రభాతవార్త



అటవీ అభివృద్ధికి నూతన విత్తన విధానంకు శ్రీకారం చుట్టింది. వివిధ రకాలైన విత్తనాలను బాల్స్‌గా తయారుచేసి అటవీ ప్రాంతంలో విడుస్తున్నారు. ఈ కాలంలో వర్షం పడిన విత్తనం పాడవ కుండా వాటిని శాస్త్రీయ పద్ధతిలో తయారు చేసి రూపంలో చల్లుతున్నా రు. సోమవారం నర్సీపట్నం రేంజ్ అటవీ శాఖ అధికారి రాజేష్ ఆధ్వర్యంలో ఎర్రవరం అటవీ ప్రాంతంలో సీట్ బాల్స్ నాటారు. స్థానిక పాఠశాల విద్యార్థులు ఈ కార్యక్రమంలో భాగస్వాములు చేసి వారిద్వారా నిర్దేశించిన ప్రదేశాల్లో ఈ సీడ్ బాల్స్‌ను నాటించారు. తక్కువ వర్షపాతం ఉన్న, అనుకూల ప్రతి కూల వాతావరణాలను ఈ విత్తనాలు తట్టుకొని మొలకెత్తుతాయని రేంజ్ అధికారి అన్నారు. అటవీ శాఖ సెక్షన్ అధికారి రామానుజులు, బీట్ అధికారి ఇందిరా, సుధారాణి ఎం.రమణ, స్థానిక పాఠశాల ఉపాధ్యా యులు కే.బాలచంద్రుడు, స్థానిక ప్రజా ప్రజాప్రతినిధులు వన సంరక్షణ సమితి సభ్యులు పాల్గొన్నారు.

## భలే వాడివి బాస్... పరిస్థితిని బట్టి మార్చావు వాయిస్..!

### ఏజెన్సీలో గనుల తవ్వకాలపై నేతల ప్రకటనలతో గిరిజనుల విస్మయం

కొయ్యూరు, జూన్ 29, ప్రభాతవార్త




అధికారం ఉన్నప్పుడు ఒకలా, అధికారం కోల్పోయి నప్పుడు మరోకల మాట్లాడే స్థానిక ఏజెన్సీ గిరిజన ప్రజా ప్రతినిధులు, నేతల ప్రకటనలపై స్థానిక గిరిజనులు విస్మయం వ్యక్తం చేస్తూ, ముక్కున వేలేసు కుంటున్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు బాక్సైట్ తదితర గనుల తవ్వకాలపై నోరు మెదపని ఆ పార్టీ ప్రజా ప్రతినిధులు నేడు కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండడంతో బాక్సైట్ తవ్వకాలకు వ్యతి రేక మంటూ ప్రకటనలు గుప్పించడంపై విస్మ యం వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఇదే సమయంలో వైసిపి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు బాక్సైట్ తవ్వకాల కు వ్యతిరేకమంటూ పత్రికా ప్రకటనలు గుప్పించిన టిడిపి నేతలు ఇప్పుడు నోరు మెదపక మెదపకపోవడంపై అంతే స్థాయి విమర్శలు వినబడుతున్నాయి. అంటే ఏ ఎండకు ఆ గొడుగులా మారుతున్న స్థానిక రాజకీయ పార్టీల నేతలు, గిరిజనుల చట్టాలను, హక్కులను కాపాడటంలో మాత్రం చిత్తశుద్ధితో లేరని, కేవలం వారి పార్టీల అధిష్టాన నేతల మెప్పు కోసమే ప్రకటనలు గుప్పిస్తున్నారని స్థానిక గిరిజనులు గుసగుసలాడుకుంటున్నారు.




## అక్రెడిటేషన్ జర్నలిస్ట్ పిల్లలకు వంద శాతం ఫీజు రాయితీ ఇస్తూ అల్లూరి జిల్లా కలెక్టర్ టి.నిశాంతి ఉత్తర్వులు జారీ

### హర్షం వ్యక్తం చేసిన జర్నలిస్టులు

పాడేరు,జూన్29, ప్రభాతవార్త



అల్లూరి జిల్లా కలెక్టర్ టి.నిశాంతిను సోమ వారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఏపీయూ డబ్ల్యూజే ప్రతినిధులు కలిసి జిల్లాలో పాత్రికేయుల సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. సమస్య లపై సానుకూలంగా స్పందించిన జిల్లా కలెక్టర్ నిశాంతి అక్రిడేషన్ కలిగిన జర్నలిస్టుల పిల్లల స్కూల్ ఫీజులో 100 శాతం రాయితీ కల్పిస్తూ స్పాట్‌లో ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా కలెక్టర్‌కు ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.నాగరాజు జిల్లాలో ఉన్న జర్నలిస్టుల సమస్యలు సమాచార సంబంధాలపై వివరించారు. జర్నలిస్టుల సంక్షేమానికి తనవంతుగా పూర్తిస్థాయిలో సహకారం అందిస్తానని జిల్లాలో పనిచేసే పాత్రికేయులు ప్రజలు గ్రామాలలో ఉన్న సమస్యలనే కాకుండా ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను కూడా ప్రచురించాలంటూ జర్నలిస్ట్‌లను కలెక్టర్‌ని శాంతి సూచించారు. అల్లూరి జిల్లా అక్రెడిటేషన్ కమిటీ సభ్యులు, వార్త సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ పి.సత్యనారాయణ, అక్రెడిటేషన్ కమిటీ సభ్యులు, ఆంధ్రజ్యోతి స్టాఫ్ రిపోర్టర్ బి.నాగరాజు, అక్రెడిటేషన్ కమిటీ సభ్యులు, ఏబీఎన్ స్టాఫ్ రిపోర్టర్ బి.హరిబాబు, ఏపీయూడబ్ల్యూజే ఎలాట్రానిక్ మీడియారాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎన్టీవీ స్టాఫ్ రిపోర్టర్ రాజేష్, ఏపీయూడబ్ల్యూజే పాడేరు ప్రెస్ క్లబ్ అధ్యక్షులు జ్ఞాన ప్రకాష్,డిపిఆర్ఓ కే.వెంకటరావు, కందర్ప సంధ్య రాణి తదితరులు పాల్గొన్నారు. అక్రెడిటేషన్ జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు విద్యా సంస్థల్లో వందశాతం ఫీజు రాయితీ కల్పిస్తూ జిల్లా కలెక్టర్ టి.నిశాంతి ఉత్తర్వులు జారీ చేయడం పట్ల అల్లూరి జిల్లాలో విధులు నిర్వహిస్తున్న పాత్రికేయులు హర్షం వ్యక్తం చేస్తూ కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలియ జేసారు. ఇది కేవలం ఏపీయూడబ్ల్యూజే నాయకత్వం కృషి ఫలితం అంటూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఆకలి తీర్చే ప్రత్యక్ష దైవం రైతు : జిల్లా కలెక్టర్ నిశాంతి.టి

హుకుంపేట, జూన్29, ప్రభాతవార్త



మన ఆకలి తీర్చే ప్రత్యక్ష దైవం రైతేనని జిల్లా కలెక్టర్ నిశాంతి పేర్కొన్నారు. సోమవారం ఏరు వాక పౌర్ణమి కార్యక్రమాన్ని హుకుంపేట మండ లం జీకే మండ గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వ ర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమా నికి జిల్లా కలెక్టర్ హాజరై తమ సందేశాన్ని రైతు సోదరులకు తెలియజేసారు. కలెక్టర్ వృద్ధులకు పూజ చేసి పొలం పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ మన ఆకలి తీర్చే ప్రత్యక్ష దైవం రైతేనని రైతు సుఖంగా ఉంటేనే దేశ అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. మనందరికీ అన్నము పెట్టి రైతు సోదరులందరికీ ఏరువాక పౌర్ణమి పండుగ శుభాకాంక్షలు తెలియజేసారు. తొలకరి పలకరింపుతో నాగలి పట్టి భూదేవిని పూజించి వ్యవసాయ పనులు ప్రారంభించే ఈ పవిత్రమైన పర్వదినం మీ జీవితాల్లో సరికొత్త వెలుగు నింపాలని కోరుకుంటున్నాను. రైతు సాంప్రదాయ వ్యవసాయ పద్ధతులతో పాటు మారు తున్న కాలానికి అనుగుణంగా ఆధునిక సాంకేతికతను అవలంబించి శాస్త్రవేత్తల సూచనలను పాటించాలని తెలిపారు. జిల్లా వ్యవసాయ అధికారి ఎస్‌బి ఎస్ నంద్, జిల్లా ఉద్యాన అధికారి కె.బి.కర్ణ, జిల్లా ప్రాజెక్ట్ మేనే జర్ (ఏపిసిఎన్ఎఫ్) భాస్కరరావు, పిడి, ఏపీఎంఎంఐపి రహీం, పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి కరుణాకర్, సహాయ వ్యవసాయ సంచాలకులు మోహన్‌రావు, ప్రభాకర్ మండల వ్యవసాయ అధికారి సుధాకర్, వివిధ మండల వ్యవసాయ అధికారులు, జిల్లా అధికారులు వ్యవసాయ గ్రామ సహాయకులు హాజరయ్యారు.

## రాజకీయాల్లో వ్యక్తిగత దూషణలు సరికాదు..

### ధర్మశ్రీపై విమర్శలను ఖండించిన వైఎస్సార్‌సీపీ

ఎలమంచిలి, జూన్ 29, ప్రభాతవార్త



రాజకీయాల్లో ప్రజాప్రతినిధులు హుందాగా వ్యవహ రించాలని, వ్యక్తిగత దూషణలకు దిగడం ఏమాత్రం తగదని వైఎస్సార్‌సీపీ నాయకుడు బొద్దపు ఎర్రయ్య దొర హితవు పలికారు. సోమవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం ధర్మశ్రీపై స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ చేసిన వ్యక్తిగత విమర్శలను ఆయన తీవ్రంగా ఖండించారు. పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకే ఇన్‌చార్జ్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో కార్యక్రమా లు నిర్వహిస్తున్నామన్నారు. సుమారు 30 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న కరణం ధర్మశ్రీ రెండుసార్లు ఎమ్మెల్యేగా, ప్రభుత్వ విప్‌గా బాధ్యతలు నిర్వర్తించిన సీనియర్ నాయకుడని గుర్తుచేశారు. మామిడివాడ గ్రామ నివాసిగా ఆయనకు ఎంతో చరిత్ర ఉందని, అలాంటి నేతపై విమర్శలు చేయడం మాను కోవాలని సూచిం చారు. జెడ్పీటీసీలు, ఇతర నాయకులు మాట్లాడుతూ గత వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో కరోనా కష్టకాలంలోనూ ప్రజలకు సంక్షేమ పథకాలు నిరంతరాయంగా అందాయని కొనియా డారు. అచ్యు తాపురం- అనకాపల్లి 100 అడుగుల రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు ధన రూపంలో పరిహారం ఇప్పించేందుకు మాజీ ఎమ్మెల్యే కన్నబాబు ఎంతో కృషి చేశారన్నారు. కానీ, ప్రస్తుత ప్రభుత్వం టీడీఎస్ రూపంలో చెల్లించడం వల్ల రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. జెడ్పీటీసీలు సేనాపతి సంధ్యారాము (యలమంచిలి), లాలం రాము (అచ్యుతాపురం), నర్మాల కుమార్ (మునగపాక), నాయకులు శంకర్రావు, శ్రీనుబాబులతో మండల పార్టీ అధ్యక్షులు కొల్లు త్రినాథ్, పిల్లా త్రినాధ్, కొఠారి కొండబాబు, కోన బుజ్జి, బెజవాడ నాగేశ్వరరావు, అర్రెపు గుప్తా, పాల్గొన్నారు.

## విద్యాహక్కు చట్టం నిబంధనలు అమలు చేయాలి

### మండల విద్యాశాఖాధికారి నరేష్

నక్కపల్లి, జూన్ 29, ప్రభాతవార్త



మండలంలో అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో విద్యా హక్కు నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయా లని స్థానిక మండలవిద్యాశాఖాధికారి కే.నరేష్ అన్నారు. సోమవారం మండలంలో చుక్కలవాని లక్ష్మీపురంలో ప్రేమ్ సాయి ప్రైవేట్ పాఠశాలను జిల్లా విద్యాశాఖాధికారి జి.అప్పా రావునాయుడు ఆదేశాల మేరకు ఫోర్ మేన్ కమిటి ఆకస్మికంగా సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల్లో విద్యాహక్కుచట్టం ద్వారా 25% విద్యార్థులకు ఉచితంగా ప్రవేశాలు కల్పించాలన్నారు. ఎక్కడా ప్రైవేట్ పాఠశాలల్లో అధికంగా ఫీజులు వసూలుచేయరాదని ఆయనతెలిపారు. ముఖ్యంగా పాఠశాలల ప్రవేశాల సమయంలో టెక్స్ట్ బుక్స్,నోట్స్‌లు, బ్యాగులు, బూట్లు వంటివి పాఠశాల ఆవరణలో విక్రయించ కూడదని ఆయన అన్నారు. విద్యాహక్కు చట్టం నిబంధనలను ప్రతీ పాఠశాలలో అమలుచేయాలని లేకుంటే కఠిన చర్యలు ఉంటాయని అన్నారు. ఈ ఫోర్‌మెన్ కమిటీలో మండల విద్యాశాఖాధికారి రుత్తల నాగన్నదొర, నోడల్ హెచ్.ఎమ్ వేమగిరి నూకరాజు, కమిటీ సభ్యులు వి.బాలాజీ ఉన్నారు.

## ఎల్లవరం...కసమిలో వరి విత్తనాలు పంపిణీ

గొలుగొండ, జూన్ 29, ప్రభాతవార్త



కొత్త ఎల్లవరం.. కసమి పంచాయతీలో సోమ వారం స్వర్ణ వార్డు సచివాలయంలో రైతులకు వరి విత్తనాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. క్లస్టర్ ఇంచార్జ్ కొల్లు రాంబాబు రైతులంతా వరి విత్తనాలు పంపిణీ చేశారు. సకాలంలో వరి నారుమడులు వేసు కోవాలన్నారు. సాగుకు అనుకూలంగా ప్రభుత్వం ముందస్తుగా అన్ని గ్రామ సచివాలయాల్లో విత్తనాలు సిద్ధం చేసిందని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసువాలన్నారు. ఈ కార్యక్రమంలో కసమి గ్రామ పార్టీ అధ్యక్షులు కవల మహేష్, అగ్రికల్చల్ అసిస్టెంట్ నరేష్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## హాస్టల్ నిర్వహణకై భవనాల పరిశీలన

నక్కపల్లి రూరల్/ అడ్డు రోడ్డు,ప్రభాతవార్త



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనితమ్మ ఆదేశాల మేరకు సోమవారం ఎంజీబీ బీసీడబ్ల్యూ బాలికల గురుకుల పాఠశాల మంజూరు ప్రతిపాదనలో భాగంగా, మండలంలోని రాజయ్యపేట గ్రామంలో జిల్లా కన్వీనర్, ప్రిన్సిపల్ రమా మోహిని రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటుకు అనువైన భవనాలను పరిశీలిం చారు. రాజయ్యపేట గ్రామంలోని తుఫాన్ భవనం, గోపాల్ భవనం భవనాలను సందర్శించి, విద్యార్థినుల భద్రత, వసతి సౌకర్యాలు, తాగునీరు, పారిశుద్ధ్యం, ఇతర మౌలిక వసతులపై స్థానిక కూటమి నాయకులతో చర్చించారు. గురుకుల పాఠశాల ఏర్పాటు కోసం అవసరమైన అన్ని విధాల సహకారాన్ని గ్రామ పంచాయతీ అందించాలని కోరారు.టీడీపీ గ్రామ శాఖ అధ్యక్షులు పిక్కి గంగరాజు, జనసేన పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు పిక్కి కోదండరావు (బుజ్జి), మాజీ ఉప సర్పంచ్ సిరిపల్లి అప్పలరాజు, నక్కపల్లి మండల జనసేన ప్రధాన కార్యదర్శి బొంది గుర్రన్న, అంగన్‌వాడీ టీచర్ పిక్కి పైడితల్లి, యూనిట్ ఇన్‌చార్జ్ వాసుపల్లి శివాజీ, ఐటీడీపీ జిల్లా కమిటీ సభ్యులు మదదా రాంబాబు, ఐటీడీపీ ప్రధాన కార్యదర్శి మైలపల్లి ప్రసాద్, పిక్కి జగ్గ, దైలపల్లి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## బయ్యవరం గ్రామంలో ఏరువాక కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కొణతాల



**కసింకోట, జూన్ 29, ప్రభాతవార్త**

వ్యవసాయానికి మన సంస్కృతిలో ఉన్న ప్రాధాన్యత ను చాటిచెబుతూ, రైతులకు శుభసూచకంగా నిర్వహించిన ఏరువాక పూర్ణిమి కార్యక్రమాన్ని మాజీ మంత్రి, అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ మండలంలోని బయ్యవరం గ్రామంలో పొలం బాట పట్టే పవిత్ర సమూహూర్తం సమయాన ఏరువాక కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, ఏపీ అర్బన్ డెవలప్మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులతో కలిసి సంప్రదాయ పద్ధతిలో భూమి పూజ కార్యక్రమంలో పాల్గొని ఎడ్లతో పొలాన్ని దున్ని, విత్తనాల జల్లి, కొత్త వ్యవసాయ సాగుకు శ్రీకారం చుట్టారు. రైతులు సుభిక్షంగా ఉండాలని, పంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షిస్తూ వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా వివిధ డిపార్టెంట్లు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను, వ్యవసాయ యంత్రాలు పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సబ్సిడీపై రైతులకు విత్తనాలు పంపిణీ చేపట్టారు. అనంతరం ఎమ్మెల్యే రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్య మంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రైతుల సంక్షేమం కోసం అనేక ప్రోత్సాహక కార్యక్రమాలు అమలు చేస్తున్నామని చెప్పారు. పోలవరం ఎడమ కాలువ పనులు ఈ ఏడాది డిసెంబర్ నాటికి పూర్తయ్యేలా చర్యలు జరుగుతున్నాయని, దీంతో జిల్లాలో సుమారు నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని పేర్కొన్నారు. అలాగే ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు ద్వారా మూడు జిల్లాల్లో మరో ఎనిమిది లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. రాష్ట్రంలో వ్యవసాయ రంగంలో వినూత్న సాంకేతికత ను ప్రోత్సహించేందుకు పైలట్ ప్రాజెక్టులను ప్రారంభించి, రైతులకు చేసి చూపించే విధానంలో ఆదర్శ వ్యవసాయ నమూనాలను అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, అధికారులు, రైతులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తాళ్లపాలెం గ్రామ సంత వద్ద ముందస్తు చర్యలు చేపట్టిన కశింకోట పోలీసులు

**కసింకోట, జూన్ 29, ప్రభాతవార్త**



మండలంలో తాళ్లపాలెం గ్రామంలో గతవారం వారాంతపు సంత సందర్భంగా భారీగా ట్రాఫిక్ రద్దీ ఏర్పడగా, కశింకోట పోలీసులు వెంటనే స్పందించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి, వాహనాల రాకపోకలు సజావుగా కొనసాగేలా చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో, సోమవారం వారాంతపు సంతను దృష్టిలో ఉంచుకుని కశింకోట సీఐ అల్లు స్వామి నాయుడు పర్యవేక్షణలో, ఎస్ఐ కొమ్మన లక్ష్మణరావు, పోలీసు సిబ్బంది ఉదయం 6.00 గంటల నుంచే తాళ్లపాలెం సంత ప్రాంతంలో ముందస్తు బందోబస్తు నిర్వహించారు. సంత ప్రాంతంలో ట్రాఫిక్ జామ్ ఏర్పడకుండా వాహనాల పార్కింగ్‌ను క్రమబద్ధీకరించడం, రహదారిపై ఎలాంటి ఆక్రమణలు జరగకుండా చూడడం, దుకాణాల యజమానులు, వ్యాపారులకు ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా వ్యాపారం నిర్వహించాలని కఠినంగా ఆదేశాలు జారీ చేశారు. అలాగే, భవిష్యత్తులో రోడ్డుపై వాహనాలను నిలిపివేయడం లేదా ట్రాఫిక్‌కు ఆటంకం కలిగించడం జరిగితే సంబంధిత దుకాణాల యజమానులు, వాహన యజమానులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీసుల ముందస్తు చర్యల ఫలితంగా తాళ్లపాలెం వారాంతపు సంతలో ఎలాంటి ట్రాఫిక్ జామ్ ఏర్పడకుండా, వాహనాల రాకపోకలు సజావుగా కొనసాగదానికి చర్యలు చేపట్టారు. ప్రజల భద్రత, ట్రాఫిక్ సౌలభ్యం దృష్ట్యా ఇలాంటి ముందస్తు చర్యలు నిరంతరం కొనసాగుతాయని కశింకోట పోలీసులు తెలిపారు. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ పోలీసు శాఖకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## బయ్యవరం చెరువు అభివృద్ధికి 50 లక్షలు నిధులు మంజూరు



### జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

**కసింకోట, జూన్ 29, ప్రభాతవార్త**

మండలంలోని బయ్యవరం చేరి చెరువు అభివృద్ధికి డ్వామా వాటర్ సెటర్ నిధుల ద్వారా 50లక్షలు మంజూరు చేసినట్లు జిల్లా కలెక్టర్ విజయకృష్ణ తెలిపారు. సోమవారం అనకాపల్లి ఎమ్మెల్యే వంతల రామకృష్ణతో కలిసి చెరువు అభివృద్ధి పనుల నిర్మాణం పనులు ప్రారంభించారు. చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్, సోలార్ లైట్లు, బెంచీలు, చిన్నారులు పార్కులు వాడుకోవడానికి ఆట వస్తువులు సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్ర మంలో తెలుగుదేశం అనకాపల్లి టిడిపి ఇన్చార్జి పీలా గోవింద సత్యనారాయణ, మల్ల సురేంద్ర, కాయల మురళీధర్, గొంతున శ్రీనివాసరావు, డ్వామా పిడి నిర్మలాదేవి, అడిషనల్ పీడీ మణికుమార్, ఎంపీడీవో సిహెచ్ చంద్రశేఖర రావు, ఏపీవో శ్రీనివాసరావు, ఇంజనీర్ కన్సల్టెంట్ కామేశ్వరరావు పాల్గొన్నారు.

## నూకాంబిక ఆలయంలో వేరువాక పౌర్ణమి వేడుకలు

### దేవస్థానం తరపున రైతులకు సత్కారం

**అనకాపల్లి జూన్ 29, ప్రభాతవార్త**



ఉత్తరాంధ్ర జిల్లాల ఇలవేల్పు రాష్ట్ర పండుగ గుర్తింపు పొందిన అనకాపల్లి గవరపాలెంలో వెలసిన శ్రీ నూకాంబిక అమ్మవారికి దేవస్థానంలో సోమవారం జేష్ట మాసం ఏరువాక పౌర్ణమి వేడు కలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అనకాపల్లి పట్టణానికి చెందిన రైతులను దేవస్థానం తరపున అమ్మవారి దర్శనం చేయించి, సత్కరించి ఆశీర్వాదం, పంచె కండువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ పీలా నాగశ్రీను (గొల్లబాబు), ఆలయ సహా కమిషనర్ యాళ్ళశ్రీధర్, దేవదాయ శాఖ బంగార ఆభరణాల తనిఖీ అధికారి పల్లవ రాజు ఆలయ ధర్మకర్తలు సూరే సతీష్, దాడి రవికుమార్ పొలిమేర స్వాతి ఆనంద్, మారిశెట్టి శంకర్రావు, కాండ్రేగుల రాజారావు, మజ్జి జానకి శ్రీనివాసరావు, కొడుకుల శ్రీకాంత్, వడ్డాది మంగ, కోనేటి సూర్యలక్ష్మి పైడ్రాజు, యర్రవరపు సంతోషి కుమారి నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్సార్సీపి నాయకులు నియోజవర్గ అభివృద్ధిని చూసి ఓర్వలేకే వ్యక్తిగత విమర్శలు

### ప్రజా క్షేత్రంలో తేల్చుకుందాం రండి కూటమి నాయకులు..



**ఎలమంచిలి, జూన్ 29, ప్రభాతవార్త**

పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో కూటమి నాయకులు పత్రికా సమావేశాన్ని ఏర్పాటు చేశారు.జనసేన పార్టీ పట్టణ పార్టీ అధ్యక్షుడు బొద్దపు శ్రీనివాసరావు మాట్లాడుతూ వైఎస్ఆర్సిపి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ ఆ పార్టీ నాయకులు ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్‌పై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని ఆరోపణలతో పాటు వ్యక్తిగత విమర్శలు చేయడం సరికాదని అన్నారు.కూటమి ప్రభుత్వంలో ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ ఎలమంచిలి నియోజకవర్గాన్ని ఒక ఆదర్శ నియోజక వర్గంగా తీర్చిదిద్దుతున్నారని గ్రామాలలో ప్రజలకు ఏమి కావాలో ఆ సదుపాయాలను ఏర్పాటు చేసే దిశగా అభివృద్ధి బాటలు వేస్తున్నారని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో పట్టణములో నడిబొడ్డున ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిని ఇరుకు సందుల్లోంచి లోపలికి తీసుకెళ్లారని అక్కడికి అత్యవసర పరిస్థితుల్లో వైద్యం కోసం వెళ్లాలంటే ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడిందని, అంతేకాకుండా గత వైసిపి ప్రభుత్వంలో తులసి నగర్‌లోని జగనన్న లేఔట్ వద్ద ఇళ్ల స్థలాలను వైసీపీ కార్యకర్తలకే పంచుకున్నారు గాని ప్రజలకు ఎక్కడ ఇవ్వలేదని అది అంతా మీకు కనబడలేదా అంటూ ప్రశ్నించారు. ఏది ఏమైనా వైసీపీ నాయకులు ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదని కూటమి నాయకులు, కార్యకర్తలు ఎవరూ చూస్తూ ఊరుకోరని అన్నారు. తెలుగుదేశం పార్టీ పట్టణ పార్టీ అధ్యక్షుడు గొర్లె శివన్నారాయణ (నానాజీ) మాట్లాడుతూ ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే ఇష్టం వచ్చినట్లు వైసిపి నాయకులు మాట్లాడుతున్నారని అన్నారు. మాజీ సర్పంచ్ జనసేన నాయకులు లవుడు లోవరాజు, బిజెపి నాయకులు నక్కా శివశంకర్, జనసేన నాయకులు కర్రి ఝాన్సీ, కోటారు శ్రీనివాసరావు, పల్లా సత్యనారాయణ, జయరాం, రాజు, నాగేంద్ర కూటమి కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతులు సమీకృత వ్యవసాయ విధానం పాటించాలి : వ్యవసాయ అధికారి ఉమాప్రసాద్

**నక్కపల్లి, ప్రభాతవార్త**



మండలంలోని ఉద్దండపురం గ్రామంలో క్షేత్ర స్థాయిలో రైతులకు ఆత్మ (వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ) సౌజన్యంతో రైతులకు సమీకృత వ్యవసాయ విధానంపై శిక్షణ నిర్వహించారు. సమీకృత వ్యవసాయ విధానం ద్వారా రైతులు పంటలతో పాటు పశుపోషణ, కోళ్ల పెంపకం, చేపల పెంపకం, తోటల సాగు వంటి అనుబంధ వ్యవసాయ కార్యకలాపాలను కలిపి నిర్వహించుకోవాలని వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్ సూచించారు. రైతులకు ఏడాది పొడవునా స్థిరమైన ఆదాయం లభిస్తుంది అన్నారు. ఈ విధానం వలన వ్యవసాయ వ్యర్థాలను సద్వినియోగం చేసుకోవచ్చు అని వివరిస్తూ ఒక ఉదాహరణగా పశువుల ఎరువును పంటలకు ఉపయోగించడం, పంట అవశేషాలను పశువులకు మేతగా వినియోగించడం ద్వారా ఖర్చులు తగ్గుతాయని తెలియజేశారు. నేల సారవంతత పెరుగుతుంది. పర్యావరణ సమతుల్యత కాపాడబడుతుంది. వాతావరణ మార్పులు లేదా మార్కెట్ ధరల మార్పుల వల్ల కలిగే నష్టాలను కూడా తగ్గించుకోవచ్చు అన్నారు. శిక్షణా కార్యక్రమం తరువాత రైతులకు ధృవీకరణ పత్రాలు అందజేశారు. ఈ క్షేత్ర శిక్షణా కార్యక్రమం ఆత్మ ఏటి ఎం.సత్యవేణి, శ్రీ ఏఈఓలు శ్రీనివాస్, సాయి, గ్రామ సహాయకులు ప్రశాంతి, శిరీష, ధనరాజ్, గ్రామ పెద్దలు రైతులు పాల్గొన్నారు.

## అనకాపల్లి అప్సర కళ్యాణి, అనకాపల్లి ఐకాన్ లిఖిత్



**అనకాపల్లి, జూన్ 29, ప్రభాతవార్త**

అనకాపల్లి కంటెంట్ క్రియేటర్స్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో అత్యంత ఘనంగా జరిగిన అనకాపల్లిఅప్సర, అనకాపల్లి ఐకాన్ ఈవెంట్ ఆధ్వర్యంలో అనకాపల్లి అప్సర -అవార్డు టీ కళ్యాణి కైవసం చేసుకోగా అనకాపల్లి ఐకాన్ అవార్డును అనకాపల్లికి చెందిన లిఖిత్ గెలుపొందారు. అనకాపల్లి అప్సర అవార్డు గెలుపొందిన మూలపేట గ్రామీణ ప్రాంతానికి చెందిన మహిళ కావడం విశేషం. ఈ పోటీలలో 60 మంది మహిళలు 40 మంది పురుషులు పాల్గొనగా వారిలో ప్రథమ ద్వితీయ తృతీయ స్థానాలకు విజేతలగా న్యాయ నిర్ణీతలు విశాఖకు చెందిన ఉదయగిరి చంద్రశేఖర్, అల్లాడ బాల సౌజన్యకుమారి ప్రకటించారు. అప్సర విభాగంలో ద్వితీయ, తృతీయ స్థానాలకు హాసిని, సౌజన్య, ఐకాన్ విభాగంలో హరి సాయి ద్వితీయ, తృతీయ స్థానాలను దక్కించుకున్నారు. కార్యక్రమానికి జనసేన పార్టీ అనకాపల్లి ఇంచార్జ్ భీమరశెట్టి రాంకీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు, అభ్యర్థుల ర్యాంప్ వాక్, చిన్నారుల ర్యాంప్ వాక్‌ను ఆయన ఆసక్తిగా వీక్షించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన చిన్నారులు, కూచిపూడి నృత్య కళాకారులకు సర్టిఫికెట్లను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా రాంకీ మాట్లాడుతూ, యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి వారికి ప్రోత్సాహం అందించే ఇటువంటి కార్యక్రమాలు సమాజానికి ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. అనకాపల్లి ఇన్‌ఫ్లుయెన్సర్స్ అండ్ కంటెంట్ క్రియేటర్స్‌ను అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయవంతమైన కార్యక్రమాలను నిర్వహించి యువతకు ప్రేరణగా నిలవాలని ఆకాంక్షించారు. మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ అనకాపల్లి అప్సర కార్యక్రమంలో పాల్గొన్న అభ్యర్థులను అభినందించారు. కూచిపూడి కళాకారులను సత్కరించారు. భవిష్యత్తులో నిర్వాహకులు మరింత భారీ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా బాడీ బిల్డింగ్, మ్యాజిక్ షో ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఈవెంట్ కన్వీనర్ మల్ల వంశి సుహాస్, అభి, మద్దాల క్రాంతి కుమార్ మద్దాల వంశీ సాయికుమార్, చరణ్, వై భార్గవ్, బి ప్రియాంక, జి ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

## ఈవీఎం గోడౌన్ వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

### జిల్లా జాయింట్ కలెక్టర్ సౌర్యమాన్ పటేల్

**అనకాపల్లి, జూన్ 29, ప్రభాతవార్త**



ఈవీఎం గోడౌన్ వద్ద సిబ్బంది అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సౌర్యమాన్ పటేల్ సిబ్బందిని ఆదేశించారు. జిల్లా ఎస్పీ కార్యాలయం వద్ద ఉన్న ఈవీఎం గోడౌన్‌ను తనిఖీల్లో భాగంగా సోమవారం ఉదయం రెవిన్యూ డివిజనల్ అధికారి ఆయేషాతో పాటు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి జిల్లా జాయింట్ కలెక్టర్ సౌర్యమాన్ పటేల్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన అక్కడ పరిస్థితులను గమనించారు. సీసీ కెమెరాల పని తీరును, ప్రధాన ద్వారానికి ఉన్న సీళ్లను పరిశీలించారు. తాళాలు తీయించి గోడౌన్ లోపల భాగంలో కూడా పర్యటించారు. అక్కడి పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించారు. భద్రతా ప్రమాణాలపై అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. తనిఖీ క్రమంలో లాగ్ బుక్‌లో సంతకం చేశారు. భద్రతా ప్రమాణాలు, లాగ్ బుక్ నిర్వహణ ఇతర అంశాలపై నేతలతో మాట్లాడారు. భద్రపరిచిన ఈవీఎంల స్థితిగతులను జాయింట్ కలెక్టర్‌కు ఎన్నికల విభాగం అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి ఆర్డీవో ఆయేషా, ఎలక్షన్ సెల్ సూపరిండెంట్ వాసు నాయుడు, టిడిపి నుండి బి.శ్రీనివాసరావు, ఏఏపి నుండి కే హరినాథ్ బాబు, జేఎస్పీ నుండి డి. వేణుగోపాలకృష్ణ, స్థానిక రెవెన్యూ, ఎలక్షన్ సెల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఏరువాక పౌర్ణమి కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్, ప్రగడ నాగేశ్వరరావు



**ఎలమంచిలి, జూన్ 29, ప్రభాతవార్త**

నియోజకవర్గం రాంబిల్లి మండలం మామిడి వాడ గ్రామంలో ఏరువాక పౌర్ణమి కార్యక్రమంలో పాల్గొన్న సుందరపు విజయ కుమార్, రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ రైతులు సమక్షంలో పోలంలో కాడి ఏద్దులతో దుక్కి దున్ని విత్తనాలు చల్లీ ఏద్దులకు పూజ చేసి భూమి పూజ చేసి ఏరువాక పౌర్ణమి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి ప్రగడ నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతులు రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలు వినియోగించుకోవాలని కోరారు. ఎంఎల్ఏ సుందరపు విజయ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఎరువులు పంపిణీ కోసం ఏర్పాటు చేసిన ఏపిఏఐఎంఎస్ యాప్ ద్వారా కేటాయించబడిన యూరియా,డి.ఏ.పి.తీసుకోవాలని, ప్రతి రైతు తనకు ఉన్న భూమిలో కొంత భాగం ప్రకృతి వ్యవసాయం చేయాలని కోరారు. అనంతరం రైతులకు ఎరువులు,సబ్సిడీపై వరి విత్తనాలు అందించారు. స్థానిక ఇన్చార్జ్ ఏడిఏ సుమంత మాట్లాడుతూ డివిజన్‌లో అన్ని ఆర్.ఎస్.కె ల్లో రైతు లకు విత్తనాలు. ఎరువులు ఇవ్వడానికి సిద్ధంగా ఉంచమని తెలిపారు. కావలసిన రైతులు ఆధార్ కార్డు, పట్టాదార్ పాస్ బుక్,మొబైల్ తీసుకొని ఆర్ఎస్‌కె సిబ్బందిని కలిసి తీసుకోవాలని తెలిపారు. నాలుగు మండలాల వ్యవసాయ అధికారులు సుమంత, మోహన్ రావు, శంకర్ గోవింద్, జ్యోత్స్న కుమారి, ప్రజా ప్రతినిధులు- యలమంచిలి మార్కెట్ కమిటీ చైర్మన్. లోవకుమారి, ఎంపీటీసీ సన్యాసి రావు, ఎంపీపీ రాజాన శేషు, ధిన్‌బాబు. నూకన్న దోర, అన్నం బాబ్జీ, బొద్దపు శ్రీను, వడ్డీ కాసులు. గొర్లె నానాజీ, బద్ది మహేష్, పిఏసిఎస్ చైర్మన్ గోపి, అగ్రికల్చర్ మార్కెట్ వైస్ చైర్మన్ బాబురావు, తెలుగుదేశం పార్టీ ప్రెసిడెంట్ నాయుడు గ్రామ రైతులు పాల్గొన్నారు.

## జనసేన పార్టీ సంస్థాగత నిర్మాణంలో ఉద్యమకారులకే ప్రాధాన్యం

### అర్హత, సేవాభావమే నాయకత్వానికి ప్రమాణం



**అనకాపల్లి, జూన్ 29, ప్రభాతవార్త**

జనసేన పార్టీ ఆవిర్భావం నుంచి నైతిక విలువలతో కూడిన రాజకీయ వ్యవస్థను నిర్మించా లని లక్ష్యంతో పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ముందుకు సాగుతున్నారని మాజీ మంత్రి స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ అన్నారు. స్థానిక విజయ రెసిడెన్సీ హోటల్‌లో సోమవారం జనసేన పార్టీ సంస్థాగత నిర్మాణ సమాచార సేకరణ కమిటీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ పాల్గొని, అనకాపల్లి పార్లమెంటరీ నియోజకవర్గానికి పార్టీ సమాచారం సేకరణ కమిటీ పరిశీలకులుగా నియమితులైన మాజీ శాసనసభ్యులు పెండెం దొరబాబుని ఘనంగా స్వాగతించి మీడియాకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ, జనసేన పార్టీ ఆవిర్భావం నుంచే నైతిక విలువలు, పారదర్శకతతో కూడిన రాజకీయ వ్యవస్థను నిర్మించాలనే లక్ష్యంతో పార్టీ అధ్యక్షులు కొణిదెల పవన్ కళ్యాణ్ ముందుకు సాగుతున్నారని తెలిపారు. అదే దిశగా పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా సమాచారం సేకరణతో పాటు నాయకత్వ ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉద్యమం నుంచి ఎదిగిన సాధకులకు అవకాశాలు కల్పిస్తూ, రాష్ట్రానికి సమర్థవంతమైన నాయకత్వాన్ని అందించాలనే ఉద్దేశంతో ప్రతి జిల్లాకు సీనియర్ నాయకులను పరిశీలకులుగా నియమించామని చెప్పారు. అనకాపల్లి పార్లమెంటరీ నియోజకవర్గానికి మాజీ ఎమ్మెల్యే, సీనియర్ నాయకులు పెండెం దొరబాబుని పరిశీలకులుగా నియమించినట్లు వెల్లడించారు. వారి ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు సంస్థాగత ఎంపిక ప్రక్రియ నిర్వహించబడుతుందని, పార్టీ సభ్యత్వం కలిగిన వారికే ఈ ప్రక్రియలో పాల్గొనే అవకాశం ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా 2014లో పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం నిరంతరం శ్రమించిన కార్యకర్తలు, ఉద్యమకారులు, సాధకులకే ప్రాధాన్యం ఇవ్వబడుతుందని స్పష్టం చేశారు. అందిన దరఖాస్తులను పరిశీలించి, స్క్రూటినీ అనంతరం పార్టీ హైకమాండ్‌కు పంపిస్తామని వివరించారు. ప్రతి జిల్లాలో 28 మంది సభ్యులతో కూడిన కమిటీతో పాటు కేంద్ర కార్యాలయం నుంచి ప్రత్యేక సపోర్ట్ టీమ్ కూడా ఈ ప్రక్రియలో భాగస్వామ్యం అవుతుందని తెలిపారు. వ్యక్తిగత సిఫార్సులు, స్వార్థపూరిత నిర్ణయాలకు ఎలాంటి అవకాశం లేకుండా పూర్తిగా పారదర్శకంగా ఎంపికలు జరుగుతాయని పేర్కొన్నారు. చివరి నిర్ణయం పార్టీ అధ్యక్షులు కొణిదెల పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ తీసుకుంటుందని, కార్యకర్తలు ఎలాంటి అపోహలకు తావివ్వకుండా పార్టీ నిర్ణయాలను గౌరవించి సంస్థాగత బలోపేతానికి సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో చోడవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ పివిఎస్ రాజు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రామాలయ అభివృద్ధికి 50 వేల రూపాయలు విరాళం

**అగనంపూడి ప్రభాత వార్త**



పెద్దమడక సీతారామాంజనేయ రామాలయ అభివృద్ధి కోసం సివిల్ కాంట్రాక్టర్ మాదుగుల హరిబాబు 50 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు వారిని సన్మానం చేశారు. ఆలయ అభివృద్ధికి దాతలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ చైర్మన్ విందుల నారాయణరావు, మదుగుల నర్సింగరావు, విందుల చిరురాజు, అప్పలరాజు, సన్నీ తదితరులు పాల్గొన్నారు.




## స్మార్ట్ పోలీసింగ్, ప్రజారక్షణే ధ్యేయం



**అనకాపల్లి, జూన్ 29, ప్రభాతవార్త**

జిల్లాలో స్మార్ట్ పోలీసింగ్‌ను బలోపేతం చేయ డానికి, ప్రజల భద్రతను మరింత మెరుగుపరచడానికి పరవాడ మండలం, జవహర్లాల్ నెహ్రూ ఫార్మా సిటీలోని ప్రముఖ ఔషధ సంస్థ గ్లాండ్ ఫార్మా కంపెనీ తమ సామాజిక బాధ్యత కింద జిల్లా పోలీసు శాఖకు అండగా నిలిచింది. ఇందులో భాగంగా రూ. 5,98,850 విలువైన 35 సిపి ప్లస్ అత్యాధునిక బాడీ వార్న్ కెమెరాలను అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హాకి జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ, పోలీస్ విధుల్లో పారదర్శకతను పెంచడానికి, శాంతిభద్రతల పరిరక్షణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవడానికి ఈ బాడీ వార్న్ కెమెరాలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. గ్లాండ్ ఫార్మా కంపెనీ సమాజ శ్రేయస్సును కాంక్షిస్తూ, పోలీసు శాఖకు ఈ విధమైన వినూత్న సాంకేతిక పరికరాలను విరాళంగా అందించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేస్తూ కంపెనీ యాజమాన్యానికి, ప్రతినిధులకు ప్రత్యేక కృతజ్ఞతలు, అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్లాండ్ ఫార్మా కంపెనీ ప్రతినిధులు ఎస్.శ్యామ్ సుందర్ (ప్లాంట్ హెడ్), కె.గణేష్ కుమార్ (ఏజీఎం), సి.హెచ్. జగన్నాధాచార్యులు (మేనేజర్ హెచ్ ఆర్) బి.మోహన రావు (పరవాడ సబ్ డివిజన్ ఇంచార్జ్ డీఎస్పీ), భాస్కర్ రావు (పరవాడ ఇన్స్పెక్టర్), శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పనితీరును మరింత మెరుగుపరచడానికి ఇటువంటి సిఎస్ఆర్ కార్యక్రమాలు ఎంతో స్ఫూర్తిదాయకమని, భవిష్యత్తులో కూడా ఇలాంటి సహకారం కొనసాగుతుందని ఆశిస్తున్నట్లు అధికారులు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి

### ఎంవిఐ కాశీ విశ్వనాథం రూరల్ ఎస్సై ఉపేంద్ర

**ఎలమంచిలి, జూన్ 29, ప్రభాతవార్త**



ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలని మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ కాశీ విశ్వనాథం తెలిపారు. రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సోమవారం ద్విచక్ర వాహనాలను మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ కాశి విశ్వనాథం, రూరల్ ఎస్సై ఉపేంద్ర సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్మెట్ ధరించిన వారికి అపరాధ రుసుముతో పాటు వాహనాలను నడిపేటప్పుడు హెల్మెట్లను ధరించాలని, అది మీ భద్రతకే అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రూరల్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఏరువాక పౌర్ణమి సందర్భంగా నాగలి పట్టిన రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు



**ఎస్ రాయవరం, జూన్ 29, ప్రభాతవార్త**

మండలంలో ధర్మవరం అగ్రహారం గ్రామంలో ఏరువాక పౌర్ణమి సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. అప్పలరాజు ధర్మవరం అగ్రహారం గ్రామంలో రైతులతో కలిసి నాగలి పట్టి, సాంప్రదాయ పద్ధతిలో భూమి పూజ చేసి, ఎడ్లతో సాగుకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ.. రైతాంగానికి ఏరువాక శుభాకాంక్షలు తెలియజేశారు. వ్యవసాయ రంగం బాగుంటేనే దేశ సుభిక్షంగా ఉంటుందని తెలిపారు. ఈ సంవత్సరం వర్షాలు సమృద్ధిగా పడి, పాడి, పంటలు పొంగి పొర్లాలలని ఆకాంక్షించారు. దేశంలో అందరికీ అన్నం పెట్టే రైతన్న నేడు తీవ్ర మైన సంక్షోభంలో ఉన్నారని, రైతులను, వ్యవసాయ రంగాన్ని ప్రభుత్వాలు ఆదుకోవాలనిఅయన కోరారు. ప్రభుత్వాలు రైతులు పండిస్తున్న పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, దానికి చట్టం చేయాలని, రైతు వ్యవసాయ రుణాలు మాఫీ చేయాలని, రుణ విముక్తి చట్టం చేయాలని, ఎంఎస్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో యాప్ ద్వారా ఎరువులు సరఫరా చేసే విధానాన్ని రద్దు చేయాలని నేరుగా ప్రభుత్వమే రైతులు కోరినప్పుడు సరిపడా ఎరువులు కోపరేటీవ్ సొసైటీలు, రైతు సేవా కేంద్రాలు ద్వారా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. జులై 3,4,5 తేదీలలో ఏలూరులో జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర 23వ మహాసభలు జయప్రదం చేయాలని జిల్లా రైతాంగాన్ని అయన కోరారు. ఈ కార్యక్రమంలో పి.సాయికుమార్, జీ.భూపతి,ఏ.సత్తిబాబు, ఎస్.పవన్, సీ.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## పి.జి.ఆర్.ఎస్.కు ఆరు దరఖాస్తు

**ఎస్.రాయవరం, జూన్, 29 ప్రభాతవార్త**



మండలంలో అడ్డు రోడ్డు రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక రెవిన్యూ క్లినిక్‌లో ఆరు అర్జీలు వచ్చాయని డిప్యూటీ తహశీల్దార్ నానాజీ తెలియజేశారు. పలు సమస్యలపై ఈ అర్జీలు రావడం జరిగిందని, వీటిని స్వీకరించి, ఆయా శాఖ ఉన్నతాధికారులకు పంపడం జరుగుతుందని ఆయన అన్నారు.

## అక్రమంగా మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులు అరెస్టు

### 30 మద్యం సీసాలు స్వాధీనం

**అనకాపల్లి, జూన్ 29, ప్రభాతవార్త**

అనకాపల్లి టౌన్ పోలీస్ స్టేషన్ కు చెందిన పోలీసు సిబ్బంది విజిబుల్ పోలీసింగ్ డ్యూటీలో భాగంగా తనిఖీల్లో ఎటువంటి లైసెన్స్ ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పట్టుకొని మొత్తం 30 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. స్థానిక రాము నాయుడు కాలనీ, అనకాపల్లి వద్ద జామి దళిరాజు అనే వ్యక్తి ఆదివారం రాత్రి ఎటువంటి లైసెన్స్, ప్రభుత్వ అనుమతి లేకుండా 20 మద్యం సీసాలు తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేశారు. ఈ కేసును ఎస్.ఐ ఏ.వెంకటేశ్వరరావు దర్యాప్తు చేస్తున్నారు. సోమవారం ఉదయం సుంకరమెట్ట జంక్షన్ వద్ద అక్కిరెడ్డి వెంకట అప్పారావు అనే వ్యక్తి ఎటువంటి లైసెన్స్ ప్రభుత్వ అనుమతి లేకుండా 10 మద్యం సీసాలు తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేశారు. ఈ కేసును ఎస్.ఐ. శ్రీనివాసరావు దర్యాప్తు చేస్తున్నారు. అక్రమంగా మద్యం రవాణా, నిల్వ విక్రయం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రజలు ఇలాంటి అక్రమ కార్యకలాపాల గురించి సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్-112కు ఫోన్తే చేసి సమాచారం తెలియజేయాలని పట్టణ సీఐ జి.ప్రేమ్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

## పేటలో జనసేన

### అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకులు దొరబాబుకు జనసేన శ్రేణుల ఘన స్వాగతం -నియోజకవర్గ ఇంచార్జ్ గెడ్డం బుజ్జి ఆదేశాలతో దొరబాబును మర్యాదపూర్వకంగా కలిసిన జనసైనికులు

**పాయకరావుపేట జూన్ 29 ప్రభాతవార్త**



రాష్ట్ర జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకులుగా నియమితులైన పెండెం దొరబాబు తొలిసారిగా అనకాపల్లి జిల్లాకు విచ్చేస్తున్న సందర్భంగా ఆ పార్టీ పాయకరావుపేట అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జ్ గెడ్డం బుజ్జి ఆదేశాల మేరకు నామవరం పిఏసిఎస్ చైర్‌పర్సన్ గెడ్డం కన్నబాబు ఆధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు సోమవారం ఇక్కడి తాండవ జంక్షన్ వద్ద ఆయనకు ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా పిఏస్ చైర్ పర్సన్ కన్నబాబు సారథ్యంలో అసెంబ్లీ నియోజకవర్గ జనసేన పార్టీ మండల శాఖల అధ్యక్షులు సహా ఆ పార్టీ సీనియర్ నాయకులు,వీర మహిళలు, జనసైనికులు కార్యకర్తలు పలువురు అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకులుగా నూతనంగా నియమితులైన దొరబాబును మర్యాదపూర్వకంగా కలిసిన మీదట ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జనసేన సీనియర్ నాయకులు అనిశెట్టి సూర్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి దేవవరపు రఘు, జిల్లా కార్యదర్శి పల్లి దుర్గారావు, పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం, కోటవురట్ల మండల పార్టీ అధ్యక్షులు యగదాసు నానాజీ,వెలగా సుధాకర్,పప్పల శివ, సింగంపల్లి శ్రీను, సీనియర్ నాయకులు జగ్గన్నదొర పట్టణ శేఖఅధ్యక్షులు ఆచంట దొర,రాష్ట్ర మత్స్యకార విభాగశీ కార్యదర్శి సంజీవ్,నక్కపల్లి మండల పార్టీ ఉపాధ్యక్షులు నల్లల రత్నాజి,మండల ప్రధాన కార్యదర్శి తుమ్మల శ్యామ్, పాల్తేరు ఎంపీటీసీ మాకినీడు చిట్టిబాబు, సీతారాంపురం సర్పంచ్ పి.కృష్ణ, ఆ పార్టీ నాయకులు దాసరి భాస్కర్,భిశెట్టి రమణ,దేవవరపు శివరాజు, హరికృష్ణ, తుమ్మల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# అన్నం పరబ్రహ్మ స్వరూపం



విశాఖపట్నం జూన్ 29 ప్రభాతవార్త

ఆరిలోవ సెక్టార్ 2లో వేంచేసి ఉన్న శ్రీ బాలా త్రిపుర సుందరి దేవి సహిత మల్లేశ్వర స్వామి వారి దేవాలయం 35 వార్షిక కళ్యాణోత్సవాలు పూర్ణాహుతితో ఘనంగా ముగిశాయి. ముగింపు ఉత్సవంలో భాగంగా అన్న ప్రసాద వితరణ (నారాయణ సేవ) నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు మరియు ఆలయ గౌరవ సలహాదారు ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్ పాల్గొన్నారు. అతిథులను ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త ఎం కృష్ణంరాజు ఆలయ సాంప్రదాయ ప్రకారం స్వాగతం పలికి స్వామివారి దర్శన సౌభాగ్యం కల్పించి పేరు గోత్రనామాలతో అర్చన నిర్వహించి అతిథులను స్వామివారి శేష వస్త్రంతో ఘనంగా సత్కరించారు. ఆలయం వద్ద నిర్వహించిన (నారాయణసేవ) అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని వెలగపూడి రామకృష్ణ బాబు ప్రారంభించారు. అన్నం పరబ్రహ్మ స్వరూపమని అన్నప్రసాదాన్ని వృథా చేయకూడదని విచ్చేసిన వారందరికీ రామకృష్ణ బాబు తెలియజేశారు. ఆలయం స్థాపించిన నుండి నేటి వరకు ఆలయ కమిటీ సభ్యులు నిస్వార్థంగా చేస్తున్న ఆలయ వార్షికోత్సవాలను, ఆధ్యాత్మిక ఉత్సవాలను ప్రశంసించారు. 2000 మందికి పైగా భక్తులు స్థానికులు పరిసర ప్రాంత వాసులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. విచ్చేసిన వారందరికీ తీర్థ ప్రసాదములను అందజేసి దాతలను తగు రీతిన సత్కరించారు. ఈ కార్యక్రమం లో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# మద్దిగ్రామంలో పండగ వాతావరణంలో ఏరువాక పౌర్ణమి



పద్మనాభం, జూన్ 29, ప్రభాతవార్త :

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఏరువాక పౌర్ణమి కార్యక్రమంను మండలంలో మద్దిగ్రామం లో వ్యవసాయ శాఖ ఎడిఎ విజయప్రసాదు ఆధ్వ ర్యంలో సోమవారం రైతులు పండగ వాతావరణం లో జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు హాజరై ముందుగా భూతల్లికి స్థానిక అర్చకులు మంత్రాలతో ప్రత్యేక పూజలు చేసి నవధాన్యాలను చల్లారు. అనంతరం పూల మాలలతో సిద్దం చేసిన రైతులతో పాటు నాగలి, ముల్లకర్రను చేతపట్టి, తలపాగ చుట్టి రైతలా మారి నారుమడిని కలియదున్నారు. అక్కడే ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యమని అన్నారు. రైతులు ఆధునికి వ్యవసాయ పద్ధతులను అనుసరించి ఆధాయాలను పెంచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు రమణ, సింహాచలం బోర్డు సభ్యులు దాము, లీలావతి, సత్యనారాయణ, జెడ్పీటీసీ వెంకటప్పడు, గంగరాజు, నాగు, నందీష్, మహేష, బుచ్చిపంతులు, పైల శ్రీను, ప్రసాదు, రైతులు పాల్గొన్నారు.

# అభివృద్ధిని అడ్డుకోవడమే వైకాపా ఎజెండా

## గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు



గాజువాక,జూన్ 29,ప్రభాతవార్త :

కూటమి ప్రభుత్వ హయాంలో రాష్ట్రానికి పెట్టుబడులు వరదలా వస్తుంటే ఆ అభివృద్ధిని అడ్డుకోవడమే జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైకాపా ఎజెండాగా పెట్టుకుందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ధ్వజమెత్తారు. గాజువాక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ అధ్యక్షతన సోమవారం వార్డుల అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌ఛార్జిల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి నియోజకవర్గ పరిశీలకుడు కిడారి శ్రావణ్‌తో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. రెండేళ్ల కూటమి పాలనలో సంక్షేమం, అభివృద్ధి సమాంతరంగా సాగుతున్నాయన్నారు. ముఖ్యంగా ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ, 'మై టీడీపీ' యాప్ పనుల్లో కార్యకర్తలు, నాయకులు చురుగ్గా పాల్గొనాలన్నారు. ఆర్భాటాలకు పోకుండా క్రమశిక్షణతో పనిచేసే వారికే పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందని, నిబద్ధత గల వారికి అధిష్టానం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అనంతలక్ష్మి, పులి వెంకటరమణారెడ్డి, చెరుకూరి నాగేశ్వరరావు, మొల్లి పెంట్రాజు, గొల్లవిల్లి భవాని, గోమాడ వాసు, కర్రి దశయేంద్ర, బలగ బాలు నాయుడు, ఉరుకూటి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

# గోపాలపట్నం పోలీస్ స్టేషన్ సందర్శించిన సిపి



విశాఖపట్నం, జూన్ 29 ప్రభాతవార్త :

నగరంలో లా అండ్ ఆర్డర్ అదుపు లో ఉంచుతూ నగరం మొత్తం ప్రశాం తముగా ఉండేలా క్రైమ్, లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్లు, పలు ఏ.సి.పి సబ్ డివిజన్ల నందు సిపి ఆకస్మిక సందర్శన చేపడుతున్న విషయం విధితమే. ఇందులో భాగంగా సోమవారం గోపాలపట్నం పోలీసు స్టేషన్ (లా అండ్ ఆర్డర్)ను నగర పోలీసు కమీషనర్ డా.శంఖబ్రత బాగ్చి ఆకస్మికంగా సందర్శించారు. సాయంత్రం గోపాలపట్నం పోలీసు స్టేషన్ ను సందర్శించిన సిపి అధికారులు, సిబ్బంది విధులను సమీక్షించి, స్టేషన్ పరిధిలో గల సమస్యలు, కేసుల రికార్డులు అన్నీ సక్రమముగా ఉన్నదీ లేనిదీ పరిశీలించి, మరుగుదొడ్ల శుభ్రతను, స్టేషన్ పరిసరాలను పరిశీలించి, సంబంధిత అధికారులకు తగు ఆదేశాలను జారీ చేశారు.

# సిపిఎం నాయకులు పి.శంకర్రావుకి మాతృ వియోగం

## సావిత్రమ్మ దేహాన్ని మెడికల్ కాలేజీకు అందజేత

విశాఖపట్నం, జూన్ 29 ప్రభాత వార్త :

సిపిఎం ఆరిలోవ సీనియర్ నాయకులు, మద్దిలపాలెం జోన్ కమిటీ సభ్యులు పి శంకర్రావు తల్లి సావిత్రమ్మ ఆదివారం సాయంత్రం 6 గంటలకు గుండుపోటుతో మరణించారు. ఆమె మరణానికి సిపిఎం విశాఖ జిల్లా కమిటీ, మద్దిలపాలెం జోన్ కమిటీ తరఫున సంతాపాన్ని, శంకర్రావు కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సోమవారం ఆరిలోవ 40 గజాల వద్ద ఉన్న శంకర్రావు ఇంటి వద్ద సావిత్రమ్మ మృతదేహాన్ని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డాక్టర్ బి గంగారావు, ఆర్కే ఎస్ వి కుమార్, పి మణి, బీ జగన్, మద్దిలపాలెం జోన్ కార్యదర్శి వీ కృష్ణారావు, కంచరపాలెం జోన్ కార్యదర్శి మాజీ కార్పొరేటర్ బొట్టా ఈశ్వరమ్మ, సిపిఎం నాయకులు అప్పలరాజు, వి నరేంద్ర కుమార్, డి కొండమ్మ, భారతి, కుమారి, సీనియర్ నాయకులు అనపర్తి అప్పారావు, ఇతర ప్రజా సంఘాల నాయకులు సావిత్రమ్మ భౌతిక దేహానికి శ్రద్ధాంజలి ఘటించారు.

సంతాప సభలో డాక్టర్ బి గంగారావు మాట్లాడుతూ సావిత్రమ్మ కు ఒక కుమార్తె ఒక కుమారుడు. కుమారుడు శంకరరావు సిపిఎం పార్టీలో సుదీర్ఘకాలం కార్యకర్తగా పనిచేస్తూ ప్రజా ఉద్యమాలకు నాయకత్వం వహిస్తున్నారని అన్నారు. ప్రజా సేవకు శంకరరావుని అందించడంతోపాటు తమ కోడలు పిల్లలు సైతం సమాజానికి ఉపయోగపడుతున్నారని గుర్తు చేశారు. మరణానంతరం ఆమె భౌతిక దేహాన్ని వైద్య విద్యార్థుల పరిశోధన కోసం ఆంధ్ర మెడికల్ కాలేజ్ అనాటమీకి జ్యోతిబసు దేహ దాన



ప్రోత్సాహక సంస్థ ద్వారా అందజేయడం చాలా మంచి పరిణామం అన్నారు. సాంప్రదాయాలు, కులం కట్టుబాట్లు నడుస్తున్న ఈ నేపథ్యంలో భౌతిక దేహాన్ని మెడికల్ కాలేజీకి ఇచ్చినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సావిత్రమ్మ భౌతిక దేహాన్ని సిపిఐ విశాఖ జిల్లా కార్యదర్శి ఎస్ కే రహమాన్, ఆరిలోవ తెలుగుదేశం సీనియర్ నాయకులు మాజీ కార్పొరేటర్ ఒమ్మి సన్యాసిరావు, కే.సత్యనారాయణ, సన్యాసిరావు, బాలరాజు, వాకర్స్ చేసిన సభ్యులు, బంధువులు పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సంతాప సభ అనంతరం ఆరిలోవ నుండి కేజిహెచ్ అంతిమయాత్ర జరిగింది. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కే లోకనాథం, పరామర్శించారు. సావిత్రమ్మకు శ్రద్ధాంజలి ఘటిస్తూ, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు

# మద్యంపై ఉన్న శ్రద్ధ.. స్టీల్‌ప్లాంట్, వాలంటీర్లపై లేదా?

## కూటమి ప్రభుత్వంపై వైకాపా నేత మార్డుపూడి పరదేశి ధ్వజం

గాజువాక, జూన్ 29, ప్రభాతవార్త :

విశాఖలో పర్యాటకం పేరుతో మద్యం సంస్కృతిని ప్రోత్స హిస్తున్న కూటమి ప్రభుత్వం.. ఉపాధి కోల్పోయిన కార్మికులు, వాలంటీర్ల సమస్యలను గాలికొదిలేసిందని వైకాపా ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మార్డుపూడి పరదేశి విమర్శించారు. సోమవారం పెద్దగంట్యాడలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బాధ్యతాయుత పదవుల్లో ఉన్న ఎంపీ భరత్, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస రావు మద్యపానాన్ని సమర్థిస్తూ మాట్లాడటం సిగ్గుచేటన్నారు. కుటుంబాలతో వచ్చే బీచ్‌లలో బార్లను ప్రోత్స హించడం ద్వారా యువతను చెడుమార్గం పట్టిస్తున్నారని మండిపడ్డారు.

ఆంధ్రుల ఆత్మగౌరవమైన విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై స్థానిక కూటమి ప్రజాప్రతినిధులు నోరు మెదపడం లేదని పరదేశి ధ్వజమెత్తారు. ప్లాంట్ యాజమాన్యం 5 వేల మంది కాంట్రాక్టు కార్మికులను



తొలగించిందని, వీఆర్ఎస్ తీసుకున్న 1,800 మంది ఉద్యోగులకు బకాయిలు చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్-కార్డు నిర్వాసితుల సమస్యలు పెండింగ్‌లో పెట్టి, బార్ల గురించి మాట్లాడటం బాధ్యతారాహిత్య మన్నారు. గత ప్రభుత్వంలో జగన్‌మోహన్‌రెడ్డి 2 లక్షల ఉద్యోగాలిచ్చి నిరుద్యోగులను ఆదుకుంటే.. ప్రస్తుత ప్రభుత్వం వాలంటీర్లను కొనసాగిస్తామన్న హామీని విస్మరించి 2.5 లక్షల మందిని రోడ్డున పడేసిందని ఆరోపించారు. ప్లాంట్ పరిరక్షణ, కాంట్రాక్టు కార్మికుల పునరుద్ధరణ, వాలంటీర్ల హామీల అమలుపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. సమావేశం లో పార్టీ నాయకులు పల్లా చిన్నతల్లి, ధర్మాల శ్రీనివాస్‌రావు, గొందేసి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రంలో ఘనంగా బొమ్మలు, స్నాక్స్ పంపిణీ

విశాఖపట్నం, జూన్ 29 ప్రభాత వార్త :

చిన్నారుల ప్రాథమిక విద్యా వికాసానికి, వారి శారీరక, మానసిక ఉల్లాసానికి అంగన్‌వాడీ కేంద్రాలు ఎంతో దోహదపడతాయని వైఎస్ఆర్సిపి రాష్ట్ర సెక్రెటరీ జి.వి. రామచంద్రరావు అన్నారు. ప్రముఖ పత్రికా సంస్థ 'సిటిజన్ టైమ్స్' ఆధ్వర్యంలో జీవీఎంసీ 9వ వార్డు పరిధిలోని సింహగిరి కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఉచితంగా ఆటబొమ్మలు, రుచికరమైన స్నాక్స్ వితరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వైఎస్ఆర్సిపి రాష్ట్ర సెక్రెటరీ జి.వి. రామచంద్రరావు చిన్నారులకు స్వహస్తాలతో బొమ్మలు, తినుబండారాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...

## చిన్నారుల ముఖాల్లో ఆనందం

సమాజంలో సేవా కార్యక్రమాలు నిర్వహించడంలో పత్రికా సంస్థలు ముందుండటం అభినందనీయమన్నారు. కేవలం వార్తలకు మాత్రమే పరిమితం కాకుండా, సిటిజన్ టైమ్స్ సంస్థ ఇలాంటి సామాజిక బాధ్యతాయుతమైన కార్య క్రమాన్ని చేపట్టడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యను అందించడానికి ఇలాంటి బొమ్మల పంపిణీ ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. పాల్గొన్న ప్రముఖులు: సిటిజన్ టైమ్స్ ప్రతినిధులు దాసు, విష్ణు, స్థానిక వైఎస్ఆర్సిపి నాయకులు శివ, శ్రీను, గజ, వినయ్, కిషోర్, బెంజి,




చిన్న,కిరణ్, నవీన్, చరణ్ కార్య కర్తలు పాల్గొన్నారు. బొమ్మలను అందుకున్న చిన్నారుల ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది. అంగన్‌వాడీ సిబ్బంది, పిల్లల తల్లిదండ్రులు సిటిజన్ టైమ్స్ యాజమాన్యానికి మరియు జి.వి.రామచంద్రరావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు మరియు పెద్ద సంఖ్యలో కాలనీవాసులు పాల్గొన్నారు.

# సర్ ఫారం నింపడంపై తహసీల్దార్ శ్రీనిబాబు అవగాహన

ఆనందపురం, జూన్ 29, ప్రభాతవార్త:

ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (సర్) కార్యక్రమంలో భాగంగా ఫారం నింపడంలో పాటించాల్సిన నిబంధనలపై తహసీల్దార్ శ్రీనిబాబు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2002 ఓటరు జాబితాలో లేదా ఆ తర్వాతి ఎన్నికల ఓటరు జాబితాల్లో పేరు నమోదై ఉన్నవారు సంబంధిత కాలమ్‌లో తమ పాత ఓటరు వివరాలు, ఎపిక్ (ఓటరు గుర్తింపు కార్డు) సంఖ్య లేదా అందుబాటులో ఉన్న ఇతర ఎన్నికల వివరాలను నమోదు చేసి ఫారాన్ని పూర్తి చేయాలని తెలిపారు. అదేవిధంగా, 2002 ఓటరు జాబితాలో పేరు లేని వారు తమ పౌరసత్వం, జనన తేదీ, నివాసం మరియు కుటుంబ సభ్యుల వివరాలకు సంబంధించిన అవసరమైన ధ్రువపత్రాలను సమర్పించాలని సూచించారు. జనన ధ్రువీకరణ పత్రం, విద్యా ధ్రువపత్రాలు, ఆధార్ కార్డు, నివాస ధ్రువీకరణ పత్రం వంటి ఎన్నికల సంఘం నిర్దేశించిన పత్రాలను జత చేయాలని తెలిపారు. ఫారంలోని ప్రతి వివరాన్ని స్పష్టంగా, నిజాయితీగా నమోదు చేయాలని, అసంపూర్ణ లేదా తప్పుడు సమాచారం ఉన్న దరఖాస్తులు పరిశీలనలో ఇబ్బందులకు దారితీయవచ్చని పేర్కొన్నారు. ప్రజలు సందేహాలుంటే తమ పరిధిలోని బి ఎల్ వో లను సంప్రదించాలని సూచించారు. నింపిన ఫారాలను ఆయా బి ఎల్ వో లకు సకాలంలో అందించాలని లేని పక్షంలో ఓటు కోల్పోయే ప్రమాదామా ఉందని చెప్పారు. సిబ్బంఫికి ప్రజలు, నాయకులు సహకరించి సర్



కార్యక్రమం విజయవంతం చేయాలని తహసీల్దార్ శీనుబాబు ఈ సందర్భంగా కోరారు.

# విద్యా నైపుణ్యాలపై దృష్టి పెట్టాలి

ఆనందపురం, జూన్ 29, ప్రభాతవార్త:

విద్యార్థులు కేవలం మార్కులకే పరిమితం కాకుండా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని విద్యా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఆనందపురం గాయత్రి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్, ప్రిన్సిపల్ దుక్క అప్పలరాజు సూచించారు. ఆంధ్ర యూనివర్సిటీ ఇటీవల విడుదల చేసిన మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ ఫలితాల్లో విశిష్ట ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సోమవారం కళాశాలలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నేటి పోటీ ప్రపంచంలో ఉన్నత మార్కులతో పాటు కమ్యూనికేషన్ నైపుణ్యాలు, డిజిటల్ పరిజ్ఞానం, సమస్యల పరిష్కార సామర్థ్యం వంటి నైపుణ్యాలను కూడా విద్యార్థులు పెంపొందించుకోవాలని అన్నారు. క్రమశిక్షణ, నిరంతర శ్రమ, అధ్యాపకుల మార్గదర్శకత్వంతోనే



ఉత్తమ ఫలితాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు. మొదటి సెమిస్టర్ ఫలితాల్లో వై. రజిని 9.25, జి. శాంతి 9.19 గ్రేడ్ పాయింట్లు సాధించగా, ఎల్. మధుప్రియ, వి. రామలక్ష్మి, జి. దివ్య తలో 9.00 గ్రేడ్ పాయింట్లు, కె. అక్షయ 8.94 గ్రేడ్ పాయింట్లు సాధించి కళాశాలకు మంచి పేరు తీసుకొచ్చారు. మొత్తం 40 మంది విద్యార్థులు 8.80కు పైగా గ్రేడ్ పాయింట్లు సాధించడం విశేషమని కళాశాల కో - కరెస్పాండెంట్ బెల్లాన రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఘనంగా సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు సిహెచ్. సునీత, టి. భారతి, ఎస్. ప్రియాంక, బి. సత్యనారాయణ, టి. ఈశ్వరరావు, కె. దుర్గా, జి. లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.

# గుత్తుల మధుబాబుకు సన్మానం




గాజువాక, జూన్ 29, ప్రభాతవార్త :

డ్రగ్స్ వ్యసనం నుంచి విముక్తులై, కౌన్సిలింగ్ ద్వారా కోలుకున్న పది మంది యువతకు ఉపాధి కల్పించిన విశాఖ అన్ ఆర్గనైజ్డ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు గుత్తుల మధుబాబును రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, నగర పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చి ఘనంగా సత్కరించారు. సీపీ పిలుపునకు స్పందించి కోలుకున్న యువకులకు నేవీ డాక్‌యార్డ్, ఎస్సార్, హెచ్‌పీసీఎల్ కంపెనీలలో మధుబాబు ఉపాధి కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నిరుద్యోగ యువతకు ఉపాధి చూపడం, కార్మికులకు చట్టాలపై అవగాహన కల్పించడంతో పాటు ఉచిత లేబర్ కార్డులు, వైద్య శిబిరాలు, లీగల్ టీమ్ ద్వారా సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు కే.శివశంకర్, బి.వెంకట్ మల్లేష్, యూనియన్ ప్రతినిధులు మేఘన దుర్గ, వెంకటేష్, గౌతమ్ పాల్గొన్నారు.

# ఓబీసీ మోర్చా మండల కమిటీల నియామకం



గాజువాక, జూన్ 29,ప్రభాతవార్త :

నియోజకవర్గంలో బీజేపీ అనుబంధ ఓబీసీ మోర్చా బలోపేతానికి తొమ్మిది మండలాల అధ్యక్ష, కార్యదర్శులను నియమించారు. పాత గాజువాకలోని పార్టీ కార్యాలయంలో రాష్ట్ర మీడియా ప్యానలిస్ట్, నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు ఆధ్వర్యంలో సోమవారం వీరికి నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాలెపు సత్యసాయి రామ్ మాట్లాడుతూ బీజేపీలో ఓబీసీ మోర్చా కీలకమైనదని, వెనుకబడిన వర్గాలకు సముచిత స్థానం కల్పించడంలో పార్టీ ముందుంటుందని చెప్పారు. నియోజకవర్గంలో మోర్చాను మరింత బలోపేతం చేసేందుకు నూతన కమిటీలు కృషి చేయాలని సూచించారు. ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రోనంకి విజయ్ చంద్రుడు, ప్రధాన కార్యదర్శి ఆడారి సతీష్, బొత్స జగదీశ్, గూటూరు శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు పౌష్టికాహార కిట్ల పంపిణీ




గాజువాక,జూన్ 29,ప్రభాతవార్త :

నిరుపేద కుటుంబాలకు కల్చర్ ఫౌండేషన్ నిరంతరం అండగా నిలుస్తోందని బీజేపీ రాష్ట్ర మీడియా ప్యానలిస్ట్ కరణంరెడ్డి నరసింగరావు, మాజీ కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి అన్నారు. కల్చర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో, డాబర్ ఇండియా లిమిటెడ్ సౌజన్యంతో పెదగంట్యాడ సి.డబ్ల్యూ.సి కమ్యూనిటీ హాల్‌లో సోమవారం సుమారు 100 మంది దివ్యాంగులకు నెలకు సరిపడా పౌష్టికాహార సరుకులను పంపిణీ చేశారు. ఫౌండేషన్ అధ్యక్షుడు పేర్ల అప్పారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి కరణంరెడ్డి నరసింగరావు, పులి లక్ష్మీబాయి, టీఆర్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు తిప్పల రమణారెడ్డి హాజరై సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కల్చర్ ఫౌండేషన్ ద్వారా విశాఖలో నాలుగు చోట్ల ఈ పంపిణీ కార్యక్రమం జరుగుతోందన్నారు. కరోనా కష్టకాలంలోనూ నిరుపేదలను ఆదుకున్న ఫౌండేషన్, సమాజంలో ఇతరులకు స్ఫూర్తినిచ్చేందుకే ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని కొనియాడారు. కారక్రమంలో బీజేపీ నాయకులు కాలెపు సత్యసాయి రామ్, రోనంకి విజయ్ చంద్రుడు, ఆడారి సతీష్, బొత్స జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాత సుఖీభవపై వ్యవసాయ అధికారులను నిలదీసిన రైతులు



పద్మనాభం, జూన్ 29, ప్రభాతవార్త :

మండలంలో పలు గ్రామాలలో పలువురికి అన్నదాత సుఖీభవ పడలేదని సోమవారం మదిగ్రామంలో నిర్వహించిన ఏరువాక కార్యక్రమా నికి హాజరైన వ్యవసాయ అధికారులను రైతులు నిలదీసారు. మండలంలో ఇరవై రెండు గ్రామ పంచాయతీలలో సుమారు 800 మందికి అన్న దాత సుఖీభవ నిధులు సంవత్సరం నుండి రాలే దని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు చెప్పినా వినిపించుకోలేదని నిలదీసారు. తమతో పాటు కృష్ణాపురం, పద్మనాభం, తాళ్లవలస గ్రామాల ఇనాం రైతులకు ఈ సంవ త్సరం అన్నదాత సుఖీబవ నిధులు రాలేదని వారు చెప్పారు.

# నిర్వాసితుల ఖాతాల్లో రూ.300 కోట్లు జమ

**• సంబరాల్లో నిర్వాసితులు • 'థ్యాంక్యూ సీఎం సార్' సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం**



**మార్కాపురం, జూన్ 29 ప్రభాతవార్త:** వెలుగొండ ప్రాజెక్టు నిర్వాసితుల్లో ఖాతాల్లో సోమవారం 300 కోట్ల రూపాయలు జమయ్యాయి. 2351 మంది నిర్వాసిత ఖాతాల్లో రాష్ట్ర ప్రభుత్వం 300 కోట్ల రూపాయలను జమ చేయడం జరిగింది. వెలుగొండ ప్రాజెక్టు టన్నుల సందర్శించి చెక్కు అందజేసిన ముఖ్యమంత్రి 24 గంటల్లోనే ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అమౌంట్ మొదటి విడత 300 కోట్లు నిర్వాసితుల ఖాతాల్లో జమ కావడంతో నిర్వాసితులు సంబరాల్లో మునిగిపోయారు. నియోజకవర్గ ఇన్చార్జ్ గూడూరు ఎరిక్షన్‌బాబు నేతృత్వంలో సోమవారం నిర్వాసిత గ్రామాల్లో ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేసి సంబరాలు చేసుకున్నారు.. "థ్యాంక్యూ సీఎం సార్.." అంటూ వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న పరిహారం సోమవారం ఉదయం నుంచి వారి బ్యాంకు ఖాతాల్లో జమ కావడంతో నిర్వాసిత గ్రామాల్లో సంబరాలు నెలకొన్నాయి. 2,351 నిర్వాసితులకు గానూ కుటుంబానికి రూ.12.50 లక్షల నుంచి రూ.12.76 లక్షల వరకు పరిహారం అందుతోంది. నిర్వాసితులు పెద్ద ఎత్తున పట్టణంలోని వివిధ బ్యాంకులకు చేరుకుని తమ ఖాతాలను చూసుకొని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. బ్యాంకుల వద్ద ఉదయం నుంచే భారీ రద్దీ కనిపించింది. బ్యాంకులన్నీ నిర్వాసితులతో కిటకిటలాడగా, తమ ఖాతాల్లో పరిహారం జమ కావడాన్ని చూసిన లబ్ధిదారులు ఆనందంతో ఒకరినొకరు అభినందించుకున్నారు. వెలిగొండ ప్రాజెక్టు కోసం భూములు, ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులు చాలా కాలంగా పరిహారం కోసం ఎదురుచూస్తున్నారు. ఇటీవల మార్కాపురం జిల్లా పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్వాసితులతో ముఖాముఖి సమావేశమై వారి సమస్యలను తెలుసుకుని, పరిహారం సోమవారం ఖాతాల్లో జమ అవుతుందని చెప్పిన 48 గంటల్లో నే పరిహారం అందడంతో సీఎం హామీ మేరకు ప రూ.300 కోట్ల నిధులను విడుదల చేయడంతో పెద్ద నిరీక్షణకు తెరపడింది సోమవారం నుంచి నగదు లావాదేవీలు ప్రారంభమయ్యాయి. దీంతో బ్యాంకుల వద్ద నిర్వాసితుల సందడి నెలకొంది. "మా జీవితాల్లో కొత్త వెలుగు నింపారు... థ్యాంక్యూ సీఎం సార్" అంటూ పలువురు నిర్వాసితులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి కృతజ్ఞతలు తెలియజేశారు. పరిహారం అందుకోవడంతో తమ కుటుంబాల భవిష్యత్తుకు భరోసా లభించిందని, కొత్త జీవితాన్ని ప్రారంభించేందుకు ఈ ఆర్థిక సాయం ఎంతో దోహదపడుతుందని నిర్వాసితులు ఆనందం వ్యక్తం చేశారు.

# ప్రాంతీయ అభివృద్ధికి హైస్పీడ్ గ్రోత్ కారిడార్లు

## కేంద్ర, రాష్ట్రాల ఉమ్మడి కృషితో ఎన్‌హెచ్ 44, ఎన్‌హెచ్ 65లకు మహర్దశ




**హైదరాబాద్, జూన్ 29:** తెలంగాణలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి ప్రణాళికలో భాగంగా ఎన్‌హెచ్ 44 (హైదరాబాద్– నాగ్‌పూర్ మార్గం), ఎన్‌హెచ్ 65 (హైదరాబాద్ – విజయవాడ రహదారి)లను ఆర్థిక ప్రగతి కారిడార్లుగా అభివృద్ధి చేసేందుకు సమిష్టిగా కృషిచేస్తున్నాయి. ఈ రెండు ప్రధాన రహదారులు అటు నాగ్‌పూర్ ఇటు విజయవాడకు రహదారుల ఆధునీకరణ, కేంద్ర రవాణాపై పెట్టుబడులకు ఆస్కార మిస్తూ ప్రాంతీయ పారిశ్రామికాభివృద్ధిని ఏవిధంగా సమ్మిళితం చేయగలవో అధ్యయనం చేసేందుకు అవకాశం ఏర్పడింది. రహదార్ల ఆధునీ కరణతో ఆ రెండు కారిడార్లను ఉన్నతీకరించడ మంటే ప్రయాణ దూరాలు తగ్గించడం, తద్వారా రవాణా వ్యయాన్ని బాగా తగ్గేలా చూసుకోవడం వలన ప్రాంతీయ పారిశ్రామికాభివృద్ధి గణనీయంగా పెరుగుతుంది. మార్కెట్ అందుబాటు గరిష్టంగా, రవాణా ఖర్చులు కనిష్టంగా ఉన్న చోట పారిశ్రామిక కార్యకలాపాలు సహజంగానే కేంద్రీకృతమవుతాయి. ప్రత్యేక పారిశ్రామిక తయారీ మండలాలు, ఆహారశుద్ధి పార్కులు, లాజిస్టిక్ కేంద్రాలను అనుసంధానిస్తూ ఈ కారిడార్ల అభివృద్ధి జరుగుతోంది. సరళ రవాణా నెట్‌వర్క్‌లను ఆర్థిక కారిడార్లుగా మార్చడం ప్రాదేశిక ప్రణాళికలో కీలకమైన మార్పును గమనిస్తాము. రవాణా కారిడార్లు ప్రధానంగా ముఖ్యపట్టణాలను కలిపే రవాణా మార్గాలుగా పనిచేస్తాయి. రవాణా దూరం తద్వారా రవాణా ఖర్చులే కాదు, సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద మితిమీరిన ఆలస్యాలు ఇవన్నీ ఇరుకు నడవాలను ఇబ్బంది పెడుతుంటాయి. ఇలా అన్ని సందర్భాల్లోను కలిసిరాని రవాణాను ప్రాదేశిక ఆర్థికవేత్తలు, ప్రాదేశిక ఘర్షణలుగా సిద్ధాంతీకరించారు. ఎప్పుడైతే ఇలాంటి సంఘర్షణలు ఆలస్యాలతో ఏర్పడే ప్రతికూలతలను పరిగణనలోకి తీసుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడి ప్రణాళికగా ఈ రహదారి కారిడార్లను అభివృద్ధి చేయడం మధ్య భారత దేశంలోని అతిపెద్ద పారిశ్రామిక ప్రగతికి చేయూతినిస్తుంది. ప్రధానంగా తెలంగాణ రాష్ట్రానికి అటూ ఇటూ అభివృద్ధి చెందబోయే రవాణా కారిడార్లలోకి పారిశ్రామిక ముడిపదార్థాల నుంచి తుది ఉత్పత్తులు పూర్తయ్యేవరకూ ఎన్నో రవాణా సౌకర్యాలు, సౌలభ్యాలకు వీలు కలిగించే కారిడార్‌లుగా రూపొందుతాయి. హైదరాబాద్ పారిశ్రామికీకరణకు ఈ రెండు రహదారి కారిడార్లు దోహదం చేస్తాయి. అంతేకాకుండా హైదరాబాద్ నగర భౌగోళిక పరిధి కూడా విస్తరిస్తుంది. ఇలా విస్తరించిన ప్రాంతాల్లో ఎంతోమందికి ఉపాధి కల్పించే పారిశ్రామిక క్లస్టర్లు కూడా వేగవంతంగా అక్కడకొస్తాయి. హైదరాబాద్ ఉత్తరం వైపు ఎన్‌హెచ్44లో అభివృద్ధి చెందిన ఆహారశుద్ధి పార్కులు, లాజిస్టిక్ కేంద్రాలు, ఇంజినీరింగ్, ఫార్మాస్యూటికల్స్, వస్త్ర తయారీ పరిశ్రమలు కూడా అభివృద్ధి చెందాయి. రెండోవైపున తూర్పు కారిడార్ ఎన్‌హెచ్65 ఆంధ్రప్రదేశ్ తీరప్రాంత ఓడరేవులకు వారధిగా ఉంది. ఈ కారిడార్‌లో ఖనిజ ఆధారిత పరిశ్రమలు, భవన నిర్మాణ సామగ్రి సముదాయాలు, మెగా ఫుడ్ పార్కులు, వ్యవసాయ ప్రాసెసింగ్ కేంద్రాలు విరివిగా ఉన్నాయి. ఈ క్లస్టర్‌లోని ఉమ్మడి మౌలికసదుపాయాలు ఉండటంతో నైపుణ్యమున్న శ్రామిక శక్తికి ఉపాధి లభిస్తుంది. కారిడార్ల ఆధునీకరణలో బహుళజాతి సంస్థలు దేశీయ సంస్థలు గణనీయంగా మూలధన పెట్టుబడులకు అవకాశం ఉంది. మధ్యభారత దేశంలో ముడిపదార్థాల వనరులను తెలంగాణ తయారీ కేంద్రాలు, కోస్తాతీర ప్రాంతంలోని ఎగుమతి కేంనరదాలతో అనుసంధానించబడే ప్రత్యేక సౌకర్యాలు కూడా అందుబాటులోకి వస్తాయి. తెలంగాణ అభివృద్ధి అంతా ప్రధానంగా హైదరాబాద్‌లోనే కేంద్రీకృతమైంది. దీనివల్ల ఇన్వెంటరీ నిర్వహణ ఖర్చులను తగ్గిస్తుంది. ఈ రవాణా రహదారి కారిడార్ల ఏర్పాటు వల్ల ఎక్కడికక్కడే ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయి. గ్రామీణ ప్రాంతాలనుంచి కూలిపనుల కోసం వలసవెళ్లిన వారు స్థానికంగానే ఉపాధి పొందుతారు. ఈ కారిడార్లలోగ్రామీణ సమాజానికి అందుబాటులో ఉండే ప్రత్యామ్నాయ వ్యవసాయేతర ఉపాధి పొందగలుగుతారు. గ్రామీణ ప్రాంతాల్లో పారిశ్రామిక సమూహాలు ఏర్పడుతున్నందున గ్రామీణ కుటుంబ ఆదాయాలను స్థిరీకరించడానికి ప్రాంతీయంగా చుట్టుపక్కల గ్రామీణ ప్రాంతాలకు పారిశ్రామిక మూలధనం వికేంద్రీకరణ, గ్రామీణ కుటుంబ ఆదాయాలను స్థిరీకరించడానికి మరింత సముతల్య ప్రాంతీయ ఆర్థిక అభివృద్ధిని ప్రోత్సహించేందుకు సహాయపడుతుంది.

# పనిచేసే కార్యకర్తలకు జనసేనాని ప్రాధాన్యత

**• మంత్రి కందుల దుర్గేష్ స్పష్టీకరణ**

**విజయవాడ, జూన్ 29 ప్రభాతవార్త ప్రతినిధి:** జనసేన నేత పవన్ కల్యాణ్ పనిచేసే కార్యకర్తలకు అత్యంత ప్రాధాన్యతను ఇస్తారని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేసారు. పార్టీ అత్యంత సైద్ధాంతిక విలువలతో పనిచేస్తోందన్నారు. పార్టీ నిర్మాణం విషయంలో పూర్తి స్థాయిలో కార్యకర్తలు శ్రమించాలన్నారు. జనసేన నిర్మాణ సారథుల సమాచార సేకరణ కమిటీ భేటీ అయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా జనసేన పార్టీ నిర్మాణ కార్యక్రమం నిర్వహించారు. 25 పార్లమెంటు స్థానాల నుంచి సమాచార సేకరణ చేపట్టినట్లు మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. నివేదిక పవన్ కల్యాణ్‌కు అందించి తదుపరి కార్యాచరణ చేపట్టనున్నట్లు వివరించారు. జనసైనికులు, వీర మహిళల నుంచి దరఖాస్తుల స్వీకరించామన్నారు. పార్టీ గురించి కృషి చేసే వారికి నాయకత్వం అందిస్తారని దుర్గేష్ పునరుద్ఘాటించారు. కూటమిలో పోటీపై చంద్రబాబు, పవన్, బిజెపి కలిసి నిర్ణయిస్తాయన్నారు. అన్ని అసెంబ్లీ స్థానాల్లో పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యమని తెలిపారు. పార్టీ నిర్మాణ ప్రక్రియ అనేది నిరంతరం కొనసాగుతుందన్నారు. రాజకీయ విశ్లేషకులు పక్షపాత వైఖరితో వ్యవహరిస్తున్నరన్న దుర్గేష్ ఏకపక్షంగా పవన్‌కు మద్దతిస్తున్నారని వైఎస్సార్సీపీ తట్టుకోలేకపోతోందన్నారు. చీలికలు తేవడానికి ప్రయత్నాలు చేస్తోందని మంత్రి దుర్గేష్ మండిపడ్డారు. వైఎస్సార్సీపీ నాయకులు ఏం చెప్పినా ప్రజలు నమ్మరని ఆయన అన్నారు. జనసేన నిర్మాణ సారథుల సమాచార సేకరణ కమిటీ భేటీ అయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా జనసేన పార్టీ నిర్మాణ కార్యక్రమం నిర్వహించారు.

# ఏరువాక సాగిందిరో!

## ఏరువాక పౌర్ణమి ఉత్సవాల సందడి

**విజయవాడ, జూన్ 29 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపిలో ఏరువాక పౌర్ణమి ఉత్సవాలు సందడిగా సాగాయి. రైతులు సంప్రదాయ సిద్ధంగా భూమి పూజలు చేసి, అరకలు కట్టి నేలను దున్నారు.సాగుపనులు ప్రారంభించారు. ఏరువాక పున్నమి సందర్భంగా ఆయా జిల్లాల్లో మంత్రులు ప్రజా ప్రతినిధులు పొలాలకు వెళ్ళి సంప్రదాయక వేడుకల్లో పాల్గొన్నారు. ఉభయగోదావరి జిల్లాలు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో ఏరువాక సందర్భంగా ఉత్సాహంతో కూడిన వాతావరణం నెలకుంది. ఎద్దులకు రైతులు కుంకుమ బొట్లు పెట్టి పొలాల్లోకి దించారు. గుంటూరు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ వర్సిటీలో ఏరువాక పౌర్ణమి కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైసీపీ హయాంలో వ్యవసాయానికి కనీస సహకారం లేదని, విత్తన కంపెనీలకు కూడా బకాయిలు పెట్టి వెళ్లారని ఆరోపించారు. మేం వచ్చాక రాయితీపై రైతులకు విత్తనాలు ఇస్తున్నామని, భూమి ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. ప్రత్యేక యాప్ ద్వారా ఎరువులు అందిస్తున్నామని, యాప్ ద్వారా 20 రోజుల్లో 11 లక్షల మంది ఎరువులు తీసుకున్నారని అచ్చెన్న తెలిపారు. ఎరువులు తీసుకున్న వారిలో 3 లక్షల మందికి పైగా కౌలు రైతులు ఉన్నారని, రాష్ట్రంలో ఎక్కడా ఎరువుల కొరత లేదని అన్నారు. ఉద్యాన పంటలకు మంచి డిమాండ్ ఉందన్నారు. ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉంటుందని, ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని ఆయన సూచించారు. వర్జీనియా పొగాకు ధర సరిగా లేదని టోబాకో బోర్డు, వ్యాపారులతో మాట్లాడామని, కిలో రూ.200 కంటే తక్కువకు కొనడానికి వీల్లేదని చెప్పామని అన్నారు.

# లేపాక్షిలో ఎల్‌వి ప్రసాద్ విజన్ సెంటర్ ప్రారంభం



**లేపాక్షి, జూన్ 29 ప్రభాతవార్త:** ప్రపంచ పర్యాటక క్షేత్రమైన లేపాక్షి వీరభద్ర అన్న ప్రసాదం సేవా ట్రస్ట్ ఆవరణలో ఎల్‌వి ప్రసాద్ 285వ విజన్ సెంటర్ సోమవారం ప్రారంభమైంది. ఎల్‌వి ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ వైస్ చైర్మన్ డాక్టర్ రాజీవ్‌రెడ్డి, మాజీ మంత్రి రఘువీరారెడ్డి, నియోజకవర్గ టిడిపి కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పిఏ వీరయ్య, తదితరులు విజన్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐ కేర్ సెంటర్ కోఆర్డినేటర్ ఎల్‌వి ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ కార్యక్రమాలను వివరించారు. అనంతరం నియోజకవర్గ టిడిపి రాజకీయ కోఆర్డినేటర్ శ్రీనివాసరావుకు మొట్టమొదటిగా కంటి పరీక్షలు నిర్వహించారు. అదేవిధంగా వీరభద్ర అన్న ప్రసాదం సేవా ట్రస్ట్ లోగోను వారు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఐసిసి సభ్యులు కేటి శ్రీధర్, ఎమ్మెల్యే పిఏ బాలాజీ, లేపాక్షి మండల టిడిపి కన్వీనర్ అభిలాష్, జిల్లా టిడిపి అధికార ప్రతినిధి ఆనంద్‌కుమార్, టిడిపి సీనియర్ నాయకులు రంగారెడ్డి, నాగరాజు, బేవినహళ్లి ఆనంద్, వైకాపా కన్వీనర్ నిసార్ అహ్మద్, సీనియర్ నాయకులు చోళసముద్రం నారాయణస్వామి, హిందూపురం నాగరాజులతో పాటు అధిక సంఖ్యలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

# ఖైదీల పట్ల వివక్ష చూపరాదు

**• జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత • ఆహార పదార్థాలను రుచిచూసి పరీక్షించిన కలెక్టర్**



**విజయనగరం, జూన్ 29 ప్రభాతవార్త:** భారత సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన బోర్డ్ ఆఫ్ విజిటర్స్ ఫర్ ప్రిజనర్స్‌లో భాగంగా, విజయనగరం సబ్ జైలులో సోమవారం సమీక్షా సమావేశం మరియు తనిఖీలు నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి మరియు జిల్లా న్యాయసేవా అధికార సంస్థ చైర్‌పర్సన్ ఎం.బబిత, జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి, జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి ఏ.కృష్ణ ప్రసాద్‌ల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ, జైలు సిబ్బంది కానీ, తోటి ఖైదీలు కానీ ఎట్టి పరిస్థితుల్లోనూ ఖైదీల పట్ల వివక్ష చూపకూడదని, సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి ఇటువంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ మేరకు జైలు సూపరింటెండెంట్ వద్ద వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జైలులో నిర్వహిస్తున్న లీగల్ ఎయిడ్ క్లినిక్ పనితీరును, పారా లీగల్ వాలంటీర్లు మరియు న్యాయవాదుల సేవలను పర్యవేక్షించారు. ఖైదీలకు సకాలంలో న్యాయ సహాయం అందించేందుకు ఈ క్లినిక్‌ను ఏర్పాటు చేశామని, వీటిని సక్రమంగా కొనసాగించాలని సూచించారు. రిమాండ్‌లో ఉన్న ఏ ఒక్క ముద్దాయి కూడా న్యాయవాది లేకుండా ఉండకూడదని, అట్టి వారికి జిల్లా న్యాయసేవా అధికార సంస్థ ద్వారా ఉచితంగా న్యాయవాదిని అందిస్తామని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ నేర ప్రవృత్తిని విడనాడి, మారుమనస్సుతో మంచి పౌరులుగా ఎదగాలని హితవు పలికారు. ఖైదీల సమస్యలను అడిగి తెలుసుకున్నారుతనిఖీల్లో భాగంగా జైలులోని వంటగది, భోజనశాల, స్టోర్ రూమ్‌లను పరిశీలించి, ఆహార పదార్థాలు, పప్పు దినుసులు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఖైదీలకు ఇస్తున్న ఆహారాన్ని జిల్లా కలెక్టర్ స్వయంగా రుచి చూసి పరీక్షించారు. ఈ కార్యక్రమంలో జెడిఏ వి.టి.రామారావు, డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ఎస్.జీవన రాణి, విజయనగరం డీఎస్పీ రాఘవులు, ఆర్‌డిఓ సుధాసాగర్, సోషల్ వెల్ఫేర్ డిడి అన్నపూర్ణ, పరిశ్రమలశాఖ జిఎం కరుణాకర్, జిల్లా ఉపాధి అధికారి రవీంద్రకుమార్ తదితర కమిటీ సభ్యులు, జైలు సూపరింటిండెంట్, ఇతర పోలీసు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## వైభవంగా ఇంద్రకీలాద్రి గిరిప్రదక్షిణ



**ఇంద్రకీలాద్రి, జూన్ 29 ప్రభాతవార్త:** దుర్గమ్మ వేంచేసియున్న ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షణ వైభవంగా జరిగింది. సోమవారం నిజజ్యేష్ఠమాసం పౌర్ణమి పర్వదినాన జరిగిన ఈ గిరి ప్రదక్షణలో శ్రీ స్వామి అమ్మవార్లు భక్తులు అనుగ్రహించారు. సాక్ష్యాత్తు వేదవిదులయిన శ్రీస్వామి అమ్మవార్లను వేదపండితులు వేదనాదాలు, మంత్రపఠనోచ్చారణలతో గిరి ప్రదక్షణలో సేవిస్తుండగా, భక్తుల కోలాహలంతో డప్పు, ఢమరుక, ఢక్క, శంఖ, వాద్యనాదాల నడుమ నృత్య, కోలాట భజనలతో గిరి ప్రదక్షణ కొనసాగింది. గిరి ప్రదక్షణ తిరిగి శ్రీ అమ్మ ఆలయానికి చేరుకోగానే అక్కడ ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు.

**ఇంద్రకీలాద్రిపై వైభవంగా ఏరువాక పౌర్ణమి:** దుర్గమ్మ ఆలయంలో రైతులు గింజలు (విత్తుకొని) నాటుకొని నారు తయారు చేసుకునే పవిత్రమైన ఏరువాక పౌర్ణమి రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు వైభవంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన రైతు భక్త బృందానికి ఆలయ అధికారులు, అర్చకులు ఘనంగా స్వాగతం పలికి, అమ్మవారి ప్రత్యేక దర్శనం, వేదాశీర్వచనం ఏర్పాటు చేసి, పవిత్ర తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ విశిష్ట కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ దేవదాయ ధర్మాదాయ శాఖ పరిధిలోని హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ మహిళా విభాగం సంకల్పంతో, ఆ సంస్థ రాష్ట్ర మహిళా కోఆర్డినేటర్ కరి రమాసుందరి బృందం అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపకల్పన చేసి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ మహిళా ప్రతినిధులు ఆలయ అధికారులు, అర్చకులు,పెద్ద సంఖ్యలో శ్రామిక రైతు మహిళలు భక్తి శ్రద్ధలతో పాల్గొని అమ్మవారి కృపాకటాక్షాలు పొందారు.

**నిత్యాన్నదానానికి విరాళం:** విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ కనకదుర్గమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి నిడమానూరుకు చెందిన డి అనిల్, సరిత దంపతులు రు.1 లక్ష విరాళాన్ని సోమవారం చైర్మన్ బొర్రా రాధాకృష్ణకు అందించారు. దాతలకు దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అధికారులు వారికి దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషశస్త్రం అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.



**దుర్గమ్మ సేవలో మంత్రి అచ్చెన్నాయుడు:** దుర్గమ్మని రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు సోమవారం దర్శించుకున్నారు. ఆయనకు దుర్గమ్మ చిత్రపటం, ప్రసాదం, శేషశస్త్రం అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.



# నిరంతర విద్యుత్ సరఫరా

**• వినియోగదారులు, అధికారులతో సిఎండి వీడియో కాన్ఫరెన్స్**



**నెల్లూరు(వైద్యం), జూన్ 29 ప్రభాతవార్త:** ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ లోతేటి శివశంకర్ ఆధ్వర్యంలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన విద్యుత్ సరఫరా, వినియోగదారుల సేవలు, రెవిన్యూ వసూళ్లు, నిర్వహణకు సంబంధించిన పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ, విద్యుత్ అంతరాయాలను వెంటనే గుర్తించి త్వరితగతిన పరిష్కరించి వినియోగదారులకు నిరంతర విద్యుత్ సరఫరా అందించాలన్నారు. అన్ని కార్యాలయాలలో సిటిజన్ చార్టర్‌ను తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు. అలాగే సైక్లోన్ ప్రివెంటివ్ మెయింటెనెన్స్ పనులకు సంబంధించి అవసరమైనప్పుడు వెంటనే ఆదేశాలు జారీ చేసి, అనుమతులు పొందుతూ పనులను తక్షణమే పూర్తి చేయాలని సూచించారు. గతంలో వచ్చిన తుఫానులకు సంబంధించిన పెండింగ్ పీఎం ఆర్డర్లను ఇప్పుడు పంపవద్దని స్పష్టం చేశారు. అదేవిధంగా పగటి సమయంలో వీధి దీపాలు ఎక్కడా వెలగకుండా ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని, వీధి దీపాలపై ప్రత్యేక సర్వే నిర్వహించి శుక్రవారం లోపు నివేదిక సమర్పించాలని ఆదేశించారు. వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లను శాఖ ద్వారా ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో, వినియోగదారుల వద్దకు వెళ్లి సేవలపై అభిప్రాయాలను సేకరించాలని, వారు సంతృప్తిగా ఉన్నారా..? లేదా.. అని తెలుసుకోవాలని ఫీల్డ్ అధికారులకు సూచించారు. విద్యుత్ వినియోగదారుల సంతృప్తి, సేవల నాణ్యతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. అదేవిధంగా రెవిన్యూ వసూళ్లు పూర్తిగా డిజిటలైజేషన్ రూపంలో రావాలని, వినియోగదారులు డిజిటల్ చెల్లింపుల వైపు మొగ్గుచూపేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు. రెవిన్యూ సిబ్బందిఫీల్డ్ సిబ్బంది ప్రతి వినియోగదారునికి డిజిటల్ చెల్లింపుల ప్రయోజనాలను వివరించి, పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సీఎండీ సూచించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ (ప్రాజెక్ట్స్, ఐటి) పి. అయూబ్ ఖాన్, డైరెక్టర్ (టెక్నికల్, హెచ్‌ఆర్ డి) కే. గురవయ్య, డైరెక్టర్/ఫైనాన్స్ (ఎఫ్‌ఏసి) కె. రామమోహన్ రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు కె. ఆదిశేషయ్య, జె. రమణా దేవి, ఎం. మురళి కుమార్, ఎన్. శోభా వాలెంటీనా, ఎం. ఉమాపతి, సిహెచ్ రామచంద్ర రావు, కే. సంపత్ కుమార్, ఎస్. రమణ, జనరల్ మేనేజర్లు చక్రపాణి, జగదీష్, లత, తదితరులు పాల్గొన్నారు.

# మంచాన పడ్డ దుగ్గుదూరు

## అనారోగ్యంతో 70 మంది ఆసుపత్రి పాలు

## బజ్జీల కొట్టులో ఆహారంపై అనుమానం

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జూన్ 29 ప్రభాతవార్త:** కాకినాడ జిల్లా కాజులూరు మండలం దుగ్గుదూరు గ్రామంలో సుమారు 70 మందికి పైగా రోగులు అనారోగ్యంతో ఆసుపత్రుల పాలయ్యారు. స్థానికఓ చిరు హోటల్ లో ప్రజలు చల్లపునుకులు తినడం ద్వారా ఫుడ్ పాయిజన్ అయ్యి అనారోగ్యానికి గురైనట్లు వైద్యధికారులు చెబుతున్నారు. వివరాల్లోకి వెళితే దుగ్గుదూరు పీహెచ్సీ పరిధిలో రెండు రోజులుగా 32 మంది రోగులు డయేరియా, సంబంధిత లక్షణాలతో ఆసుపత్రిలో చేరారు. వీరిలో 23 మందిని ఆసుపత్రిలో చేర్చుకుని వైద్యం అందిస్తున్నారు. కాగా మిగతా 9 మంది రోగులు అవుట్ సైడ్ పేషెంట్లుగా చికిత్స పొందుతున్నారు. వీరితో పాటు ద్రాక్షారామ, రామచంద్రపురం, యానం, కాకినాడ ప్రాంతాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో సుమారు 40 మంది వరకూ దుగ్గుదూరు, పరిసర గ్రామాలకు చెందిన రోగులు డయేరియా సంబంధిత లక్షణాలతో చికిత్స పొందుతునట్లు స్థానికులు చెబుతున్నారు.

కాగా శుక్రవారం సాయంత్రం దుగ్గుదూరు గ్రామంలో చిరుహోటల్‌లో చల్లపునుకులు తిన్న అనంతరం పలువురికి వాంతులు, విరేచనాలు, కడుపునొప్పి వంటి లక్షణాలు కనిపించడంతో కుటుంబ సభ్యులు వారిని సమీప ఆసుపత్రులకు తరలించిన్నట్లు రోగులు పేర్కొంటున్నారు. శుక్రవారం 10 మంది రోగులు మాత్రమే బయట పడగా శనివారం రోగుల సంఖ్య భారీగా పెరిగడంతో వైద్యధికారులు పరుగులు తీసారు.

సమాచారం అందుకున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి(డీఎంహెచ్‌వో) నరసింహ నాయక్, జిల్లా మలేరియా అధికారి ప్రభాకరరావు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి బాధితుల ఆరోగ్య పరిస్థితిని స్థానిక వైద్యురాలు డాక్టర్ సుప్రియను అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోగికి మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందికి ఆదేశించారు. అవసరమైతే వెంటనే కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. ప్రస్తుతం బాధితుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, గ్రామంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షి స్తున్నట్లు వైద్యాధికారిని సుప్రియ తెలిపారు. ఘటనకు గల కారణాలపై అధికారులు విచారణ చేపట్టారు. ఆహారం విషంగా మారడం వల్లే ప్రజలు అనారోగ్యం పాలైనట్లు వైద్యాధికారులు భావిస్తున్నారు.

# జెసి ప్రభాకర్ రెడ్డి భాష, మాట తీరుపై టిడిపి వైఖరి ఏంటో చెప్పాలి: విశ్వేశ్వర్ రెడ్డి

**అనంతపురం, జూన్ 29 ప్రభాతవార్త బ్యూరో:** తాడపత్రి మాజీ శాసనసభ్యుడు జెసి ప్రభాకర్ రెడ్డి మాట్లాడిన మాటలు, భాష తీరుపై సిఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌తో పాటు తెలుగుదేశం పార్టీ వైఖరి ఏంటో చెప్పాలని వైసిపి సీనియర్ నేత, ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఫ్యాక్షన్ పెంచే విధంగా జెసి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతుంటే పోలీస్ అధికారులు ఎందుకు మౌనంగా ఉంటున్నారని ప్రశ్నించారు. సోమవారం అనంతపురంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తనతో పాటు అనంత వెంకట్రామిరెడ్డి, రంగయ్యలను వ్యక్తిగతంగా, ఇంట్లో వారిని ఎందుకు తిట్టారని నిలదీశారు. అసలు ఆయనకు కోర్టులు, పోలీసులు, లాయర్లు, జర్నలిస్టులు, చివరకు ఆయన కుటుంబ సభ్యులను కూడా దూషిస్తుంటారన్నారు. ఇంత కుసంస్కారిగా జెసి ఎలా ఉన్నాడో అర్థం కావడం లేదు. నీ విధానాలు, భాష, తీరు పట్ల మీ పార్టీ వారితో సహా అంతా అసహ్యించుకుంటున్నారన్నారు. మీ లాగా జనం మీద పడి దోచుకోలేదని, తాము విలువలతో కూడిన జీవితాన్ని చూశామన్నారు. నీ లాంటి బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదని.. తాము చూడని కేసులు, దాడులు లేవన్నారు. ఆడపిల్లలపై రేప్ కేసు లాంటివి తప్ప అన్ని కేసులు చూశావని ఆయన గుర్తు చేశారు. నీ భాష, వికృత చేష్టల వల్ల ప్రజలు అసహ్యించుకుంటున్నారని ఆయన విమర్శించారు.

# అనంతలో ఇద్దరు విద్యార్థినుల మిస్సింగ్

## - ఎస్పీ చొరవతో క్షేమంగా తల్లిదండ్రుల చెంతకు

**అనంతపురం(క్రైమ్), జూన్ 29 ప్రభాతవార్త:** కూలీ పనుల కోసం వెళ్ళిన తల్లిదండ్రులు తిరిగి ఇంటికి వచ్చేసరికి ఇద్దరు బాలికలు మిస్సయ్యారు. ఇంట్లో కనిపించకపోవడంతో ఆందోళన చెందారు. రాయదుర్గం మండలం, టీ. వీరాపురం గ్రామానికి చెందిన హరిజన శివకుమార్ కుమార్తె మజత (11) 6వ తరగతి, అదే గ్రామం హరిజన రాజు కుమార్తె సౌమ్య (9) 4వ తరగతి చదువుకుంటున్నారు. వీరిద్దరూ తప్పిపోయారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో వారి ఆచూకీ కోసం తీవ్రంగా గాలించారు. అయితే ఎక్కడ వారి జాడ తెలియకపోవడంతో చివరకు బాధితులు పోలీసులను ఆశ్రయించారు. ఈ ఘటనపై జిల్లా పోలీస్ యంత్రాంగం సీరియస్ గా స్పందించింది.

అనంతపురం జిల్లా ఎస్పీ జగదీష్ జిల్లా వ్యాప్తంగా హై అలెర్ట్ చేసారు. ఎస్పీ ప్రత్యేక శ్రద్ధ, పర్యవేక్షణతో రాత్రికి రాత్రే గాలింపు చర్యలు చేపట్టారు. ఎట్టకేలకు తప్పిపోయిన ఇద్దరు బాలికలను క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించారు. బాలికలు అందరూ ఒక్కసారిగా ఊపిరి పిల్చుకున్నారు. తల్లిదండ్రుల ఆనందం అవధులు దాటింది.

## జనసేన పార్టీ సమాచార నిర్మాణ సారధిగా 'కోరుకొండ'




ఆమదాలవలస, జూన్ 29 (ప్రభాతవార్త)

శ్రీకాకుళం పార్లమెంటరీ నియోజకవర్గం ప్రెసిడెంట్ సెక్రటరీ సపోర్ట్ టీమ్‌లో శ్రీకాకుళం జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి కోరుకొండ మల్లేశ్వరరావు నియమించారు. ఈ సందర్భంగా సోమవారం కోరుకొండ మల్లేశ్వరరావు మాట్లాడుతూ 12 సంవత్సరాల నుండి జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేసినట్లు తెలిపారు. పార్టీ అధినేత ఆదేశాలు మార్గదర్శకాలు ఆచరిస్తూ తనకు ఇచ్చిన బాధ్యతలను సంపూర్ణంగా నిబద్ధతతో, నిజాయితీతో నిస్వార్థంగా సమర్థవంతంగా నిర్వహించినట్లు మల్లేశ్వరరావు తెలిపారు. జనసేన పార్టీ ఆశయాలు, సిద్ధాంతాల సాధనతో పాటు పార్టీ బలోపేతం కోసం మరింత అంకిత భావంతో క్రమశిక్షణతో శ్రమించి పార్టీని మరింత బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. జనసేన పార్టీ చేసిన సేవలను గుర్తించి జనసేన పార్టీ నిర్మాణ సారధుల సమాచార సేకరణ కమిటీలో నన్ను ఎంపిక చేశారని అన్నారు. నాకు ఈ బాధ్యతలు అప్పగించిన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్‌కు ఈ నిర్ణయంతో భాగస్వాములైన నాయకులకు మల్లేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు.

## కనులపండువగా జగన్నాథుని దేవస్నానం

ఇచ్ఛాపురం, జూన్ 29 ప్రభాతవార్త :



ఇచ్ఛాపురం జగన్నాథస్వామి దేవస్థానంలో ఏటా జ్యేష్ఠ మాసంలో జరిగే జగన్నాథ స్వామి వారి దేవస్నానం, చందనోత్సవ కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిగాయి. జ్యేష్ఠ పౌర్ణమి సందర్భంగా జగన్నాథ, సుభద్ర, బలభద్ర, సుదర్శన మూర్తులను సోమవారం వేకువ జామున జ్యేష్ఠమండపంపై ఆవాహన చేశారు. నిత్యారాధనల అనంతరం విశ్వక్సేన పూజ, పుణ్యాహ వచనం, నవకళశారాధన చేసి, వివిధ రకాల జలాలు, పాలు, పంచామృతాలు, ఫలరసాలతో చతుర్ధ మూర్తులను అభిషేకించారు. సుమారు రెండుగంటలు అభిషేకం జరిపారు. దేవేరులకు నూతన వస్త్రాలను ధరింపజేసి, సుగంధద్రవ్య మిళితమైన చందనాన్ని చతుర్ధమూర్తుల ముఖవర్చ స్సుపై పూతగా వేశారు. దీనినే ఈ ప్రాంతంలో ఉక్కలో వేయడం అని అంటారు. తులసీ, వివిధ రకాల పుష్ప మాలలతో స్వామివారిని విశేషంగా అలంకరించారు. విష్ణు, లలిత సహస్రనామ పారాయణ లను మహిళాభక్తులు పఠించారు. ఆలయ ప్రతినిధుల పర్యవేక్షణలో జరిగిన ఈ వేడుకలలో సేవాకర్తలు కాళ్ల శ్రీనివాసరావు, బచ్చు జగన్నాథరెడ్డి, ప్రకాష కుమార్ సాహు, శాసనపూరి ప్రదీప్, పిలక యాదవ రెడ్డి, సిహెచ్.మధు, ఉల్లి మహేంద్రకుమార్, బత్తిన నాగరాజు, రవికుమార్ తదితరులు పాల్గొని సేవలందించారు. ఆలయ అర్చకులు పద్మకుమార్ ఆచార్యులతో పాటు రామకృష్ణమాచార్యులు, ఎస్.కె.ఎన్. మూర్తి, పాణింగపల్లి రామతేజాచార్యులు, సాయి, సంతోష్, భీమ్ వైదిక కార్యక్రమాలను, అభిషేక, చందనోత్సవ ఘట్టాలను జరిపించారు. వేణుగోపాలస్వామి పాంచాహ్నిక దివ్యతిరు కల్యాణ మహోత్సవంలో భాగంగా ఉదయం పూర్ణాహుతి, సాయంత్రం ధ్వజావరోహన కార్యక్రమాలను జరిపారు.

### 15 రోజులు దర్శనం ఉండదు

జ్యేష్ఠ అమావాస్య వరకూ స్వామివారి దర్శనం ఉండదు. చతుర్ధమూర్తులను చికిటి గదికి తరలించి, అక్కడే వనమూలికలతో శుశ్రూషలు, అర్చన చేస్తారు. నైవేద్యాలన్నీ స్వామి కళలు నిక్షిప్తమైన కళశకే జరుగుతాయి. అమావాస్యరోజున నేత్రోత్సవం జరిపి, భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తారు.

## స్కూల్‌లో సీటు కావాలి.. జేసీని ఆశ్రయించిన చిన్నారి

### ముచ్చట పడ్డ జేసీ వెంటనే డీఈఓకు ఆదేశాలు

పలాస (మందస), జూన్ 29 ప్రభాతవార్త



ఆరో తరగతిలో చేరేందుకు మోడల్ స్కూల్‌లో సీటు ఇవ్వక పోవడంతో ఓ చిన్నారి జిల్లా జాయింట్ కలెక్టర్ (జేసీ)ను ఆశ్రయించింది. శ్రీకాకుళంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల స్వీకరణ (గ్రీవెన్స్) కార్యక్రమంలో మందస మండలం గోపాలపురానికి చెందిన విద్యార్థిని తనుశ్రీ ఫిర్యాదు చేసింది. తాను మోడల్ స్కూల్‌లో ఆరో తరగతిలో ప్రవేశం పొందేందుకు దరఖాస్తు చేసుకున్నప్పటికీ, నాన్‌లోకల్ కేటగిరీ కారణంగా సీటు నిరాకరించారని ఆమె విన్నవించింది. ఈ విషయంపై సంబంధిత అధికారులను సంప్రదించినప్పటికీ పరిష్కారం లభించక పోవడంతో పీజీఆరఎస్‌ను ఆశ్రయించింది. విద్యార్థిని ఫిర్యాదుపై స్పందించిన జాయింట్ కలెక్టర్, సమస్యను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారికి ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థినికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

## వైయస్సార్ సీపీ కుటుంబాలను పరామర్శించిన గోవింద్

సంతబొమ్మాళి, జూన్ 29 ప్రభాతవార్త



సంతబొమ్మాళి మండలంలోని సుగ్గువానిపేటలో ఇటీవల గుండె పోటుతో మరణించిన మాజీ వాలంటీర్ సుగ్గు వెంకట రమణారెడ్డి కుటుంబ సభ్యులను వైయస్సార్ సీపీ రాష్ట్ర జాయింట్ కార్యదర్శి కెల్లి జగన్నాయకులు (గోవింద్) పరామర్శించారు. అలాగే సున్నాపల్లి గ్రామంలో సి ఎఫ్ భర్త మోస గురుమూర్తి ఇటీవల గోవాలో గుండె పోటుతో మృతి చెందారు. అదే గ్రామంలో మరణించిన అర్జాల వరలక్ష్మి కుటుంబ సభ్యులను కూడా పరామర్శించి వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎసఆర్సీపీ రాష్ట్ర రైతు విభాగ కార్యదర్శి సుగ్గు రామిరెడ్డి, వైస్ ఎంపీపీ ప్రతినిధి నక్క బీమారావు, దండుగోపాలపురం సర్పంచ్ ప్రతినిధి మార్పు నాఘభూషణ మండల ఆర్ టి ఐ అధ్యక్షులు ముద్దపు ఆనందరావు పాల్గొన్నారు.

## ఘనంగా జేష్టాభిషేకం

వీరఘట్టం, జూన్ 29 ప్రభాతవార్త



మండల కేంద్రం వీరఘట్టంలోని శ్రీ జగన్నాథ స్వామి ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకులు లింగరాజ్ రథో ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా జేష్టాభిషేకాన్ని నిర్వ హించారు. దేవతామూర్తులు సుభద్ర, బలబద్ర, జగన్నాథ స్వామిలకు ఫల రసాలు, సుగంధ ద్రవ్యాలు, పంచామృతాలు, నారికేళాలతో 108 కళాశాలతో అభిషేకాన్ని నిర్వహించారు. అలాగే జులై 14వ తేదీన నేత్రోత్సవం, 16వ తేదీన మొదటి రథయాత్ర, 20వ తేదీన హీరాపంచమి, 24వ తేదీన మారు రథయాత్రను నిర్వహించనున్నట్లు లింగరాజ్ రథో తెలిపారు.

## టెట్ రద్దుకు చట్ట సవరణ చేయాలి

### ఎమ్మెల్యే జయకృష్ణకు ఫ్యాప్టో విజ్ఞాపన పత్రం

వీరఘట్టం, జూన్ 29 ప్రభాతవార్త



టెట్‌ను రద్దు చేయడానికి చట్ట సవరణ చేయాలని కోరుతూ ఫ్యాప్టో ఆధ్వర్యంలో సోమవారం ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణకు వినతి పత్రాన్ని అందజేశారు. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్‌ను పూర్తిగా మినహాయించాలని, టెట్‌ను తప్పనిసరి చేస్తే ప్రిపరేషన్ కోసం ఎక్కువ శాతం ఉపాధ్యాయులు సెలవులు పెట్టే అవకాశం ఉందని, దీనివల్ల టీచర్లతో పాటు, విద్యార్థులు కూడా ఇబ్బందులు పడే అవకాశం ఉందన్నారు. అందువల్ల 2009 విద్యాహక్కు చట్టాన్ని సవరణ చేసి ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ నుండి పూర్తిగా మినహాయింపు ఇవ్వాలని, చట్ట సవరణ అయ్యే లోపల ఇన్ సర్వీస్ టీచర్లకు ప్రత్యేక టెట్‌ను నిర్వహించాలని పార్వతీపురం మన్యం జిల్లా ఫ్యాప్టో జనరల్ సెక్రటరీ గొల్ల ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణకు మెమోరండం అందజేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు మజ్జి పైడిరాజు ఏపీటీఎఫ్ నాయకులు మురళి, ధనుంజయ్, రామారావు బిటి ఏ నాయకులు కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## రిజిస్టర్ ఉపాధ్యాయ సంఘాలను పిలవకపోవడంలో ఆంతర్యం ఏమిటి?

వీరఘట్టం, జూన్ 29 ప్రభాతవార్త

రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ వారు నిర్వహించిన ఉపాధ్యాయ సంఘాల సమావేశంలో రిజిస్టర్ ఉపాధ్యాయ సంఘాలను పిలవకపోవడంలో ఆంతర్యం ఏమిటని ఎస్సీ, ఎస్టీ, పిఎఫ్ ఏపీ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (1991) తీవ్రంగా ఖండిస్తుందని ఆ నాయకులు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇది అప్రజాస్వామికం, చాలా అన్యాయమని వారన్నారు. ఎన్నడూ లేని విధగా ఇటువంటి నిర్ణయాలు తీసుకోవటం ఉపాధ్యాయ లోకానికి తీరని అన్యాయమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఉన్న వివిధ ఉపాధ్యాయ సంఘాలు రిజిస్టర్డ్ మరియు రికగ్నైజ్డ్ సంఘాలు ప్రతి సంఘం వారి సభ్యుల సభ్యత్వం ఎంతో వివరంగా విద్యాశాఖ డైరెక్టర్ ప్రకటించాలని ఎస్సీ ఎస్టీ టీచర్స్ ఫెడరేషన్ 1991 ఆంధ్రప్రదేశ్ వారు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే దీనిపై విద్యాశాఖ మంత్రికి మరియు ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తామని వారు స్పష్టం చేశారు.

## బాధితులకు అండగా కూటమి ప్రభుత్వం

### ఎమ్మెల్యే, పియుసి చైర్మన్ కూన

ఆమదాలవలస, జూన్ 29 (ప్రభాతవార్త)



నియోజకవర్గంలో పొందూరు మండలం కింతలి గ్రామానికి చెందిన పైడిపెద్ది జనార్దనరావు కుటుంబానికి రూ.21వేల రూపాయలు, ఆమదాల వలస మండలం కొరపాం గ్రామానికి చెందిన సేపాన పార్వతమ్మ కుటుం బానికి రూ.45 వేల రూపాయలు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును ఎమ్మెల్యే కూన రవికుమార్ బాధిత కుటుంబాల ఇంటికి వెళ్లి పంపిణీ చేశారు. వైద్య ఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి అందించాలని పలువురు ఎమ్మెల్యే రవి కుమార్‌కు విన్నవించుకున్నారు. వారి విన్నపాన్ని ఎమ్మెల్యే ముఖ్యమంత్రి కార్యాలయానికి అందించారు. ఈ దరఖాస్తులు పరిశీలించిన ముఖ్యమంత్రి కార్యాలయం సహాయనిధి మంజూరు చేశారు. సీఎం సహాయనిధి చెక్కులను వైద్య చికిత్స నిమిత్తం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి కార్యకర్తకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని అన్నారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి ధ్యేయంగా పని చేస్తుందని అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న పలు సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకుని వెళ్లవలసిన బాధ్యత ప్రతి టిడిపి కార్యకర్తపై ఉందని అన్నారు. సీఎంఆరఎఫ్ సహాయం అందడంతో లబ్ధిదారుల కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే రవికుమార్‌కు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. వండాన ఉదయ్ కుమార్, చేపాన సత్తిరాజు, పొట్నూరు కొండయ్య, మట్ట జగ్గారావు, తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అర్హతకు మించి విమర్శిస్తే క్షమించరు

కోటబొమ్మాళి, జూన్ 29 ప్రభాతవార్త:



ప్రజాక్షేత్రంలో మన్ననలు పొందలేని వ్యక్తులు అర్హతకు మించి విమర్శలు చేస్తే ఏ ఒక్కరు క్షమించరని రాష్ట్ర కళింగ కోమటి కార్పొరేషన్ చైర్మన్ బోయిన గోవిందరాజులు ధ్వజమెత్తారు. ఆయన సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి విషయంలో ఎక్కడైనా అటంకం సృష్టించాలనుకునే వైసీపీ గూండాలకు, శ్రేణులకు అమరావతిలో పట్టిన గతే వారికి పడుతుందన్నారు. దేశానికి తద్వారా రాష్ట్రానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్, మా నాయకులు రాష్ట్ర కేంద్రమంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, రామ్మోహన్నాయుడులు చేస్తున్న అభివృద్ధిని చూసి వైసీపీ ఓర్వలేక ఉండలేకపోతున్నారన్నారు. ఈ అక్కసుతో చోటా నేతలు కులాలను రెచ్చగొట్టే విధానం, దుర్భాషలాడే తీరు సరికాదన్నారు. ఏం మాకు మాత్రం కులాల్లేవా? మేం రెచ్చగొటంలేమా? అంటూ అగ్రహం వ్యక్తం చేశారు. ఆయనతో పాటు మండల పార్టీ అధ్యక్షుడు బోయిన సత్యశ్రీనివాస్ ఉన్నారు.

## సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా జాతీయ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే, పియుసి కమిటీ చైర్మన్



కూన ఆమదాలవలస, జూన్ 29 (ప్రభాతవార్త)

భారతదేశ రాజధాని న్యూఢిల్లీ లో నిర్వహించిన సాఫ్ట్‌బాల్ అసోసి యేషన్ ఆఫ్ ఇండియా జాతీయ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్య క్షులు, ఆమదాలవలస ఎమ్మెల్యే, రాష్ట్ర పియుసి కమిటీ చైర్మన్ కూన రవికుమార్ పాల్గొన్నారు. దేశం లోని వివిధ రాష్ట్రాల సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ల ప్రతినిధులు హాజరైన ఈ సమావేశంలో సాఫ్ట్‌బాల్ క్రీడాభివృద్ధి, జాతీయ స్థాయి పోటీల నిర్వహణ, యువ క్రీడాకారులకు మెరుగైన శిక్షణ, రాష్ట్రాల మధ్య సమన్వయం, భవిష్యత్ కార్యాచరణ తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో సాఫ్ట్‌బాల్ క్రీడాభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలు, యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు తీసుకుంటున్న చర్యలను కూన రవికుమార్ సమావేశంలో వివరించారు. రాష్ట్రంలో సాఫ్ట్‌బాల్ క్రీడను మరింత విస్తరించేందుకు అవసరమైన సహకారాన్ని అందించేందుకు కృషి చేస్తామని ఆయన తెలిపారు. జాతీయ స్థాయి సమావేశంలో ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహించడం రాష్ట్రానికి గర్వ కారణమని, క్రీడాకారులకు మరిన్ని అవకాశాలు కల్పించేందుకు నిరంతరం కృషి కొనసాగిస్తామని కూన రవికుమార్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## భర్తకు తలకొరివి పెట్టిన భార్య

### పలాసలో భావోద్వేగ ఘటన




పలాస, జూన్ 29 ప్రభాతవార్త :

పలాస పట్టణంలోని జగనన్న కాలనీలో సోమవారం హృదయ విదారక ఘటన చోటు చేసుకుంది. కాలనీకి చెందిన నెయ్యిల ఉమా మహేశ్వరరావు (56) అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు, సన్నిహితులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. సోమవారం నిర్వహించిన అంత్యక్రియలకు బంధుమిత్రులు, స్థానికులు పెద్ద సంఖ్యలో హాజరై ఉమా మహేశ్వరరావుకు తుది వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయన భార్య నెయ్యిల సరస్వతి భర్తకు సంప్రదాయం ప్రకారం తలకొరివి పెట్టడం అక్కడున్న వారిని భావోద్వేగానికి గురి చేసింది. భర్తతో కలిసి ఎన్నో ఏళ్ల దాంపత్య జీవితాన్ని గడిపిన ఆమె, కన్నీరుమున్నీరుగా విలపిస్తూ భర్తకు చివరి వీడ్కోలు పలికిన దృశ్యం అందరినీ కంటతడి పెట్టించింది. అంత్యక్రియల సందర్భంగా కుటుంబ సభ్యులు, బంధువులు ఉమా మహేశ్వరరావు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం హిందూ సంప్రదాయాల ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు. భార్య సరస్వతి భర్తకు తలకొరివి పెట్టిన సంఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది. జీవితాంతం తోడుగా ఉన్న భర్తకు చివరి కర్తవ్యాన్ని నిర్వర్తిస్తూ ఆమె చూపిన ధైర్యం పలువురిని భావోద్వేగానికి గురి చేసింది.

## ఏరువాక పౌర్ణమి రైతు సంస్కృతికి ప్రతీక



శ్రీకాకుళం, జూన్ 29 ప్రభాతవార్త

ప్రభుత్వం రైతులకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పష్టం చేశారు. ఎచ్చెర్ల నియోజక వర్గం లావేరు మండలం లావేరులో సోమ వారం ఆయనతో పాటు విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు, నియోజకవర్గం శాసన సభ్యులు నడికుదిటి ఈశ్వరరావు ఏరువాక పౌర్ణమిలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ ఏరువాక పౌర్ణమిలో పాల్గొనడం ఒక అద్భుతమని, ఈ కార్యక్రమంలో పాల్గొనడం ఇదే మొదటిసారన్నారు. ఈ రోజు ఇక్కడ నాగలి పట్టి సాంప్రదాయబద్ధంగా సాగును ప్రారంభించడం చాలా సంతోషాన్నిచ్చిందని కొనియాడారు. ప్రభుత్వం ద్వారా రైతులకు అందుతున్న విత్తనాలు, పీఎం కిసాన్, రైతు భరోసా నిధులు, రైతు సేవా కేంద్రాల ద్వారా ఆధార్ ఆధారిత ఎరువుల (యూరియా, డీఏపీ) పంపిణీ వంటి వాటి గురించి వివరించారు. ఏరువాక పౌర్ణమి చేపట్టిన 50 సెంట్లలో ఏర్పాటు చేసిన ఈ సేంద్రీయ ప్రదర్శనా క్షేత్రం చుట్టుపక్కల రైతులకు ఒక మంచి అవగాహన కలిగిస్తుందన్నారు. ఏపీ ఫార్మర్ యాప్ ద్వారా పంటలకు పట్టే తెగుళ్లు, వాటి నివారణోపాయాల గురించి సులభంగా తెలుసుకోవచ్చన్నారు. విజయనగరం పార్లమెంటు సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ ఏ రంగంలో ఉన్నవారైనా వ్యవసాయం మీదే ఆధారపడి జీవిస్తున్నట్లు చెప్పారు. ప్రధానమైన ఆహారం లేకపోతే జీవించలేమన్నారు. ఏరువాక పౌర్ణమి కార్యక్రమం తొలి పలకరింపుగా తొలి దిశగా ఉన్న ఈ ఏరువాక కార్యక్రమానికి అందరం పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని రైతులను ఆయన కోరారు. సేంద్రీయ ఎరువుల్ని ఉపయోగించి వ్యవసాయాన్ని చేయాలన్నారు. ఎచ్చెర్ల శాసన సభ్యులు నడికుదిటి ఈశ్వరరావు మాట్లాడుతూ వరి విత్తనాలు గాని, ఖరీఫ్ పంటల్లో ఏవైనా విత్తనాలు, ఏ పంటలైతే పండిస్తామో ఆ పంటలన్నింటికీ కూడా విత్తనాలు వేసుకునేది పౌర్ణమి రోజుని, వ్యవసాయం చేయడం మన సాంప్రదా యం, విత్తనాలు చల్లడం మన అందరి సాంప్రదాయమన్నారు. రైతులకు అన్ని రకాలుగా సాగునీరు, విత్తనం, ఎరువులు సమయానికి ఇచ్చి, రైతుని రైతు బాంధవుడిగా పేరుగాంచినటువంటి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎప్పుడూ కూడా వ్యవసాయానికి ప్రాధాన్యతనిస్తూనే ఉన్నారన్నారు. రైతు దేశానికి వెన్నెముక అయితే, రైతుకి వెన్నెముక వ్యవసాయం. ఆ వ్యవసాయం బాగున్న రోజే ఈరోజు మనం ఏదైనా సాధించుకోగలుగుతామన్నారు. మడ్డువలస ప్రాజెక్టు బాగు చేయించాలని ముఖ్యమంత్రి వద్దకు వెళితే నిధులు మంజూరు చేశారని, పనులు పూర్తి అయితే లావేరు, జి. సిగడాం, బుడుమూరు పెద్ద చెరువుకు నీరొస్తే అవతల ఎచ్చెర్లకు, తాగునీరుకి కొదవ ఉండదన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మన అందరికీ ఒక లక్ష్యం ఇచ్చారని, ఆ లక్ష్యం పేరే వికసిత్ భారత్. ఆ వికసిత్ భారత్ సాధించాలంటే, భారతదేశం అభివృద్ధి చెందిన దేశం అవ్వాలంటే, ఎక్కువగా ఆధారపడినటువంటి మన జీడీపీలో, దేశ అభివృద్ధిలో, జీడీపీలో ఎక్కువ సింహభాగం ఉన్నటువంటి వ్యవసాయాన్ని అభివృద్ధి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ హరిఒం పాండ్య, సుడా ఎస్ఈ, నియోజకవర్గ ప్రత్యేక అధికారి సుగుణాకరరావు, ఎపిఎంఐపి శ్రీనివాసరావు, వ్యవసాయ శాఖ ఎడి సురేష్, ఏఎంసి చైర్మన్ పద్మ, సచివాలయ సిబ్బంది, రైతులు, యువత, మహిళలు, ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# శ్రీకాకుళం వార్త



## వ్యవసాయాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

### ఏరువాకలో పాల్గొన్న ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ

వీరఘట్టం, జూన్ 29 ప్రభాతవార్త



వ్యవసాయాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని, ఆ దిశలోనే రాష్ట్ర ప్రభుత్వం పయనిస్తుందని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. సోమవారం మండల ంలోని ఎం.రాజపురం గ్రామంలో 'ఏరువాక పౌర్ణమి' కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని రైతులకు అవసరమయ్యే సకల సదుపాయాలను ప్రభుత్వం అందిస్తుందన్నారు. రైతే రాష్ట్రానికి వెన్నెముక అనే భావనతో కూటమి ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. రైతు పంటకు గిట్టుబాటు ధర కల్పించడం, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు సకాలంలో అందించడం, సాగునీటి సౌకర్యాల మెరుగుదల, వ్యవసాయ యాంత్రీకరణకు ప్రోత్సాహం, రైతులకు సాంకేతిక పరిజ్ఞానం అందించడం వంటి అనేక కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. అలాగే వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి పలు సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నామని, రైతుల ఆదాయం పెరిగేలా ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తోందని అన్నారు. రైతు కుటుంబాల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని, వ్యవసాయాన్ని లాభసాటి వృత్తిగా మార్చేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా రైతులతో పొలంలో దిగి సాంప్రదాయ బద్ధంగా ఏరువాక కార్యక్రమాన్ని ప్రారంభించారు. రైతులతో మమేకమై వారి కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైతులకు ఏరువాక పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులందరికీ మంచి పంటలు పండాలని రైతులందరూ సుభిక్షంగా ఉండాలని ఎమ్మెల్యే జయకృష్ణ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడి కే.రత్నకుమారి, మండల వ్యవసాయ శాఖ అధికారి జక్కు సౌజన్య, మాజీ ఏఎంసీ చైర్మన్ పొదిలాపు కృష్ణమూర్తి నాయుడు, మండల సీనియర్ నాయకులు ఉదయాన ఉదయ భాస్కర్, పట్టణ శాఖ సీనియర్ నాయకులు జామి లక్ష్మీనారాయణ, చింత ఉమామహేశ్వరరావు, గొర్లె గౌరునాయుడు, తూముల రమేష్, జంపు శేఖర్, చుక్క శ్రీనివాసరావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## జగన్నాథ మందిరంలో జేష్ట అభిషేకాలు

కంచిలి, జూన్ 29 ప్రభాతవార్త



కంచిలి పంచాయతీలో మఠం కంచిలిలో జగన్నాథస్వామి దేవాలయం, అలాగే కొల్లూరు గ్రామంలో శ్రీ జగన్నాథ స్వామి ఆలయంలో ఏటా జరిగే ఉత్సవాల్లో భాగంగా జ్యేష్ట అభిషేకాలు సోమవారం ఆలయ ప్రధాన అర్చకులు జానకి రాందాస్ మహంతి, పద్మనాభ పాడిలు నిర్వహించారు. జేష్ట పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈ అభిషేకాలు నిర్వహించినట్లు తెలిపారు. సాధారణంగా ప్రతీ దేవాలయాల్లో మూలవిరాట్ గర్భగుడికి పరిమితమైతే ఇక్కడ మాత్రం అందుకు భిన్నంగా ప్రసిద్ధ పూరి శ్రీక్షేత్రం అనుసరించి ఉదయాన్నే శ్రీ జగన్నాథ స్వామి వారిని గర్భ గుడి నుండి ఆలయ మండపం వద్దకు తీసుకొచ్చి కొలువు తీరుస్తారు. విశ్వక్షేణ పూజ, పుణ్యహవచనం, నవ కలశారాధన వేదపండితుల మంత్రోచ్చరణలతో జరిపి వివిధ పవిత్ర నదీ జలాలతో సుగంధ ద్రవ్యాలతో అభిషేకించి శ్రీ చందనాన్ని సుగంధ ద్రవ్యాలతో అలంకరిస్తారు. నూతన వస్త్రాలను దేవతామూర్తులకు అలంకరించి, నేటి నుండి 15 రోజులపాటు స్వామివారికి ప్రతిరోజు సమర్పించే అన్నభోగం, వడపప్పు పానకం వివిధ రకాల పండ్లను స్వామివారికి నివేదిస్తారు. ఏటా జరిగే జగన్నాథస్వామి వారి ఉత్సవాల్లో జ్యేష్ట అభిషేకాలు ప్రథమ వేడుక కావడం విశేషం. ఈ వేడుకలో ఆలయ ప్రధాన అర్చకులు జానకిరామ్ దాస్ మహంతి, పద్మనాభ పాడి మరియు వేద పండితులు దుర్గాప్రసాద్ పాండా, పవున్ మహంతి ఆలయ మేనేజర్ బెండి రామారావు, కొల్లూరు గ్రామ పెద్దలు, గ్రామప్రజలు యువకులు మహిళలు పాల్గొన్నారు.

## బరితెగిస్తున్న కంకర మాఫియా...

### అధికారుల మౌనంపై అనుమానాలు




పలాస, జూన్ 29 ప్రభాతవార్త

పలాస మండలంలోని మొగులపాడు గ్రామం పరిసర ప్రాంతాల్లో కంకర మాఫియా బరి తెగించినట్లు స్థానికులు ఆరోపిస్తు న్నారు. వర్షాకాలం ప్రారంభానికి ముందే సమీపంలోని కొండలను తవ్వి, వేలాది క్యూబిక్ మీటర్ల కంకరను ఖాళీ స్థలాల్లో భారీగా నిల్వ చేస్తున్నట్లు కనిపిస్తోంది. ఈ నిల్వలు లక్షలాది రూపాయల విలువ ఉంటాయని స్థానికులు పేర్కొంటున్నారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ఈ భారీ కంకర నిల్వలు పలాస మండలం మొగులపాడులోని రెవెన్యూ కార్యాలయానికి కూతవేటు దూరంలోనే ఉండటం. అయినప్పటికీ సంబంధిత అధికారులు ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇంత పెద్ద ఎత్తున తవ్వకాలు, రవాణా,నిల్వలు అధికారుల దృష్టికి రాకపోవడం ఎలా సాధ్యమని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. స్థానికుల కథనం ప్రకారం, గత కొన్ని నెలలుగా కొండలను యంత్రాలతో తవ్వి కంకరను తరలించి వివిధ ప్రాంతాల్లో నిల్వ చేస్తున్నారు. రాత్రి వేళల్లోనే కాకుండా పగటి పూట కూడా పలు రకాల రవాణా వాహనాలతో ఈ కార్యకలాపాలు జరుగుతున్నాయని ఆరోపిస్తున్నారు. దీంతో ప్రకృతి సంపద నాశనం కావడంతో పాటు పర్యావరణానికి తీవ్ర నష్టం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వానికి రావాల్సిన రాయల్టీ, పన్నుల రూపంలో కోట్ల రూపాయల ఆదాయం అక్రమ తవ్వకాల వల్ల నష్టపోతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అక్రమంగా నిల్వ చేసిన కంకరను అవసరమైనప్పుడు విక్రయించేందుకు ముందస్తుగా సిద్ధం చేసినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంలో సంబంధిత శాఖల నిర్లక్ష్యమా? లేక కొందరి అండదండలతోనే ఈ అక్రమ వ్యాపారం సాగుతోందా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అక్రమ తవ్వకాలపై గతంలో పలుమార్లు ఫిర్యాదులు వచ్చినప్పటికీ ఇప్పటివరకు కఠిన చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు చెబుతున్నారు. స్థానిక ప్రజలు జిల్లా యంత్రాంగం,మైనింగ్, రెవెన్యూ, విజిలెన్స్ అధికారులు వెంటనే రంగంలోకి దిగి అక్రమ కంకర నిల్వలను స్వాధీనం చేసుకుని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.అలాగే పలాస మండలం మొగులపాడు ప్రాంతంలో కొండల విధ్వంసంపై సమగ్ర విచారణ జరిపి,ప్రభుత్వానికి జరిగిన నష్టాన్ని అంచనా వేసి వసూలు చేయాలని కోరుతున్నారు.

## తల్లిదండ్రులను హత్య చేసిన కేసులో నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష

### జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి

శ్రీకాకుళం, జూన్ 29 ప్రభాతవార్త



తల్లిదండ్రులను హత్య చేసిన కేసులో నిందితుడికి సోంపేట 6వ అదనపు జిల్లా కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష విధించినట్లు జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి సోమవారం నాడు ఒక ప్రకటన ద్వారా తెలిపారు. నిందితుడు బూసి శ్రీనివాసరావుకు గౌరవ 6వ అదనపు జిల్లా సెషన్స్ న్యాయమూర్తి కోడూరు కిశోర్ బాబు సోమవారం తీర్పు వెలువరించారు. కేసు వివరాల ప్రకారం, దాంపత్య జీవితానికి సంబంధించిన విషయాల్లో తన వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులు జోక్యం చేసుకుంటున్నారనే ఆగ్రహంతో, నిందితుడు 07/06/2022 అర్ధరాత్రి సమయంలో కాపు గోపాలపురంలోని తన తల్లిదండ్రుల ఇంటికి వెళ్లి, ఇనుప కత్తి మరియు దుడ్డుకర్రతో అత్యంత దారుణంగా దాడి చేశాడు. ఈ ఘటనలో తల్లి బూసి భాగవతమ్మ అక్కడికక్కడే మృతి చెందగా, తండ్రి బూసి రామారావు చికిత్స పొందుతూ 09/06/2022న మరణించారు. మృతుల కోడలు బూసి బృందారణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పాతపట్నం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయబడింది. అప్పటి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.వినోద్ బాబు సమగ్ర దర్యాప్తు నిర్వహించి, నిందితుడిని అరెస్ట్ చేసి, పటిష్టమైన సాక్ష్యాధారాలతో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. విచారణ సందర్భంగా అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ దువ్వు జగన్నాయకులు సమర్థవంతంగా వాదనలు వినిపించగా, నిందితుడిపై అభియోగాలు రుజువైనట్లు న్యాయస్థానం నిర్ధారించింది. న్యాయస్థానం నిందితుడిని యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. అదనంగా రూ.1,000/ జరిమానా విధించగా, జరిమానా చెల్లించని పక్షంలో మూడు (03) నెలల సాధారణ కారాగార శిక్ష అనుభవించాలని ఆదేశించింది.

**CHANGE OF NAME**

I, NAMBALLA DAMODARA RAO, S/o NAMBALLA APPA RAO, R/O PLOT NO 157, 4th Line, Purushotham Nagar Colony, Gujarathipeta, Srikakulam 532005. Have changed my name from NAMBALA DAMODARA RAO (Old name) to NAMBALLA DAMODARA RAO (New name). Henceforth I will be called as NAMBALLA DAMODARA RAO (New name) for all purpose.

30 -6Pg9th cheli.qxd:30 -6Pg9th cheli.qxd 1/1/02 6:04 AM Page 1





అందంగా మెరిసే ముఖంపై చిన్న మొటిమ వచ్చినా అమ్మాయిలకు ముచ్చెమటలు పొస్తాయి. ఇందుకు హార్మోన్ల ప్రభావంతో పాటు అధిక జిడ్డు, దుమ్మూధూళీ, **ఆహారపుటలవాట్లు**.. వంటి ఎన్నో కారణాలు. అలాగని వీటిని తగ్గించుకోవడానికి ఖరీదైన క్రీములు వాడుతున్నారా? అవేం అక్కర్లేదు.. ఇంట్లోని పదార్థాలతో ఈ చిట్కాలు పాటించి

# ముత్యమంత మొటిమే కదా!

చూడండి. దాల్చిన చెక్కలో ఉండే యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు మొటిమలకు కారణమైన బ్యాక్టీరియాని చంపేస్తాయి. రెండు చెంచాలు తేనె,కాసిని పాలు, చెంచా దాల్చిన చెక్కపొడి కలుపుకోవాలి. దీన్ని ముఖానికి పూతలా వేసి పావు గంట తరవాత గోరువెచ్చని నీళ్లతో ఇలా చేయడంవల్ల మొటిమలు తగ్గడమే కాదు,మచ్చలూ పోతాయి.జిడ్డుని తొలగించి మొటిమలు రాకుండా బొప్పాయి అడ్డుకుంటుంది. బాగా పండిన బొప్పాయి గుజ్జులో పంచదార, పెరుగు కలిపిముఖానికి రాసి మృదువుగా మర్దన చేయాలి. అపై గోరువెచ్చని నీళ్లతో కడిగేసుకోవాలి. రెండు చెంచాల నారింజ తొక్కల పొడికి తగినన్ని పాలు చేర్చి ముఖానికి రాసి ఇరవై నిమిషాల తరవాత కడిగేయాలి. వీటితో మొటిమలు తగ్గడమే కాదు చర్మం కొత్త మెరుపుతో కనిపి స్తుంది. కలబంద గుజ్జులో కాస్త నిమ్మరసం తేనె కలిపి రోజూ రాసి ఆరనివ్వండి ఇలా పదిహేను రోజులు చేస్తే క్రమంగా మొటిమలు తగ్గుముఖం పడతాయి.

# దానాలు ఫలించాలంటే..

**దానం ఓ మహోత్తర కార్యం.** నువ్వు ఏ దానం అయినా చేయి కాని కుటుంబ అవసరాలు, నీ జీవితానికి సంబంధించినవి తీర్చుకుని దానం చేయి. అలా కాకుండ కొంత మంది మాకు దానం చేస్తే పుణ్యం వస్తుంది. మేము స్వర్గ సుఖాలు పొందవచ్చని మూఢంగా దానాలు చేస్తుంటారు. కుటుంబంలో కొడుకులు కావొచ్చు. కూతుర్లు కావొచ్చు వాళ్ల అవసరాలకు కొంత మంది, వాళ్లు అనారోగ్యంగా ఉన్నా ఖర్చు పెట్టరు. వేలకు, వేలు వివిధ సంస్థలకు డబ్బు దానం చేస్తుంటారు. అది వారి సొంత డబ్బు అయినా ఎంతో కొంత కుటుంబ అవసరాలకు ఉంచుకుని దానం చేస్తే బాగుంటుంది. ఇది కొంత మందికి నచ్చదు. అందుకే హతమార్చడం చేస్తున్నారు. ఉదాహరణకు ఓ ముదుసలికి నెల, నెల ప్రభుత్వ పింఛను వస్తుంది. ఆవిడను కొడుకు,కోడలు తరిమివేశారు. కూతురు ఇంటికి వచ్చినా ఆమె చేసే దానాలకు అంతులేదు కూతురు అనారోగ్యంగా ఉన్నా, ఏమి పట్టనట్లుగా డబ్బు దానం చేస్తుడటం ఆమె మూర్ఖత్వం. అట్టి దానాలు ఎప్పటికి ఫలించవు. వీళ్లేమో మేము దానాలు చేశాం మాకు పుణ్యం వస్తుంది అనుకుంటారు. నిజానికి వారు పాపం మూట గట్టుకుంటారు. మా డబ్బు పేదలకు చేరుతుంది కదా అనుకుంటారు. కానీ నీకు అన్ని సమాకూర్చే నీ వాళ్లకు నీవు ఏమి ఖర్చు పెట్టవు. నేను అంత చేశాను, ఇంత చేశాను అని వాళ్లకు మనసులో ఉండొచ్చు కాని ఏవి నీకు మంచి జరగదు. అవసాన దశలో నీవు నీ కుటుంబ సభ్యులు, వాళ్ళ రోగాలకు డబ్బు ఖర్చు పెడితే అదే నీకు పుణ్యం. నువ్వు చేసేది దానం అయినా, ఆ దానంలో నీ వాళ్లు కూడ ఉన్నారు. నీ వాళ్లకు ఖర్చు పెడితే ఆ పన్నులకు పెట్టినట్లే. ఇప్పటికైనా ఎవరైనా డబ్బు దానం చేయాలిసివస్తే ముందు కుటుంబ అవసరాలు, తర్వాత దానాలు చేస్తే అనంత ఫలితం వస్తుంది. భగవంతుడు కూడ వున్న దానిలో కొంచెం నాకు ఇస్తే నీకు పుణ్యం కలుగుతుంది అని మన పురాణ గ్రంధాలలో, వివిధ సగ్రంధాలలో కూడ ఉంది. మొత్తానికి వున్న దానిలో దానంచేస్తే కలిగే ప్రయోజనాలు ఎన్నో.

# ఒత్తిడికి దూరంగా..



ఒత్తిడి మనకు పెద్దగా పరిచయం అక్కర్లేని పేరు. నిద్రలేమి, నెలసరి సమస్యలు.. ఇలా దీనికి కారణాలు బోలెడు. కాబట్టి ఓ రెండు నిమిషాలు ఇలా చేస్తే అది కాస్తా మటుమాయం. కళ్లు మూసుకొని దీర్ఘశ్వాస తీసుకొని వీలైనంత సేపు అలా పట్టి ఉంచండి. తర్వాత నెమ్మదిగా వదలాలి. ఈ పక్రియలో ధ్యాసంతా పొట్ట మీదే ఉంచాలి. ఇలా రెండు నిమిషాలు చేస్తే చాలు. ఈ వ్యాయామం నాడీవ్యవస్థను నెమ్మదింపజేసి.. ఒత్తిడిని దూరం చేస్తుంది. చిన్న చిన్న వార్మప్‌లు.. నడుముపై చేతులు ఉంచి వెనక్కి వాలడం, జాగింగ్, స్ట్రెచింగ్ వంటివీ చేయొచ్చు. వేగంగా కొద్దిసేపు నడిచినా ఫలితం కనిపిస్తుంది. నేల మీద కాళ్లు ముడుచుకొని కూర్చోవాలి. కళ్లు మూసి, మీరు ప్రేమించే వాళ్లనో.. మీకు ఆనందాన్నిచ్చే సందర్భాన్నో గుర్తు తెచ్చుకోండి. మనసు ఇతర అంశాల మీదకి మళ్లి ఆందోళన దూరం అవుతుంది. మనసు లగ్నం కావట్లేదనిపిస్తే ఎదురుగా ఉన్న వస్తువుని తదేకంగా చూడండి. కళ్లు మూసి మరోసారి ప్రయత్నించండి. మనసు తేలిక పడుతుంది.. ఇతరులతో పోలిస్తే మీరు ఏ అంశాల్లో మెరుగ్గా ఉన్నారో ఆలోచించుకోండి. కనీసం మూడు అంశాలను ఎతుక్కున్నా చాలు. జీవితం మీద సానుకూల భావన ఏర్పడు తుంది. ఇదీ ఒత్తిడిని తగ్గించే మార్గమే. పోనీ.. మంచి జోక్‌ని గుర్తుతెచ్చుకోండి.లేదా చదవండి.. నవ్వు ఎండార్ఫిన్లను విడుదల చేసి, ఒత్తిడిని దూరం చేస్తుంది. మొక్కల మధ్యకు వెళ్లండి. ఆ పూల సువాసనలు చూడండి. ఆ అవకాశం లేకపోతే ఆరోమా ఆయిల్‌ని వాసన చూడటమో.. సెంటెడ్ క్యాండిల్‌ని వెలిగించడమో చేసినా చాలు. ఇవి మనసును తేలికపరిచి ఒత్తిడిని తగ్గిస్తాయి.

# శశి కాంచనం



నారీమణులకు నగలంటేనే ముఖం వెలిగిపోతుంది. కానీ ఒకామెకు కళ్లు చెదరగొట్టే అమూల్య ఆభరణాలు తనకు తారసపడినా చలించలేదు. ఎక్కడో ఆలోచనలో మెదడు పాడుచేసుకోలేదు. దానిని సొంతదారులకందించే వరకు నిద్రలేదంటే నమ్మండి. ఆమెలోని నిజాయితీ మహిళాలోకానికి మకుటాయమానం. జీవనోపాధికి చేస్తున్న ఉద్యోగం చిన్నదే అయినా కళ్లెదుట 'కనకపు సంచి' మెరుస్తూనే ఉన్నా ఆమె మనసు పాడుచేసుకోలేకపోవడమే ఇక్కడ చెప్పుకోవాలి. . ఆమె అభినందనీయురాలు. బెంగళూరుకు చెందిన ఓ కుటుంబం తిరుపతిలో పెళ్లి వేడుకలో ఘనంగా నిర్వహించుకుని తిరుగు ప్రయాణ సమయంలో ఓ హ్యాండ్ బ్యాగ్ మరచిపోయారు. తీరా ఇంటికి చేరుకున్నాక దాదాపు 45 లక్షల రూపాయల విలువైన 300 గ్రాముల బంగారు ఆభరణాలున్న హ్యాండ్ బ్యాంగ్ ఎక్కడో ఏ హోటల్‌లోనో పొగొట్టుకున్నాట్లు గుర్తించి ఆందోళన చెందారు. విషయం పోలీస్‌ల దాక వెళ్లి పెళ్లివారు చివర్లో ఆగిన తిరుపతి గరుడాద్రి హోటల్ క్యాషియర్ శశిని అడగ్గా ఆమె నోటివెంట పలికిన పలుకులు ఇక్కడ ప్రస్తావనార్హం. ఔను! ఒక హ్యాండ్ బ్యాగ్ దొరికింది. భద్రంగా దాచి ఉంచాం ఇదిగో! దాంతో పోయిన నగల సంచి సొంతదారుకు చేరింది. దాంతో ఆ కుటుంబం ఆనందానికి అవధుల్లేవు. శశి విధి నిర్వహణలో నిబద్ధత, బాధ్యత నిజాయితీని మెచ్చుకుని జిల్లా ఎస్‌పి సుబ్బారాయుడు శాలువాతో సత్కరించారు.

# ఎక్స్‌పైరీ తేదీ చూడాలి!

మార్కెట్‌కెళ్లి ఏదైనా కొనుగోలు చేయాలంటే మనమేం చేయాలి. రూపొందించిన కంపెనీల లోగోలు చూద్దామా? ఏది తక్కువకు లభిస్తుందో బేరీజు వేసుకుంటారా.. అవన్నీ తర్వాత మనమైతే ముందు ఎక్స్‌పైరీ తేదీని గమనించాలి.

**రెండింటి మధ్య తేదా ఏంటంటే...** మార్కెట్లో కొనే ఉత్పత్తులపై తయారీ, గడువు తేదీలు ఉంటాయన్న విషయం తెలిసిందే! అయితే వీటితో పాటు షెల్ఫ్‌లైఫ్‌ని కూడా ఆయా సంస్థలు లేబుల్‌పై పేర్కొంటాయి. కానీ ఇది, గడువు తేదీ ఒకటేనేమోనని అనుకుంటారు కొందరు. అయితే ఈ రెండింటి మధ్యస్వల్ప వ్యత్యాసం ఉంటుంది.



**గడువు తేదీ అంటే...** ఒక ఉత్పత్తిని ఎన్ని రోజుల తర్వాత అస్సలు వాడకూడదో తెలియజేసే కాల పరిమితి. ఆ తర్వాత దాని ప్రభావం తగ్గిపోవడమే కాదు.. అది హానికరం కూడా అని దీని అర్థం.

**అదే షెల్ఫ్ లైఫ్ విషయానికొస్తే..** ఉత్పత్తిని తెరిచిన తర్వాత.. దాని లేబుల్‌పై పొందుపరిచిన నియమ నిబంధనలకు అనుగుణంగా సరైన నాణ్యతా ప్రమాణాలతో దాన్ని నిల్వ చేయడం/భద్రపరచడం చేస్తే అది ఎంత కాలం సురక్షితంగా ఉంటుందని తెలియజేసే సూచిక ఇది. ఉదాహరణకు 12ఎం అని ఉంటే.. దానికి 12 నెలల షెల్ఫ్ లైఫ్ ఉందని అర్థం! సాధారణంగా దీన్ని ఉత్పత్తిపై 'యూజ్ బై' లేదా సెల్ బై అనే పదాలతో సూచిస్తారు. షెల్ఫ్ లైఫ్ దాటినప్పుడు ఒకవేళ గడువు తేదీ మీరకపోయినా ఆయా ఉత్పత్తుల్ని వాడకపోవడమే మంచిదంటున్నారు నిపుణులు. ఆహారం, మందులు, కాస్మెటిక్స్. వంటి ఉత్పత్తుల్ని ఉపయోగించే క్రమంలో ఈ రెండు తేదీల్ని దృష్టిలో పెట్టుకోవడం ముఖ్యమంటున్నారు. తద్వారా ఆహారం, అందంపై ప్రతికూల ప్రభావం పడకుండా జాగ్రత్త పడొచ్చంటున్నారు.

**నిల్వ చేయడమూ ముఖ్యమే!...**

అయితే మార్కెట్లో కొన్ని ఉత్పత్తి ఏదైనా సరే.. వాటిపై పేర్కొన్న గడువు, షెల్ఫ్ లైఫ్ తేదీలకు అనుగుణంగా మన్నాలంటే దాన్ని నిల్వ చేసే లేదంటే భద్రపరిచే విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు నిపుణులు. లేదంటే వాటి నాణ్యత తగ్గిపోయే ఆస్కారం ఉందంటున్నారు ఇందులోసం ఆయా ఉత్పత్తులపై పేర్కొన్న లేబుల్స్‌ని సునిశితంగా పరిశీలించాలంటున్నారు. ఉదా: ఫ్రిజ్‌లో పెట్టే ఉత్పత్తుల్ని లేబుల్‌పై పేర్కొన్న ఉష్ణోగ్రత వద్ద భద్రపరచడం ముఖ్యం అలాగే ఆహారం, మందుల్ని ఫ్రిజ్‌లో లేదంటే బయట ఉంచినా.. సరైన నిల్వ ప్రమాణాల్ని పాటించాలి.

**చిట్కా :**
- అవకాయపచ్చడి జాడీలో కొంచెం బెల్లంపొడిపైన చెల్లితే బూజుపట్టదు.
- అటకులు రుచిగా వుండాలంటే కొబ్బరి కోరు యాలకులపొడి కొద్దిగా కలపండి.
- అల్లపురసమును తేనెతో కలిపి త్రాగిన ఎక్కిళ్లు పోవును.

# చిలగడ దుంప బజ్జీలు!

**కావలసిన పదార్థాలు:**
శనగపిండి: కప్పు
బియ్యప్పిండి: అరకప్పు
వాము: పావు స్పూను
కారం: ఒక స్పూను
ఉప్పు: తగినంతసోడా ఉప్పు:
చిటికెడుచిలగడ దుంపలు: పెద్దవి
రెండునూనె: వేయించడానికి సరిపడా

**తయారీ విధానం :** ముందుగా చిలగడ దుంపలను శుభ్రంగా కడిగి పల్చగా పొడవాటి ముక్కలుగా తరిగి నీళ్లలో వేసి పక్కకు పెట్టుకోవాలి. ఒక గిన్నెలో శనగపిండిని తీసుకోవాలి. అందులో ఉప్పు, వాము, సోడా, కారం వేసి కొద్దిగా నీళ్లు పోయాలి. అంటే బజ్జీ వేసేందుకు వీలుగా జారుడుగా పిండి వచ్చేలా ఈ నీళ్లను పోసుకోవాలి. తర్వాత పిండిలో అన్నీ కలిసేలా బాగా కలియ బెట్టాలి. ఎంత కలిపితే బజ్జీలు అంత గుల్లగా వస్తాయి. ఇప్పుడు పొయ్యి మీద బాణలి పెట్టి నూనె పోసి వేడిచేయాలి. నూనె బాగా కాగాక, ఇందాక కలిపి పెట్టుకున్న పిండిలో



చిలగడదుంప ముక్కలను ముంచి అందులో వేయాలి. మంట తక్కువగా పెట్టి కాలిస్తే లోపలి చిలగడదుంప కూడా చక్కగా ఉడుకుతుంది.

# తెర

## 'ENE Repeat' నవంబర్ 19న రిలీజ్



యూత్ లో చెరగని ముద్ర వేసుకున్న 'ఈ నగరానికి ఏమైంది' చిత్రం ఇప్పుడు సీక్వెల్ ENE Repeat తో సిద్ధమవుతోంది. విశ్వక్ సేన్, అభినవ్ గోమటం, వెంకటేష్ కాకుమాను ఆ మ్యాజిక్‌ను మళ్లీ క్రియేట్ చేయడానికి రీయూనియన్ అవుతుండగా, శ్రీనాథ్ మాగంటి ఈ టీంకు కొత్త ఉత్సాహాన్ని జోడిస్తున్నారు. తరుణ్ భాస్కర్ మరోసారి దర్శకత్వం వహిస్తుండగా, ఎస్ ఒరిజినల్స్, రూట్ నోడ్ సినిమా బ్యానర్లపై సృజన్ యరబోలు, సందీప్ నాగిరెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.ఈ సినిమా ప్రపంచవ్యాప్త నవంబర్ 19ని విడుదల కానుందని మేకర్స్ అనౌన్స్ చేశారు. చిత్రం (మొదటి భాగం) విడుదలై ఎనిమిది ఏళ్లు పూర్తయిన సందర్భంగా, ఆనాటి 'కన్యా రాశి' గ్యాంగ్ జ్ఞాపకాలను గుర్తు చేసేలా, అందరినీ ఆకట్టుకునే ఫ్రెండ్షిప్ యాంథమ్ నేపథ్యంతో ఒక 'ఫీల్ గుడ్' వీడియోను చిత్ర బృందం విడుదల చేసింది.? పార్ట్ వన్‌లోని ప్రత్యేకతను కొనసాగించేలా ఈ సీక్వెల్‌కు ట్యాలెంటెడ్‌టెక్నికల్ టీం పని చేస్తోంది. వివేక్ సాగర్ సంగీతం అందిస్తుండగా, ఏజే ఆరోన్ సినిమా టోగ్రఫీ నిర్వహిస్తున్నారు. రవితేజ గిరిజాల ఎడిటింగ్ చేస్తుండగా, రాజేష్ పెంటకోట, సాలీ వైట్ ప్రొడక్షన్ డిజైన్‌ను రూపొంది సు_న్నారు .విడుదల తేదీని ప్రకటించిన నేపథ్యంల త్వరలోనే చిత్ర ప్రమోషన్స్‌ను మరింత వేగవంతం చేయడానికి మేకర్స్ సిద్ధమవుతున్నారు.

## #RAPO23 పూజా కార్యక్రమంతో షూటింగ్ ప్రారంభం



ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్టాత్మక మైన చిత్రం #RAPO23 అధికారికంగా లాంచ్ చేశారు. ఎన్నో ఏళ్ల పాషన్, ప్లానింగ్ తో రూపుదిద్దుకున్న ఈ చిత్రంతో రామ్ దర్శకుడిగా అరంగేట్రం చేస్తున్నారు. రాపో సినిమాటిక్స్ బ్యానర్ పై కృష్ణ పోతినేని ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. రామ్ కెరీర్‌లోనే అత్యధిక బడ్జెట్ తెరకెక్కుతున్న చిత్రం ఇది.ఈ చిత్రం ఈరోజు సాంప్రదాయ పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైంది. నిర్మాత కృష్ణ పోతినేని స్క్రిప్ట్ ను రామ్ పోతినేనికి అందజేశారు. ముహూర్తపు సన్నివేశానికి పి. మురళీ మోహన్ కెమెరా స్విచ్ ఆన్ చేయగా, పి.వి. రవి కిషోర్ క్లాప్ కొట్టారు. దర్శకుడిగా తన ప్రయాణానికి శ్రీకారం చుడుతూ తొలి షాట్‌కు రామ్ పోతినేని స్వయంగా దర్శకత్వం వహించారు.ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ కూడా ఈ రోజు హైదరాబాద్ శివార్లలో ప్రారంభమైంది. కథానాయకుడు రామ్ పోతినేని చిత్రంలోని ప్రధాన తారాగణంతో కలిసి షూటింగ్‌లో పాల్గొంటు న్నారు.ఈ చిత్రానికి సంబంధించిన ఒరిజినల్ కథను స్వయంగా రామ్ పోతినేని రాశారు. నియోనోయర్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే సైకాలజికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా దీనిని రూపొందిస్తున్నారు. ఇప్పటివరకు తెలుగు తెరపై చూడని విభిన్న అంశాలను, ఆసక్తికరమైన పాత్రల ప్రయాణంతో ఈ చిత్రం ఉండబో తోంది.దర్శకత్వం, కథతో పాటు ఈ చిత్రంలో రామ్ కథానాయకుడిగానూ నటిస్తున్నారు. కెమెరా ముందు, వెనుక బాధ్యతలు చేపట్టడం ద్వారా ఈ ప్రాజెక్ట్‌పై ఆయనకున్న అంకితభావం స్పష్టమవుతోంది. తన కెరీర్‌లోనే అత్యంత సవాల్‌తో కూడిన పాత్రను ఆయన ఇందులో పోషించబోతున్నారు.

## 'నాగబంధం'లో స్ట్రాంగ్ క్యారెక్టర్ చేశాను: నభా నటేష్



విరాట్ కర్ణ హీరోగా అభిషేక్ నామా దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఎపిక్ అడ్వెంచర్ థ్రిల్లర్ 'నాగబంధం – ది సీక్రెట్ ట్రెజర్'. నిక్ స్టూడియోస్ బ్యానర్‌పై కిషోర్ అన్నపురెడ్డి, నిశిత నాగిరెడ్డి ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్ తో ప్రతిష్టాత్మకంగా నిర్మించారు.

**నాగబంధంలో మీ పాత్ర ఎలా ఉండబోతోంది?**
ఇప్పటివరకు ఇలాంటి పాత్ర నేను చేయలేదు. ఇందులో నేను పార్వతి పాత్రలో కనిపిస్తాను. తను ఒక వేద విద్యార్థిని. తన పాత్ర ఎమోషనల్‌గా చాలా స్ట్రాంగ్‌గా ఉంటుంది.

**ఇందులో చాలా గ్రాండ్‌గా చిత్రీకరించిన డాన్స్ నంబర్ ఉంది కదా... దాని గురించి చెప్పండి?**
ఆ పాట చేయడం నిజంగా అద్భుతమైన అనుభవం. దాదాపు 5,000 మంది డ్యాన్సర్లతో ఆ పాటను గణేష్ ఆచార్య మాస్టర్ కొరియోగ్రఫీ చేశారు. అందులో క్లాసికల్ డాన్స్ కూడా ఉంటుంది.

**డైరెక్టర్ అభిషేక్ నామా గురించి?**
అభిషేక్ గారికి చాలా క్లియర్ విజన్ ఉంది. ఆయన ఈ కథను చాలా అద్భుతంగా ఊహించుకున్నారు. ఈ సినిమాలో నా పాత్ర కోసం రెడీ అవ్వడానికి దాదాపు రెండు గంటలు పట్టేది. ప్రతి కాస్ట్యూమ్ విషయంలో ఎంతో జాగ్రత్త తీసుకున్నారు. ఈ షూటింగ్‌ను నేను చాలా ఎంజాయ్ చేశాను. అనంత పద్మనాబ స్వామి ఆలయ సెట్‌లో షూటింగ్ చేస్తున్నప్పుడు మేమంతా చాలా నియమనిష్ఠ లతో పని చేశాం. పూర్తిగా శాకాహారులుగా ఉన్నాం.

**ఇందులో మీ పాత్రలో రొమాన్స్ కూడా ఉంటుందా?**
రొమాన్స్ ఉంటుంది. అయితే దానికంటే చాలా ముఖ్యమైన అంశాలు నా పాత్రలో ఉంటాయి. అవే కథకు కీలక మలుపు తీసుకొస్తాయి.

**నిర్మాతల గురించి?**
తొలి సినిమానే అయినప్పటికీ కంటెంట్‌పై ఉన్న నమ్మకంతో దాదాపు రూ.110 కోట్ల భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మించారు. ప్రతి విషయంలో రాజీ పడకుండా, కంటెంట్‌కు తగ్గట్టుగా సినిమాను తీర్చిదిద్దారు.ప్రమోషన్స్ కూడా చాలా వినూత్నంగా చేశారు. .

**విరాట్ కర్ణ గురించి?**
విరాట్ కర్ణ చాలా ప్యాషన్, డెడికేషన్ ఉన్న నటుడు. ఇది ఆయన రెండో సినిమా అని అనిపించదు. ఎంతో అనుభవం ఉన్న నటుడిలా నటించారు.

**'నాగబంధం' షూటింగ్ అనుభవం?**
నాగబంధం చాలా భారీ స్థాయి సినిమా. ప్రతిరోజూ షూటింగ్‌లో దాదాపు 200 మంది ఉండేవారు. ప్రతి షెడ్యూల్‌కు సినిమా స్కేల్ మరింత పెరుగుతూ వెళ్లింది.

## 'మకుటం' విజయం సాధించాలి: విశాల్



సూపర్ గుడ్ ఫిల్మ్స్ బ్యానర్ మీద 99వ ప్రాజెక్ట్‌గా విశాల్ హీరోగా, దర్శకుడిగా చేస్తున్న చిత్రం మకుటం. స్వర్గీయ ఆర్ బీ చౌదరి నిర్మిస్తున్న ఈ చిత్రంలో అంజలి, దుషార విజయన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ మూవీ నుంచి వచ్చిన టీజర్, ఫస్ట్ సింగిల్ ది రైజ్ ఆఫ్ లింగా అందరినీ ఆకట్టుకున్నాయి. తాజాగా ఆదివారం (జూన్ 28) నాడు సెకండ్ సింగిల్ నచ్చాకే వచ్చేరా అనే పాటను విడుదల చేశారు. ఈ క్రమంలో నిర్వహించిన కార్యక్రమంలో.. విశాల్ మాట్లాడుతూ.. .. 'మకుటం'తో తెలుగు ప్రేక్షకులను పలకరించబోతోన్నందుకు ఆనందంగా ఉంది. ఈ సారి దర్శకుడిగా మారి ఆడియెన్స్ ముందుకు రాబోతోన్నాను. శివ్ల చూసిన తరువాత దర్శకుడిగా మారాలని ఫిక్స్ అయ్యాను. ఇన్నాళ్లకు ఆ కోరిక నెరవేరింది. ఈరోజు ఆర్‌బీ చౌదరి గారిని నేను మిస్ అవుతున్నాను. 99వ ప్రాజెక్ట్ బాధ్యతల్ని ఆయన నాకు ఇచ్చారు. కొన్ని అనివార్య కారణాల వల్ల ఈ మూవీకి దర్శకుడిగా మారాను. ..అంజలి మాట్లాడుతూ.. .. మదగదరాజా తరువాత విశాల్‌తో కలిసి మకుటం చేశాను. అప్పుడు విశాల్ హీరో.. ఇప్పుడు దర్శకుడు కూడా. ఇందులో నేను ఓ మంచి, పవర్ ఫుల్ రోల్‌ను పోషించాను. విశాల్ నా పాత్రను గొప్పగా తీశాడు. ..జితన్ రమేష్ మాట్లాడుతూ.... విశాల్ మాకు ఎన్నో ఏళ్ల నుంచి తెలుసు. మా ఇంట్లో వ్యక్తిలా, సొంత అన్నలా ఉంటాడు. జీవీ ప్రకాష్ పట్టిందల్లా బంగారం అవుతుంది. మా 'మకుటం' మ్యూజిక్ కూడా పెద్ద హిట్ అవుతుందని అనుకుంటున్నాను. ..నటి దూస్నీ మాట్లాడుతూ.. నన్ను తమిళంలో పరిచయం చేస్తున్న విశాల్‌కి థాంక్స్. సూపర్ గుడ్ ఫిల్మ్స్‌తో నాకు ఎంతో అనుబంధం ఉంది. హీరోగా, దర్శకుడిగా అన్ని రకాలుగా విశాల్ ఈ చిత్రంతో అద్భుతం చేశారు.

## 'కళ్యాణం కమనీయం జీవితం" పోస్టర్ విడుదల



వివిపై మీడియా ఫిల్మ్ ఫ్యాక్టరీ పతాకంపై, ఖాన్ దురాని, సాహితి ఆవంచ హీరోయిన్‌గా రవి లోకిరెడ్డి డైరెక్షన్ లో పైలా ప్రసాద్‌రావు కిషోర్ గుండాల సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం కళ్యాణం కమనీయం జీవితం. ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ ను ప్రముఖ రచయిత విజయేంద్ర ప్రసాద్ ఆవిష్కరించారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని త్వరలో రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు మేకర్స్. తెలుగు రాష్ట్రాల్లో ఈ చిత్రాన్ని రాజవంశీ రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా ప్రముఖ రచయిత విజయేంద్రప్రసాద్ మాట్లాడుతూ: టైటిల్ చాలా బాగుంది. రాజవంశీ టైటిల్ గురించి చెప్పగానే చాలా ఇంప్రెస్ అయ్యాను. ప్రొడ్యూసర్స్ మంచి ప్రయత్నం చేశారు .డైరెక్టర్ విజన్ పోస్టర్ ద్వారా తెలుస్తుంది. హీరో హీరోయిన్ లకు సినిమా టీమ్ కు అల్ ది బెస్ట్ అని అన్నారు నిర్మాత పైలా ప్రసాద్ రావు మాట్లాడుతూ : విజయేంద్ర ప్రసాద్ గారు అడగగానే మా పోస్టర్ లాంచ్ చేయడం ఆనందంగా వుంది ఆయనకు నా కృతజ్ఞతలు. డైరెక్టర్ కథ చెప్పగానే తప్పకుండా ఈ సినిమా చేయాలి అనిపించింది. దర్శకుడు చెప్పిన విధంగా సినిమా తీశాడు సినిమా తప్పకుండా అందరికీ నచ్చుతుంది అని అన్నారు మరో నిర్మాత కిషోర్ గుండాల మాట్లాడుతూ పాన్ వరల్డ్ స్టార్ రైటర్ విజయేంద్రప్రసాద్ గారు పోస్టర్ ను ఆవిష్కరించి టీమ్ కు బ్లెస్సింగ్స్ ఇవ్వడం చాలా సంతోషంగా ఉంది. మంచి కథ, కథనాలతో సినిమాని తెరకెక్కించాము త్వరలో ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తాము అన్నారు

## 'స్టూడెంట్' మూవీ టీజర్ రిలీజ్



స్వర్గీయ రియల్ స్టార్ శ్రీహరి తనయుడు మేఘాంశ్ శ్రీహరి హీరోగా నటిస్తున్న కొత్త సినిమా 'స్టూడెంట్' ఈ సినిమాలో విజేత పరీక్ హీరోయిన్ గా నటిస్తోంది. జోవికా సినిమాస్, చెరిష్ మీడియా వర్క్స్ బ్యానర్స్ పై బెల్లం సిద్ధారెడ్డి నిర్మిస్తున్నారు. బాలు తత్వమసి దర్శకత్వం వహిస్తున్నారు. బెల్లం సంగీత, బెల్లం బయ్యారెడ్డి కో ప్రొడ్యూసర్స్ గా వ్యవహరిస్తున్నారు. 'స్టూడెంట్' సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవు తోంది. ఈ రోజు ఈ సినిమా టీజర్ రిలీజ్ చేశారు. "స్టూడెంట్" సినిమా టీజర్ ఎలా ఉందో చూస్తే సరదాగా కాలేజ్ లైఫ్ ఎంజాయ్ చేసే స్టూడెంట్ భాను (మేఘాంశ్ శ్రీహరి) ఆంధ్ర రాష్ట్ర సమితి పార్టీ తరుపున పాలిటిక్స్ లోకి రావడం కాలేజ్ లో ఒక సెన్సేషన్ క్రియేట్ చేస్తుంది. పాలిటిక్‌కు కొత్తైనా రాజకీయాల్లో ఉండే ప్రమాదాలను, ఎత్తులు పై ఎత్తులను త్వరగా అర్థం చేసుకుంటాడు భాను. పక్కనోడు కత్తితో యుద్ధం చేస్తున్నప్పుడు మనం చెయ్యి పెడితే తెగిపోద్ది, మనం పాలిటిక్స్ లో ఉన్నాం, ఇక్కడ ఎథిక్స్ ఉండవు, ఓన్లీ ట్రిక్సే ఉంటాయి. అంటూ మేఘాంశ్ చెప్పిన పవర్ ఫుల్ డైలాగ్ టీజర్‌కు హైలైట్ గా నిలుస్తోంది. స్టూడెంట్ రాజకీయాల్లోకి వస్తే ఈ పొలిటికల్ ఆటను ఎలా మార్చేయగలడు అనేది ఇంపాక్ట్ ఫుల్‌గా చూపించారు.

# ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం.. ఆరుగురు ఉద్యోగుల సస్పెన్షన్

## ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్ రాంసుందర్ రెడ్డి

విజయనగరం, జూన్ 29, ప్రభాతవార్త

ఎన్నికల విధుల నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యం మరియు ఉద్దేశపూర్వకంగా విధులను విస్మరించడం వంటి చర్యలకు పాల్పడిన ఆరుగురు ఉద్యోగులను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. సస్పెన్షన్‌కు గురైన ఉద్యోగుల వివరాలు:1.భారతి కర్ణాయిన్, వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శి, పోలింగ్ స్టేషన్ నెం.138, లచ్చయ్యపేట సచివాలయం, రాజాం మండలం. సవిరిగాన శివకృష్ణ, పంచా యతీ కార్యదర్శి, పోలింగ్ స్టేషన్ నెం.239, హోంజరం గ్రామం, సంతకవిటి మండలం.3.పి. విజయ, మహిళా సంరక్షణ కార్యదర్శి, పోలింగ్ స్టేషన్ నెం.75, చుక్కవలస గ్రామం, గరివిడి మండలం.4. వి.ఎస్.ఎస్. ప్రకాశ్‌రావు, పంచాయతీ కార్యదర్శి, పోలింగ్ స్టేషన్ నెం.90, దబ్బిరాజుపేట గ్రామం, వేపాడ మండలం. కె.గంగాధర్, పంచాయతీ కార్యదర్శి, పోలింగ్ స్టేషన్ నెం.114, చిన్నగుడిపాల గ్రామం, వేపాడ మండలం. 6. కె.జి.ఎల్.మాధురి, ఇంజినీరింగ్ అసిస్టెంట్, పోలింగ్ స్టేషన్ నెం.251, జడ్డేటివలస సచివాలయం, జామి మండలం.ఎన్నికల విధుల నిర్వహణలో నిర్లక్ష్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి హెచ్చరించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది నిబంధనలకు అనుగుణంగా బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పాక్షికంగా జరిగేలా ప్రతి ఉద్యోగి తన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ పేర్కొన్నారు.

# జనసైనికులే రేపటి నాయకులు

## విజయనగరంలో జనసేన సమాచార సేకరణ షురూ



విజయనగరం,జూన్ 29 ప్రభాతవార్త:

జనసైనికుల నుంచే భవిష్యత్తు నాయకత్వాన్ని తీర్చిదిద్దే ఒక వినూత్న, విప్లవాత్మక ప్రక్రియకు ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ శ్రీకారం చుట్టారు. సాధారణంగా రాజకీయాల్లో వారసత్వానికి, ధనబలానికి ప్రాధాన్యత ఉండే ఈ రోజుల్లో, కేవలం ప్రజా సేవ, అంకితభావమే కొలమానంగా క్షేత్రస్థాయి కార్యకర్తలను ఉన్నత స్థానాల్లో కూర్చోబెట్టాలనే పవన్ కల్యాణ్ ఆశయం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. పార్టీ కోసం అంకితభావంతో పనిచేసిన నిజమైన కార్యకర్తలను గుర్తించేందుకు ఆయన ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసినట్లు 'జనసేన పార్టీ నిర్మాణ సారథుల సమాచార సేకరణ కమిటీ' విజయనగరం పార్లమెంట్ పరిశీలకులు కోరికాన రవి కుమార్, సీనియర్ నాయకుడు గురాన అయ్యలు తెలిపారు. సోమవారం విజయనగరంలోని మెసానిక్ టెంపుల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కమిటీ సభ్యులతో కలిసి వారు మాట్లాడారు. ఈ సందర్భంగా విజయనగరం పార్లమెంట్ పరిశీలకులు కోరికాన రవి కుమార్ మాట్లాడుతూ జనసేన అధినేత పవన్ కల్యాణ్ రాజకీయాల్లో ఒక కొత్త అధ్యయనానికి శ్రీకారం చుట్టారని కొనియాడారు. జూల విజయనగరం మెసానిక్ టెంపుల్ నందు దరఖాస్తులను స్వీకరిస్తామని, అన్నారు. సీనియర్ నాయకుడు గురాన అయ్యలు మాట్లాడుతూ కార్యకర్తలే పార్టీకి ప్రాణం అని నమ్మే ఏకైక నాయకుడు పవన్ కల్యాణ్ అని, విలువలతో కూడిన రాజకీయం అంటే ఎలా ఉంటుందో ఆయన తన నిర్ణయాల ద్వారా నిరూపిస్తున్నారని అన్నారు. ఈ కమిటీ కేవలం దరఖాస్తులు తీసుకోవడానికే పరిమితం కాదని, క్షేత్రస్థాయిలో నిరంతరం శ్రమిస్తున్న నేతల సేవలు, వారిలో దాగి ఉన్న నాయకత్వ లక్షణాలు, పార్టీ సిద్ధాంతాల పట్ల వారికి ఉన్న అంకితభావం వంటి ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలిస్తామని చెప్పారు. ఇక్కడ తాము సేకరించిన పూర్తి సమాచారాన్ని ఒక సమగ్రమైన నివేదిక రూపంలో తయారు చేసి నేరుగా పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ పరిశీలనకు పంపిస్తామని, పవన్ కల్యాణ్ ఆశయాల అడుగుజాడల్లోనే భవిష్యత్తు నాయకత్వాన్ని తాము తీర్చిదిద్దుతారని వివరించారు.

# జామి మండలంలో పైడితల్లి అమ్మవారి దేవాలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న జడ్పీ చైర్మన్ చిన్న శ్రీను

విజయనగరం (జామి) జూలై 29 ప్రభాతవార్త



జామి మండలం సోమయాజుల పాలెం గ్రామంలో నిర్వహించిన శ్రీ పైడితల్లి అమ్మవారి దేవాలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో విజయనగరం జిల్లా జడ్పీ చైర్మన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు చిన్న శ్రీనుకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా చిన్న శ్రీను మాట్లాడుతూ, ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యత, సాంస్కృతిక విలువలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. శ్రీ పైడితల్లి అమ్మవారి కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి కుటుంబం సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# రైతే రాష్ట్రానికి వెన్నెముక: మంత్రి సంధ్యారాణి

## రైతులకు ప్రభుత్వం ఎప్పుడూ అండగానే ఉంటుంది



మక్కువ, జూన్ 29 ప్రభాతవార్త

మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన ఏరువాక కార్యక్రమంలో రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ మరియు గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్నదాతలందరికీ తోడుగా ఉంటూ, వారి ఆర్థికాభివృద్ధికి మరియు ఆరోగ్య రక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రైతులకు పెట్టుబడి సహాయం అందించేందుకు 'అన్నదాత సుఖీభవ' పథకం కింద రూ. 20,000 నిధులను త్వరలోనే అన్నదాతలందరి ఖాతాల్లో నేరుగా జమ చేయనున్నట్లు మంత్రి తెలిపారు. సాంకేతిక కారణాల వల్ల ఎవరికైనా నిధులు నిలిచిపోతే, జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో వాటిని వెంటనే పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. ముఖ్యంగా సాలూరు, మక్కువ, పాచిపెంట వంటి ఎస్టీ గిరిజన మండలాల్లోని రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తూ 90 శాతం సబ్సిడీతో విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పనిముట్లను అందిస్తున్నామని ప్రకటించారు. అలాగే బీసీ వర్గాల రైతులకు 50 శాతం సబ్సిడీ వర్తింపజేస్తున్నట్లు తెలిపారు. దళారుల వ్యవస్థను పూర్తిగా నిర్మూలించాలనే ఉద్దేశంతో, భారతదేశంలోనే మొట్టమొదటిసారిగా ఒక 'మొబైల్ యాప్' ద్వారా ఎరువులను పంపిణీ చేసే సరికొత్త విధానాన్ని మన రాష్ట్రంలో తీసుకువచ్చామని కలెక్టర్ ప్రభాకర రెడ్డి ఈ సందర్భంగా వెల్లడించారు.ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గుల్ల వేణుగోపాల్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# గతి శక్తి కార్గో టెర్మినల్ ప్రాజెక్టుతో పునరుజ్జీవ దిశగా ఫేకర్ అల్లాయిస్ పరిశ్రమ

గరివిడి, జూన్ 29,ప్రభాత వార్త



గత కొంతకాలంగా ప్రతికూల మార్కెట్ పరిస్థితులు, అధిక విద్యుత్ చార్జీలు, ఆర్థిక ఇబ్బందులు నేపథ్యంలో ఫేకర్ సంస్థ ఉత్పత్తి కార్యకలాపాలు నిలిచిపోయిన పరిస్థితుల్లో సంస్థ పునరుద్ధరణ కోసం యాజమాన్యం చేస్తున్న ప్రయత్నాలు ఫలించే అవకాశం కనిపిస్తున్నాయి. ఫేకర్ గత ఉత్పత్తులతో పరిశ్రమ నడిపించే అవకాశం లేకపోయినా భారతీయ రైల్వే గతి శక్తి కార్గో టెర్మినల్ (జి సి టి) విధానం కింద ఫేకర్ అల్లాయిస్ ప్రస్తుత రైల్వే సైడింగ్‌ను గతి శక్తి కార్గో టెర్మినల్‌గా అభివృద్ధి చేసేందుకు తూర్పు తీర రైల్వే (ఈస్ట్ కోస్ట్ రైల్వే) సూత్రప్రాయ అనుమతిని మంజూరు చేసింది. కాగా రైల్వే శాఖ సూచించిన విధంగా సమగ్ర సాధ్యతా నివేదిక (డిటైల్డ్ ఫీజిబిలిటీ రిపోర్ట్), సవరించిన ఇంజినీరింగ్ ప్రణాళికలు ఇతర సాంకేతిక ప్రమాణాలను సమర్పించిన అనంతరం తుది అనుమతులు లభించనున్నాయి.

# జనసేన పార్టీ టౌన్ ప్రెసిడెంట్ రేసులో గుమ్మా నాగార్జున



సాలూరు జూన్ 29 ప్రభాతవార్త

జనసేన పార్టీ అధినేత, డి.సీఎం. పవన్ కళ్యాణ్ ఆదేశాలతో అరకు పార్లమెంట్ పరిధి ఎమ్మెల్సీ నాగబాబు సూచన మేరకు పార్టీ పాత కమిటీలు రద్దుచేసి కొత్త కమిటీలు వేస్తారని తెలుస్తుంది. అందులో జనసేన పార్టీ టౌన్ ప్రెసిడెంట్ గా గుమ్మా.నాగర్జున ఇంకా నియోజకవర్గ ఇంచార్జ్ కోసం జర్జాపు.సూరిబాబు అలాగే రేగు మహేష్ రేసులో ఉన్నట్టుగా సమాచారం. సోమవారం ఈ విషయంపై నాగార్జున మాట్లాడుతు ఎమ్మెల్సీ నాగబాబు అరకు పార్లమెంట్ పర్యటనలో భాగంగా ఈ రెండు లేక మూడు రోజులలో సాలూరు పట్టణానికి వచ్చి పాత కమిటీలు రద్దుచేసి నూతన కమిటీలు వేస్తారని తెలిపారు.అలాగే జనసేన పార్టీలో కీలకమైన జనబలం కలిగిన నాయకులను క్రియాశీలక పదవులు వచ్చే అవకాశం ఉందని క్లారిటీ ఇచ్చారు. అంతేకాకుండా జనసేన పార్టీ తనకు అప్పగించే ఏ పదవి భాద్యతలు అయినా పార్టీప్రతిష్ట పెంచే విధంగా కృషి చేస్తానని స్పష్టం చేశారు.

# మద్యం తాగి వాహనాలు నడిపిన ముగ్గురు వ్యక్తులకు జరిమానా



పాచిపెంట జూన్ 29 ప్రభాతవార్త

పాచిపెంట పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడిపి పట్టుబడిన ముగ్గురిపై కేసులు నమోదు చేసి సాలూరు కోర్టు హాజరు పరచుగా సాలూరు కోర్టు వారు ఒక్కొక్కరికి 10000 రూపాయలు చొప్పున 30000 రూపాయలను జరీమాన విధించినట్లు ఎస్సై ఎల్ అర్జున్ విలేకరులకు తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే లిచట్టపరమైన చర్యలు తప్పవని, అలాగే ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా వాహనదారులు పాటించాలని పాటు వాహనదారులు విధిగా వాహనాల ధ్రువపత్రాలు వాహనంలో ఉంచుకోవాలని తెలిపారు. అలాగే మాదిగ ద్రవ్యయు లైన గంజాయి ఒక్క వంటసార తదితర మత్తు పదార్థాలు అక్రమ రవాణా చేసిన వారిపై చట్టరీత్యా కేసులు తప్పు అని ఆయన హెచ్చరించారు.

# శత శాతం పల్స్ పోలియో ఇమ్యూనైజేషన్ కార్యక్రమం

గరివిడి, జూన్ 29 ,ప్రభాత వార్త



గరివిడి ప్రాధమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో నిర్వహించిన పల్స్ పోలియో ఇమ్యూనైజేషన్ కార్యక్రమం శత శాతం నిర్వహించినట్లు గరివిడి ప్రాధమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ కే. రాజ్యలక్ష్మి వెల్లడించారు. గరివిడి ప్రాధమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోగల ఐదేళ్ల లోపు 3111 మంది చిన్నారులకు గాను 28,29 తేదీల్లో నిర్వహించిన పల్స్ పోలియో ఇమ్యూనైజేషన్ కార్యక్రమంలో 3111 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసినట్లు ఆమె పేర్కొన్నారు గరివిడి ప్రాధమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ కే.రాజ్యలక్ష్మి డాక్టర్ సాయి కిరణ్‌ల పర్యవేక్షణలో సిహెచ్ ఓ కె.శివ ప్రసాద్ ఆధ్వర్యంలో చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. పోలియో రహిత సమా జావిష్కరణకు ప్రతీఒక్కరూ పాటు పడాలని ఈ సందర్భంగా డాక్టర్ రాజ్యలక్ష్మీ అన్నారు. సోమవారం నుండి 8330 ఇళ్లకు వెళ్లి చిన్నారులకు పోలియో చుక్కలు వేసి శత శాతం నమోదు చేశామని ఆమె పేర్కొన్నారు.14 పోలియో బూత్ లు ఏర్పాటు చేసి కార్యక్రమాన్ని పూర్తి చేశామని ఆమె స్పష్టం చేశారు. కాగా గరివిడి పట్టణ పరిధిలో జెడ్పిటిసి సభ్యులు వాకాడ శ్రీనివాసరావు ,వైకాపా నాయకులు పి.కుమార్, బొంపల్లి వెంకట రావు, శివుకు కాంతారావు ,వైద్య సిబ్బంది తదితరులు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.

# మంచినీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం

## ఆర్‌డబ్ల్యుఎస్ డీఈఈ ఢిల్లీశ్వరరావు



రామభద్రపురం,జూన్ 29,ప్రభాతవార్త

రామభద్రపురం మండల పరిధి లోని ఆరికతోట బీసీ కాలనీలో మంచినీటి ఎద్దడి నివారణకు అన్ని చర్యలు తీసుకుంటామని ఆర్ డబ్ల్యుఎస్ డీఈఈ ఢిల్లీశ్వరరావు తెలిపారు. సోమవారం కాలనీలో పర్యటించి చెడిపోయిన బోర్ల మర మ్మతుల కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను సిబ్బందికి సూచించారు. అలాగే కాలనీలో రక్షిత మంచినీటి పథకం ద్వారా సక్రమంగా ప్రతీరోజూ నీరు అందేలా చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యు ఎస్ సిబ్బంది, జనసేన నాయకుడు అల్లు రమేష్ పాల్గొన్నారు.

# పిఎం స్వానిధిపై అవగాహన కల్పించాలి

## నగర పంచాయతీ కమిషనర్ అప్పలరాజు

నెల్లిమర్ల, జూన్ 29, ప్రభాతవార్త



ప్రధానమంత్రి స్వానిధి పథకంపై మహిళల్లో అవగాహన కల్పించాలని నగర పంచాయతీ కమిషనర్ కిలాన అప్పలరాజు అన్నారు. స్థానిక మెప్మా కార్యాల యంలో సిఎంఎం గేదెల రాము ఆధ్వర్యంలో సోమవారం నిర్వహిం చిన సమావేశంలో కమిషనర్ అప్పలరాజు మాట్లాడారు. మహిళల అభ్యున్నతి కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న కార్యక్రమాలను పథకాలను సద్వినియోగం చేసుకునేలా నగర పంచాయతీలోని మహిళలకు ప్రచారం చేయాలని అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. మహిళలు ఆర్థిక పరిపుష్టి సాధించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎందుకు అను గుణంగా మెప్మా సిబ్బంది, రిసోర్స్ పర్సన్లు కృషి చేయాలని అన్నారు. స్వయం ఉపాధి కోసం రుణాలు మంజూరుతో పాటు రికవరీ పై కూడా దృష్టి సారించాలని కమిషనర్ అప్పలరాజు సూచించారు. ఈ కార్యక్రమంలో మెప్మా సీఎం గేదెల రాము, సిఓ, ఆర్‌పిలు పాల్గొన్నారు.



# నాటు సారాయితో వ్యక్తి అరెస్టు

కురుపాం జూన్ 29 ప్రభాతవార్త

నాట్ సారా విక్రయిస్తున్నా వ్యక్తిని పట్టుకొని అరెస్ట్ చేసినట్లు కురుపాం ప్రాబిహిషన్ ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ పి.శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం నవోదయం 2.0 కార్యక్రమంలో అమలులో భాగంగా కురుపాం ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో గుమ్మ లక్ష్మీపురం మండలం కొల్లిగూడ గ్రామం దాడులు నిర్వహించగా నాటు సారా విక్రయించుస్తున్న కొల్లి గూడ గ్రామానికి చెందిన లాభాల శేఖర్10 లీటర్ల నాటు సారా తో అరెస్టు చేసినట్లు తెలిపారు. కురుపాం న్యాయ స్థానం లో హాజరు పరచగా అతనికి న్యాయ స్థానం రిమాండ్ ను విధించిందిన్నారు. కేసు దర్యాప్తు లో భాగంగా ఈ నేరంలో ప్రమేయం ఉన్న కొత్తవలస గ్రామానికి చెందిన కద్రక సుమంత్ పై కూడా కేసు నమోదు చేశామని అతడిని కూడా త్వరలో అరెస్ట్ చేస్తామని తెలిపారు. ఈ దాడుల్లో కురుపాం ఎక్సైజ్ స్టేషన్ ఎస్ఐ జె రాజ శేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

# వేద పండితులతో కోదండ రామాలయ ప్రతిష్ట మహోత్సవ పూజలు

దత్తిరాజేరు జూన్ 29 ప్రభాతవార్త



మండలంలోని పాచలవలస గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ కోదండ రామాలయ ప్రతిష్ట పూజలు భక్తులు ఘనంగా నిర్వహించారు పురోహితులు రవి స్వామి ఆధ్వర్యంలో వేద పండితులతో అంగరంగ వైభవంగా ప్రతిష్ట పూజలు సోమవారం నిర్వహించారు రామాలయ ప్రతిష్ట పూజా కార్యక్రమంలో సుమారు 400 మంది భక్తులు పూజలో పాల్గొన్నారు గ్రామ కమిటీ సభ్యులైన పది మంది దంపతులు కంకణా ధారణ కట్టి ప్రతిష్ట పూజలు జరిపించారు ముందుగా విఘ్నేశ్వర పూజ పుణ్యాహవాచన పరిషత్ పంచగవ్య ప్రాసన దీక్ష కంకణాధారణ అంకురార్పణ గోపూజ యాగశాల ప్రవేశం మహాధ్వజస్థాపన యోగినావాస్తు నవగ్రహ దేవత సర్వతో భద్రత మండపారాధన పూజలు చేసి అనంతరం మధ్యాహ్నం మూర్తి హోమం మూలమంత్ర హోమం కల హోమం ఆవాహిత సర్వదేవత మంత్ర హోమం అగ్ని ప్రతిష్టాపన అనంతరం ఆవాహిక మండప పూజ హోమాలు పురోహితులు భక్తులతో చేపించారు భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలో పాల్గొని పూజలు చేశారు బుధవారం స్వామివారి విగ్రహ ప్రతిష్ట పూర్ణ కలత ప్రతిష్ట స్వామి వారి కల్యాణం జరిపిస్తారని కమిటీ సభ్యులు తెలిపారు

# రైతుల సమస్యలు పరిష్కారించకుండా శంఖుస్థాపనలా?

## అభివృద్ధికి వ్యతిరేకం కాదు : ఎమ్మెల్సీ రఘురాజు



శృంగవరపుకోట,జూన్29, ప్రభాతవార్త

జిందాల్ రైతుల సమస్యలు పరిష్కారించకుండా శంఖుస్థాపన కార్యక్రమం చేపడతామనడం సరికాదని ప్రభుత్వం,జిందాల్ యాజమాన్యం కలిసి రైతులకు తీరని అన్యాయం చేస్తున్నారని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు ఆవేదన వ్యక్తం చేశారు.సోమవారం మండలంలోని బొడ్డవరలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిందాల్ సంస్థకు భూములు ఇచ్చి దాదాపు 18ఏళ్ళు గడిచినా పరిశ్రమ ఏర్పాటు చేయలేదని అప్పుడు ఇచ్చిన హామీలు ఏఒక్కటి నెరవేర్చలేదని అయినా మాభూముల్లో ఎంఎస్‌ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తామనడం సరికాదన్నారు.పరిశ్రమలు ఏర్పాటుకు మేము వ్యతిరేకం కాదని అయితే ఇటీవల ప్రభుత్వం ఏర్పాటు చేసిన రాష్ట్ర హోం శాఖ మంత్రి అనిత ఆధ్వర్యంలో రైతులతో నేరుగా ఆమె చర్చలు జరిపారని రైతులకు ఎటువంటి అన్యాయం లేకుండా చూస్తామని హామీ ఇచ్చారని ఇప్పుడు చూస్తే జూలై మూడవ తేదీన జిందాల్ రైతుల భూముల్లో ఎంఎస్‌ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తామని వివిధ పత్రికల్లో వార్తలు రావడం విచారకరమన్నారు. అయితే పత్రికలలో వచ్చిన వార్తలు నమ్మడం లేదన్నారు.మరి ప్రస్తుతం శంఖుస్థాపనలపై వస్తున్న వార్తలు కారణంగా రైతులు ఆందోళన చెందుతున్నారని ప్రభుత్వం స్పందించి ముందు రైతుల సమస్యలు పరిష్కారించి తరువాత కాలుష్యం రహిత పరిశ్రమలను ఏర్పాటు చేయాలని అందుకు రైతులందరూ సమ్మతంగా ఉన్నారని ఎమ్మెల్సీ రఘురాజు ప్రభుత్వానికి మరో సారి విజ్ఞప్తి చేశారు.

విజయనగరం
పార్వతీపురం మన్యం
వార్త
25

# శత శాతం పల్స్ పోలియో ఇమ్యూనైజేషన్ కార్యక్రమం

గరివిడి, జూన్ 29 ,ప్రభాతవార్త



గరివిడి ప్రాధమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో నిర్వహించిన పల్స్ పోలియో ఇమ్యూనైజేషన్ కార్యక్రమం శత శాతం నిర్వహించినట్లు గరివిడి ప్రాధమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ కే. రాజ్యలక్ష్మి వెల్లడించారు. గరివిడి ప్రాధమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోగల ఐదేళ్ల లోపు 3111 మంది చిన్నారులకు గాను 28,29 తేదీల్లో నిర్వహించిన పల్స్ పోలియో ఇమ్యూనైజేషన్ కార్యక్రమంలో 3111 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసినట్లు ఆమె పేర్కొన్నారు గరివిడి ప్రాధమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డా.కే.రాజ్యలక్ష్మి డాక్టర్ సాయి కిరణ్‌ల పర్యవేక్షణలో సి హెచ్ ఓ కె.శివ ప్రసాద్ ఆధ్వర్యంలో చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. పోలియో రహిత సమాజావిష్కరణకు ప్రతీఒక్కరూ పాటు పడాలని ఈ సందర్భంగా డాక్టర్ రాజ్య లక్ష్మీ అన్నారు. సోమవారం నుండి 8330 ఇళ్లకు వెళ్లి చిన్నారులకు పోలియో చుక్కలు వేసి శత శాతం నమోదు చేశామని ఆమె పేర్కొన్నారు.14 పోలియో బూత్ లు ఏర్పాటు చేసి కార్యక్రమాన్ని పూర్తి చేశామని ఆమె స్పష్టం చేశారు. కాగా గరివిడి పట్టణ పరిధిలో జెడ్పిటిసి సభ్యులు వాకాడ శ్రీనివాసరావు, వైకాపా నాయకులు పి.కుమార్,బొంపల్లి వెంకట రావు, శివుకు కాంతారావు ,వైద్య సిబ్బంది తదితరులు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.

# జూలై 1న డీఈఈసెట్-2026 ప్రవేశ పరీక్ష

నెల్లిమర్ల,జూన్ 29, ప్రభాతవార్త

డీఈఈసెట్-2026 ( డైట్ సెట్ ) ప్రవేశ పరీక్షలు జూలై 1 తేదీన విజయనగరం గాజులరేగ, సీతం ఇంజినీరింగ్ కళాశాలలోని ఐయాన్ డిజిటల్ జోన్‌లో జరుగుతాయని జిల్లా విద్యాశాఖాధికారి యు. మాణిక్యాశీ నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలు రెండు సెషన్లలో నిర్వహించబడతాయన్నారు. ఉదయం సెషన్‌లో కేటాయించిన అభ్యర్థులు నిర్ణీత సమయానికి ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని తెలిపారు. అలాగే మధ్యాహ్నం సెషన్‌కు సంబంధించిన అభ్యర్థులు కూడా తమ ప్రవేశ పత్రంలో పేర్కొన్న సమయానికి అనుగుణంగా పరీక్షా కేంద్రానికి హాజరు కావాలన్నారు. అభ్యర్థులు తప్పనిసరిగా హాల్ టికెట్, చెల్లుబాటు అయ్యే ఫోటో గుర్తింపు కార్డు వెంట తీసుకురావాలని సూచించారు. పరీక్షా కేంద్రంలో అమలులో ఉన్న నిబంధనలు, సూచనలను కచ్చితంగా పాటించాలని, ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్లు, ఇతర నిషేధిత వస్తువులను పరీక్షా కేంద్రంలోకి తీసుకురావద్దని తెలిపారు. వివరాలకు డైట్ ఇన్చార్జి ప్రిన్సిపాల్ డి.అప్పలనాయుడును 9440338045కు సంప్రదించాలని జిల్లా విద్యాశాఖాధికారి మాణిక్యం నాయుడు తెలిపారు.

# త్రాగునీటి సమస్యల శాశ్వత పరిష్కారం కూటమి లక్ష్యం

## టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మల్లిక్ నాయుడు

చీపురుపల్లి, జూన్ 29, ప్రభాతవార్త



చీపురుపల్లి నియోజకవర్గం కేంద్రంలో త్రాగునీటి సమస్యల శాశ్వత పరిష్కారమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కృషి చస్తుందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి స్థానిక శాసనసభ్యులు కిమిడి కళా వెంకట్రావు తనయుడు కిమిడి మల్లిక్ నాయుడు అన్నారు. సోమవారం చీపురుపల్లి పట్టణ పరిధిలోని రామాంజనేయ కాలనీ రోడ్డులో (నటరాజ్ థియేటర్ ప్రక్కన, స్మశానవాటిక ప్రక్కన) నివసిస్తున్న ప్రజల దశాబ్దాల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కొరకు తొమ్మిది లక్షల రూపాయలతో త్రాగునీటి బోర్లు నిర్మాణం కొరకు ఆయన శంకుస్థాపన చేశారు. కాలనీవాసుల మంచినీటి సదుపాయం కొరకు 9 లక్షల పంచాయతీ నిధులతో నిర్మించనున్న నూతన బోరు బావుల ఏర్పాటు చేసామన్నారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల కనీస అవసరాలను తీర్చడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోంది అన్నారు. నీటి ఎద్దడి వల్ల స్థానికులు, ముఖ్యంగా మహిళలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అత్యంత వేగంగా నిధులు మంజూరు చేయించి ఈ పనులకు శ్రీకారం చుట్టాం అని వివరించారు. రాబోయే రోజుల్లో నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలోనూ, వార్డులోనూ మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తాం అని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ప్రజలకు ఎల్లప్పుడూ ఎటువంటి సమస్యలు వచ్చినా అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం అన్నారు. తమ కాలనీ తాగునీటి కష్టాలను గుర్తించి, తక్షణమే స్పందించి బోర్ల ఏర్పాటుకు చొరవ చూపిన యువనేత రామ్ మాలిక్ నాయుడు గారికి కాలనీ ప్రజలు, మహిళలు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కనకమహాలక్ష్మి ఆలయ కమిటీ చైర్మన్ గవిడి నాగరాజు, తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు రౌతు కాము నాయుడు, మాజీ ఆర్‌ఈసిఎస్ చైర్మన్ రామచంద్రుడు, స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, ఎంపీడీవో ఐ.సురేష్, స్థానిక నాయకులు ఆర్కేఎం. కార్యకర్తలు, పంచాయతీ అధికారులు రామాంజనేయ కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

## మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన ర్యాలీ



నెల్లిమర్ల, జూన్ 29, ప్రభాతవార్త

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఫార్మసీ స్కూల్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డా. చందన్ కుమార్ బ్రహ్మ పిలుపు నిచ్చారు. ఎన్డిపిఎస్ చట్టాలు కఠినంగా ఉన్నం దున యువత మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం- అక్రమ రవాణా నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్కూల్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ మరియు స్కూల్ ఆఫ్ అలైడ్ అండ్ హెల్త్ కేర్ సైన్సెస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై యువతకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో డ్రగ్ ఫ్రీ ఇండియా అని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు శ్రావణి, డీన్ ప్రొఫెసర్ ఆర్.ఎస్.వర్మ, ఎన్.సి.సి. లెఫ్టినెంట్ డాక్టర్ సతీష్, కె. శ్రీను, జి. గణేష్, డా. తేజస్విని, దినేష్ తదితరులతోపాటు ఫార్మసీ విద్యార్థులు, ఎన్.సి.సి. విద్యార్థులు పాల్గొన్నారు.



30-06pg10.qxd:30-06pg10.qxd 1/1/02 6:05 AM Page 1



# యుఎస్ ఓపెన్ రన్నరప్‌గా కిడాంబి




**కాలిఫోర్నియా, జూన్ 29:** మాజీ ప్రపంచ నెంబర్ వన్, భారత్ అగ్రశ్రేణి షట్లర్ కిడాంబి శ్రీకాంత్.. యూఎస్ ఓపెన్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నీలో చివరి మెట్టుపై తడబడ్డాడు. పురుషుల సింగిల్స్ ఫైనల్లో చైనీస్ తైపీ క్రీడాకారుడు సు లియాంగ్ చేతిలో ఓడి రన్నరప్‌గా నిలిచాడు. గంటా 9 నిమిషాల పాటు హోరాహోరీగా జరిగిన ఫైనల్లో కిడాంబి శ్రీకాంత్ 15-21, 21-16, 9-21తో పరాజయం పొందాడు. 33 ఏళ్ల శ్రీకాంత్ తొలిగేమ్‌లో ఓడినప్పటికీ.. తర్వాత పుంజుకున్నాడు. ఫలితం తేల్చే మూడో గేమ్‌లో వయసులో తనకన్నా 9 ఏళ్ల చిన్నవాడైన లియాంగ్ వేగాన్ని కిడాంబి అందుకోవడంలో వెనకబడ్డాడు. దీంతో సు లియాంగ్ అలవోకగా మూడోగేమ్‌ను 21-9తో ముగించి టైటిల్ అందుకున్నాడు. ఈ సీజన్‌లో మొదటిసారి ఫైనల్ చేరిన కిడాంబి తొలుత ఆటను వేగంగానే ప్రారంభించాడు. తర్వాత లయ తప్పడంతో అనవసర తప్పిదాలు దెబ్బతీశాయి. గతేడాది మలేసియా మాస్టర్స్ సూపర్ 500, సయ్యద్ మోదీ ఇంటర్నేషనల్ సూపర్ 300లో కూడా ఫైనల్ చేరినా రన్నరప్‌తోనే సరిపెట్టాడు. 2021 ప్రపంచ ఛాంపియన్ షిప్‌లో కిదాంబి శ్రీకాంత్ రజతపతకాన్ని గెల్చుకున్నాడు.




# ఆస్ట్రియన్ ఫార్ములా వన్ విజేత రస్సెల్

**స్పియెల్‌బర్గ్(ఆస్ట్రియా), జూన్ 29:** మాక్స్ వెర్‌స్టాపెన్‌ను నిలువరిస్తూ మెర్సిడెస్ డ్రైవర్ జార్జ్ రస్సెల్ ఆస్ట్రియన్ గ్రాండ్ ప్రిక్స్ ఫార్ములా వన్ టైటిల్ అందుకున్నాడు. దీంతో వరుస నిరాశల తర్వాత జార్జ్ రస్సెల్ తిరిగి విజయాల బాట పట్టాడు. ఉత్కంఠభరితంగా నువ్వానేనా అన్నట్లుగా సాగిన ఆస్ట్రియన్ గ్రాండ్ ప్రిక్స్‌లో నాలుగుసార్లు ఛాంపియన్ మాక్స్ వెర్‌స్టాపెన్ గట్టిపోటీఇచ్చాడు. పలుసార్లు ఆధిక్యం చేతులు మారింది. చివరి ల్యాప్‌లలో దూసుకుపోయిన రస్సెల్... రెడ్‌బుల్ రేసర్‌ను వెనక్కి నెట్టాడు. వెర్‌స్టాపెన్ కంటే 1.611 సెకన్ల ముందుగా రస్సెల్ రేస్ పూర్తి చేశాడు. ఈ ఏడాది తన రెండో విజయాన్ని, కెరీర్‌లో ఏడో విజయాన్ని అందుకున్నాడు. మెర్సిడేస్‌కే చెందిన కిమి అంటోనెల్లి మూడో స్థానంతో సరిపెట్టాడు. మెక్‌లారెన్-మెర్సిడెస్ డ్రైవర్ ఆస్కార్ పియాస్ట్రి నాలుగో స్థానం, ఫెర్రారీ డ్రైవర్ లూయిస్ హామిల్టన్ అయిదో స్థానంలో నిలిచారు. కాగా ఫార్ములావన్ డ్రైవర్స్ ఛాంపియన్‌షిప్‌లో కిమి అంటోనెల్లి 171 పాయింట్లతో అగ్రస్థానంలో దూసుకుపోతున్నాడు. జార్జ్ రస్సెల్ 131 పాయింట్లఽ, లూయిస్ హామిల్టన్ 125 పాయింట్లతో తరువాతి స్థానాల్లో ఉన్నారు.




## బెన్ స్ట్రోక్ వీడ్కోలు టెస్ట్‌లో ఇంగ్లండ్ ఓటమి

# టెస్ట్ సిరీస్ న్యూజిలాండ్ కైవసం

**నాటింగ్హామ్‌షైర్, జూన్ 29:** ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ ఓటమితో అంతర్జాతీయ వీడ్కోలు పలికాడు. అనూహ్యంగా టెస్ట్ మధ్యలోనే రిటైర్మెంట్ ప్రకటించిన బెన్ స్టోక్స్‌కు విజయంతో సాగనంపాలని జట్టు సహచరులు ఆశించినా బ్యాటింగ్ వైఫల్యంతో పరాజయం పొందింది. మూడో టెస్ట్ చివరి రోజు ఆటలో ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌కు 212 పరుగులకే తెరదించిన న్యూజిలాండ్ ఏకంగా 160 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. ఇంగ్లండ్‌ను దాని సొంత గడ్డపైనే ఓడించి కివీస్ 2-1 తేడాతో సిరీస్‌ను కైవసం చేసుకుంది.

ఓవర్‌నైట్ స్కోరు 103 పరుగులతో అయిదో రోజు ఆట కొనసాగించిన ఇంగ్లండ్‌ను న్యూజిలాండ్ బౌలర్ ఫౌల్క్స్ ధాటికి కుప్పకూలింది. 116 పరుగుల వద్ద ఇమిలియో (18), జోరూట్(18) అవుటయ్యారు. వికెట్ కీపర్ బ్యాట్స్‌మెన్ జెమీ స్మిత్(91 బంతుల్లో 60) ఒక్కడే ఒంటరిపోరాటం చేసినా ఫలితం దక్కలేదు. సాంట్నర్ చివరి వరుస వికెట్లను కూల్చాడు. దీంతో ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో 212 పరుగులకు ఆలౌటైంది. న్యూజిలాండ్ బౌలర్లలో ఫౌల్క్స్ మూడు వికెట్లు.. నాథన్ స్మిత్, మిచెల్ సాంట్నర్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. చివరి టెస్ట్ రెండో ఇన్నింగ్స్‌ల్లోనూ 15, 30 పరుగులకు అవుటై నిరాశపరిచిన బెన్ స్టోక్స్ బౌలింగ్‌లో మాత్రం రాణించాడు. తొలి ఇన్నింగ్స్‌లో 4, రెండో ఇన్నింగ్స్‌లో 2...మొత్తం ఆరు వికెట్లు పడగొట్టాడు.

**సంక్షిప్త స్కోర్లు: న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్: 438**(టామ్ లాథమ్ 151, కాన్వే 157, బెన్ స్టోక్స్ 4/70) **ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్: 354**(జాకబ్ బెతెల్ 74, హారీ బ్రూక్స్ 58, నాథన్ స్మిత్ 4/91); **న్యూజిలాండ్ రెండో ఇన్నింగ్స్: 288/9 డిక్లేర్డ్** (డారెల్ మిచెల్ 100 నాటౌట్, రచిన్ రవీంద్ర 94, జోఫ్రా అర్చర్ 4/54); **ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్: 212** (జేమీ స్మిత్ 60, జాక్ ఫౌల్క్స్ 3/52)

# సౌతాఫ్రికాకు షాక్ : ప్రి క్వార్టర్ ఫైనల్లో కెనడా

**టొరంటో, జూన్ 29 :** ఫిఫా ప్రపంచకప్ 2026 నాకౌట్ పోరులో అతిథ్య కెనడా చరిత్ర సృష్టించింది. అమెరికా, మెక్సికోతో కలిసి సంయుక్తంగా సాకర్ వరల్డ్‌కప్‌కు ఆతిథ్యమిస్తున్న కెనడా.. సొంత మైదానంలో, సొంత ప్రేక్షకుల మద్దతుతో విజృంభించింది. ఉత్కంఠగా జరిగిన నాకౌట్ మ్యాచ్‌లో కెనడా 1-0 గోల్స్ తేడాతో సౌతాఫ్రికాను ఓడించింది. ప్రపంచకప్‌లో మొట్టమొదటిసారిగా ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. మ్యాచ్ చివరి నిమిషంలో కెనడా మిడ్‌ఫీల్డర్ స్టీఫెన్ యూస్టాకియో కొట్టిన గోల్ ఆ జట్టుకు చారిత్రాత్మక విజయాన్ని అందించింది. మ్యాచ్ ప్రారంభం నుంచే ఇరు జట్లు గోల్ కోసం హోరాహోరీగా తలపడ్డాయి. తొలి అర్ధభాగంలో సౌతాఫ్రికా జట్టు అటాకింగ్ గేమ్ ఆడుతూ కెనడా డిఫెన్స్‌ను పరీక్షి ంచింది. అయితే, ఫైనల్ పాస్‌లు సరిగ్గా అందకపోవడంతో వారు గోల్ చేసే సువర్ణ అవకాశాలను చేజార్చుకున్నారు. మరోవైపు మొదటి అర్ధభాగం ముగిసే సమయా నికి కెనడాకు వరుసగా రెండు గోల్స్ చేసే అవకాశాలు వచ్చాయి. కానీ, సౌతాఫ్రికా గోల్‌కీపర్ రోన్వెన్ విలియమ్స్ అద్భుతంగా అడ్డు కుని గోల్స్ కాకుండా నిలువరించాడు. రెండో అర్ధభాగంలో కెనడా ఆటపై పూర్తి నియంత్రణ సాధించింది. మ్యాచ్ 75వ నిమిషంలో కెనడా స్టార్ ప్లేయర్ అల్ఫోన్సో డేవిస్ మైదానంలోకి అడుగుపెట్టడంతో జట్టులో సరికొత్త ఉత్సాహం వచ్చిం ది. డేవిస్ రాకతో కెనడా అటాకింగ్ వేగవంతం చేసింది. మ్యాచ్ డ్రాగా ముగిసి ఎక్స్‌ట్రా టైమ్‌కు వెళ్తుందని అభిమానులు భావిస్తున్న తరుణంలో, 92వ నిమిషంలో నాటకీయ పరిణామం చోటుచేసు కుంది. సౌతాఫ్రికా డిఫెండర్లు బంతిని క్లియర్ చేయడంలో చేసిన చిన్న పొరపాటును యూస్టాకియో అద్భుతంగా సద్వినియోగం చేసు కున్నాడు. బాక్స్ అంచున తనకు దొరికిన బౌన్సింగ్ బాల్‌ను గోల్ పోస్ట్ లెఫ్ట్ కార్నర్‌లోకి పంపాడు. సౌతాఫ్రికా గోల్ కీపర్ బంతిని ఆపలేకపోయాడు. ఈ ఏకైక గోల్‌తో కెనడా విజయం ఖరారైంది. మరోవైపు, ఈ ఓటమితో దక్షి ణాఫ్రికా జట్టు టోర్నీ నుంచి నిష్క్ర మించినప్పటికీ, తమ ఫుట్‌బాల్ చరిత్రలోనే మొదటిసారి ప్రపంచకప్ నాకౌట్ దశకు చేరుకుని గర్వంగానే వెనుదిరిగింది.

ఇక కెనడా రౌండ్ 16 మ్యాచ్‌లో భాగంగా నెదర్లాండ్స్-మొరాకో మ్యాచ్ విజేతతో తలపడనుంది. కెనడా గ్రూప్ దశలో అంతగా ఆకట్టుకోలేకపోయింది. గ్రూప్‌బిలో బోస్నియాతో మ్యాచ్‌ను 1-1తో డ్రా చేసిన కెనడా.. ఖతార్‌పై 6-0తో నెగ్గింది. అయితే, ఆఖరి మ్యాచ్‌లో భాగంగా స్విట్జర్లాండ్ చేతిలో 2-1తో పరాజయం పొందింది.



కెనడాకు గోల్ అందించిన స్టీఫెన్ యుస్టాకియో

## హెచ్‌సిఎకు అంబుడ్స్‌మన్ నోటీసులు

**హైదరాబాద్, జూన్ 29:** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ)కు బీసీసీఐ ఒంబుడ్స్‌మన్ ఎథిక్స్ ఆఫీసర్ జస్టిస్ అరుణ్ మిశ్రా అధికారిక నోటీసు జారీ చేశారు. మాజీ క్రికెటర్లు గౌరవ్ శర్మతో పాటు పలువురు దాఖలు చేసిన ఫిర్యాదులో హెచ్‌సీఏ తీవ్రమైన ఉల్లంఘనలకు పాల్పడిందన్న ఆరోపించారు. దీనిపై ఈ నోటీసు వెలువడింది. నాలుగు వారాల్లో సమగ్ర సమాధానం దాఖలు చేయాలని హెచ్‌సీఏ అపెక్స్ కౌన్సిల్‌ను ఆదేశించారు. ఫిర్యాదు ప్రతితో పాటు నోటీసును వెంటనే హెచ్‌సీఏకు అందజేయాలని, అనంతరం ఫిర్యాదుదారులు అవసరమైతే రీజాయిండర్ దాఖలు చేసుకునే అవకాశాన్ని కూడా కల్పించారు. ఈ పరిణామంపై స్పందించిన టీసీఏ ప్రధాన కార్యదర్శి ధరం గురువారెడ్డి మాట్లాడుతూ.. మాజీ సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అరుణ్ మిశ్రా నోటీసు జారీ చేయడం ద్వారా ఈ అంశాలు సాధారణ ఆరోపణలు కాదని స్పష్టమైందన్నారు. ఇది ఒక్క హెచ్‌సీఏ గురించి మాత్రమే కాదన్నారు. తెలంగాణ జిల్లా క్రికెటర్ల భవిష్యత్తు, పారదర్శక పరిపాలన, సమాన అవకాశాలు కల్పించే దిశగా అడుగుగా పేర్కొన్నారు.



# 87 మీటర్ల మార్క్ దాటిన రోహిత్

**భువనేశ్వర్, జూన్ 29:** ఒడిషాలోని భువనేశ్వర్‌లో జరిగిన 65వ జాతీయ అంతర్రాష్ట్ర సీనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ అత్యుత్తమ గణాంకాలను నమోదు చేసింది. ఈ పోటీల్లో ఏకంగా 26 రికార్డులు బద్దలయ్యాయి. చివరి రోజున రోహిత్ యాదవ్ జావెలిన్ త్రోలో మెరుగైన ప్రదర్శన ఇచ్చాడు. జావెలిన్‌ను చివరి ప్రయత్నంలో 87.05 మీటర్లు విసిరి స్వర్ణం అందుకున్నాడు. ఈ నెల ప్రారంభంలో రోహిత్ నమోదు చేసిన 83.76 మీటర్లను మెరుగుపరుచుకున్నాడు. 87 మీటర్ల మార్కును దాటిన మూడవ భారతీయ జావెలిన్ త్రోయర్‌గా నిలిచాడు. భారత అథ్లెటిక్స్ చరిత్రలో తన పేరును లిఖించాడు. రెండు సార్లు ఒలింపిక్ మెడలిస్ట్ నీరజ్ చోప్రా, కిషోర్ జెనాల తర్వాత 87 మీటర్లు దాటిన మూడవ భారతీయుడిగా అతను నిలిచాడు. రోహిత్ ఈ సీజన్ ప్రారంభంలోనే అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్దేశించిన ఆసియా క్రీడల అర్హత ప్రమాణాన్ని అధిగమించాడు. యశ్వీర్ సింగ్ 83.72 మీటర్లతో రెండవ స్థానంలో నిలవగా, ప్రపంచ ఛాంపియన్‌షిప్స్ ఫైనలిస్ట్ సచిన్ యాదవ్ 82.32 మీటర్లతో కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నారు.

### శ్రీశంకర్ లాంగ్‌జంప్ రికార్డు

కామన్వెల్త్ గేమ్స్ రజత పతక విజేత మురళీ శ్రీశంకర్ 8.38 మీటర్ల దూరం దూకి పురుషుల లాంగ్ జంప్ స్వర్ణం కైవసం చేసుకున్నారు. ఈ ఏడాది ఒక ఆసియా అథ్లెట్ సాధించిన అత్యుత్తమ ప్రదర్శన ఇదే. ఈ విజయంతో, 2026లో శ్రీశంకర్ అజేయ పరంపర ఐదు పోటీలకు విస్తరించింది. అతను గెలిచిన ప్రతి జంప్ ఎనిమిది మీటర్ల మార్కును దాటింది. షానవాజ్ ఖాన్ (8.30మీటర్లు), డేవిడ్(8.06 మీటర్లు) వరుసగా సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ అందుకున్నారు. ఇక విశాల్ పురుషుల 400 మీటర్ల పరుగును 45.43 సెకన్లలో పూర్తి చేసి అగ్రస్థానంలో నిలిచాడు.

అంతర్ రాష్ట్ర సీనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్... భారత అథ్లెటిక్స్‌తో కొత్త ప్రమాణాలను సృష్టించిందని భారత అథ్లెటిక్స్ సమాఖ్య ఉపాధ్యక్షురాలు అంజూ బాబీ జార్జ్ సంతోషం వ్యక్తం చేసింది.

## లాభాల స్వీకరణపైనే ఇన్వెస్టర్ల ఫోకస్

# నష్టాల్లో సెన్సెక్స్ నిఫ్టీ




**ముంబయి,జూన్ 29:** దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం నష్టాలతో ముగిశాయి. ప్రారంభంలో లాభాల్లో ట్రేడ్ అయిన సూచీలు చివరికి అమ్మకాల ఒత్తిడితో దిగజారాయి. ఆటో, ఐటీ షేర్లలో భారీ అమ్మకాలు మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం చూపించాయి. ఫార్మా రంగం షేర్లు మాత్రం కొనుగోళ్లతో లాభాల్లో ముగిశాయి. బీఎస్ ఈ సెన్సెక్స్ 372.10 పాయింట్లు తగ్గి 76,728.37 వద్ద ముగిస్తే ఎన్ఎస్ఈ నిఫ్టీ 109.75పాయింట్లు క్షీణించి 23,946.25 వద్ద స్థిరపడింది. నిఫ్టీ పతనానికి కోటక్ మహీంద్రా బ్యాంక్, మహీంద్రా అండ్ మహీంద్రా, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు కారణమయ్యాయి. మిడ్ క్యాప్ సూచీ 0.22 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 0.57శాతం పడిపోయాయి. బీఎస్ఈలో 1,712 షేర్లు లాభపడగా, 2,629 షేర్లు నష్టపోయాయి. మధ్యప్రాచ్యంలో మళ్లీ ఉద్రిక్తతలు నెలకొనే అవకాశాలపై ఇన్వెస్టర్లు ఆందోళన వ్యక్తం చేయడంతో యూరప్ మార్కెట్లు బలహీన పడ్డాయి.

ఆసియా మార్కెట్లు మిశ్రమ ధోరణిలో ముగిాయి. అమెరికా డౌ జోన్స్ ఫ్యూచర్స్ మాత్రం 200కు పైగా పాయింట్లు లాభాల్లో ట్రేడ్ అయింది. జర్మనీకి చెందిన నగారో ఎస్ఈ సంస్థను కొనుగోలు చేసేందుకు స్వచ్ఛంద పబ్లిక్ టేకోవర్ ఆఫర్ ప్రకటించిన నేపథ్యంలో పర్సిస్టెంట్ సిస్టమ్స్ షేరు 11.35శాతం క్షీణించింది. అమెజాన్ బెడ్‌రాక్ కోసం ఆంథ్రోపిక్ అధీకృత రీసెల్లర్‌గా ఎంపిక కావడంతో హెక్సావేర్ టెక్నాలజీస్ షేరు 4.53 శాతంపెరిగింది. కోటక్ బ్యాంకు ఎండీ, సీఈఓ నిష్క్రమణ ప్రకటనతో కోటక్ మహీంద్రా బ్యాంక్ షేరు దాదాపు 3 శాతం పడిపోయింది. అమెరికా కస్టమ్స్ నిర్ణయంతో ఎగుమతులపై ఆందోళనలు వ్యక్తమవడంతో వారీ ఎనర్జీస్ షేరు 4.10 శాతం నష్టపోయింది.

సీజీడీఎస్‌సీఓ నిపుణుల కమిటీ నుంచి సెనోబామేట్ మాత్రల తయారీ, విక్రయానికి సిఫార్సు లభించడంతో బజాజ్ హెల్త్‌కేర్ షేరు 16 శాతం పైగా పెరిగింది. హోటళ్ల రంగ సంస్థ ఓమాక్స్ షేరు 8.40శాతం లాభపడింది. డీసీఎక్స్ సిస్టమ్స్‌కు రూ.435.85 కోట్ల ఆర్డర్ లభించడంతో షేరు స్వల్పంగా పెరిగింది. ట్రాన్స్‌రైల్ లైటింగ్‌కు రూ.459కోట్ల అంతర్జాతీయ ఆర్డర్లు రావడంతో షేరు లాభపడింది.

మహారాష్ట్రలో 969మెగా వాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టుకు రూ.3,517.98 కోట్ల ఈపీసీ ఆర్డర్ దక్కడంతో విక్రాన్ ఇంజినీరింగ్ షేరు 6 శాతం ఎగిసింది. ఆస్థా స్పిన్‌టెక్స్ ఐపీఓ తొలి రోజే 0.84రెట్లు కొనుగోలుజరిగితే, సీఎస్ఎమ్ టెక్నాలజీస్ ఐపీఓ 1.34 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది.

## ఐదులక్షల కోట్ల డాలర్లకు

# భారత్ ఈక్విటీల మార్కెట్ క్యాప్

**ముంబయి,జూన్ 29:**భారత ఈక్విటీ మార్కెట్ సరికొత్త రికార్డు నమోదుచేసింది. దేశీయ మార్కెట్ మొత్తం విలువ తొలిసారిగా 5 లక్షల కోట్ల డాలర్ల మార్క్‌ను దాటింది. తైవాన్, దక్షిణ కొరియాలను వెనక్కి నెట్టి, ప్రపంచంలో ఐదో అతిపెద్ద ఈక్విటీ మార్కెట్‌గా భారత్ తన స్థానాన్ని తిరిగి కైవసం చేసుకుంది. ప్రపంచ మార్కెట్లు తీవ్ర ఒడుదొడుకులకు లోనవుతుండగా, భారత మార్కెట్లు మాత్రం స్థిరంగా రాణిస్తున్నాయి.

జూన్ నెలలో అనేక అంతర్జాతీయ మార్కెట్లు నష్టాల్లో ముగిశాయి. భారత మార్కెట్లు మాత్రం మెరుగైన తీరు చూపించాయి. ఈ నెలలో భారత్ మార్కెట్ క్యాప్ 2.75 పెరగ్గా, సమీప పోటీ మార్కెట్లు దక్షిణ కొరియా 4.7 , తైవాన్ 2.3 మేర నష్టపోయాయి. భారత్ ఐదో స్థానానికి చేరేందుకు మార్గం సుగమమైంది. ప్రస్తుతం భారత్ మార్కెట్ విలువ 5 ట్రిలియన్ డాలర్లు కాగా, తైవాన్ 4.97ట్రిలియన్ డాలర్లు, దక్షిణ కొరియా 4.66ట్రిలియన్ డాలర్లు తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. కొన్ని నెలలుగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), సెమీకండక్టర్ స్టాక్స్ కారణంగా రికార్డు స్థాయిలో లాభపడిన తైవాన్, దక్షిణ కొరియా మార్కె ట్లలో మదుపరులు ఇప్పుడు లాభాల స్వీకరణకు మొగ్గుచూపుతున్నారు. దీనివల్ల ఆయా మార్కెట్లలో కరెక్షన్ చోటుచేసుకుంది. ఇదే సమయంలో అమెరికా, చైనా మార్కెట్ విలువల్లో పెదగా మార్పులు కనిపించలేదు. భారత మార్కెట్ల స్థిరత్వానికి పలు అంశాలు దోహదం చేస్తున్నాయని మార్కెట్ నిపుణుల అంచనా.



అంతర్జాతీ యంగా ముడి చమురు ధరలు దిగిరావడం, వాల్యుయేషన్లు ఆకర్షణీయంగా మారడం, విదేశీ పెట్టుబడులు నిలకడగా కొనసాగడం వంటివి భారత మార్కెట్లకు అండగా నిలుస్తున్నాయన్నది నిపుణుల వాదన. నిఫ్టీ ప్రైస్‌టుఎర్నింగ్స్ నిష్పత్తి 24నుంచి 18కి తగ్గడం కూడా ఇన్వెస్టర్లను ఆకట్టుకుంటోందని నిపుణులు చెబుతున్నారు. ఈ నెలలో డాలర్ల పరంగా చూస్తే సెన్సెక్స్ దాదాపు 4 , నిఫ్టీ 3శాతం మేర లాభపడ్డాయి.

# అదానీ కేసులో ప్రాసిక్యూషన్‌దే విచక్షణాధికారం!

**వాషింగ్టన్,జూన్ 29:** భారత పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ, ఇతరులపై ఉన్న క్రిమినల్ కేసును ఉపసంహరించుకోవాలన్న అమెరికా న్యాయశాఖ అభ్యర్థనపై పూర్తిస్థాయి వివరణ ఇవ్వాలని అక్కడి ఫెడరల్ జడ్జి ఆదేశించడం పారిశ్రామిక వర్గాలను కలవరపరిచింది. అయితే ఈ ప్రక్రియ కేసు కొట్టివేతను ఏమాత్రం ప్రభావితం చేయబోదని, ప్రాసిక్యూషన్ విచక్షణాధికారమే అంతిమమని ప్రముఖ అమెరికన్, భారతీయ న్యాయ నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

అమెరికా రాజ్యాంగం ప్రకారం ప్రాసిక్యూషన్ విచక్షణాధికారం అనేది పూర్తిగా కార్యనిర్వాహక వర్గానికి చెందినదని, ఆఅధికారానికి దేశాధ్యక్షుడు అధిపతిగా వ్యవహరిస్తారని కొలంబియా లా స్కూల్ ప్రొఫెసర్ సి.కాఫీ తెలిపారు. న్యాయమూర్తి కేసు ఉపసంహరణకు గల కారణాలను అడగవచ్చు గానీ, ప్రాసిక్యూటర్ నిర్ణయాన్ని తిరస్కరించే అధికారం కోర్టుకు లేదు. ఇది కేవలం



న్యాయశాఖ నిర్ణయాన్ని ధ్రువీకరించుకునే ప్రక్రియే" అని ఆయన వివరించారు.

గత నెలలో అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ, ఆయన మేనల్లుడు సాగర్ అదానీపై ఉన్న సెక్యూరిటీల మోసం, వైర్ ఫ్రాడ్ ఆరోపణలను శాశ్వతంగా ఉపసంహరించుకుంటున్నట్లు న్యాయశాఖ ప్రకటించింది. ఈకేసుపై మరింత సమయం, వనరులు వెచ్చించదల్చుకోలేదని తన విచక్షణాధికారం మేరకు నిర్ణయించుకున్నట్లు కోర్టుకు తెలిపింది. ఫెడరల్ జడ్జి నికోలస్ గరాఫిస్ ఈ వివరణ సంతృప్తికరంగా లేదని పేర్కొన్నారు. ఫెడరల్ రూల్స్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్‌లోని రూల్ 48(ఎ) ప్రకారం, కోర్టు తన బాధ్యతలను నిర్వర్తించడానికి తగిన సమాచారం లేదని, అందుకే పూర్తి వివరాలతో కూడిన నివేదికను జులై 13లోగా సమర్పించాలని ఐదు పేజీల ఉత్తర్వులో ఆదేశించారు. ఈ పరిణామంపై అమెరికా మాజీ అటార్నీ బార్బరా మెక్‌క్వేడ్ స్పందిస్తూ సాధారణంగా ఇలా జరగదని, కానీ న్యాయమూర్తి అధికార పరిధిలోనిదేనని అన్నారు. న్యాయశాఖ తన అధికారాన్ని దుర్వినియోగం చేయడం లేదని నిర్ధారించుకోవడానికి న్యాయమూర్తి ఇలాంటి విచారణ జరపవచ్చు. భారత మాజీ సొలిసిటర్ జనరల్ హరీశ్ సాల్వే ఈ ఆదేశాలను ఒక సాధారణ ప్రక్రియగా అభివర్ణించారు.



## భారత్ పారిశ్రామిక ఉత్పత్తి

# వృద్ధి 5.1శాతం

**న్యూఢిల్లీ,జూన్29:**భారత్ పారిశ్రామిక ఉత్పత్తి వృద్ధిరేటు మేనెలలో 5.1శాతంగా నమోదైంది. విద్యుత్, గ్యాస్ ఉత్పత్తి గణనీయంగా పెరిగాయి. తయారీ రంగం గత ఏడాదితో పోలిస్తే 5.5 శాతం వృద్ధి నమోదు చేసింది. మరోవైపు గనుల ఉత్పత్తి 1.6 శాతం క్షీణించినప్పటికీ, గత నెలతో పోలిస్తే ఆ తగ్గుదల తీవ్రత తగ్గింది. మే నెలలో విద్యుత్ ఉత్పత్తి 9.9శాతం పెరిగింది. ఏప్రిల్‌లో ఇది 4.6శాతంగా ఉండగా ఇప్పుడు గణనీయంగా మెరుగుపడింది. నీటిసరఫరా, మురుగునీటి నిర్వహణ రంగం కూడా 5.5 శాతం వృద్ధి నమోదు చేసింది. తయారీ రంగంలో అత్యధిక వృద్ధిని నమోదు చేసిన విభాగాల్లో మోటారు వాహనాలు, ట్రైలర్లు, సెమీ ట్రైలర్ల తయారీ మొదటి స్థానంలో నిలిచింది. ఎలక్ట్రికల్ ఎక్విప్‌మెంట్ తయారీ 20.8 శాతం, బేసిక్ మెటల్స్ తయారీ 4.6 శాతం వృద్ధిని నమోదు చేశాయి. 2026 మే నెలలో ఐఐపి సూచీ122.7కు చేరుకోగా, గత ఏడాది ఇదే నెలలో అది 116.7గా నమోదైంది. గనులు, తయారీ, విద్యుత్‌గ్యాస్ సరఫరా, నీటి సరఫరా రంగాలు పారిశ్రామిక వృద్ధికి దోహద పడినట్లు ప్రభుత్వం వెల్లడించింది.

## మాజీ ఉద్యోగులను విధుల్లోకి తీసుకుంటున్న 'ఫోర్డ్'




**న్యూఢిల్లీ,జూన్ 29:** ప్రముఖ ఆటోమొబైల్ దిగ్గజం ఫోర్డ్, టెక్నాలజీపై ఆధారపడకుండా కంపెనీ తన పాత వ్యూహానికి స్వస్తి పలికింది. నాణ్యతను పెంచి, ఖర్చులను తగ్గించుకునే లక్ష్యంతో అనుభవజ్ఞులైన ఇంజనీర్లను, ముఖ్యంగా తమ మాజీ ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకుంటోంది. మానవ నైపుణ్యానికి మళ్లీ పెద్దపీట వేస్తున్న ఈ నిర్ణయం ఇప్పటికే సత్ఫలితాలనిస్తోందని, జేడీ పవర్ ఇనిషియల్ క్వాలిటీ సర్వేలో ప్రధాన బ్రాండ్లలో ఫోర్డ్ అగ్రస్థానానికి చేరడమే ఇందుకు నిదర్శనమని కంపెనీ వర్గాలు చెబుతున్నాయి. గత మూడేళ్లలో ఫోర్డ్ సుమారు 350 మంది అనుభవజ్ఞులైన ఇంజనీర్లను తిరిగి నియమించుకుంది. దశాబ్దాల పాటు వివిధ వాహనాల తయారీలో పనిచేసిన ఉద్యోగుల అనుభవాన్ని విస్మరించి, పూర్తిగా ఆటోమేషన్‌పై ఆధారపడటం పొరపాటని కంపెనీ ఉన్నతాధికారులు అంగీకరించారు. ఈ విషయంపై ఫోర్డ్ వెహికల్ హార్డ్‌వేర్ ఇంజనీరింగ్ వైస్ ప్రెసిడెంట్ చార్లెస్ పూన్ మాట్లాడుతూ కేవలం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను ప్రవేశపెడితే సరిపోతుందని, అదే అత్యుత్తమ నాణ్యత గల ఉత్పత్తిని ఇస్తుందని పొరపాటుగా భావించాం. ఏఐ ఒక అద్భుతమైన సాధనమే అయినా, దానికి శిక్షణ ఇవ్వడానికి ఉపయోగించే సమాచారంపైనే దాని సామర్థ్యం ఆధారపడి ఉంటుందని వివరించారు. అనుభవజ్ఞులైన ఇంజనీర్లు కంపెనీని విడిచి వెళ్లే ముందు వారి విజ్ఞానాన్ని భద్రపరచడంలో విఫలమయ్యామని, దానివల్లే ఏఐ వ్యవస్థలు వాస్తవ ప్రపంచంలోని సమస్యలను ముందుగా గుర్తించ లేకపోయాయని ఆయన అంగీకరించారు.

ప్రస్తుతం తిరిగి విధుల్లో చేరిన వీరిని గ్రేబియర్డ్స్ అని పిలుస్తున్నారు. వీరు యువ ఇంజనీర్లకు మార్గనిర్దేశం చేయడం, ఫోర్డ్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ కుమార్ గల్హోత్రా మాట్లాడుతూ, సమస్యను గుర్తించి సరిదిద్దడం కాకుండా, సమస్య రాకముందే నివారించే దిశగా మేము మారుతున్నాం. ఈ మార్పుకు మా అనుభవజ్ఞులైన ఇంజనీర్లే గుండెకాయ వంటివారని తెలిపారు. హార్డ్‌వేర్‌కే పరిమితం కాకుండా సాఫ్ట్‌వేర్, మాన్యుఫ్యాక్చరింగ్, సప్లైచెయిన్ బృందాలు ఇప్పుడు మరింత సమన్వయంతో పనిచేస్తున్నాయి. వాహనాలు కస్టమర్లకు చేరేలోపే సాఫ్ట్‌వేర్ విశ్వసనీయతను మెరుగుపరిచేందుకు 40 మంది సభ్యులతో ప్రత్యేకంగా ఒక క్వాలిటీ అస్యూరెన్స్ బృందాన్ని కూడా ఫోర్డ్ ఏర్పాటు చేసింది. ఫోర్డ్ ఏఐని పూర్తిగా పక్కన పెట్టడం లేదు. అనుభవజ్ఞులైన ఇంజనీర్ల నుంచి సేకరించిన విలువైన సమాచారంతో ఏఐని మరింత తెలివైనదిగా మారుస్తోంది.

# ఏటా 10 లక్షల వాహన అమ్మకాలు టార్గెట్



**ముంబయి, జూన్ 29:** ప్రపంచ వాణిజ్య వాహనాల మార్కెట్లో అగ్రస్థానాన్ని లక్ష్యంగా పెట్టుకున్న టాటా మోటార్స్ భారీ ప్రణాళికను ప్రకటించింది. ఇటలీకి చెందిన ఐవెకో గ్రూప్ కొనుగోలు పూర్తయిన తర్వాత ఏడాదికి 10 లక్షలకు పైగా వాణిజ్య వాహనాలు విక్రయించాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు టాటా సన్స్ చైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ తెలిపారు. టాటా మోటార్స్ కమర్షియల్ వెహికల్స్ వార్షిక సర్వసభ్య సమావేశంలో చంద్రశేఖరన్ మాట్లాడారు. ఐవెకో కొనుగోలుతో ప్రారంభంలోనే రెండు కంపెనీలవి కలిపి వార్షిక విక్రయాలు సుమారు ఆరు లక్షల వాహనాలకు చేరుకుంటాయన్నారు. ఆ తర్వాత 10 లక్షల మార్కును సులువుగా దాటే అవకాశం ఉందన్నారు. ఈ కొనుగోలు ప్రక్రియ ప్రస్తుతం నియంత్రణ సంస్థల ఆమోదం పొందాల్సి ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో డీల్ పూర్తయ్యే అవకాశముంది. ఈ ఒప్పందంతో టాటా మోటార్స్‌కు అత్యాధునిక పవర్‌ట్రెయిన్, కొత్త తరం టెక్నాలజీలు, మెరుగైన ఉత్పత్తుల శ్రేణి, అంతర్జాతీయ మార్కెట్లలో మరింత బలం లభిస్తుందని చంద్రశేఖరన్ చెప్పారు.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Flat.No. 22, G Block ,Industrial park Auto Nagar , Gajuwaka, Visakhapatnam-530 012, Phones:2706784,2706785,2706786,2706787,2706622, Fax: 2706522, RNI No.64864/96, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.No. H/SD/337/12-14.